# నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ), నల్లగొండ - తెలంగాణ

## Nagarjuna Government College (A), Nalgonda - Telangana

Vol. : 27 Issue : 7 (2) Spl. Edition May - 2024 ISSN No. : 2457-0796


# తెలుగు నాటక సాహిత్యం - సమాలోచన

# Literature of Telugu Drama - A Colloquium

రెండు రోజుల జాతీయ సదస్సు తేది : 27, 28 మార్చి, 2024


UGC APPROVED JOURNAL

## మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక




నిర్వహణ

తెలుగు శాఖ

నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ), నల్లగొండ



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక


**సంపుటి : 27 సంచిక : 7 (2) మే - 2024**

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' **(MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013


**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆయా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

# నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)

**నల్లగొండ – తెలంగాణ**

**తెలుగుశాఖ**

# తెలుగు నాటక సాహిత్యం – సమాలోచన

జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

తేది: 27 మార్చి 2024 & 28 మార్చి 2024

**గౌరవ సంపాదకులు**

డా॥ సముద్రాల ఉపేందర్

ప్రధానాచార్యులు

నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)

నల్లగొండ – తెలంగాణ

**సంపాదకులు**

డా॥ తండు కృష్ణయ్య

తెలుగుశాఖాధ్యక్షులు

నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)

నల్లగొండ – తెలంగాణ

**సహ సంపాదకులు**

డా॥ ఎన్. దీపిక

నర్రా లవేందర్ రెడ్డి

డా॥ వెల్దండి శ్రీధర్

**తెలుగుశాఖ**

## నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)

**నల్లగొండ – తెలంగాణ**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| అభినందన | - | డా॥ సముద్రాల ఉపేందర్ | v |
| మా మాట | | | vi |
| 1. జానపద నాటక సాహిత్యం | - | డా॥ ఇడికోజు శ్రీనివాసాచారి | 07 |
| 2. తెలుగు నాటకం - వస్తు వైవిధ్యం | - | బొమ్మకంటి సుధామాధురి | 13 |
| 3. తెలంగాణ జాతీయోద్యమ నాటక సాహిత్యం | - | గద్దమీది మల్లేశం | 17 |
| 4. జానపద వీధి నాటకాలు - సామాజిక, సాంస్కృతిక దృక్పథం | - | డా॥ మ్యాతరి ఆనంద్ | 21 |
| 5. జాతీయోద్యమ కాలంలో నిషిద్ధ నాటకాలు-సమాలోచనం | - | డా॥ జి.శ్రీనివాస్ | 27 |
| 6. తెలంగాణ నాటక సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం | - | డా॥ భీంపల్లి శ్రీకాంత్ | 32 |
| 7. త్రికాలాల్లో తెలుగు నాటకం | - | డా॥ వి.వి. సుబ్బారావు. | 39 |
| 8. శతాబ్ది బాలల నాటికలు - పరిశీలన | - | డా॥ తండు కృష్ణయ్య | 44 |
| 9. తెలంగాణ తొలి నాటక సమాజం- ప్రాభవం, ప్రస్థానం | - | డా॥ హరీష్ శ్రీధర | 50 |
| 10. శ్రీకాకుళం జిల్లా నాటక సాహిత్యం - పరిశీలన | - | డా॥ పప్పల వెంకటరమణ | 54 |
| 11. నల్లగొండ జిల్లా సాంఘిక నాటక సాహిత్యం | - | శీలం భద్రయ్య | 60 |
| 12. కాళ్ళకూరి నారాయణరావు నాటకాలు - సంఘసంస్కరణ | - | డా॥ రాపోలు శ్రీనివాస్ | 67 |
| 13. పీవీ రాజమన్నారు నాటకాలు - సామాజిక స్పృహ | - | ఎన్. లవేందర్‌రెడ్డి | 74 |
| 14. పెద్దింటి అశోక్‌కుమార్ నాటకాలు - పరిశీలన | - | డా॥ వెల్దండి శ్రీధర్ | 79 |
| 15. మిత్ర నృత్యరూప నాటకాలు - వస్తు వైవిధ్యం | - | సి. అనిత కుమారి | 85 |
| 16. ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు చారిత్రక నాటకాలు - విశ్లేషణ | - | గద్దల అనిల్ | 90 |
| 17. కన్యాశుల్కం - ఇతివృత్త వైవిధ్యం | - | డా॥ మల్లెపోగు మాదన్న | 98 |
| 18. వరవిక్రయం-సామాజిక చిత్రీకరణ | - | డా॥ జి. వెంకట లక్ష్మి | 102 |
| 19. వరవిక్రయము - స్త్రీ చైతన్య స్ఫూర్తి | - | డా॥ మంగమూర మునిలక్ష్మి | 106 |
| 20. తెలంగాణ జన జీవన పోరాట చిత్రణలో మా భూమి నాటకం | - | కంచర్ల మహేష్ | 110 |
| 21. గయోపాఖ్యాన నాటక ప్రాశస్త్యము | - | డా॥ బి.సునీత | 114 |
| 22. పాండవోద్యోగ నాటకం - వస్తువైవిధ్యం | - | డా॥ గుమ్మడి రవీంద్ర | 119 |
| 23. ఎన్.జి.ఓ నాటకం - మధ్యతరగతి జీవిత చిత్రణ | - | డా॥ ఎం.టి.జ్యోత్స్న | 123 |
| 24. ఒకే నిద్ర ఎన్నో కలలు - నాటక పరిశీలన | - | దండి అంజయ్య | 126 |
| 25. సమాజ నేత్రాలు- పరిశీలన | - | డా॥ ఎన్. దీపిక | 130 |
| 26. వరూధిని పద్య నాటకం - పరిశీలన | - | డా॥ టంగుటూరి సైదులు | 137 |
| 27. సత్య హరిశ్చంద్ర నాటక మేటి - చీమకుర్తి నాగేశ్వరరావు | - | నోసిన వెంకటేశ్వర్లు | 142 |
| 28. తులనాత్మకంగా నాటకాలను విమర్శించిన తొలి విమర్శకుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ | - | డా॥ అంకే శ్రీనివాసులు | 146 |
| 29. తెలుగు నాటకరంగం విమర్శ - పరిశోధన | - | డా॥ మహ్మద్ హసేన | 154 |

**డా॥ సముద్రాల ఉపేందర్**
ప్రధానాచార్యులు
నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)
నల్లగొండ – తెలంగాణ

# అభినందన

ప్రజల వినోదం కోసం ఒకనాడు అత్యధికంగా ఆదిరిపంబడిన కళ నాటకమే. ప్రపంచ వ్యాప్తంగా ఆయా భాషల్లో, ఆయా కాలాల్లో నాటకం ఆయా సమాజాల్ని ఎంతో కొంత సంస్కరించుకుంటూ వచ్చింది. మారిన స్థల, కాల పరిస్థితుల్లో నాటకం తన ప్రాభవాన్ని కోల్పోయి సినిమాల్లో పునర్జీవం పోసుకుందనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. ఒకప్పుడు తెలుగు నేల మీద సురభిలాంటి నాటక సమాజాలు నాటకానికి ప్రాణం పోసి నాటకాన్ని బతికించడానికి తీవ్రమైన కృషి చేశాయి. ఒకప్పటి నాటికలు ఇప్పుడు చిన్న చిన్న స్కిట్లుగా మారి పలు టీవీ కార్యక్రమాల్లో ప్రదర్శింపబడుతుండడం మనం గమనిస్తూనే ఉన్నాం.

శతాబ్దాలుగా ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని, చైతన్యాన్ని, సంస్కరణ దృష్టిని కల్గించిన నాటకరంగ ప్రాశస్త్యము మీద మా కళాశాల తెలుగు విభాగం 'తెలుగు నాటక సాహిత్యము – సమాలోచన' అనే పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించడం ముదావహం. ఈ జాతీయ సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాల నుండేగాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా నాటక రంగంలో విశేషమైన కృషి చేసిన నటులు, దర్శకులు, వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాలల ఆచార్యులు, పరిశోధకులు పాల్గొని లోతైన విమర్శతో పరిశోధనా పత్రాలను సమర్పించడం గమనార్హం. సదస్సులో సమర్పించబడిన పరిశోధనా పత్రాలలో ఎంపిక చేసిన కొన్ని వ్యాసాలను రేపటి పరిశోధకులకు, నాటకరంగ అభిమానులకు ఉపయోగపడే విధంగా ఇలా ఒక ప్రత్యేక సంచిక రూపంలో వెలువరించడం సంతోషదాయకం. తెలుగుశాఖ భవిష్యత్తులో కూడా మరిన్ని మంచి అంశాలపైన జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తుందని ఆకాంక్షిస్తూ ఈ జాతీయ సదస్సును విజయవంతం చేయడంలో అవిరళమైన కృషి చేసిన తెలుగుశాఖ అధ్యక్షులు డా॥ తండు కృష్ణయ్య గారిని, ఇతర అధ్యాపకులను, విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అదేవిధంగా జాతీయ సదస్సులో సమర్పించిన వ్యాసాలను ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్న మూసీ పత్రిక సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మ గారికి, సహ సంపాదకులు డా॥ అట్టెం దత్తయ్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

తేది: 22–05–2024. **–డా॥ సముద్రాల ఉపేందర్**

# మా మాట

68 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన మా నాగార్జున ప్రభుత్వ కళాశాలకు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. కళాశాల ప్రారంభం నుండి తెలుగు శాఖ కొనసాగుతూ ఎందరో ప్రతిభావంతులైన అధ్యాపకులు తమ బోధన ద్వారా విద్యార్థుల్ని అత్యుత్తమ పౌరులుగా, సాహితీవేత్తలుగా, పరిశోధక విద్యార్థులుగా, అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా రాణించేలా కృషి గావిస్తున్నారు. మా తెలుగు శాఖ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్రస్థాయి సదస్సులను, కార్యశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగివున్న సృజనను వెలికితీస్తూ వారిని సాహితీవేత్తలుగా, పరిశోధక విద్యార్థులుగా తీర్చిదిద్దడం జరుగుతుంది. ఈ క్రమంలోనే 27, 28 మార్చి 2024 న "తెలుగు నాటక సాహిత్యం-సమాలోచన" అను అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ఉభయ రాష్ట్రాల డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు మాత్రమే కాకుండా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఆచార్యులు, బెంగళూరు, మద్రాసు విశ్వవిద్యాలయాల అధ్యాపకులు కూడా ఆయా అంశాలపై పత్ర సమర్పణ గావించారు.

తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియకు ప్రత్యేక స్థానం ఉన్నది. 19 వ శతాబ్ది ఉత్తరార్థంలో ప్రారంభమైన తెలుగు నాటక ప్రక్రియ క్రమంగా వికాసం చెంది వేలాది నాటకాలు రాయబడి తెలుగు నాట జరిగే అనేక సమస్యలను ప్రతిబింబిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మొదట పౌరాణిక, చారిత్రక నాటకాలతో ప్రారంభమైన నాటకం క్రమంగా సామాజిక సమస్యలకు అద్దం పట్టే అనేక నాటకాలు వెలువడి తెలుగు నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. ప్రజల భాషకు పట్టం కడుతూ భాషా సంస్కరణతో పాటు సంఘసంస్కరణే ధ్యేయంగా గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకం వెలువడినదాదిగా పలువురు నాటక రచయితలు రచనా విధానంలో కొత్త పుంతలు తొక్కుతూ అనేక నాటకాలను రాసి ప్రదర్శింపజేశారు. తమ కాలం నాటి సామాజిక సమస్యల్ని ప్రతిబింబించే విధంగా నాటక రచన గావించి ఆ సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కలిగించి వారిని చైతన్యవంతుల్ని చేశారు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో రాయబడిన మాభూమి నాటకం తెలుగు నేలపై వందలాది ప్రదర్శనల ద్వారా ప్రజల్ని చైతన్యవంతం చేసిందంటే తెలుగునాట నాటకం ఎంతటి పాత్రను పోషించిందో చెప్పవచ్చు. అనేక నాటకాలు ఆయా కాలాల్లో ప్రదర్శింపబడి ప్రజల్ని ఆకట్టుకున్నాయి, ఆలోచింపజేశాయి. ఇలా ఎంతో ప్రజాదరణ పొందిన నాటకం సినిమా ప్రభావం వల్ల క్రమంగా తన వైభవాన్ని కోల్పోయింది. నాటక రచనలు చేయడం, ప్రదర్శింపబడడం తక్కువ అవుతూ వస్తుంది. ఇటువంటి సందర్భంలో తెలుగు నాటక సాహిత్యాన్ని సమగ్రంగా నేటి విద్యార్థులకు మాత్రమే కాకుండా భావి తరాల వారికి కూడా అవగాహన కలిగించడం కోసం ఈ జాతీయ సదస్సును నిర్వహించాం. తెలుగునాట వెలువడిన పలు నాటకాల గూర్చి, నాటక రచయితల గూర్చి, నాటక సంస్థల గూర్చి వ్యాసాలను రాయించడం జరిగింది. మేము కోరిన వెంటనే ఆయాఅంశాలపై వ్యాసాలను రాయడమే కాకుండా సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ గావించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఈ సదస్సు నిర్వహించడానికి అనుమతి ఇచ్చిన మా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సముద్రాల ఉపేందర్ గారికి, ఆర్థికంగా సహకారం అందించిన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారికి, మా తెలుగు శాఖ అధ్యాపకులకు, కళాశాలలోని ఆయా విభాగాల అధ్యాపకులకు అందరికీ పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు. అదేవిధంగా జాతీయ సదస్సులో సమర్పించిన వ్యాసాలను ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్న మూసీ పత్రిక సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మ గారికి, సహ సంపాదకులు డా॥ అట్టెం దత్తయ్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**- సంపాదకులు**

# జానపద నాటక సాహిత్యం

**డా. ఇడికోజు శ్రీనివాసాచారి**
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ మైనార్టీ గురుకుల కళాశాల
అంబర్‌పేట్
సెల్: 9885349305

మంచీ చెడుకు మధ్య జరిగే సంఘర్షణను తెలియజేస్తూ, చివరికి మంచికే విజయం లభిస్తుందని సందేశం ఇస్తూ జనపదుల్లో నైతిక విలువలు పెంపొందించి, సన్మార్గ బాటను పయనింపజేసే ఉత్తమ ప్రయోజనం కోసం జనంలోని ఆట, పాట, మాటల నుండి పుట్టిందే జానపద నాటకం. జానపదుల కోసం జానపదులచే ప్రదర్శింపబడే దేశి రూపకం జానపద నాటకం. మార్గ రూపకాలు నియమాలతో, కేవలం సమాజంలోని విద్యావంతులకు మాత్రమే ఉద్దేశింపబడినవైతే, గ్రామీణ ప్రజల కోసం, వారివారి మాండలికాల్లో వినోదం ప్రధానాశయంగా కలిగి, భక్తిభావం పెంపొందిస్తూ, నీతిని తెలియజేయడానికి ఉద్దేశింపబడినవి ఈ దేశి రూపకాలు (జానపద నాటకాలు). ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పద్ధతిలో, ఒక్కో పేరుతో ప్రదర్శించే కళారూపాలకు సంబంధించిన ప్రత్యేక లక్షణాలతో ఆయా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వినోదంతో పాటు, విజ్ఞానాన్ని కలిగిస్తూ, చైతన్యవంతుల్ని చేస్తూ ముందుకు సాగిపోతోందీ జానపద నాటకం. ప్రాచీన కాలం నుండి ప్రజల జీవితంలో పెనవేసుకుపోయి, వారి సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రధాన భాగమైంది. జాతికి ప్రతీకగా నిలిచింది.

తెలుగు జానపద నాటకరంగం సుసంపన్నమైనదీ, వైవిధ్యభరితమైంది. తెలుగులో ఉన్నన్ని జానపద నాటక కళారూపాలు ప్రపంచంలో ఎక్కడా లేవంటే అతిశయోక్తి కాదు. యక్షగానం, వీధి నాటకం (భాగవతం), కలాపం, తూర్పు భాగవతం, చిందు యక్షగానం, తోలుబొమ్మలాట ప్రధానమైన జానపద నాటక కళారూపాలుగా మనుగడ సాగిస్తుండగా- పగటి వేషాలు, చిరుతల రామాయణం, వాలకం నాటకీయతను సంతరించుకొని, నాటకీయ లక్షణాలు కలిగిన కళారూపాలుగా కొనసాగుతున్నాయి. అయితే, నాటకీయత సంతరించుకొన్న కారణంగా వీటిని జానపద నాటక కళారూపాలుగా పేర్కొనలేం.

అన్ని భాషల దేశి రూపకాల ప్రదర్శనల తొలిదశలో మాదిరిగానే పౌరాణిక, ఇతిహాసాలకు సంబంధించిన గాథలే ప్రధాన ఇతివృత్తాలుగా మన జానపద నాటకాలు కూడా రూపుదిద్దుకున్నాయి. అయితే కాలక్రమేణా జనపదుల మనోభావాల వ్యక్తీకరణ, వారి ఆచారాలు, సంప్రదాయాలు, సమకాలీన సమస్యలు, హాస్య-వ్యంగ్య పూర్వక సంభాషణలు ప్రదర్శనల్లో చోటు చేసుకొంటూ ఇంకా వారికి చేరువయ్యాయి. నృత్యం, నాటకం, సంగీతం మేళవింపుతో సమాహార కళగా కళాత్మక ప్రదర్శనలుగా పరిణతి చెందాయి. నీతి, ధర్మం, భక్తి ప్రధాన ప్రబోధకాంశాలుగా గ్రామీణ ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయి.

ప్రారంభదశలో జానపద నాటక ప్రదర్శనలు దేవుడి మీద భక్తితోనో, సరదాతోనో, ఆచారంతోనో ప్రారంభమైనా, రానురాను వృత్తిగా మారి, ఒక్కో కళారూపం ఒక్కో మతం, కులం, వర్గం, ప్రాంతం, కుటుంబం వారే ప్రదర్శించే పరిణామానికి దారితీసింది. దాంతో అందరూ అన్ని కళారూపాలను ప్రదర్శించే
అవకాశం లేకుండా పోయింది. ఈనాటికి కూడ ఇదే నియమం అమలవుతూ ఉంది. దేవుడి కొలుపులు,

ఉత్సవాలు, ఊరేగింపులు, పెళ్ళిళ్ళు, శుభకార్యాలు, కర్మకాండల్లో ప్రదర్శనలు కచ్చితంగా జరగాలనే కట్టుబాటు అమల్లోకి వచ్చి కొనసాగుతూనే ఉంది. దాంతోపాటు ఒక్కో బృందం ఊరూరా తిరుగుతూ మొబైల్ థియేటర్‌లా ప్రదర్శనలిస్తూ, వారెన్నుకొన్న కళారూపానికి పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చారు. దేవాలయాల ప్రాంగణాల్లో మొదలైన ఈ జానపద నాటకం ప్రదర్శనలు క్రమంగా ఆ గ్రామం మధ్యలో, నాలుగురోడ్ల కూడలిలో లేదా ఆ ఊరి రచ్చబండ వద్దనో, తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వేదికలపైననో ప్రదర్శించడం ప్రారంభమైన తర్వాత అన్ని వర్గాల ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత 10-11 గంటల సమయంలో ప్రదర్శన ప్రారంభమై, తెల్లారే వరకూ కొనసాగడం కూడ జానపద నాటక ప్రదర్శనల సంప్రదాయంగా మారింది. కాగడాలు లేదా దీపపు సెమ్మెల వెలుగులో ప్రదర్శించిన నాటకాలు గంభీరంగా, తన్మయత్వంగా కొనసాగేవి. తెర ముందు పాత్రధారులు, తెర వెనుక వాద్యకారులు, ప్రదర్శన సహాయకారులు, ముఖ్యంగా ఈ బృందానికి నాయకత్వం వహించే సూత్రధారుడూ కలిసి ప్రదర్శన బాధ్యతను నిర్వర్తిస్తారు.

ప్రాంతాలవారీగా జానపద నాటకాల విభజన జరగడంతో ఆయా ప్రాంతాల్లో ప్రదర్శించే నాటకంలో ఆ ప్రాంత భాష లేదా మాండలీకం లేదా యాసను ఉపయోగించడంలో మన భాష, మన నాటకం, మన కోసం అనే మనోభావానికి గురై, మరింత ఆదరించడం జరిగింది. చాలా మంది నిరక్షరాస్యులైన కళాకారులు పద్యాలు, శ్లోకాలు, పాటల విషయంలో కూడా ఆయా ప్రాంత భాషలో వ్యక్తీకరించడం విశేషం. స్త్రీ పాత్రలను పురుషులే ధరించి రంజింప చేయడం మరో ప్రత్యేకత. నాటకపరమైన సంభాషణలు తక్కువగా ఉండి, సంగీతానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రేక్షకులు ఆనందించేవారు. అవసరమైనచోట్ల ముఖ్యంగా సమకాలీన సమస్యలు ప్రతిబింబించే సమయంలో పూర్తి వాడుకభాష ఉపయోగించడం మరో విశిష్ట లక్షణం. కొన్ని కొన్ని నాటకాలు హాస్యం, శృంగారానికి పెద్దపీట వేశాయి. తోలుబొమ్మలాటలో హాస్యం పాలు ఎక్కువగా ఉంటే, భామాకలాపంలో శృంగారం మెండు. ఇక సంగీతం విషయానికొస్తే ఎక్కువ శాతం జానపద బాణీల్లోంచి గ్రహించి, సమర్పించడం, వాద్యాలు కూడా సంప్రదాయపరమైనవి కాక ఉత్సవాల్లో, ఊరేగింపుల్లో ఉపయోగించే డోలు, మృదంగం, తాళాలు, గజ్జెలు మొదలైన సాధారణ వాద్యాలతో వీనులవిందు చేయడం జానపద నాటక విలక్షణ లక్షణం. ఆట, పాట, మాట- ఈ మూడింటినీ అనుసంధానం చేస్తూ, దేని అవసరం మేరకు దాన్ని ఉపయోగిస్తూ, పరిధిని మించకుండా ప్రదర్శించడం ఒక్క జానపద నాటకంలోనే చూస్తాం. శ్రుతి, లయ, తాళాలకు అనుగుణంగా, ఆంగికాభినయానికి తోడు, సాత్వికాభినయాన్ని జోడిస్తూ, పాట పాడడం అనిర్వచనీయం.

ఇక హాస్యం విషయానికి వస్తే, తొలిదశలో లేకపోయినా, కాలానుగుణంగా సమకాలీన సమస్యలు చర్చించేందుకు (ముఖ్యంగా ప్రదర్శించే గ్రామ విషయాలు), అలసిపోయిన ప్రధాన పాత్రధారులకు కొద్ది సమయం విశ్రాంతి కల్పించేందుకు, పూర్తిగా ప్రధాన కథలో లీనమైన ప్రేక్షకులకు కాసేపు ఉల్లాసం కల్గించేందుకు ప్రదర్శన మధ్యలో అడపా దడపా హాస్యాన్నీ, వ్యంగ్యాన్నీ జోడించి నవ్వుల్ని పండించడం జానపద నాటకం మరో ప్రత్యేకత. ఇక్కడే అప్పుడప్పుడూ సామెతలు, పిట్ట కథలు, వ్యంగ్యోక్తులు, ఎత్తిపొడుపులు, వెక్కిరింపులు చోటు చేసుకోవడం గమనార్హం. ఈ హాస్య సన్నివేశాలు కేవలం సృష్టించినవే. ప్రధాన కథలో భాగం మాత్రం కావు. అయితే కొన్ని సందర్భాల్లో కథలో మేళవించి హాస్య సంభాషణలు చోటు చేసుకొంటాయి. ఒక్కో కళారూపానికి ఒక్కొక్క హాస్యపాత్ర లేదా రెండు పాత్రలు ఉంటాయి. ఉదాహరణకు తోలు బొమ్మలాటలో కేతిగాడు, బంగారక్క, వీధి నాటకంలో విదూషకుడు ఇలాంటివే. వీరి ఆహార్యం, దుస్తులు కూడ ప్రధాన కథలో ఉండే సంప్రదాయక పాత్రలకు భిన్నంగా, చోద్యంగా ఉంటాయి.

**తెలుగు జానపద నాటకాలు - లక్షణాలు**

1) ప్రాంతీయం 2) సంప్రదాయం 3) దేవతా సంబంధం 4) వంశ పారంపర్యం 5) స్థానిక భాష 6) ముఖాంగరచన అధికం 7) విలువైన వస్త్రాలు, నగలు 8) పురాణేతిహాసాల ఇతివృత్తం 9) సుదీర్ఘ ప్రదర్శన 10) సద్యోనటన ప్రయోగం 11) సమయోచిత సంభాషణం 12) ప్రేక్షకుల పాత్ర (ప్రదర్శనలో) 13) నృత్యం, నాటకం,

సంగీతం 14) మతం, కులం, వర్గం, కుటుంబాల ప్రదర్శన 15) సంచార ప్రదర్శనలు 16) కాలానుగుణ ప్రదర్శనలు 17) నిరక్షరాస్య కళాకారులు (ఎక్కువగా) 18) నాటక ప్రతిలేని ప్రదర్శన.

ప్రపంచంలో ఏ దేశంలోని లేదా ఏ ప్రాంతంలోని జానపద నాటకాన్ని చూసినా, మౌలిక లక్షణాలు ఈ విధంగానే ఉంటాయి. తెలుగు ప్రాంతాల సంస్కృతినీ, వైభవాన్నీ, వారసత్వాన్నీ చాటి చెప్పిన జానపద నాటకాలలో ఇంతకుముందు చెప్పుకొన్న ప్రధాన స్రవంతిలోని నాటకాలను గురించి ఇప్పుడు సూక్ష్మంగా తెలుసుకొందాం.

**యక్షగానం**

యక్షగానం నృత్య, నాటక, సంగీత, వేష, భాష, అలంకారాల కలబోత. 15, 16 శతాబ్దాలకు చెందిన తొలి జానపద కళారూపం యక్షగానం. యక్షులు గానంచేసే సంప్రదాయం కారణంగా దీనికా పేరు వచ్చింది. శివరాత్రి పండుగ సందర్భంగా శ్రీశైలంలో తొలి యక్షగాన ప్రదర్శన జరిగినట్టుగా పాల్కురికి సోమనాథుడి (1280-1340) పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణంలో చెప్పబడింది. శ్రీనాథుడి (1430) భీమేశ్వర పురాణంలో కూడ దీని ప్రసక్తి తెలియవచ్చింది. పండుగల సందర్భంగా యక్ష (జక్కుల) జాతికి చెందిన పురుషులు, స్త్రీలు పాడుతూ, నృత్యం చేసేవారని క్రీడాభిరామం (15వ శతాబ్దం) తెలియజేస్తుంది.యక్షగాన ప్రదర్శన సాయంత్రం వేళలలో మొదలవుతుంది. ఊరికి తెలియజెప్పడానికి ఆటకు మొదలు దాదాపు రెండు గంటలపాటు డప్పు కొడతారు. నటులందరూ మెరిసే దుస్తులు, రంగులు పూసిన ముఖములు, తలపై సవరం ధరించి ఉంటారు. ఈ ప్రదర్శనలు ఎక్కువగా పురాణగాధలను వివరిస్తుంటాయి. కథకుడు కథ చెబుతుండగా, వెనుక సంగీతం వినబడుతుంటుంది. వర్ణనలకు అనుగుణంగా నటీ-నటులు నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. నటులకు సంభాషణ అతి స్వల్పంగా ఉంటుంది. ఇలా దాదాపు మరుసటి రోజు సూర్యోదయం వరకూ యక్షగానం సాగుతుంది. భక్తి ఉద్యమం జరిగే సమయంలో ఉన్న శాస్త్రీయ సంగీతం ఇంకా నాటక కళ యక్షగానంగా పరిణితి చెందాయన్నది ఒక నమ్మిక. గాన ప్రక్రియలో ప్రారంభమైన ఈ కళారూపం క్రమంగా నాటక కళారూపంగా మారిందని తెలుస్తోంది. తంజావూరు నాయకరాజుల కాలంలో ఈ కళారూపం ఆదరింపబడి, పరిపూర్ణ నాటక కళారూపంగా రూపుదిద్దుకొంది. 18వ శతాబ్దం శహాజీ కాలం నాటికి యక్షగానం ఉచ్ఛస్థితికి చేరింది. ఈ ఇద్దరు రాజులు వరుసగా 23, 20 యక్షగానాలు రచించడం ఈ కళారూపానికి ఉన్న ప్రాముఖ్యతను చాటుతుంది.

తెలంగాణ ప్రాంతంలో 18వ శతాబ్దం నుండి యక్షగానం బహుళ ప్రజాదరణ పొందింది. శేషాచలకవి రాసిన ధర్మపురి రామాయణం (1780), రాపాక శ్రీరామకవి రాసిన ఆధ్యాత్మ రామాయణం ప్రసిద్ధమైనవి. ఆ తర్వాత తెలంగాణ యక్షగాన పితామహునిగా పేరొందిన చెర్విరాల భాగయ్య 34 యక్షగానాలు రాసి చరిత్ర సృష్టించాడు. ఇప్పటికీ ఆయన రచనలు ప్రదర్శితాలు. 500 సంవత్సరాల చరిత్ర కలిగిన యక్షగానం పలు దిశల్లో, దశల్లో పయనించి, పలు స్థానిక అవసరాలను తీరుస్తూ, తిరుగులేని సంప్రదాయ నాటక కళారూపంగా విలసిల్లుతోంది. కలాపం దీని నుంచే పరిణామం చెందింది. యక్షగానం యక్షగాన ప్రబంధం, యక్షగాన మహానాటకం పేర్లతో కూడా వినుతి కెక్కింది.

**కలాపం**

నృత్య-సంగీత ప్రధాన పాత్రలతో నడిచే నాటకీయతతో కూడిన కళారూపాన్ని కలాపం అని అంటారు. భామాకలాపం, గొల్లకలాపం ఈ ప్రక్రియలో పేరొందిన కళారూపాలు. కథ అంతగా లేకపోయినా, అభినయం, నృత్యం, పాట, సంగీతంతో సమ్మోహనపరిచే నాటక కళారూపం. యక్షగానానికి-వీధినాటకానికి వారధి ఈ కలాపం అని చెప్పవచ్చు. పాత్రలు స్వయంగా పరిచయం చేసుకోవడం (ప్రవేశ దరువు) కలాపంతోనే ప్రారంభమైంది. రాధాకృష్ణుల ప్రేమోదంతం దీని ప్రధాన కథా వస్తువు. అయితే, సత్యభామ ప్రధాన పాత్రధారిగా ఆంధ్ర కలాపం పరిచయమైంది. శృంగార రసంలోని ఎనిమిది అంశాలను ప్రతిబింబిస్తూ కృష్ణ-సత్యభామల మధ్య సాగే ప్రేమ కథే ఈ కలాప ప్రదర్శన. కూచిపూడి వాళ్ళు ప్రదర్శిస్తే సంప్రదాయ శైలిగాను, తూర్పు భాగవతులు ప్రదర్శిస్తే తూర్పు భాగవతం (జానపద) శైలిగాను

పరిగణింపబడుతోంది. 15వ శతాబ్దంలో సిద్ధేంద్రయోగి ఈ శైలికి మూలకారకుడని తెలుస్తుంది. ఈ శైలిలో పురుషులే మహిళల పాత్రలు ధరిస్తారు. ప్రాచీన వాయిద్యాలు వాడుతూ, కృష్ణలీల నృత్యాలు చేయడం దీని ప్రత్యేకత. గిరిజా కల్యాణం, కీచకవధ, రామ నాటకం, రుక్మాంగద, శశిరేఖా పరిణయం, కిరాతార్జునీయం, కాళీయ మర్దనం, లవకుశ మొదలైనవి యక్షగాన ప్రదర్శనలకు ఉదాహరణలు.

**తూర్పు భాగవతం**

భామాకలాపం, గొల్లకలాపం రెండు విభిన్న శైలులతో తూర్పు భాగవతం ప్రదర్శింపబడుతోంది. ప్రపంచం - మానవుడి పుట్టుక గురించి ఒక పాలమ్మే గొల్ల యువతికీ, ఒక బ్రాహ్మణుడికీ మధ్య జరిగే చర్చ, సంవాదమే గొల్ల కలాప ప్రదర్శన. విజయనగరం, విశాఖ జిల్లాలలో విశేషాదరణ పొందిన ఈ కళారూపం నేటికీ సజీవంగానే ఉంది. తన ఉనికినీ, అవసరాన్నీ చాటుతూనే ఉంది. కృష్ణ గాథల్ని బలంగా నాటకీయ ధోరణిలో ప్రదర్శించేది భామాకలాపం. 13వ శతాబ్దిలో వైష్ణవ ప్రదర్శనల ఆధారంగా ఈ భాగవత ప్రదర్శనలు ఆంధ్రలోకి వెలుగులోకి వచ్చాయని జయదేవుడి గీతగోవిందం ద్వారా విదితమౌతోంది. భాగవత కథలను తూర్పు ప్రాంతంవారు ప్రదర్శిస్తున్న కారణంగా ప్రదర్శించేవారిని తూర్పు భాగవతులని, ప్రదర్శనలను తూర్పు భాగవతాలని పిలుస్తూ వచ్చారు. కృష్ణలీలలు, జలక్రీడలు పేరిట రెండు పద్ధతుల్లో సాగే ఈ ప్రదర్శనలు హృద్యంగా ఉంటాయి. కృష్ణలీలలు బాలకృష్ణుని చేష్టలు, మహిమల్ని తెలియజేయగా, జలక్రీడలు కృష్ణుని శృంగార చేష్టల్ని బహిర్గతం చేస్తాయి. రెండూ కూడ కృష్ణుడి ప్రేమ తత్వాన్ని, కృష్ణుడి పట్ల భక్తిభావాన్నీ వ్యక్తం చేస్తాయి. నాటక పాఠ్యం సంగీత ప్రధానంగా సాగుతుంది. చాలా రాగాలు దేశి పద్ధతిలో ఉంటాయి. పాట, రగడ, పద్యం, ద్విపదల వాడకం అధికం. కృష్ణ-సత్యభామల సంవాదం, సత్యభామ-రాధల మధ్య సవతుల కయ్యం ప్రధానేతివృత్తం. భాగవత పాత్ర సంక్లిష్టమై, బహువిధాల పోషణ ఓ ప్రత్యేకత. సూత్రధారుడిగా, వంత గాయకుడిగా, హాస్యగానిగా, సంభాషణల కర్తగా బహువిధాలుగా పోషించవలసి ఉంటుంది. కీర్తన, పురాణ ప్రవచనం ప్రముఖ పాత్ర వహిస్తాయి. ముఖాంగ రచన, వేషధారణ, నగలు సుందరంగా ఉంటాయి. మృదంగం ప్రధాన పాత్ర వహిస్తుంది. వంకాయల బలరామభుక్త ప్రథమ తూర్పు భాగవత రచయితగా గుర్తించబడ్డాడు. పురుషులే అన్ని పాత్రలూ ధరిస్తారు. ప్రదర్శన సాధారణంగా 6-7 గంటలపాటు సాగుతుంది. ఒక్కోసారి 3 రాత్రులు కూడ కొనసాగుతుంది. ఇప్పటికీ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్థానిక దేవతల పండుగలు, ఉత్సవాలు ఈ భాగవత నాటక ప్రదర్శనలు లేనిదే ప్రారంభం కావు. సంప్రదాయ-జానపద శైలులకు మధ్యస్థంగా ఉండి ఇరువర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం దీని ప్రత్యేకత. కొచ్చర్ల వీరభద్రుడు, చేబ్రోలు సన్యాసయ్య, దూడల శంకరయ్య, బొంతలకోటి జగన్నాథం, కొచ్చర్ల బ్రహ్మానందం బృందాలు ఈ భాగవత ప్రదర్శనల్లో విశేషఖ్యాతి పొందాయి.

**వీధి నాటకం**

ఆంధ్రదేశంలో అన్ని కళారూపాల కంటే బహుళ ప్రాచుర్యంలో ఉన్న కళారూపం వీధి నాటకం. రాయలసీమ ప్రాంతంలో దీన్ని బయలాట అంటారు. భాగవతం, వీధి భాగవతం అని ఆంధ్ర ప్రాంతంలో పిలుస్తారు. వీటిని ప్రదర్శించే కళాకారులను భాగవతులు అంటారు. దాసరి భాగవతం, యానాది భాగవతం, చెంచు భాగవతం, చిందు భాగవతం, మేలట్టూరు భాగవతం అని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిస్తూ ఉంటారు. ప్రదర్శనాపరంగా చూస్తే మిగిలిన నాటక కళారూపాల కంటే వీధి నాటక కళారూపం భిన్నమైందీ... ప్రత్యేకమైందీ. ఆంధ్ర ప్రాంతంలో కృష్ణభక్తి ప్రచారానికిగాను 16-17 శతాబ్దాల మధ్యకాలంలో ఈ కళారూపం వెలుగులోకి వచ్చింది. విజయరాఘవ నాయకుడు వీధి నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించినట్టు తెలుస్తోంది.

రగడలు, త్రిపుటలకు మారుగా పదాలు, దరువులతో, పాత్రలే స్వయంగా పరిచయమౌతూ, నాటకీయతకు దెబ్బ రాకుండా నృత్య, సంగీతాలతో కనువిందు చేసే కళారూపం వీధి నాటకం. యక్షగానం, కలాపం కంటే ఎక్కువగా నాటకీయతను సంతరించుకొంది. సంఘర్షణలను నాటకీయతతో చెప్పడం దీని ప్రత్యేకత. సంభాషణలు ఎక్కువగా

పాటల రూపంలో ఉంటాయి. సూత్రధారుడు ప్రధాన భూమిక నిర్వహిస్తాడు. నాటకీయతతో కూడిన సంభాషణలు ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఆంగిక, వాచికాభినయాలకు ప్రాధాన్యత, హాస్యానికి పెద్దపీట దీని అదనపు ప్రత్యేకతలు.

1943-44లోనే ప్రజానాట్యమండలి కోగంటి గోపాల కృష్ణయ్య రచించిన హిట్లర్ భాగవతం, సిమ్లా భాగవతం నాటకాలను సంప్రదాయ వీధి నాటక శైలిలో ప్రదర్శించి, సమకాలీన సమస్యల్ని సంప్రదాయ శైలిలో ప్రదర్శించే పద్ధతికి, మార్గదర్శకులయ్యారు. ఈ రెండు నాటకాలకు కోడూరి అచ్చయ్య దర్శకత్వం వహించారు.

సంప్రదాయ వీధి నాటక లక్షణాలను ఆపాదించుకొని, సమకాలీన సమస్యలతో కదం తొక్కుతూ ప్రజలకు చేరువైంది ఆధునిక వీధి నాటకం. ఆధునిక వీధి నాటకం పలు జానపద కళారూపాల బాణీని, సంగీతాన్ని, నృత్యాలను మేళవించి ప్రదర్శిస్తూ, వెనుకబడి పోయిన ఈ కళారూపాలను ముందు తరాలకు పరిచయం చేస్తూ ఉంది.

**తోలుబొమ్మలాట**

కళాకారుల స్థానంలో రంగురంగుల, వింత ఆకృతుల్లో, వివిధ పరిమాణాల్లో తయారుచేసిన తోలుబొమ్మలే పాత్రధారులుగా, నేపథ్యం నుండి ఆయా పాత్రల సంభాషణలతో, తెర మీద బొమ్మల కదలికలతో పాటు ప్రాధాన్యంగా గల కళారూపం తోలుబొమ్మలాట. పౌరాణిక ఇతివృత్తాలే ప్రధానంగాగల ఈ ప్రదర్శనలో ఆ ఇతివృత్తంలోని పాత్రలు బొమ్మల రూపంలో దర్శనమిస్తాయి. తోలుతో తయారు చేసిన బొమ్మలు కాబట్టి దీనిని 'తోలు బొమ్మలాట' అన్నారు. 12, 13 శతాబ్దాల్లో దీని ఉనికి తెలిసినప్పటికీ, 18,19 శతాబ్దాలకు ప్రజాదరణ పొందిన కళారూపంగా కనిపిస్తుంది. సంవత్సరానికి 9 నెలల పాటు అన్ని ప్రాంతాలూ తిరిగి తమ ప్రదర్శనలివ్వడం బొమ్మలాట ప్రత్యేకత. రాత్రి 9-10 గంటల మధ్య ప్రారంభమై, తెల్లవారే వరకూ ప్రదర్శనలు కొనసాగుతాయి. ప్రధాన కథకు సంబంధం లేని పలు హాస్య సంఘటనలు ఇందులో చోటు చేసుకొంటాయి. కేతిగాడు, బంగారక్క, జుట్టుపోలిగాడు వంటి హాస్య పాత్రలు అందించే ఈ బొమ్మల కదలికలు, హావభావాలు సంభాషణల కనుగుణంగా ఉంటాయి. బొమ్మల కదలికలు సజీవంగా ఉంటాయి. పాత్ర, పాత్రకూ పరిమాణంలో, రంగుల్లో, ఆకృతుల్లో తేడాలుంటాయి. నాటకీయత పాలు అధికంగా ఉండే ఈ కళారూపంలో పాట, సంభాషణలు, బృందగానం ప్రధానంగా చోటు చేసుకుంటాయి. తెరవెనుక నుండి బొమ్మల నాడించే వ్యక్తులు ప్రధాన సూత్రధారులు. సుందరకాండ, కుశలవ, పద్మవ్యూహం, కీచకవధ, లక్ష్మణ మూర్ఛ, యుద్ధకాండ, మైరావణ, శశిరేఖా పరిణయం బొమ్మలాట ప్రధాన ప్రదర్శనలు. నెల్లూరు జిల్లా డి.సి.పల్లి కుమార రాజారావ్ బృందం, అనంతపురం జిల్లాలోని నిమ్మలకుంట వనారస చలపతిరావ్, రామకృష్ణల బృందం, తూర్పుగోదావరి జిల్లా మాధవపట్నం తోట సుబ్బారావ్, అనపర్తి త్రినాథ్‌ల బృందం, గుంటూరు జిల్లా నరసరావుపేట సమీపంలోని మరో బృందం తోలు బొమ్మలాట ప్రదర్శనలకు పెట్టింది పేరు.

**చిందు యక్షగానం / భాగవతం**

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వృత్తి కళాకారులైన హరిజనులు - హరిజనుల కోసమే ప్రధానంగా ప్రదర్శించే, మహిళలు ప్రధాన పాత్రలు పోషించే జానపద నాటకం చిందుయక్షగానం /భాగవతం, రామాయణ, మహాభారత, భాగవత కథలు ఇతివృత్తంగా మరియు స్థానికంగా బహుళ ప్రచారంలో ఉన్న చెంచులక్ష్మి వంటి కథలను ఇతివృత్తాలుగా ప్రదర్శిస్తారు. 'చిందు' అంటే నాట్యంలో వేసే లయబద్ధమైన అడుగు. ఈ చిందుకు ప్రాధాన్యమిస్తూ కథను కొనసాగించడం చేత దీనికాపేరు వచ్చింది. పండుగలకు, పెళ్ళిళ్ళకు ఆచారంగా ప్రదర్శించే 'జాంబపురాణం'లో వారి కులదేవత 'ఎల్లమ్మ' ఆవిష్కరింపబడుతుంది. పురుషులు, మహిళలు కలిసి చేసే ఈ ప్రదర్శనలు సాధారణంగా పగటి పూట చోటు చేసుకుంటాయి. ఒక్కోసారి పురుషులు మహిళా పాత్రలు, మహిళలు పురుష పాత్రలు ధరించడం ఈ కళారూపం ప్రత్యేకత. తమ కులదేవతను ప్రసన్నం చేసుకోవడానికి, తద్వారా సుఖశాంతులు కలుగుతాయనే నమ్మకంతో, ప్రదర్శనలనే 'పూజావిధానం'గా ఈ భాగవత నాటకాన్ని ప్రదర్శించడం మరో ప్రత్యేకత.

సతీ సావిత్రి, చెంచులక్ష్మి, అల్లీరాణి, బాలనాగమ్మ, భక్త ప్రహ్లాద, వీరాభిమన్యు, గంగా-గౌరి సంవాదం పేరెన్నిక

గన్న చిందు ప్రదర్శనలు. బాలక్రిష్ణ, రంభ నృత్యంతో ప్రారంభమై ఎల్లమ్మ సాక్షాత్కారంతో ప్రదర్శన ముగుస్తుంది. కాంభోజ, సావేరి, మోహన రాగాలు ప్రధానంగా కొనసాగుతుంది. రూపక, ఆది, త్రిపుట తాళ వినియోగం అధికం. మృదంగం. తబలా లయ ప్రధాన వాద్యాలు. కళాకారులందరూ కాలి గజ్జెలు ధరిస్తారు.

నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఇప్పటికీ సజీవంగా నిలిచి ఉన్న కళారూపం చిందు భాగవతం. చిందుల ఎల్లమ్మ, చిందుల శ్యాం, చిందుల గోపాల్ బృందాలు ఈ ప్రదర్శనలకు ప్రపంచ ప్రఖ్యాతి నార్జించి పెట్టాయి. సాధారణ పల్లె ప్రజలచే ప్రదర్శించే ఈ జానపద నాటకాల్లో సాహిత్యపరమైన విలువలు అంతగా లేకపోయినా, ప్రదర్శనాపరంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అంతేగాక, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే భాషలో, శైలిలో ప్రదర్శించబడడం చేత వారికి కావలసిన మానసికోల్లాసం లేదా భక్తి భావం లేదా సంప్రదాయానుసరణ విధానం ప్రదర్శించారన్న తృప్తి లభించేవి.

**ఆధార గ్రంథాలు :**

1. డా॥ రాధాకృష్ణమూర్తి మిక్కిలినేని (1992), తెలుగువారి జానపద కళారూపాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
2. డా॥ ప్రేమలత రావి (2019), తెలుగు జానపద సాహిత్యం – పురాగాథాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. డా॥ సుందరం ఆర్వీయస్ (2018), ఆంధ్రుల జానపద విజ్ఞానం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
4. ఆచార్య బిరుదురాజు రామరాజు (1978), తెలుగు జానపద గేయ సాహిత్యం, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్.
5. ఆచార్య మోహన్ జి.యస్ (2011), జానపద విజ్ఞాన అధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్, బెంగళూరు.
6. ప్రొ॥ సిమ్మన్న వెలమల (2011), తెలుగు సాహిత్య చరిత్ర, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్టణం.
7. అంతర్జాలం వికీపీడియా సమాచారం.

ISSN 2457 - 0796 UGC CARE List Approved Journals
మూసీ మాస పత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-27: సంచిక - 7(2) హైదరాబాద్ మే - 2024

# తెలుగు నాటకం - వస్తు వైవిధ్యం

**బొమ్మకంటి సుధామాధురి**
తెలుగు అధ్యాపకులు
కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజి
హన్మకొండ
సెల్ : 9949727714

తెలుగు సాహిత్యంలో ప్రతి ప్రక్రియకు ఏదో ఒక ప్రత్యేకత, ప్రయోజనం వుంది అందులో నాటకం మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది ప్రేక్షకుల యొక్క సాహిత్య స్థాయితో సంబంధం లేకుండా అనేక అనుభూతులను, ఆనందాన్ని, ఆలోచనలను అందించగల ఏకైక సాధనం. నాటకం అనేది ప్రదర్శన యోగ్యమైనది. ఇది నటులచే వేదికపై ప్రదర్శింపబడి సర్వజనులను రంజింపచేస్తుంది. నాటకాన్ని జీవితానికి ప్రతిబింబంగా చెబుతారు, కారణం లోకంలో అవగతమయ్యే సుఖదుఃఖాలను అభినయాత్మకంగా వ్యక్తీకరించి, జీవిత సత్యాలను ఆవిష్కరిస్తుంది. అందుకే "కావ్యేషు నాటకం రమ్యమ్"గా చెప్పబడింది.

సంస్కృతంలోని పురాణేతిహాస కావ్య ప్రక్రియలను తెలుగులోకి తీసుకువచ్చిన తెలుగు కవులు ఎందుకో దృశ్యకావ్య ప్రక్రియను మాత్రం పట్టించుకోలేదు. అంతకు ముందు తెలుగునాట ప్రసిద్దిపొందిన దృశ్యప్రక్రియ అంటే యక్షగానాలనే పేర్కొనాలి. తెలుగు సాహిత్యం, ఆంగ్ల సాహిత్య పరిచయంతో ఆధునిక యుగంలో అడుగు పెట్టిన తర్వాతే తెలుగ నాటకం ఆవిర్భవించింది. సంస్కృత నాటకాల అనువాదం మరియు స్వతంత్ర తెలుగు నాటక రచన 1860 తర్వాతే జరిగాయి. కోరాడ రామచంద్రశాస్త్రి 1860లో రచించిన 'మంజరీ మధుకరీయము'ను తొలి తెలుగు నాటకంగా చెబుతారు. కాని ఇది సంస్కృత నాటక లక్షణాల సమన్వీత రచన. ఆధునిక తెలుగు నాటకం 1860లో ఆవిర్భవించే నాటికి సంస్కృత నాటక లక్షణాల సమన్వయంతో సాగింది. అంటే పంచసంధియుతమై, ధీరోదాత్తాది నాయక లక్షణాలు కలిగి వుండి వీర, శృంగార రసాలలో ఏదో ఒకటి ప్రాధాన్యత గల గద్యపద్యాత్మకమైన రచనగా వుండేది. అనంతర కాలంలో పాశ్చాత్య నాటక ప్రభావం వల్ల తెలుగునాటకం ఆధునిక రూపాన్ని సంతరించుకుంది. అందుకు ఉదాహరణ, గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటకం ఇది రూపపరంగా వస్తుపరంగా ఆధునికతను కలిగి వుంది.

తెలుగు నాటక వికాసము : డా.పి.ఎస్.ఆర్. అప్పారావు గారు తెలుగు నాటకరంగ చరిత్రను దశల వారీగ విభజించారు. అవి 1860 నుండి 1880 వరకు ఆరంభదశగా, 1880 నుండి 1929 వరకు గల కాలాన్ని నాటకానికి స్వర్ణయుగంగా అభివర్ణించారు. 1929 నుండి 1943 వరకు గల కాలాన్ని సంధియుగం, 1943 నుండి 1970 వరకు గల కాలాన్ని పోటీ యుగమని, 1970 నుండి నేటి వరకు సమకాలీన యుగమని విభజించారు. ఆ కాలంలో వెలువడిన నాటకాల ప్రామాణికతను, ప్రాశస్త్యాన్ని, ప్రాచుర్యాన్ని పరిగణనలోనికి తీసుకున్నప్పుడు 1875 నుండి 1920 మధ్య కాలాన్ని నాటక యుగంగా చెప్పబడింది.

నేటికి ప్రదర్శించిన ప్రతిసారి అశేష ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం, వేదం వెంకటరాయశాస్త్రి గారి ప్రతాపరుద్రీయం,చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులు గారి గయోపాఖ్యానం, బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి సత్యహరిశ్చంద్ర, తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయం ఆ కాలంలో రచింపబడ్డవే. వీరు గాక ఇంకా ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు,పానుగంటి లక్ష్మీనరసింహరావు ఈ కాలంలోనే ఎక్కువగా నాటకాలు రాశారు.

**ఆధునిక నాటక లక్షణాలు :**

1. నాటకంలో వస్తువు సమకాలీన సమాజానికి సంబంధించిన సమస్యల చిత్రణ అయి వుండాలి.
2. పాశ్చాత్య మర్యాదననుసరించి రంగ విభజన, దృశ్యవిభజన చేయబడ్డాయి.
3. సులభ వచన శైలి, పాత్రోచిత భాష ప్రయోగింపబడ్డాయి.
4. విషాదాంతాలు, మోదాంతాలు అనే పాశ్చాత్య విభజన తెలుగు నాటకాలకు విస్తరింపబడింది.
5. సామాన్య మానవుడే కథానాయకుడయ్యాడు.

(నాట్యశాస్త్రంలో నాట్యపరంగా భరతుడు చెప్పిన చతుర్విధ అభినయ రీతులు ఆధునిక నాటకంలోను కనిపిస్తాయి. అవి: ఆంగికం, వాచికం, ఆహార్యం, సాత్వికం).

ఆధునిక నాటకాన్ని వస్తురీత్యా నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చునని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు పేర్కొన్నారు. అవి: (1) విషాదాంత నాటకాలు (2) విషాద గంభీర రూపకాలు (3) సంప్రదాయ నాటకాలు (4) సాంఘిక సమస్యా నాటకాలు.

**(1) విషాదాంత నాటకాలు:** పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో ఆవిర్భవించిన ప్రక్రియ విషాదాంత నాటకం (ట్రాజెడి). ఇది తొలుత గ్రీకు సాహిత్యంలో కనబడినా 16వ శతాబ్దిలో షేక్స్పియర్ కారణంగా ఆంగ్లసాహిత్యంలోను ప్రవేశించింది. ఆంగ్ల సాహిత్య పరిచయంతో 19వ దశాబ్దంలో ఇది తెలుగు నాటక కర్తలను ఆకర్షించింది.

తెలుగులో విషాదాంత నాటకానికి మేలైన ఉదాహరణ ధర్మవరం రామకృష్ణమాచార్యులు గారి 'విషాద సారంగధర' విశ్వనాథ సత్యనారాయణ గారి 'నర్తనశాల'. ఇవి పూర్తిగా పాశ్చాత్య విషాదాంత నాటక లక్షణాలను కలిగియుండవు. దానికి కారణం భారతీయులది రసదృష్టి కావడమే. పాశ్చాత్యులది కెథార్సిస్ పోషించే ప్రవృత్తి. ఈ రెండింటికి మౌలికమైన భేదముంది. 'రసదృష్టి అంటే అనుకూల ప్రతికూల భావ సంఘర్షణలో నుండి జనించే అంతర్వేదనను సృష్టించి ఆనందంలో లయింపజేసే స్థాయి భావపోషణ ప్రధానంగా సాగేది. కెథార్సిస్ అంటే పరస్పర విరుద్ధ భావ సంఘర్షణలో నుండి అంతర్వేదనను కలిగించి అంతర్మాలిన్యాన్ని ప్రక్షాళనం చేసే పద్ధతి. రస పర్యవసనం ఆనందం కాగా, కెథార్సిస్ భయం, జాలి కలిగించడం ద్వారా జరిగే అంతర్మాలిన్యాన్ని ప్రక్షాళన చేస్తుంది.

**(2) విషాద గంభీర నాటకాలు :** కథ విషాదాంతం కాకపోయినా ప్రేక్షకునిలో నాయకాదుల పట్ల విపరీతమైన సానుభూతిని కలిగించే కథా ప్రవృత్తి గల నాటకాలు విషాదగంభీర నాటకాలు. ఉదా: కందుకూరి 'అభిజ్ఞాన శాకుంతలం', చిలకమర్తి 'గయోపాఖ్యానం' బలిజేపల్లి సత్యహరిశ్చంద్ర మొదలగునవి. ఈ నాటక వస్తువులలో నాయకునిలో సహజమైన లోపం కంటె విధి వైపరీత్యము వల్ల కలిగిన విషాదంతో ప్రేక్షకులు పొందే అనుభవాలు ఎక్కువ. స్వభావరీత్యా ఇవి భారతీయ విషాద గంభీర నాటకాలు.

**(3) సంప్రదాయ నాటకాలు :** సంస్కృత నాటక సంప్రదాయాన్ని అనుసరించేది సంప్రదాయ నాటకం. ఇది రస ప్రధానమైనది. ఇందులో వస్తువు ప్రఖ్యాతమో, మిశ్రమమో అయివుంటుంది. అంటే పౌరాణికంగాని, ఐతిహాసికం గాని, చారిత్రకం గాని అవుతుంది. వస్తునిర్మాణంలో పంచసంధులు, విష్కంభాదులు, అంక నిర్మాణం కనిపిస్తాయి. ఈ నాటకాలలో భావతీవ్రతను పద్యం ద్వారానో, లయాత్మక వచనం ద్వారానో వ్యక్తీకరింపబడుతుంది. ఉదా : తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు'.

**(4) సాంఘిక సమస్యా నాటకాలు :** ఈ నాటకంలో వస్తువు కల్పితం, దీనిపై పాశ్చాత్య నాటక ప్రభావం బాగా కనిపిస్తుంది. ఈ నాటకాలు మోదాంతాలుగా విషాదాంతాలుగాను వుండవచ్చు. సాంఘిక సమస్యా నాటకంలో పాత్రోచితమైన, సజీవమైన వ్యవహార భాష ప్రయోగింపబడుతుంది. ఉదాహరణకు గురజాడ వారి 'కన్యాశుల్కం'.

తెలుగు నాటకంపై పాశ్చాత్య నాటక ప్రభావం వల్ల నాటక వస్తువులో ఎక్కువగా సామాజిక స్పృహ కనబడుతుంది. కందుకూరి వారి ప్రహసనాలనుండే నాటకంలో సామాజిక స్పృహ ప్రారంభమయిందని చెప్పవచ్చు. నాటక సాహిత్యంలో

నాటికలు, ఏకాంకికలు అంతర్భాగాలే. వీటి ప్రదర్శన కాల పరిమితి సుమారు ఒక గంట. ఇది 5 నుండి 6 రంగాలను కలిగి వుంటుంది. కథలో పటుత్వం గల సన్ని వేశాలతో పాటు, సంభాషణలకు ప్రాధాన్యం వుంటుంది. నాటికలలో స్వరూపాన్ని బట్టి దృశ్యనాటిక, గేయ నాటిక, పద్యనాటిక, నృత్యనాటిక, సాంఘిక నాటిక, రాజకీయ నాటిక, విప్లవ నాటిక వంటి భేదాలు కనిపిస్తాయి.

ఈ పరిశోధనా పత్రంలో వస్తు వైవిధ్యం గల మూడు నాటికలను ఎంచుకున్నాను. వీటిలోని వస్తువు నాటి సామాజిక సమస్యలుగా వున్న అంశాలు. ఈ మూడు ప్రేక్షకుల్లో చైతన్యం కలిగించి తద్వారా మార్పుకు శ్రీకారం చుట్టినవే.

మొదటి నాటిక తెలంగాణ తొలి నవలా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి గారిది. ఇది 1955లో రాయడింది. ఈ నాటిక పేరు 'కనువిప్పు'. చదువు సంధ్యలు లేని భార్యను కాదని పట్నంలో చదువు కోసం వెళ్ళి, మరో పెళ్ళికి సిద్దపడి కట్టుకున్న భార్యకు అన్యాయం చేయాలనుకున్న వానికి మిత్రుడు కనువిప్పు కలిగించడమే ఇందులోని ఇతివృత్తం.

వీరయ్యకు చిన్నతనంలోనే వివాహం అవుతుంది. జీవితంపై అవగాహన లేక మిడిమిడి జ్ఞానంతో కట్టుకున్న భార్యకు చదువు లేదని, పల్లెటూరి మొద్దని కాదనుకుంటాడు. కన్న తండ్రి వత్తాసుతో మరో పెళ్ళికి సిద్దపడుతాడు. ఈ విషయం తెలిసిన కన్న తండ్రి మల్లయ్య కూతురికాపురం ఏమవుతుందోనని ఆందోళన చెందుతాడు. అయితే వీరయ్య స్నేహితుడైన రఘు మల్లయ్యను కలిసి విషయం గ్రహిస్తాడు. వీరయ్యకు కనువిప్పు కలిగేలా తన తమ్ముడి సమస్య అంటూ నాటకం ఆడి వీరయ్యలో మార్పు తెస్తాడు. చదువుకున్న వాళ్ళు పాతకాలం వాళ్ళకు బుద్ధి చెప్పాలి కాని మూర్ఖత్వంతో ప్రవర్తించరాదని హితబోధ చేస్తాడు. బలమైన సంభాషణలు నాటికను రక్తి కట్టించి ప్రేక్షకులలో ఆలోచనలను కలిగిస్తాయి.

రెండవ నాటిక 'పై పంట' దీనిని పత్రికా సంపాదకునిగా, నాటక రచయితగా,హేతువాదిగా, మానవతావాదిగా ప్రసిద్ధులైన నార్ల వెంకటేశ్వరరావు గారు 1947లో రచించారు. ఇందులో కష్టపడి పంటను పండించడం రైతు పని, అది రైతుకు అందకుండ కమీషన్లు, దళారీలు, కాకులు, గద్దల్లా రైతు కష్టాన్ని తన్నుకు పోతుంటె నిస్సహాయ స్థితిలో బ్రతుకుతున్న రైతు దారుణ పరిస్థితులు వివరించడమే 'పై పంట' ఇతివృత్తం. రైతు వర్తమాన జీవితానికి తార్కాణం ఈ నాటిక.

రైతు కష్టపడి పంట పండించే వాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. రైతుకు పంట చేతికొచ్చే సమయానికి మునసబు, కరణం తమకు ఇవ్వవలసిన బాకీలు చెల్లించమని ఒత్తిడి చేస్తాడు. గత్యంతరం లేక రైతు గిట్టుబాటు ధర కూడా రాకుండ కమీషన్ ఏజంటుకు ఎంతకో కొంతకు అమ్ముకునే దుస్థితి కలుగుతుంది. షావుకారు తక్కువకు వడ్లు అమ్మలేదని వెంటనే బాకీ మొత్తం చెల్లించమంటాడు. లేకపోతే కోర్టుకు వెళతానని బెదిరిస్తాడు. ఇన్ని ఇబ్బందులను అధిగమించి భార్యకు రెండు చీరెలు కొనిపెట్టలేని నిస్సహాయస్థితి రైతుది. కూతురు ముచ్చట తీర్చలేదనే ఆవేదన మరోవైపు. ఏ అవసరమైనా పంటతో ముడిపెట్టడం, ఆ పంట చేతికి వచ్చేసరికి అప్పటి పరిస్థితులకు తలవొగ్గి పై పంటలో చూద్దాం అనుకోవడం, అలా ప్రతి సంవత్సరం వెళ్ళిపోతుంది. 'పై పంట' అనే ఆశ మాత్రం అలాగే వాళ్ళను బతికిస్తుంది. తీరని ఆశలతో బ్రతుకుతో రాజీపడి రైతు తన జీవితాన్ని నెట్టుకొస్తాడు. ఇటువంటి రైతు జీవితాలకు 'పై పంట' నాటిక అద్దం పడుతుంది. బరువైన సన్నివేశాలు, వేదనతో నిండివున్న సంభాషణలు రైతు యొక్క పరిస్థితి పట్ల ప్రేక్షకులకు సానుభూతి దోపిడి పట్ల అసహనం,ఆలోచన రేకెత్తిస్తుంది.

మూడవ నాటిక 'పడిపోతున్న అడ్డుగోడలు' దీనిని ఆధునికాంధ్ర సాహిత్యంలో తనదైన ముద్రను కలిగి వున్న బోయిభీమన్న 1958లో రచించారు. వీరు దళిత కవి, వర్ణవ్యవస్థ దుష్ఫలితాలకు, అస్పృశ్యతా వ్యాధికి మందు ఒక్క వర్ణాంతర వివాహాలు మాత్రమే అని బోయి భీమన్న గారి ఉద్దేశం. అందుకే వీరి 'పడిపోతున్న అడ్డుగోడలు' నాటిక సమకాలీన సాంఘిక రుగ్మతలను ఎత్తి చూపి సమాజ ప్రగతికి అక్షరదీపికగా నిలిచింది. దళిత విద్య, వర్ణాంతర వివాహాలు ప్రోత్సహించడం ప్రధాన అంశాలుగా సందేశాత్మక సంభాషణలతో అభ్యుదయ భావంతో రామబద్ధ ప్రబోదాత్మక రచన.

ఈ నాటికలో శివరామశాస్త్రి, లక్ష్మీదేవమ్మ బ్రాహ్మణ దంపతులు. వీరికి ఉమాదేవి అనే కూతురు. రామచంద్రం

అనే కుమారుడు వున్నారు. శివరామశాస్త్రి అభ్యుదయ భావాలు కలవాడు. గాంధీజీ పట్ల ఆరాధనతో అతని అడుగుజాడల్లో నడిచేవాడు. హరిజన సేవా సంఘం కార్యదర్శిగా వున్నాడు.

పట్నంలో చదివే ఉమాదేవికి మిత్రురాలు రమాదేవి. ఈమె హరిజన బాలిక. ఉమాదేవి సంక్రాంతి పండుగకు తన ఊరిలో జరిగే సర్వోదయ ఉత్సవానికి రమాదేవిని ఆహ్వానిస్తుంది. ఆ గ్రామంలో కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా కలిసి బహిరంగ సభను ఏర్పాటు చేసుకుంటారు. ఆ తరువాత అందరూ కలిసి సహపంక్తి భోజనం చేస్తారు.

అయితే శివరామశాస్త్రికి ఆదర్శాలు వున్నా అవి తన ఇంటి నుండి ప్రారంభించటానికి సందేహిస్తాడు. కారణం అతడి కొడుకు హరిజన అమ్మాయిని ప్రేమించి ఆమెను తప్ప మరొకరిని వివాహమాడనని మొండిపట్టు పడుతాడు. భార్య ఛాందసురాలు, కొడుకు అభిప్రాయాన్ని ఇష్టపడదు. ఆ సమయంలో రామచంద్రం ప్రేమించిన అమ్మాయి రమాదేవి తన మిత్రురాలైన ఉమాదేవి పిలుపు మేరకు వాళ్ళ ఊరిలో జరిగే ఉత్సవాలు చూడటానికి వస్తుంది. తొలి పరిచయంలోనే ఆమె రూపురేఖలు, మాటతీరు లక్ష్మీదేవమ్మకు నచ్చుతుంది. ఆమె అభిమానానికి పాత్రురాలవుతుంది. అనాది నుండి హరిజనులంటే వుండే నిరసనతో లక్ష్మీదేవమ్మ తన కొడుకుకు ఆ హరిజన పిల్ల బదులు ఈ రమాదేవిని తన కోడలుగా చేసుకోవాలనుకుంటుంది. చివరకు ఆ అమ్మాయి తనకొడుకు ప్రేమించిన హరిజనుల అమ్మాయే అని తెలుసుకొని ఆశ్చర్యపోతుంది. హరిజనులు నేడు చదువుకుని సంస్కారవంతంగా వుంటున్నారని గ్రహించి తన తప్పు తెలుసుకుంటుంది. వివాహానికి అంగీకరిస్తుంది. రామచంద్రం తను ప్రేమించిన అమ్మాయిని కులమతాల కతీతంగా వివాహం చేసుకొని, ఆమె కోరుకున్నట్టు పై చదువు పూర్తి చేయటానికి సహకరిస్తాడు.

ఈ విధంగా దళితులకు విద్య వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో సమతా భావనలు వెల్లివిరుస్తాయని రచయిత ఆశించారు.

**ముగింపు:** కథలలో జీవితాన్ని అనుభవించేది పాత్రలే. సమాజంలోని వ్యక్తులే పాత్రలకు రూపకర్తలు. నాటకంలో రచయిత ఏమి చెప్పినా పాత్రల సంభాషణల ద్వారానే చెప్పాలి. ఈ సంభాషణా రచనే నాటకంలో అత్యంత కీలకం. ఈ విధంగా ఒక దానికొకటి ఆలంబనగా నాటకం రక్తి కడుతుంది. ప్రేక్షకులను జాగృత పరుస్తుంది. కాలానికనుగుణంగా సమాజంలో ఉత్పనమయ్యే సమస్యలపట్ల కవి గాని రచయిత గాని నిశిత చూపు సారించి. రచన చేస్తారు.

ఒక సమాజంలో మార్పు రావాలన్నా, ప్రగతి పథంలోకి వెళ్ళాలన్నా కవులు, రచయితల యొక్క ఆలోచనాధార, అభ్యుదయ దృక్పథం ఎంతో తోడ్పడుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య సూర్యా ధనంజయ్ (2021), తెలుగు సాహితీ దుందుభి, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్.
2. ఆచార్య సుబ్బారావు పర్వతనేని (2014), తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్.
3. అంతర్జాల వికీపిడియా నుండి కొంత సమాచారం.

# తెలంగాణ జాతీయోద్యమ నాటక సాహిత్యం

**గడ్డమీది మల్లేశం**
**పరిశోధక విద్యార్థి**
తెలంగాణ విశ్వవిద్యాలయం
నిజామాబాద్
సెల్ : 7095252232

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాలనే లక్ష్యంతో యావత్తు భారతదేశం సామ్రాజ్యవాద బ్రిటిషు భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయోద్యమాన్ని జరిపింది. అయితే ఈ జాతీయోద్యమం ప్రత్యక్ష బ్రిటీషు పరిపాలన ప్రాంతాలలో ఒక రకంగా, ఒప్పందాల ద్వారా సామంత రాజ్యాలుగా మారిన సంస్థానాలలో మరో రకంగా సాగింది. ఈ ఇరు ప్రాంతాలలో సాగిన జాతీయోద్యమ లక్ష్యం దేశ స్వాతంత్ర్యమే అయినా దాని కోసం జరిపిన ఉద్యమ విధానాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో నిజామాంధ్ర రాష్ట్రంలో జరిగిన అనేక సంఘటనల్ని నాటక రచయితలు వివిధ నాటకాలుగా మలిచి ప్రజల్ని చైతన్య పరిచారు.

నాటకం అనేది దృశ్య శ్రవ్య విభాగాలలో అభివృద్ధి చెందిన ప్రక్రియ. ఆదికవి నన్నయ, పాల్కురికి సోమనాథుల కాలం నుండే తెలుగు దేశంలో నాటక ప్రక్రియలు విస్తృత ప్రచారం పొందాయి. నాటకం దృశ్య శ్రవణ విభాగానికి చెందిన ప్రక్రియ కావడం మూలంగా సాహిత్యమంటే తెలియని పామర జనులు కూడా నాటకాల ప్రదర్శనల మూలంగా జాతీయోద్యమంలో చైతన్యం పొందారు.తెలుగు సాహిత్య చరిత్రలో 'తెలుగునాటకం సంస్కృత నాటకానువాదాలతో మొదలై, ఆంగ్ల నాటకాలతో ఊపిరి పోసుకొని, పౌరాణిక నాటకాలతో బలపడి, సాంఘిక నాటకాలతో పరిపుష్టినీ-తుష్టినీ ఏర్పరుచుకుందన్నారు' ద్వా.నా. శాస్త్రి. నాటక సాహిత్యం ఎలా ప్రారంభమైనా అది ఆనాటి సమాజం మీద ప్రభావం చూపిందని చెప్పవచ్చు.

ప్రజలు తాము నివసిస్తున్న నేల మీద అభిమానాన్ని ప్రకటించటం, స్వజాతి జనులమీద ప్రేమను పెంచుకోవటం జాతీయతలో కనిపించే కొన్ని ముఖ్య అంశాలు. సర్వ సాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలిసి జీవించేవారని చరిత్ర పరిశీలిస్తే అర్థమవుతుంది. ఒక నిర్దిష్టమైన భౌగోళిక ప్రదేశంలో నివసించే కొంత మంది ప్రజలు, వివిధ కట్టుబాట్లను, ఆచారాలను పాటిస్తూ జీవనం సాగిస్తుంటారు. అలాంటి వారిని ఒక ప్రత్యేకమైన వర్గం అనుకుంటే, అలా కొన్ని వర్గాల సమూహాన్ని జాతిగా భావిస్తారు. ఈ జాతి, జాతీయత అనేవి అమూర్త భావనలు.మానవులు కుటుంబాలను కేంద్రంగా చేసుకొని విడి విడిగా జీవిస్తున్నా వారందరిలో మాత్రం తామంతా ఒక జాతి వారమనే భావననే ఉంటుంది. ఏ దేశ చరిత్రను గమనించినా ఈ జాతి, జాతీయత భావనలు ప్రజలను చైతన్యం చేసి ఉద్యమ స్ఫూర్తిని ప్రసాదిస్తాయి.

ఏ ప్రాంతంలో అయినా ఏ కాలంలో అయినా నాటి సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించేటట్టు చేసి రేపటి తరానికి అందించే వెసులుబాటు సాహిత్యానికి ఉన్నది. కావున ఒక ప్రాంతంలో జరిగిన ఉద్యమాన్ని కవులు, రచయితలు అప్పటి సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను సాహిత్యం ద్వారా పొందుపరిచి ప్రజలను చైతన్యవంతుల్ని చేయడంలో కృతకృత్యులవుతారు. ఇలా నిజాం ఆధీనంలోని హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన జాతీయోద్యమాన్ని పలువురు రచయితలు, కవులు, నాటకకర్తలు సాహితీ ప్రక్రియలలో స్పృశించారు. అలా హైదరాబాదులో జరిగిన జాతీయోద్యమాన్ని తెలంగాణ

ప్రాంత రచయితలు, తెలంగాణేతర రచయితలు

ప్రజలను ఉద్యమోన్ముఖులను చేసే విధంగా నాటకాలను రచించారు. ఆనాడు సమాజంలోఉన్న ఉద్యమ స్ఫూర్తి సాహిత్యంలోనూ, వివిధ కళారంగాల్లోను ప్రతిఫలించింది. తెలుగు నాటకం జాతీయోద్యమంలో బలమైన ముద్ర వేసింది. ఈ విధంగా వారు సృజించిన సాహిత్యంలో నాటక సాహిత్యం ఎంత మేరకు ప్రజలను ప్రభావితం చేయడంలో సఫలమైంది? జాతీయోద్యమ నేపథ్యంతో వచ్చిన నాటకాలలో తెలంగాణలో జరిగిన స్వాతంత్రోద్యమం ఎలా చిత్రించబడిందనే అంశాలను విశ్లేషించాల్సి ఉంది.నా దేశం, నా భాష, నా సంస్కృతి అనే దృక్పథం తెలుగులో జాతీయోద్యమ సాహిత్యానికి నేపథ్యం. తెలుగు సాహిత్యంలో భారత జాతీయోద్యమాన్ని వస్తువుగా చేసుకొని పలు ప్రక్రియలలో ఎన్నో రచనలు వెలువడ్డాయి. వాటిలో కవిత్వం, నవల, నాటకం మొదలైన ప్రక్రియలలో వచ్చిన సాహిత్యంపై పరిశోధనలు కూడా జరిగాయి. అవి: 'తెలుగులో జాతీయోద్యమ కవిత్వం' అనే అంశంపై వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మద్దూరి సుబ్బారెడ్డి పిహెచ్.డి చేశారు. 'తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణ' అనే అంశంపై కూరెళ్ళ విఠలాచార్య ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి చేశారు. 'తెలంగాణ పోరాట నాటకాలు'అనే అంశంపై బి.ఎస్. కామేశ్వరి కాకతీయ విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి చేశారు. 'తెలుగు నాటకాలు –జాతీయోద్యమం'అనే అంశంపై రావి రవిప్రకాశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి చేశారు. తెలంగాణ జాతీయోద్యమం పై 'తెలంగాణ జాతీయోద్యమ కథా సాహిత్యం'అనే అంశంపై ఘనపురం సుదర్శన్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి పరిశోధన చేశారు. ఈ పరిశోధన గ్రంథాలన్నింటిలో కూడా సాహిత్యంలో జాతీయోద్యమం ఎలా చిత్రించబడిందో విశ్లేషించడం జరిగింది.

"ప్రజలు తమ భూభాగాన్ని ప్రభుత్వాన్ని పరిరక్షించుకోవడానికి తమ ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడే సమైక్యతా భావనే జాతీయ భావం"అని కందిమల్ల సాంబశివరావు అన్నారు. (తెలుగు నాటకం ఉద్యమ నేపథ్యం. పుట. 19)

1800 సంవత్సరంలో అప్పటి బ్రిటీష్ గవర్నర్ జనరల్ స్వదేశీ సంస్థానాధీశులతో చేసుకొన్న ఒడంబడిక ప్రకారం నైజాం ప్రభుత్వం కూడా బ్రిటీషు వారికి సామంత రాజ్యం అయ్యింది.ఈ బ్రిటీషు వారి పరిపాలనను సంస్థానాధీశులు శిరసావహించినప్పటికీ ప్రజలు మాత్రం బ్రిటీషు పాలనను అంగీకరించలేదు.అన్ని రాష్ట్రాలలో వలెనే హైదరాబాద్ రాష్ట్రంలో కూడా బ్రిటీషు పరిపాలనకు వ్యతిరేకంగా విప్లవాలు బయలుదేరాయి.బ్రిటీషాంధ్ర ప్రాంతానికి సమానంగా నిజామాంధ్ర ప్రాంతం నుండి జాతీయోద్యమ సాహిత్యం ఆవిష్కృతమైంది. తెలంగాణలో సామాజిక సంస్కరణలు, జాతీయ ఉద్యమాలు, శ్రమ జీవుల పోరాటాలు, విప్లవాలు, తిరుగుబాట్లు, త్యాగాలు మొదలైన వాటి ప్రభావంతో నాటకాలు వెలువడ్డాయి.ఈ ఉద్యమ కళారంగం మూడు భాగాలుగా జరిగింది. 1. సంఘ సంస్కరణోద్యమం 2. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం 3. జమీందారి భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం. ఏక కాలంలో మూడు ఉద్యమాలు నడిపిన పోరుబాటల నేల తెలంగాణ. దేశంలో ఇతర ప్రాంతాల్లో జరిగిన జాతీయోద్యమానికి, తెలంగాణలో జరిగిన జాతీయోద్యమానికి తేడా ఉన్నది. అదేమిటంటే తెలంగాణ లేదా హైదరాబాద్ రాష్ట్రప్రజలు స్థానిక నిజాం ప్రభువుపై, అటు బ్రిటీష్ వారిపై ఏక కాలంలో పోరాటం చేశారు. ఇదే తెలంగాణ జాతీయోద్యమ ప్రత్యేకత. తెలంగాణాలో జాతీయోద్యమాన్ని ఆధారంగా చేసుకుని వెలువడిన నాటకాలను పరిశీలిస్తే... సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావులు రచించిన మాభూమి, ముందడుగు, అపనింద నాటకాలు, సుంకర సత్యనారాయణ ఆగష్టు పదిహేను, గెరిల్లా, వీర కుంకుమ, కాంగ్రేజా ఆంగ్రేజా నాటకాలు, వాసిరెడ్డి భాస్కరరావు పోతుగడ్డ నాటకం, సోమరాజు రామానుజరావు రచించిన స్వరాజ్య రథం, తిలక్ రాయబారం నాటకాలు, వేదాంత కవి ఛలో హైదరాబాద్, రిపబ్లిక్ వెలిగింది మహీధర రామ్మోహనరావు శాంతి రక్షణ కోసం పొట్లపల్లి రామారావు పగ, సర్ బరాహి గరికపాటి రాజారావు వీరనారి పోలవరపు వెంకటేశ్వరరావు రాసిన మహాత్మా జిందాబాద్ అంచా తాతారావు విముక్తి మాచినేని వెంకటేశ్వరరావు గెరిల్లా తిరునగరి రామంజనేయులు వెట్టిచాకిరి కవిరాజమూర్తి మార్పు నాటకాలు తెలంగాణ జాతీయోద్యమ ఇతివృత్తాన్ని చిత్రించాయి.

స్వరాజ్యరథం నాటకం – సోమరాజు రామానుజరావు భద్రాచలం సమీపంలోని దుమ్ముగూడెంలో జీవించారు.ఆయన జీవించింది 38 ఏండ్లే అయినా వివిధ ప్రక్రియల్లో మొత్తం 62 రచనలు చేశారు. అందులో 30కి పైగా నాటకాలు, మరో 31 నవలలు, ఒక కథాసంకలనాలను వెలువరించారు. కాని ఆయన 62 రచనల్లో ఇంతవరకు 27 మాత్రమే లభ్యమయ్యాయి. అందుకు కారణం ఆనాడు తెలంగాణ సాహిత్యంపై ఉన్న ప్రభుత్వఆంక్షలే కారణమని చెప్పవచ్చు.లభించిన ఆధారాలను బట్టి తెలుగులో తొలి సంపూర్ణ స్వాతంత్ర్యోద్యమ నాటకం 'స్వరాజ్య రథము'. దామరాజు పుండరీకాక్షుడు రచించిన 'పాంచాల పరాభవం' తొలి స్వాతంత్ర్యోద్యమ నాటకం అన్న వాదన కూడా ఉన్నది. ఏది ముందన్న వాదనలో విభిన్న స్వరాలు వినిపిస్తున్నయన్నారు డా. అయాచితం శ్రీధర్.

1920లో గాంధీజీ రాజకీయ రంగప్రవేశంతో వచ్చిన చైతన్యంతో ఎన్నో నాటకాలు వచ్చాయి. మొదటగా అదే పద్ధతిలో 1920లో స్వరాజ్య సోపానం అనే నాటకం వచ్చింది. దీనిని దామరాజు పుండరీకాక్షుడు రచించారు. దీనిలో గాంధీజీ పాత్రను పరోక్షంగా శీనప్ప పాత్ర ద్వారా తెలిపారు. ఈ నాటకం నిషేధానికి గురైంది. అచ్చం అదే కథ పోకడను కొనసాగిస్తూ సోమరాజు స్వరాజ్య రథం నాటకం వచ్చింది. "సమకాలీన పరిస్థితులను సమగ్రంగా వివేచించేదే గొప్ప నాటకంగా కలకాలం ఉండిపోతుంది" అన్న ప్రసిద్ధ తాత్వికుడు ప్లెకినోవ్ నిర్వచనానికి నిదర్శనంగా స్వరాజ్యరథం నాటకం నిలిచిపోతుంది.

మరో విషయం చూస్తే సోమరాజు రాసిన తిలక్ రాయబారం నాటకం బహుళ ప్రజాదరణను పొందింది. దీంతో ఈ నాటకంను పొడిగిస్తూ మరో నాలుగు అంకాలుచేర్చి ప్రతిజ్ఞా శౌకతాలీయము,పాంచాల పరాభవము, రామరాజ్య స్థాపనము, రథ యాత్ర అనే అంకాలను జోడించి ఐదు అంకాలతో స్వరాజ్య రథము అనే నాటకాన్ని రక్తికట్టించారు.ఇది ఐదు అంకాల పద్యరూప నాటకం. దేవేంద్రుడు, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ, మౌలానా షౌకత్ అలీ, మౌలానా మహమ్మద్ అలీ, అరవింద ఘోష్, భరతమాత, విక్టోరియారాణి, అనిబిసెంట్, పాంచాలి మరో నాలుగు సాధారణ పాత్రలతో సాగే ఈ నాటకం ఆద్యంతమూ స్వాతంత్ర్యకాంక్ష, మత సామరస్యం, దేశభక్తి, శాంతి సామరస్యాలను ప్రభోదించింది. దేవతలు, స్వాతంత్ర్యోద్యమకారుల సమ్మేళనంతో సంభాషణలు, సందర్భోచితమైన పద్యాలతో రచయిత నాటకాన్ని రక్తికట్టించారు.ప్రజలలో స్వాతంత్ర్య భావాలను ప్రేరేపించి వారిని జాతీయోద్యమంలో పాల్గొనేలా చేయాలనే భావనతోనే స్వరాజ్య రథం నాటకం సాగింది. జీర్ణావస్థలో ఉన్న ఈ నాటకాన్ని సేకరించి అయాచితం శ్రీధర్ గారు పరిష్కరించి 2002లో ప్రచురించడం జరిగింది.

పోతుగడ్డ నాటకం – వాసిరెడ్డి భాస్కరరావు

ఈ నాటకం 1953లో వాసిరెడ్డి భాస్కరరావు రాశారు. పోతుగడ్డ నాటకంలో మొత్తం ఏడు అంకాలున్నాయి. ప్రతి అంకానికి కుడా ఆ అంకంలో జరిగే సంఘటనలను ఆధారంగా చేసుకుని రాత్రి పాఠశాల, భద్రయ్య ఇల్లు, దేవిడీ అని శీర్షికలు పెట్టారు. ఇందులో గజపతి, భీమన్న, ప్రసాదు, ముక్కంటి, భద్రయ్య, నారాయణ, వీరయ్య, శేషగిరి, సరోజినీ అనే పాత్రలున్నాయి.పల్లెలు వదిలి పట్నాలకు పారిపోయిన దేశ్‌ముఖ్‌లు పోలీసుల సహకారంతో గ్రామాలకు తిరిగి చేరడం ఇందులో ఇతివృత్తం.ప్రేక్షకులను, పాఠకులను పూర్తిగా లీనంచేసే తన్మయస్థితి ఈ నాటకంలో ఉంది. ప్రతి ఘట్టంలో పాఠకుడు రసానుభూతికి లోనవుతాడు. పెత్తనమా దొరతనమా? అని ప్రశ్నిస్తూ మొదటి అంకంలో ముక్కంటి పాత్ర ద్వారా ఆనాడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించారు.

దేశ మెల్లా కొల్లగొట్టీ, గుల్ల చేసినతెల్ల దొరలే
శత్రువులు మనజాతి కంచని, నీతులెన్నో చెప్పలేదా ?
మెత్త మెత్తగ దొరల పొత్తున, జేరి పెత్తందారులై, తిన
తిండి అడిగితే గుండెలోన, తుపాకి గుండును గుచ్చినావూ
లేదంటావా............!

ఎదురు తిరిగిన దిబ్బరాజును, మదమణంచీ దింపి వేయగ

గుంపు గుంపుగ మేటి దండును, పంపినానని చెప్ప లేదా ?(పుట. 5)

దేశాన్ని కొల్లగొట్టిన తెల్ల దొరలే ఈ అవినీతికి కారకులని పేర్కొన్నారు. ఆనాడు మీ రాష్ట్రంలో వ్యాపారం చేసుకుంటామని అనుమతి కోసం అర్జీలు పెట్టుకున్న ఆ ఆంగ్లేయులే మెల్లమెల్లగా దొరల పొత్తున జేరి పెత్తందారులై తమ మీదనే పెత్తనం చేలాయించడాన్ని సహించలేకనే ఈ ముక్కంటి పాత్ర ద్వారా నాటక రచయిత పలికిన వాక్యాలివి.అభ్యుదయ భావాలు కలిగిన ప్రసాదు పాత్ర ద్వారా

సమాజంలో జరుగుతున్న జాతీయ, భూస్వామ్య సమస్యలను ఎండగట్టాడు రచయిత.

"తెలుగువీర లేచిరా, జాగదేల సాగిరా

మేరునగం లేచిందీ, హోరుగాలి వీచిందీ

ధీరు లెవరొ రారండీ, భీరువులిక పోపొండీ ॥ తెలుగువీర॥

తర తరాల అజ్ఞానం, నర నరాన జీర్ణించీ

అణగారిన మనజాతికి, నవజాగృతి సమకూర్చగ ॥ తెలుగువీర॥

అరణ్యమే శరణ్యమై, శరీరమే నశించినా

పరాజయం పరాభవం, సహించనీ చలించనీ ॥తెలుగువీర॥

యుగ యుగాల రకరకాల, దోపిడికీ రాపిడికీ

నరజాతిని గురి జేసిన, పరపీడన దునుమాడగ ॥తెలుగువీర॥ (పుట. 21)

పోతుగడ్డ నాటకం తొలిసారి 1953 లో ముద్రితమయ్యింది. ఈ పాటను చదువుతూ ఉంటె శ్రీశ్రీ మహాప్రస్థానంలోని వాక్యాలు స్పురణకు వస్తున్నాయి. రచయిత ఇంతటి ఆవేశాన్ని తన పంక్తులలో బంధించారు కనుకనే ఆనాటి సమాజంలో చైతన్యాన్ని తీసుకురాగలిగారు. నాటకం పూర్తిగా దొరల పరిపాలనకు వ్యతిరేకంగానే సాగినప్పటికీ అంతరంగికంగా నాటకంలో జాతీయోద్యమ భావన దాగిఉందని అర్థమవుతుంది. జాతీయోద్యమ భావన అంతర్గతంగా దాగిఉంది కనుకనే కొన్ని చోట్ల ప్రజలకు లభించినటువంటి ఓటుహక్కు ప్రస్తావనలు వచ్చాయి. శేషగిరి వంటి పాత్ర ద్వారా ఇంట్లోపడివుండే స్త్రీలకు ఓటు ఎందుకు అన్న ప్రశ్నను సంధిస్తూనే ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేశారు. ఈ నాటకం చరిత్రకు సాక్షీభూతం కావడం మాత్రమే కాదు, స్వయంగా తానే చరిత్రను సృష్టించింది. చరిత్ర నిర్మాణానికి తోడ్పాటుగా నిలిచింది.

తెలుగు సాహిత్యంలో, ప్రధానంగా తెలంగాణ సాహిత్యంలో కూడా తమకోసం కాకుండా ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకోసం రచయితలు రాజ్యధిక్కారం చేసి ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఆ కృషి ఫలితమే ఆనాడు రచయితలు వెలువరిచిన సాహిత్యంపై నిషేధాజ్ఞలు విధించేలా చేసింది. ఎన్ని ఆంక్షలను విధించినా కవులు, నాటక కర్తలు, సాహిత్యకారులు ఆ ప్రభుత్వ ఆంక్షలను పరిత్యజించి సేవాతత్పరత గలిగిన వ్యక్తుల ప్రోత్సాహంతో వారి సాహిత్యాన్ని ప్రచురించి ప్రజలను ఉద్యమోన్ముఖులను గావించారు. అలా ప్రచురించినందుకు జైలుపాలు అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటన్నింటి ఫలితమే నేటి ఆధునిక సమాజం నిర్మాణం.

**ఆధార గ్రంథాలు :**

1. భాస్కర రావు వాసిరెడ్డి (1980), పోతుగడ్డ నాటకం, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.
2. రామానుజరావు దేవులపల్లి (1967), తెలంగాణలో జాతీయోద్యమాలు, శివాజి ప్రెస్, సికింద్రాబాద్.
3. రామానుజరావు సోమరాజు (1920), స్వరాజ్యరథం నాటకం.

# జానపద వీధి నాటకాలు - సామాజిక, సాంస్కృతిక దృక్పథం

**డా. మ్యాతరి ఆనంద్**
తెలుగు అధ్యాపకులు
మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం
నల్గొండ
సెల్ : 8184859060.

సంస్కృతి మానవ జీవితంలో అంతర్లీనంగా ఉండే ఒక ధార. ఈ సంస్కృతి ప్రపంచీకరణ ప్రభావంతో ఎన్నో ఒడిదుడుకులకు ఎదురీది నిలుస్తుంది. ఒక వ్యక్తి సంస్కృతిలో పుట్టి పెరుగుతాడు. అది రోజువారి అలవాట్లలో, ఆహారపు రీతుల్లో, సేద్యపు పద్ధతుల్లో, కళలకు సంబంధించిన సంప్రదాయాల్లో, భాషలో, నమ్మకాలలో, ఆలోచన విధానంలో సమ్మిళితమై ఉంటుంది. ముఖ్యంగా జానపద సంస్కృతులు ఆధిపత్య సంస్కృతులకు ఎదురీది నిలిచి భౌతిక, అభౌతిక సామాజిక అలవాట్లని అధిగమించి సాగవలసి ఉంటుంది. సంస్కృతిలోని ఈ పలు కోణాలు సమాజ జీవన మూలాలతో పెనవేయబడి తరతరాలకు నిలిచి ఉంటాయి.

ఈ మధ్యకాలంలో ప్రపంచీకరణ సాంస్కృతిక మూలాల మీద, విలువల మీద ప్రగాఢ ప్రభావం చూపించింది. ప్రచార సాధనాల వల్ల ఈ ప్రపంచీకరణ కొంత సకారాత్మక భావాలను చూపించినప్పటికీ, విపరీతమైన వస్తువు వ్యాప్తి వ్యామోహాన్ని రేకెత్తించింది. అందువల్ల గతకాలపు సమాజ స్థితులను తుడిచివేసింది. దీనివల్ల అల్ప సంఖ్యాక మరియు ప్రాదేశిక సముదాయాలు తమ తమ తరాల వృత్తి విద్యలను, విజ్ఞానాన్ని కోల్పోయాయి. ముఖ్యంగా 1980 తర్వాత ఉప్పెనలా వచ్చిన సాంకేతిక మార్పులు అందులోని దృశ్య శ్రవణరంగాల్లోని మార్పులు జానపద భావ వ్యక్తీకరణలకు ఆటంకంగా నిలిచాయి. జానపద కళా నైపుణ్యాన్ని, సాహిత్య సాంస్కృతిక విజ్ఞాన వారసత్వాలను ఈ మార్పులు చాప కింద నీరులా కబళిస్తూనే ఉన్నాయి.

ఈ ప్రభావానికి లోనై తమ ఉనికిని కోల్పోయిన కళారూపాలలో వీధి నాటకం ఒకటి. ఈ వీధినాటకాలు తెలంగాణ ప్రాంతంలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, నిజామాబాద్ లాంటి జిల్లాలో ప్రజల సాంస్కృతిక, సామాజిక జీవన విధానాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. అంతటి ఘనకీర్తి ఉన్న కళారూపం నేడు అంతరించిపోయే దశలో ఉంది. ఈ సందర్భంగా ఈ కళారూపం సమాజంపై చూపించిన ప్రభావాన్ని స్ఫురణకు తెచ్చుకోవలసిన అవసరం ఎంతైన ఉంది.

"గ్రామాలలో సామాన్యప్రజలకు వీధి నాటకాలు, బహురూపాలు మొదలైన తెర నాటకాలు ప్రదర్శించినట్లు పండితారాధ్యచరిత్ర పర్వత ప్రకరణంలో ఉదహరించబడింది". (రాధాకృష్ణ మిక్కిలినేని మూర్తి, 2011, పుట: 150) పూర్వం గ్రామాలలో సామాన్య ప్రజలకు విజ్ఞానం, వినోదం పంచిన వీధి నాటకాల ప్రస్తావన 16వ శతాబ్దం నుంచే ఉన్నట్లు సాహిత్య పరిశోధన గ్రంథాల ద్వారా తెలుస్తుంది. కాబట్టి సాహిత్య చరిత్రలో ప్రత్యేకంగా జానపద సాహిత్య చరిత్రలో వీటి ప్రముఖ్యతను గుర్తించాల్సిందే. సాహిత్య చరిత్ర పునఃముల్యాంకనంలో వీటిని ప్రస్తావంచివలసిన అవసరం ఎంతైనా ఉంది.

భరతుడు నాట్యశాస్త్రంలో ప్రకటించిన దశవిధ రూపకాలలో వీధి ఒకటి. ఆ వీధినే, వీధి నాటకంగా ప్రసిద్ధి చెందింది. "వీధిని గురించి భరతుడు భరత నాట్యశాస్త్రంలో దేశిరూపకాల వర్ణనలో కథ కల్పితమనీ, రెండు మూడు పాత్రలు కలిగిన ఏకాంతమనీ, నటునికి శృంగార రసం ప్రధానమనీ, ప్రస్తావన, ముఖ నిర్వహణ సంధులు ఉండాలనీ,

గీతనృత్యాదులతో కూడిన ప్రశంసలు ఉండవచ్చుననీ బాణం వలే ఇది వర్ణప్రధానమనీ, వ్యాఖ్యానించారు". (రాధాకృష్ణ మిక్కిలినేని మూర్తి, 2011, పుట: 151). దశవిధ రూపకాలలో నాటకం, యక్షగానానికి వచ్చినంత పేరు ప్రఖ్యాతులు మిగతా వాటికి రాలేదు. నాటకాలల్లో పద్యనాటకాలు, సాంఘిక నాటకాలు మొదలైన విభాగాలు బహుళ ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం వీధి నాటకాలు కనుమరుగు అవుతున్నాయి.

ఈ కళను ప్రదర్శించడానికి ప్రత్యేకంగా వృత్తి కళాకారులు గానీ, కులవృత్తి కాళాకారులు గానీ ఉండరు. పగటివేషాలు, బయలాటలు లాంటి వాటిని ప్రదర్శించడానికి కులవృత్తి కలిగిన కళాకారులు కనిపిస్తారు. కానీ ఈ వీధి నాటకానికి అలాంటి ప్రత్యేక బృందాలు లేవు. గ్రామంలో ఉండే ఔత్సాహిక యువకళాకారులచే మాత్రమే ప్రదర్శన జరుగుతుంది. పగటి వేషాలు, కొంత వీధినాటక లక్షణాలు కలిగి ఉంటాయి.

వీధి నాటకాల రచయిత ఎవరో చెప్పడం కష్టం. ప్రస్తుతం ఈ వీధి నాటకాల ప్రతులు అముద్రితంగానే ఉన్నాయి. వాటిని కళాకారులు వారి అవసరాల నిమిత్తం సేకరించి ఉపయోగించు కుంటున్నారు. చాలా వాటికి నిర్దిష్టమైన రచయిత పేరు లేదు.

**అలంకరణ**

సాంకేతికంగా అభివృద్ధి సాధించని రోజుల్లో ప్రజలు ఆముదం దీపాల వెలుగులో వీధి నాటకాలు ప్రదర్శించబడేవి. తర్వాత విద్యుత్ దీపాల వెలుగులో ప్రదర్శించేవారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తరువాత వీటి అలంకరణ, వేశధారణ తీరు మారుతూ వచ్చింది. చిన్న ఊరైతే ఊరి ప్రజలు అందరు, పెద్ద ఊరైతే ఒకటి లేదా కొన్ని కులాల ప్రజలు వీటిన్ని ప్రదర్శిస్తుంటారు. వారు ప్రతి సంవత్సరం వర్షకాలం, తర్వాత చలికాలం చివరలో నాటకం నేర్చుకోవడం ప్రారంభించి ఎండకాలంలో వర్షాలు రాని సమయంలో వీటిని ప్రదర్శిస్తుంటారు. అందులో పాత్రధారులు అందరు మగవారే కావడం విశేషం. ఆడ, మగ పాత్రలు అన్నింటిని మగవారే ధరిస్తారు.

**నాటకాలు**

తెలంగాణ ప్రాంతంలో అధికంగా ఆడే నాటకాలు మునిరంగ స్వామి, చెన్నకేశవ స్వామి, భక్త సిరియాల, భక్త మార్కండేయ, శివగంగా కళ్యాణం, సత్యానసూయ, నలచక్రవర్తి, భక్త రామదాసు, వేమన, ఎల్లమ్మ, మల్లమ్మ మొదలైన నాటకాలు ఎక్కువగా ప్రదర్శిస్తారు.

**ప్రదర్శన విధానం**

ఈ నాటకం రాత్రి పది గంటలకు ప్రారంభం అవుతుంది. ఈలోగా గ్రామ ప్రజలు అందరు రంగస్థలం(అట్టడి) దగ్గరకు నాటకాన్ని చూడటానికి చేరుకుంటారు. ఈ నాటకం సంగీత ప్రధానం. నాటకాలల్లో దరువులు, ద్విపదలు, వచనాలు, కందార్థాలు ప్రధానంగా కనిపిస్తాయి. రాగం, తాళం ప్రధాన భూమిక వహిస్తాయి. భాష చాలాచోట్ల గ్రాంథికంగా కనిపిస్తుంది. ఈ నాటకాలను నేర్చుకునేవాళ్ళలో చాలా మంది చదువుకోనివారు కాబట్టి ఆ దరువులు, ద్విపదల అర్థాన్ని తెలుసుకొని పాడేవాళ్ళ సంఖ్య చాలా స్వల్పం. తాళ జ్ఞానానికి పెద్దపీట వేయడం వల్ల పాదం విరుగుడు ఒక్కొక్కసారి అర్థహీనమో, విపరీతార్థమో స్ఫురిస్తుంది. తాళం, తబల, హార్మోనియం లాంటి సంగీత సాధనాల సహాయంతో రాగయుక్తంగా, ల4యబద్ధంగా, శ్రుతిలో కలిపి పాడటం జరుగుతుంది. పూర్వం మైకులు లేని సమయంలో కళాకారుడు చెప్పే విషయం శ్రోత వినపడటానికి అనుకూలంగా వెనకాల వంతన పాడే అలవాటు ఉంది. ఈ సాంప్రదాయం నేటికీ కొనసాగుతుంది. ఈ వంతన పాడటమే ఈ నాటకానికి అందం చందం. అప్పుడప్పుడు పాడినది సరిగ్గా అర్థం కాదేమోనని మాటల రూపంలో సారాంశాన్ని చెప్పుతుంటారు.

**సాంస్కృతిక అంశాలు**

ఈ వీధి నాటకాల కథ విషయానికి వస్తే కథలకు ఒక విధానం ఉంటుంది. లోకంలో అరాచకాలు, అవినీతి, దురాగతాలు ఎక్కువైనప్పుడు భగవంతుడు స్వయంగా సాధు, సంతుల రూపంలో అవతరించి లోకాన్ని ఉ

ద్ధరిస్తాడని వారి నమ్మకం. అలాంటి నమ్మకంతోనే ఈ నాటకాలు ప్రదర్శింబడుతాయి.

కథలో మొదట భూదేవి వచ్చి భూమి భారాన్ని మోయలేను, దురగాతాలు ఎక్కువైనవి, ఈ భారాన్ని నేను భరించలేనని త్రిలోకాలలో ఉన్న త్రిమూర్తుల వద్దకు వెళ్ళి తన పరిస్థితి మొరపెట్టుకుంటుంది. త్రిమూర్తులలో ఒకరు భూమిపై సత్యవంతులై దంపతులకు కొన్ని పరీక్షలు పెట్టి, వారికి సంతాన ఫలం అందించి వారి కడుపున పుడతారు. అక్కడ నుండి అసలు కథ మొదలవుతుంది. త్రిమూర్తుల వరప్రాసదం వల్ల జన్మించిన వ్యక్తి లోకానికి కొంత సన్మార్గ, ధర్మసందేశం అందిస్తాడు. ఈ కథలో భాగంగా భూదేవి బాధలు ఈ విధంగా ఉన్నాయి. భూదేవి భూమి భారాన్ని మోయకపోవడానికి కారణం.

ఏమని తెలుపూదూ యీవేలా మీ తోడా //అమ్మావేగా//

నేను యీ భూమి భారంబూ మోయాజాలను తల్లీ //అమ్మావేగా//

**మాటలు :** అమ్మా! భార్య మాటలు విని తల్లిదండ్రులను తన్నుచున్నారు, కలియుగంబులో యిట్టి పాపంబులు జరుగుచున్నవి. ఇలా భూదేవి తను ఈ భూమి భారాన్ని మోయలేను అని చెబుతూ భూమిమీద దురాగతాలు ఎలా పెచ్చరిల్లుతున్నవో త్రిమూర్తులకు తెలియజేస్తుంది. అందుకే నేను ఈ భూమి భారాన్ని మోయలేకపోతున్నాను. ఈ పాపపుణ్యాలను నేను చూడలేక పోతున్నాను అని విన్నవిస్తుంది. అప్పుడు త్రిమూర్తులు తమ తక్షణ కర్తవ్యంగా ఎవరో ఒకరు ఈ భూమి మీద జన్మించి వారి బోధనచే భూమి భారాన్ని కొంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. అలా వచ్చినవారే మునిరంగసామి నాటకంలో మునిరంగసామి, శివగంగ కళ్యాణంలో శంకరాచార్యులు. వేమన నాటకంలో వేమన, భక్త సిరియాల నాటకంలో సిరియాలుడు, మల్లమ్మ నాటకంలో మల్లమ్మ మొదలైనవారు.

ఇందులో పుట్టుక నుంచి పెండ్లి, చావు అన్ని అంశాలు వాటి ప్రాధాన్యత కనిపిస్తుంది. కథలో ప్రధాన పాత్ర జననం తప్పనిసరిగా ఉంటూంది. ఆ పాత్ర జననం కారణ జన్మగా, దేవుని వరప్రసాదంగా నమ్ముతారు. ఇందులో మంత్రసాని వచ్చి పురుడు పోయడం, ఆ పాత్ర తొట్టెల వేసి జోలపాడటం లాంటివి సాంస్కృతిక అంశాలను తప్పనిసరిగా ప్రదర్శిస్తారు. వీటి వల్ల ప్రజలలో సాంస్కృతిక సామాజిక స్పృహ పెరుగుతుంది. ఈ సన్నివేశాన్ని తమ ఇళ్ళలో చేసే కార్యక్రమంలా ప్రజలు ఆదరిస్తారు. మునిరంగ స్వామి నాటకంలో నల్లపోచమ్మ జాతరలో బోనం తీసే సన్నివేశంలో నిజంగా బోనం చేసి అమ్మవారి విగ్రహం వరకు ఊరేగింపుగా వెళ్ళడం జరుగుతుంది. పెళ్ళి సన్నివేశంలో, తొట్లె వేసే సన్నివేశంలో కానుకలు సమర్పింస్తారు. ప్రజలకు ఆ సన్నివేశాలలో స్థానం కలిపించడం ద్వారు వారు వాటిని తమ ఇళ్ళలో జరిగే సాంస్కృతిక అంశాలుగా పరిగణించి ఆస్వాదిస్తారు.

ఈ నాటకాలలో ప్రధాన పాత్రకు గానీ, సహాయ పాత్రకు గానీ పెళ్ళి ఘట్టం తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ సన్నివేశంలో పెళ్ళి కూతురు తల్లిదండ్రులు కూతురును అత్తవారింటికి పంపేటప్పుడు పెళ్ళి కూతురు అత్త వారింట్లో ఎలా ఉండాలో చెప్పే ఘట్టం చాలా అద్భుతంగా ఉంటుంది. దీనిని ప్రజలు తమ ఆడబిడ్డను అత్తగారింటికి పంపినట్టు భావిస్తారు. ఈ అప్పగింతల ఘట్టం ద్వారా ప్రజలకు పెళ్ళి కావలసిన అమ్మాయిలకు, కొత్తగా పెళ్ళి అయినవారికి సత్ప్రవర్తనను, నడవడికను నేర్పిస్తుంది.

**సామాజిక అంశాలు**

ఇక్కడ భూదేవి చెప్పడం వల్ల ప్రజలకు తెలిసిన విషయం ఏమిటంటే ధర్మబద్దంగా తల్లిదండ్రులను ప్రేమగా చూడడం వారి పిల్లల బాధ్యతను గుర్తు చేస్తుంది. ఇక వావి వరసలు మాని ఇష్టం వచ్చిన వారితో తిరగకుండా కొంత క్రమ శిక్షణగా, ధర్మబద్దంగా మెలగాలని సూచిస్తుంది.

ఉదా: పెళ్ళి చూపులప్పుడు తల్లి చెప్పే బుద్ధులు

అత్తావారింటికి కొత్త కోడలావై పోయిరావమ్మా!

మల్లమ్మ నీవు వెళ్ళి రావమ్మా!

ఎన్నో పూజాలు జేసి నినుగానియున్నాము!
కన్నా తల్లిదండ్రులాకు అపకీర్తి తేవొద్దు! పోయిరావమ్మా
ముగ్గురు ఉన్నచోట ముచ్చాటలాడాకు!
నలుగురు ఉన్నచోట నవ్వులాటాడాకు!
కన్నా తల్లిదండ్రులాకు అపకీర్తి తేవొద్దు! పోయిరావమ్మా

అత్తమామలను కన్న తల్లిదండ్రుల్లా చూడాలని చెబుతుంది. ఇలాంటి మాటలు కుటుంబంలో ప్రతి తల్లికి, ప్రతి కూతురుకు అవసరము. అందుకే ప్రజలు వీటిని అంతగా ఆదరించారు.

తల్లిదండ్రులకు పిల్లలపై గల ప్రేమానురాగాలు, పిల్లలకు తల్లిదండ్రుల పట్ల గల బాధ్యతలను ఈ నాటకాలు తెలియజేస్తాయి. ఇక్కడ మునిరంగ స్వామి నాటకంలో కొడుకు నల్లారెడ్డి మునిరంగస్వామి భక్తుడుగా మారి సంసారాన్ని విడిచి సన్యాసిగా మారిన సందర్భంలో ఆ తల్లిదండ్రులు పడే ఆవేదన ప్రతి ప్రేక్షకుడి హృదయాన్ని కలిచివేస్తుంది. వారు కొడుకును సన్యాసి వేశం తీసివేయమని అడగడం చాలా హృదయవిదారకంగా కనిపిస్తుంది.

**అచ్చుమ్మ దర్వు:**

యిక ఏమి చేయూదు యీ ధరణీలోపాలా !! ప్రాణావల్లభా!!
మనము పుట్టీన ఫలమేమి పొందుగా వినావయ్యా !! ప్రాణావల్లభా!!
మన పుత్రున్ని చూడాగా బుగులొందే నాకింకా !! ప్రాణావల్లభా!!
వాడు కాశాయ వస్త్రాములు కట్టిపెట్టేనయ్యా !! ప్రాణావల్లభా!!
చేతిలో జపామాల పట్టియున్నాడింకా !! ప్రాణావల్లభా!!
వాడు మంత్రతంత్రంబులు పఠనాజేయాగలడు !! ప్రాణావల్లభా!!

**మాటలు:** హా నాథా మనము ఏమి చేయుదము వాడు సాధు రూపము దాల్చినాడు.

భక్తసిరియాల నాటకంలో సిరియాలుడు తల్లిదండ్రుల మాటకు విలువ ఇచ్చి ఆ జంగమ స్వామి కోరినట్లు తాను వారికి ఆహారంగా మారడానికి సిద్ధపడతాడు.

ఈ వీధి నాటకాలు సంఘసంస్కరణ కూడా చేయగలవు. అందులో మునిరంగ స్వామి నాటకంలో నల్లారెడ్డి తండ్రితో అనే మాటలు సంఘంలో పాతుకపోయిన కుల సమస్య, దానికి గల కారణాలను ఈ నాటకం తెలియజేస్తుంది. వ్యక్తికి కులం కంటే గుణమే ప్రధానం అనే విషయాన్ని తెలియజేస్తుంది. ప్రజలందరు కుల, మతలు అంటూ విద్వేషాలను పెంచుకొని జీవనం సాగించడం కంటే అన్నదమ్ముల వలె కలిసి మెలసి ఉండాలని ఈ నాటకం బోధిస్తుంది. ఇలాంటి సామాజిక అంశాలను నేర్చుకోవడానికి, ప్రజలు అంటరానితనం అనే రుగ్మతను రూపుమాపటంలో ఆయా ప్రాంతాలలో వీటి ప్రాత్ర అమోఘం.

**నల్లారెడ్డి కందార్థం:** కులమెక్కడ గుణమెక్కడ కులహీనుడనైతేనేమి గుణవంతుడికన్! కులభేదములు విడిచియు మరి// గురుమూలము దెలుసుకున్న// దర్వు: వాడే సజ్జనుడూ! తెలియని వాడే అతిమూర్ఖుడతడూ! కులము కులామనుచూ కుములూట పనియేమి! అన్ని కులములొక్కటే ఆత్మారాముడొక్కడే!//కులమెందుకయ్యా! నరునకు మంచి గుణమే కారణము//

**మాటలు:** తండ్రి కులము కులమని పలుకుచున్నవు అన్ని కులములు ఒక్కటే కదా నాయనా! అంటూ నల్లారెడ్డి మునిరంగస్వామి తనకు బోధించిన తత్వాన్ని తండ్రికి తెలియజేస్తాడు. సమాజంలో ఉన్న అంటరానితనం, అస్పృశ్యత అనే విషయాలపై ఈ నాటకం అవగహన కలిగిస్తుంది.

**వినోదం**

ఈ నాటకాలు ఆడేవారికి ఒక సరదా. జానపదులు తమ అలుపును తీర్చుకోవడం కోసం, వారి ప్రతిభను ప్రదర్శించడం కోసం ఆడటం జరుగుతంది. అందులో పాత్ర ధరించి ఆడి, పాడి అందరిని మెప్పించాలనేది వారి ఆశయంగా కనిపిస్తుంది. అందుకోసం తన సమీప బంధువులను అందరిని తన నాటకాన్ని చూడడం కోసం పిలిపిస్తారు. ఒకప్పుడు ఈ వీధి నాటకాలను చూడడానికి జనం పెద్ద ఎత్తున వచ్చి, రాత్రంతా మేలుకొని ఉండి వాటిని చూసి ఆనందించేవారు.

ఏ నాటకానికైనా ప్రజాదరణనే ముఖ్యం. ప్రజలు ఆ నాటకాలను ఆదరిస్తూ ఆయా పాత్రధారులు మంచిగా కథను చెప్పితే, ఆ పాత్రధారుని ప్రతిభకు మెచ్చుకొని వారికి తోచినంతా కానుకలు చదివించేవారు. అలా ప్రజలచేత మెప్పు పొందాలని ప్రతి కళాకారుడు ప్రయత్నిస్తుంటాడు. అందుకు నిరంతరం తనను తాను సంస్కరించుకొని సాధన చేస్తారు. కథ అద్భుతంగా చెప్పడానికి ప్రయత్నిస్తుంటాడు.

ఇక ప్రజలు ఈ కథ ఎంతగా ఆస్వాదిస్తారంటే కథలో మంత్రసాని వచ్చి పురుడు పోస్తే ఆ పాత్రకు ప్రాణం పోసినందుకు ఆమెకు కానుకలు ఇస్తారు. అంతగా ప్రజలు ఈ నాటకాలతో మమేకమై చూసేవారు. ఆలా చూసేవారు కాబట్టే అందులో మంచి చెడ్డలను తమకు అన్వయించుకొని అందులో సారాన్ని గ్రహించి మంచి మార్గంలో ప్రయాణించే విధంగా తమని తాము మలుచుకునేవారు.

అంతటి ప్రభావవంతమైన ఈ జానపద వీధి నాటకాల పరిస్థితి మారిపోతుంది. ఈ నాటకాలను ఆడేవారు, చూసేవారు కరువైనారు. ఎవరో కొంత మంది కష్టపడి నాటకాన్ని ఆడితే అది చూసేవారు కరువైనారు. చూసేవారిలో తమ బందువులు, ఇంకా దగ్గరి వారు, మిత్రులు ఇలా కొద్ధిమంది మాత్రమే చూసే పరిస్థితి దాపురించింది. సాంకేతికంగా అభివృద్ధి సాధించి, టి.వి, సెల్ ఫోను వచ్చిన తరువాత ప్రజల జీవన విధానంలో చాలా మార్పులు వచ్చినవి. ఒక్కప్పుడు రాత్రి అయిందంటే గ్రామం మధ్యలో కూర్చొని తమ కష్ట సుఖాలను మాట్లాడుకొనేవారు. ఇప్పుడు రాత్రి అయ్యిందంట టి.వి లో వచ్చే సీరియల్స్ ను చూస్తూ అందులోని కష్ట సుఖాలను మాట్లాడుకుంటూ గడిపేస్తున్నారు. బయటికి రావడమే మరిచిపోతున్నారు. అందువల్ల తెలంగాణ పల్లెల్లో సాంస్కృతికంగా అస్తిత్వాన్ని కోల్పోవలసిన పరిస్థితి దాపురించింది.

ఈ వీధి నాటకాలు ప్రజలకు వినోదాన్నే కాదు విజ్ఞానాన్ని కూడా అందించాయి. ప్రజలకు నడవడికను నేర్పించాయి. ప్రజలకు ఏది మంచిది, ఏది చెడు అనే విషయాలను పూర్తిగా విపులీకరించి, వివరించేవి. అందులోని అంశాలు సామాజికమైనవి. ప్రజల జీవన విధానంతో ముడిపడినవి. ఆ అంశాలు వారి సంస్కృతిలో భాగమే. సాధారణంగా నాటకం అంటేనే నవరసభరితం, ఈ నాటకంలో కూడా నవరసాలు కలగలసి ఉంటాయి. ఈ నాటకాలల్లో శృంగార రసం కంటే కరుణ రసానికి అధిక ప్రాధాన్యత కనబడుతుంది. ఆ తర్వాత వీర రసానికి ప్రాధాన్యత కనిపిస్తుంది. ఆ తర్వాతనే మిగతా రసాలు కనిపిస్తాయి.

ఈ విధంగా వీధినాటకాలు సమాజంలో బంధాలకు బందుత్వాలకు విలువనిచ్చి మనుషులమధ్య సంబంధ బాంధవ్యాలను పెంచుతాయి. కుటుంబంలో అంతఃకలహాలు రాకుండా ఎలా జాగ్రత్తగా వ్యవహారించాలో, మనల్ని మనం ఎలా సంస్కరించుకోవాలో ఈ నాటకాల ద్వారా ప్రజలు నడవడికను నేర్చుకుంటారు. ఆనాటి సమాజంలో ఈ వీధినాటకాల ప్రభావం చాలా ఉండేది. ప్రస్తుతం ఈ స్థానాన్ని టీవి సీరియళ్లు, సినిమాలు ఆక్రమించాయి.

**ముగింపు:**

ఈ నాటకాలలో కూడా భారతీయ నాటక నియమం ప్రకారం కథ సుఖాంతంగా ముగుస్తుంది. భారతీయ సమాజం విషాదాంత కథలను అంతగా అంగీకరించదు. కాబట్టి ప్రతి కథ భరత వాక్యంతో ముగుస్తుంది. అక్కడ భరత వాక్యం అంటే మంగళహారతి. ఈ మంగళహారతితో కథ ముగుస్తుంది.

**ఆధార గ్రంథాలు**

1. రాధాకృష్ణ మూర్తి, మిక్కిలినేని (2011), తెలుగువారి జానపద కళారూపాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
2. రామమోహన రావు పల్లెర్ల సం. (2012), పాలమూరు వైజయంతి, జిల్లా సాంస్కృతిక మండలి, మహబూబ్‌నగర్.
3. మునిరంగ స్వామి వీధి నాటకం (అముద్రితం).
4. మల్లమ్మ నాటకం (అముద్రితం).
5. భక్త సిరియాల నాటకం (అముద్రితం).

ISSN 2457 - 0796 UGC CARE List Approved Journals
మూసీ మాస పత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-27: సంచిక - 7(2) హైదరాబాద్ మే - 2024

# జాతీయోద్యమ కాలంలో నిషిద్ధ నాటకాలు-సమాలోచనం

**డా. జి. శ్రీనివాస్**
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
రాజమహేంద్రవరం
సెల్ : 9440766546

**ఉపోద్ఘాతం:**

కావ్యాలు ప్రధానంగా రెండు రకాలు శ్రవ్య కావ్యాలు, దృశ్య కావ్యాలు. మారుతున్న కాలంతో పాటు ప్రజలపై ఎక్కువ ప్రభావం చూపించినవి దృశ్య కావ్యాలే అనడంలో అతిశయోక్తి లేదు. సంస్కృతంలో దృశ్య కావ్యాలు అనగానే దశవిధ రూపకాలు ఉంటాయి కాని తెలుగు దృశ్యకావ్యాలు అనగానే గుర్తుకు వచ్చేది నాటక సాహిత్యమే. "నాటకాంతం హి సాహిత్యం" అన్నాడు మహాకవి కాళిదాసు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ చివరిగా స్పర్శించవలసిన అంకం నాటకమని అర్థం. కవిత్వం, వ్యాసం, కథ... ఇలా అన్ని సాహిత్య ప్రక్రియలను స్పృశించిన తరువాత మాత్రమే నాటకాన్ని రచించాలని ఆయన తెలిపాడు. అప్పుడు మాత్రమే నాటక రచనకు నిండుదనం చేకూరుతుందని ఆయన భావన.

**నిషిద్ధం:**

నిషేధం అనే పదం ఆధునిక కాలంలో ఎక్కువుగా వినిపించే పదం. మరీ ముఖ్యంగా ఆంగ్లేయులు మన దేశాన్ని పాలిస్తున్న రోజులలో సామాన్య మానవుని నుంచి దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన ఎందరో మహనీయుల నోట వినిపించిన పదం. ఆ స్పృహతో అప్పటి కాలంలో వచ్చిన సాహిత్యంలోను నిషేధం అనే పదం కీలక పాత్ర పోషించింది. నిషేధం పదానికి అనేక అర్థాలు నిఘంటువులలో కనిపిస్తున్నాయి. 'నిషేధము' అనగా త్రోసి పుచ్చుట, నివర్తనము అనే అర్థాలు (తెలుగు-తెలుగు నిఘంటువు.జి.యన్.రెడ్డి,పుట-469) ఉన్నాయి. నిషేధము అనగా నివారణము, నివర్తనము,మరలించుట, నిరాకరణము.(శ్రీ సూర్యాయాంధ్ర నిఘంటువు,చతుర్థి సంపుటము, పుట:657.) అనే మరో అర్థం కనిపిస్తుంది.

**జాతీయోద్యమం:**

జాతీయత అంటే ప్రజలందరిలో ఉండే దేశభక్తి. జాతీయతా భావన అంటే తమ దేశం పై అభిమానాన్ని పెంచుకుని , దేశం పై ప్రేమను చూపిస్తూ తమ మాతృ దేశం కోసం ఎటువంటి పనినైనా చేయటానికి సిద్ధం కావడం.బ్రిటీష్ వారి వలస పాలనకు విసిగి పోయిన ప్రజలు వ్యతిరేకించడానికి వారిలో ప్రేరణ కలిగించడానికి వచ్చిన సాహిత్యమే జాతీయోద్యమ సాహిత్యం. నిషేధానికి గురైన సాహిత్య ప్రక్రియల్లోని దృశ్య కావ్యాలను పరిశీలిస్తే భారతదేశంలో ముందుగా నిషేధానికి గురైన దృశ్య నాటకం "నీల్ దర్పణ్" అనే బెంగాలీ నాటకం. దీనబంధు మిత్రా రచించిన ఈ నాటకం బెంగాలీ నాటక రంగంలో ఒకపెద్ద మార్పును తీసుకు వచ్చింది. ఈ నాటకంలో ముఖ్యంగా బ్రిటీష్ పాలకుల నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా పీడిత రైతాంగాన్ని పోరాడమని పిలుపినిచ్చింది. మొదటగా 1860లో ఈ నాటకం ఢాకాలో ప్రదర్శించారు. 'సాహిత్యం'లో బంకించంద్రుడు, 'నాటకం'లో గిరీశ్‌చంద్ర ఘోష్ ప్రజల్లో స్ఫూర్తి రగిలించే రచనలు చేశారు. 1900 దశకంలో గిరీశ్ రాసిన 'సిరాజ్-ఉద్-దౌలా' నాటకం బ్రిటిష్ పాలనను ఎండగట్టింది. 'మూన్వార్స్ థియేటర్', 'ది ఇంపీరియల్ థియోట్రికల్ కంపెనీ'లు 1880కి పూర్వమే తెలంగాణలో నాటకాలను ప్రదర్శించాయి.

**నిషిద్ధ నాటకాల రచయితలు:**

జాతీయోద్యమ కాలంలో నిషేధానికి గురైన నాటకాలు. తిలకు రాయబారము, స్వరాజ్య రథము, పాంచాల పరాభవము, స్వరాజ్య సౌధము, నవయుగారంభం, స్వరాజ్య సోపానము, రణభేరి, తిలకు మహారాజు నాటకము, గాంధీ విజయ ధ్వజ నాటకము, అవతార పరివర్తనము, చిచ్చుల పిడుగు మొదలగు నాటకాలు.

**దామరాజు పండరీకాక్షుడు :**

దామరాజు పుండరీకాక్షుడు న్యాయవాది, స్వాతంత్ర్యసమరయోధుడు, పాత్రికేయుడు, సంపాదకుడు, కవి, నాటకకర్త ఈయన 1898జూలై 6వ తేదీన గుంటూరు జిల్లా, పెదకూరపాడు మండలం, పాటిబండ్లలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు రంగమాంబ, గోపాలకృష్ణయ్యలు. న్యాయవాద వృత్తిని చేసేవారు. రామరాజ్యం పత్రికను స్థాపించి కొంత కాలం నిర్వహించారు. 'స్వరాజ్య సోపానము' పేరుతో నాటక సమాజం స్థాపించి జాతీయ భావాల్ని ప్రచారం చేశారు. నాటకాలు, ఖండ కావ్యాలు, హరికథలు, స్వీయచరిత్ర వంటి ప్రక్రియలో రచనలు చేశారు. వీరు రాసిన నాటకాలలో ఎక్కువ భాగం జాతీయోద్యమ భావనలు కలిగినవే.

రాజకీయ నాటకాలతో ప్రజల్ని చైతన్యపరుస్తున్న పుండరీకాక్షుడిని తమ అదుపాజ్ఞల్లో పెట్టుకోవడానికి బ్రిటిష్ పాలకులు ఎన్నో ఎత్తులు వేశారు. చివరికి 'కనీసం నాటకాల్లో గాంధీజీ పాత్ర లేకుండా అయినా రాయండి' అంటూ ఓ ప్రతినిధితో ప్రభుత్వం రాయబారం పంపింది. అలా చేస్తే నజరానాగా యాభై వేల రూపాయలు ఇస్తామని కూడా ఆశజూపింది. అప్పట్లో రూ.50 వేలు అంటే మాటలు కాదు. కానీ పుండరీకాక్షుడు ఆ ప్రలోభానికి లొంగలేదు. సరికదా.. 'గాంధీ లేనిది సాగదు నా కలమ్ము..' అంటూ ఓ పద్యం రాసి, ఆ రాయబారి ద్వారానే బ్రిటిష్ పాలకులకు పంపించారాయన.

**సోమరాజు రామానుజరావు:**

వీరు 19వ శతాబ్దం ఉత్తరార్థంలో జీవించిన వ్యక్తి. వీరి తల్లిదండ్రులు చూడమాంబ, కోదండరామయ్య. వీరు భద్రాచలంలో జన్మించారు. చారిత్రక నేపథ్యం, అభ్యుదయ భావాలతో రచనలు చేశారు. సుమారుగా 17 వరకు నాటకాలు, 21 నవలలు, కథలు, గేయాలు కూడా రచించారు.

**శ్రీపాద కృష్ణ మూర్తి శాస్త్రి :**

కృష్ణమూర్తి పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లికిచెందిన ఎర్నగూడెం లో 1866 సంవత్సరంలో అక్టోబరు 29 వ తేదీన జన్మించారు. వీరు నాటకాలు, పద్య కావ్యాలు, వచన గ్రంధాలు, అచ్చ తెలుగు కావ్యాలు, అనువాదాలు రచించారు. 'కళావతి' అనే ముద్రాలయాన్ని స్థాపించారు. గౌతమి అనే తెలుగు మాస పత్రికను స్థాపించారు.

**రామచంద్రుని వెంకటప్ప:**

వీరు 1902 మే నెలలో జన్మించారు.తండ్రి పేరు రామకృష్ణయ్య.వీరు ప్రకాశం జిల్లాలోని ఒంగోలు తాలూకాలోని టంగుటూరి గ్రామంలో జన్మించారు.కాంగ్రేస్ అనే వారపత్రికకి కొంత కాలం ఉప సంపాదకుడిగా పని చేసారు.నాటకాలు, వచన గ్రంథాలు రాసారు.

నిషిద్ధ నాటకాలు-వస్తువు:

జాతీయోద్యమ కాలంలో వచ్చిన నాటకాలో స్వదేశం పై అభిమానం. విదేశీ వస్తువుల బహిష్కరణ , బ్రిటీష్ పాలకుల దౌర్జన్యాలు, దేశం కోసం పోరాటం చేస్తున్న నాయకులను స్తుతిస్తూ రాసిన నాటకాలు నిషేధానికి గురి అయ్యాయి.కొన్ని నాటకాలను సంక్షిప్తంగా పరిచయం చేయాలనేదే నా ప్రయత్నం.

**నవయుగారంభం:**

ఈ నాటకంలో మూడు అంకాలు కలవు. దీనిలో ఇతివృత్తం బాలగంగాధర తిలకును దేవుని అవతారంగా భావించడం, అతని మరణాంతరం ఆ దైవాంశ గాంధీలో ప్రవేశించినట్లు నవయుగారంభం జరుగుతుంది.

**పాంచాల పరాభవము నాటకం:**

ఐదు అంకాల నాటకం. త్యాగం, దేశభక్తి ప్రధాన ఇతివృత్తం. డయ్యరు అరాచక పాలన, భరతమాత హీన దీనస్థితి, జలియన్‌వాలాబాగ్ దారుణ మారణ కాండ మొదలైన సంఘటనలు, సన్నివేశాలు చూపించారు. ఈ నాటకంలో గాంధీ, భరతమాత, కృష్ణుడు, పాంచాల మాత, డయ్యరు, సత్యపాల్, కిచ్లూ, ధీరసింగ్, వీరలాల్, భటులు, విద్యార్థులు. భరతమాత పూర్వపు రోజుల్లో తన గొప్పతనాన్ని, నేటి కాలంలో హీనమైన దీనమైన బానిస బ్రతుకులను తలచుకుని బాధపడ్తూ మూర్ఛపోయింది. అప్పుడే గాంధి రావడం తాను దక్షిణాఫ్రికాలో చేసినట్లుగానే యిక్కడా పోరాటం చేయాలని సంకల్పం కలగడం ఈ నాటకం లోని ప్రధాన ఇతివృత్తం.

**స్వరాజ్య సోపానం:**

ఇది అయిదు అంకాల నాటకం. ప్రధాన ఇతివృత్తం దేశభక్తి, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించినది. స్వాతంత్ర్య పోరాటంలో జరిగిన సంఘటనలు, ఉప్పు సత్యాగ్రహం, గాందీని జైలులో పెట్టడం తరువాత విడుదల చేయటం, నెహ్రూ ప్రభుత్వం ఏర్పడటం, రాజీనామా చేయడం భారత దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి స్వేచ్ఛను పొందటం ముఖ్య సన్నివేశాలుగా ఈ నాటకం సాగుతుంది. ఈ నాటకంలో ఎన్నో సన్నివేశాలు బ్రిటీష్ వారికి ఆగ్రహం కలిగించాయి.ప్రజలలో ఊహించిన దాని కంటే ఎక్కువ చైతన్యం కలిగింది. ఈ నాటకంలో ప్రధాన పాత్రలు గాంధీ, భరతమాత,కృష్ణుడు, శోకతాళి, లజపతి రాయ్, నెహ్రు, సరోజినినాయుడు, జిన్నా, డయ్యర్, వైశ్రాయ్ మొదలైనవారు.

**స్వరాజ్య సౌధము:**

ఈ నాటకంలో అంకాలు లేవు. రెండు భాగాలుగా రచించడం జరిగింది.పూర్వ భాగంలో స్వరాజ్య సౌధము, ఉత్తర భాగము క్విట్ ఇండియాగా రచన సాగింది.దేశభక్తి, స్వర్జ్య పోరాటం ప్రధానంగా సాగుతుంది. గాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించడం, క్విట్ ఇండియా ఉద్యమం తీవ్ర స్థాయిలో సాగడం ప్రభుత్వం దిగి వచ్చి స్వాతంత్ర్యం ఇస్తామని ప్రకటించడం వంటి అనేక అంశాలు సన్నివేశాలుగా రచించారు దామరాజు పుండరీకాక్షుడు.

**స్వరాజ్య రథము:**

ఐదు అంకాల నాటకం. ఆంగ్లేయుల అమానుష చర్యల వలన దీనస్థితికి చేరిన భరతమాత ఆవేదనను తీర్చమని దేవేంద్ర సభలో భరతమాత దేవేంద్రుడిని కోరడ, తిలక్ మరల గాంధీగా అవతరించి, ప్రజలందరినీ చైతన్య పరచి స్వరాజ్యాన్ని స్థాపించి ఆ స్వరాజ్య రథాన్ని ముందుకు సాగించటం ప్రధాన వస్తువు. ఈ నాటకంలో గాంధీ, శోకతాలి, భరతమాత, పాంచాలి, దేవేంద్రుడు, తిలక్, గోఖలే, రాత్నాదేవి మొదలైనవి. ఈ నాటకంలో ప్రతి పాత్ర దేశభక్తని ప్రతిబింబిస్తాయి. ఈ నాటకం రాసినవారు సోమరాజు రామానుజరావు.

**తిలకు మహారాజ నాటకము:**

ఇందులో పది అంకాలు ఉన్నాయి. బాలగంగాధర్ తిలక్ జీవితాన్ని, వారి జీవిత క్రమంలో వారు దేశసేవ కోసం, స్వరాజ్య సాధన చేసిన ప్రయత్నం, వారి మరణం వరకు సాగిన ప్రయాణాన్ని వివరించారు.

**చిచ్చుల పిడుగు నాటకం :**

ఇది ఏకాకింక. ఒకే అంకంతో మూడు రంగాలతో రచించబడిన నాటకం. ఈ నాటకం తూర్పు గోదావరి జిల్లా నుంచి వెలువడే "కాంగ్రెస్ " అనే పత్రికలో 1929 లో ప్రచురితం అయ్యింది. బ్రిటీష్ ప్రభుత్వ దోపిడీ పాలనలో నశించిపోతున్న భారతదేశ హీన దీన స్టితిని ఈ నాటకంలో ప్రధానంగా చూపించారు.

**బ్రిటీష్ వాళ్ళు నిషేధించడానికి కారణాలు :**

జాతీయోద్యమ ముఖ్య లక్ష్యం పరదేశీయుల్ని పారద్రోలడమే ప్రధాన ధ్యేయమైనప్పటికీ, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజిక రంగంలో కనిపించే అనేక సమస్యల్ని పరిష్కరించేదిశగా పయనించిన కోణాన్ని కూడా రచయితలు తమ నాటకాలలో వివరంగా పేర్కొన్నారు. వందేమాతరం, విదేశీవస్తు బహిష్కరణ, సత్యాగ్రహం, క్విట్

ఇండియా ఉద్యమం మొదలైన చారిత్రక ఘట్టాలను తెలుగు నాటకాల్లో కనిపిస్తాయి.

సాంఘికేతివృత్తాలతో రచించబడిన సాంఘిక నాటకాలలోని కొన్ని సంభాషణలు, సంఘటనలు, సన్నివేశాలు సమాజంలోని మానవ జీవన గమనానికి ఆటంకం కలిగిస్తాయనే ఆలోచనలతో, భావనలతో బ్రిటీష్ ప్రభుత్వం సాంఘిక నాటకాలను నిషేధించింది. అయితే కేవలం సామాజిక జీవనం అస్తవ్యస్త మవుతుందని భావించిన అంశాలే గాకుండా సహజంగానే తమకు ఇబ్బందిని కలిగిస్తాయని ఊహించి కోపావేశం పొందేటట్లు చేసే మరికొన్ని సన్నివేశాల వలన కూడా బ్రిటీష్ ప్రభుత్వం ఈ నాటకాలను నిషేధించింది.

"సంస్కారిణి" నాటకం ప్రధానంగా సాంఘిక సమస్యలను వాటి వలన ఛిద్రమవుతున్న మానవ జీవితాలను వివరిస్తున్నా మధ్యలో దక్షిణాఫ్రికా సన్నివేశాలు, చివర్లో ప్రజలందరూ చైతన్యవంతులై ఏకమై దేశ సౌభాగ్యం కోసం పాటుపడాలని ప్రమాణాలు చేయటం బ్రిటీష్ వారికి నచ్చని అంశాలు. ఇంకా హిందూ- ముస్లిమ్లు మతద్వేషాలు మరచిపోయి ఐకమత్యంగా ఉండాలనుకోవడం ప్రభుత్వానికి రుచించని అంశం.

మరొక సన్నివేశంలో దక్షిణాఫ్రికా దేశంలో భారతీయులు పడే వేదనను రంగస్థలం మీద ప్రయోగయోగ్యమైన రీతిలో దామరాజు వారు చిత్రించారు." దక్షిణాఫ్రికాలోని భారతీయులపై తెల్లదొరలు సాగిస్తున్న హింసా కాండలను చిత్రించటం వల్ల చూస్తున్న ప్రేక్షకులకు తమ దేశంలో ఉన్న ఆంగ్లేయులపై కూడా కోపం కలిగి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తారని బ్రిటీష్ వారు నాటకాన్ని నిషేధించారు.

హిందువులు, ముస్లిములు కలసికట్టుగా ఉంటే బ్రిటీష్ ప్రభుత్వం సహించలేదు. వారందరూ ఒక్కటై తమను వ్యతిరేకిస్తే తమ ఆధిపత్యానికి ఆటంకం కలుగుతుందని భయం. నాటకంలో ఈ సన్నివేశాలు, సంభాషణలు చూసిన ప్రజలు ద్వేషం మాని ఐకమత్యంగా ఉండటానికి ప్రయత్నిస్తారని, అది తమకు అంత మంచిది కాదని భావించి ప్రభుత్వం అటువంటి నాటకాలని నిషేధించింది.

దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కొరకు పాటుపడుతూ, సంఘ సంస్కరణకు కృషి సాగిస్తున్న గాంధీ నిర్మాణ కార్యక్రమంలో భాగమైన మద్యపాన నిషేధ విధానాన్ని, దేశీయోద్యమంలో ప్రజలు భాగస్వాములయిన తీరును మరికొన్ని నాటకలలో చూపించారు రచయితలు.

దామరాజు పుండరీకాక్షుడు నాటకంలో గాంధీ ప్రబోధాలు విన్న నాగరత్తం, కుశాల్రావులు తాము చేస్తున్న చెడ్డపనులను మానుకొని దేశంకోసం పాటుపడాలనుకొని దేశయోద్యమంలో చేరడం, యామినీ సుందరి కూడా సర్వాభరణాలను త్యజించి నూలు వస్త్రాలు ధరించి దేశ సేవ చేయాలని అందరికీ వివరిస్తూ దేశీయోద్యమంలో చేరటం. బ్రిటీష్ వారికి కోపాన్ని తెప్పించింది. నాటకం చూస్తున్న ప్రేక్షకులు గాంధీ బోధనలు విని తాము చేస్తున్న పనులన్నీ మానుకొని దేశం కొరకు దేశీయోద్యమంలో పాల్గొంటారేమోనని బ్రిటీష్ ప్రభుత్వం భావించి నాటకాన్ని నిషేధించారు. గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించు కొన్నట్లుగా చూపించడం బ్రిటీష్ ప్రభుత్వానికి ఆగ్రహం కలిగించిన అంశాలు.

ఈ కారణాల వలన సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి రచింపబడిన నాటకాలు బ్రిటీష్ ప్రభుత్వ నిరాదరణకు, నిషేధాలకు గురయ్యాయి.

**ముగింపు :**

అక్షరాస్యులకు మాత్రమే కాకుండా నిరక్షరాస్యులకు సైతం ఆకర్షించిన ప్రక్రియ నాటకం. 1920 తర్వాత తెలుగు నాటక రంగంలో ప్రధానంగా నాటక రచనల్లో ఊహించని పరిణామాలు మొదలయ్యాయి. అప్పటి సమాజంలో ముఖ్యంగా జాతీయోద్యమ కాలంలో ఉన్న పరిస్థితులు ఈ నాటకాల రచనకు ప్రేరణ అయ్యాయి. నాటక రచయితల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం ఆగ్రహాన్ని ప్రదర్శించి ఆంక్షలను విధించి నిషేధాలను అమలు చేసింది. అయినప్పటికీ ఈ నాటక కర్తలు భయపడక ప్రభుత్వ దారుణాలను ఎండగడుతూ నాటక రచన చేసారు. ఈ విధంగా బ్రిటీష్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ , హెచ్చరిస్తూ చిత్రించబడిన నాటకాల రచన స్వాతంత్ర్యం వచ్చేవరకు కొనసాగింది.

జాతీయోద్యమంలో నిరక్షరాస్యులను సైతం ఒక ఉద్యమ కారులుగా మార్చడంలో నాటకం ఒక ప్రముఖ పాత్ర పోషించింది అనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. డా॥ నారాయణరెడ్డి సి. (1999), ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు – ప్రయోగములు, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.
2. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణ, హైదరాబాద్.

# తెలంగాణ నాటక సాహిత్యం - ప్రక్రియా వైవిధ్యం

**డా. భీంపల్లి శ్రీకాంత్**
ప్రభుత్వ ఉపాధ్యాయులు
ప్రాథమికోన్నత పాఠశాల
పాలకొండ, మహబూబ్‌నగర్ జిల్లా
సెల్ : 9032844017

సామాజిక, రాజకీయ, జాతీయ, సాహిత్య, సాంస్కృతికోద్యమాల్లో క్రియాశీలమైన పాత్రను పోషించిన తెలంగాణ నాటక సాహిత్యం విశేషమైన కృషి సల్పింది. నాటకం దృశ్యకావ్యం ప్రదర్శన యోగ్యమైనది. అన్ని రసాలను పలికించగల ఏకైక సాహిత్య ప్రక్రియ నాటకం. తెలంగాణలో నాటక రచన సంస్థానాల కాలం నుంచి పురుడుపోసుకున్నది. పండిత పామరజనకంగా అందరికీ అందుబాటులో ఉండి ప్రదర్శించే కళ నాటకం. నాటకం పురాణాల నుంచి సామాజికం వైపు నడిచి అనేక రూపాల్లో అభివ్యక్తమైంది. నాటిక, రూపకం, భువనవిజయం వంటి రూపాల్లో నాటకం రంజింపజేసింది. దశ రూపకాల్లో నాటకం సర్వసమగ్రమైన కళారూపం. నాటకం ప్రారంభం నుంచి నేటి వరకూ అనేక మార్పులకు లోనై సమగ్రతను పొంది తన స్థానాన్ని భద్రపరచుకుంది. తెలంగాణలో సమకాలీన సమస్యలను పట్టి చూపించే సాంఘిక నాటకాలు అనేకం వచ్చాయి. జనజీవన పరిస్థితులను, సమస్యలను తెలుపుతూ రాయబడ్డ నాటకాలు తెలంగాణాలో విరివిగా వచ్చాయి.

ఈ నేపథ్యంలో ప్రక్రియాపరంగా వైవిధ్యమైన నాటికానాటకాలు ఆవిర్భవించాయి. అవి చారిత్రక నాటకాలు, జానపద నాటకాలు, సాంఘిక నాటకాలు, ఉద్యమ నాటకాలు, రాజకీయ నాటకాలు, నృత్య నాటికలు, గేయ నాటికలు, హాస్య నాటికలు, నృత్య గేయ నాటికలు, సంగీత రూపకాలు మొదలైనవి.

కాకతీయ సామ్రాజ్యాన్ని క్రీ.శ. 1289 – 1323 మధ్యకాలంలో పాలించిన ప్రతాపరుద్రుడు 'యయాతి చరిత్ర, ఉషారాగోదయం' అనే సంస్కృత నాటకాలను రచించాడు. రెండవ ప్రతాపరుద్రుడి కాలంలో ఉన్న విశ్వనాథుడు తాను రాసిన 'ప్రతాపరుద్ర యశోభూషణం' అనే లక్షణ గ్రంథానికి అనుగుణంగా ఆయన " ప్రతాప కల్యాణము " అనే నాటకాన్ని రచించాడు. అలాగే ఇదే కాలంలో జీవించిన నరసింహుడు (1289–1323) అనే కవి " కాదంబరీ కల్యాణం " అనే నాటకాన్ని రచించినట్లు సాహిత్య పరిశోధకుల అభిప్రాయం. రాచకొండ రాజ్యాన్ని పరిపాలించిన అనపోతనాయకుడు (1360 – 1385) 'అభినవ రాఘవము' అనే నాటకాన్ని రచించాడు. సర్వజ్ఞ సింగభూపాలుడు సంస్కృత నాటక రచయిత. కాకతీయుల సామ్రాజ్య పతనం అనంతరం రాచకొండ రాజధానిగా రేచర్ల వెలమరాజులు తెలంగాణను పాలించారు. 1381 – 1405 ప్రాంతంలో పాలించిన ఈ రేచర్ల వెలమరాజు " రత్నపాంచాలిక లేదా కువలయావళి " అనే నాటికను రచించాడు. కువలయావళిగా అవతరించిన భూదేవిని శ్రీకృష్ణుడు వివాహం చేసుకోవడం ఇందులోని ఇతివృత్తం. ఇది స్వతంత్ర రచన.

తెలంగాణలో వెలిసిన సంస్థానాలలో తెలుగు, సంస్కృత నాటకాలు విరివిగా వచ్చాయి. సంస్థానాల ఖిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే అనేక నాటకాలు వచ్చాయి. గద్వాల, జటప్రోలు, వనపర్తి, ఆత్మకూరు, అలంపురం, గోపాలపేట తదితర సంస్థానాల నుంచి అనేక నాటకాలు వెలుగుచూశాయి. ప్రాచీన కళారూపమైన యక్షగానం నాటకానికి పూర్వరూపమని చెప్పవచ్చు. ఈ సంస్థానాలలోనే అనేక యక్షగానాలు వచ్చాయి. ఆయా సంస్థానాలలో నిర్వహించే జాతర్లలో, బ్రహ్మోత్సవాలలో ఈ యక్షగానం ఆడేవారు. సంస్థానాల కాలం నుంచే యక్షగానం పురుడుపోసుకుని తదనంతర కాలంలో నాటకంగా ఊపిరిపోసుకుంది.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని జటప్రోలు సంస్థానాధిపతి సురభి మాధవరాయల ఆస్థాన కవి అయిన ఎలకూచి బాలసరస్వతి 'రంగకౌముది' అనే నాటకాన్ని రచించాడు. 1570-1650 మధ్యకాలానికి చెందిన ఆయన అసలు పేరు వెంకటకృష్ణయ్య. 1730 సంవత్సరంలో జన్మించిన తిరుమల బుక్కపట్నం కిరీటి వెంకటాచార్యులు 'ఉషాపరిణయం' అనే నాటకాన్ని రచించాడు. ఆయన తమ్ముడు తిరుమల బుక్కపట్నం బుచ్చి వెంకటాచార్యులు " కల్యాణ పురంజనం " అనే నాటకాన్ని రాశాడు.

వనపర్తి సంస్థానాధీశుడు "అష్టబహిరీ" గోపాలరావు "శృంగారమంజరీ భాణము, రామచంద్రోదయము " అనే సంస్కృత నాటకాలను రాశాడు. ఇతడు 17 వ శతాబ్దానికి చెందినవాడు. ఇదే సంస్థానానికి చెందిన హొసదుర్గము కృష్ణమాచార్యులు అనేక సంస్కృత నాటకాలు రాశాడు. ఇందులోని కొన్ని సంస్కృత నాటకాలను మాదిరాజు విశ్వనాథరావు తెలుగులోకి అనువాదం చేశాడు. అలాగే కాళిదాసు "అభిజ్ఞాన శాకుంతలం" ను అనువదించాడు. ప్రసిద్ధ సంస్కృత పండితుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రితో కలిసి బిల్హణుడి ప్రఖ్యాత నాటకం "కర్ణసుందరి" ని అనువదించాడు. ఆత్మకూరు సంస్థానంలోని బాలసరస్వతి బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు (1862 – 1920) అనేక సంస్కృత నాటకాలను రచించాడు. "కిరీటి వెంకటాచార్య విజయ వైజయన్తి " అనే సంస్కృత నాటకాన్ని రచించాడు.

నల్లగొండ జిల్లా నారాయణపుర సంస్థానంలో జన్మించిన రామకవచం కృష్ణయ్య (క్రీ.శ.1863 - 1926) " హరిప్రియ " అనే నాటకాన్ని రచించాడు. మెదక్ జిల్లా మద్దికుంటకు చెందిన కందాళ సుందరాచార్యులు " రాజసూయం, పుష్పవేణి విలాసం, సంపూర్ణ రామాయణం, తిరుమంగ యాళ్వారు చరిత్రం " అనే నాటకాలను రచించాడు. మామిడిపల్లి సాంబశివశర్మ (క్రీ.శ.1870 లో జననం) "మంగళ హారతులు, కీర్తనలు, భద్రావతి, త్యాగయ్య " అనే నాటకాలను రచించాడు. మెదక్ జిల్లా సిద్దిపేటలో జన్మించిన గడ్డం రామదాసు 'ఋతుధ్వజ' అనే నాటకాన్ని రచించాడు. 19వ శతాబ్దానికే చెందిన ప్రబంధం అనంతయ్య " హరిశ్చంద్ర, బిల్హణీయం " అనే నాటకాలను రాశాడు. అలాగే మహబూబ్ నగర్ జిల్లా గొరిటకు చెందిన చెన్నకృష్ణమరాజు "ఋతుధ్వజ" నాటకాన్ని రాశాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ కు చెందిన చందాల కేశవదాసు 'బలిబంధనం, కనకతార' అనే నాటకాలను రచించాడు. వరంగల్ జిల్లాకు చెందిన ఒద్దిరాజు సోదరులు బహుముఖ ప్రజ్ఞాశాలురు. ఒద్దిరాజు సీతారామచంద్రరావు 'మోహినీ విలాసం, ప్రేమవివాహం, నవనాగరిక భార్య, మైత్రీపరిణతి, ఎరువు సొమ్ము, జమీందారి తీరు, మేనరికము, మేనత్త, మగసంసారం, ఆడపెత్తనం' వంటి నాటికలను రచించాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ తాలూకా రేపాలకు చెందిన కె.ఎల్. నరసింహారావు దాదాపు 25 నాటికలు, నాటకాలు రచించాడు. " ఆదర్శ లోకాలు, గెలుపు నీదే, గుడిగంటలు, అడుగుజాడలు (1956), కొత్తగుడి, క్రీనీడలు " వంటి నాటకాలను రచించాడు. నల్లగొండ జిల్లాకు చెందిన గవ్వా జానకిరామిరెడ్డి " దేశబంధు " అనే మూడంకాల నాటకాన్ని రాశాడు.

ఇంకా భాగి నారాయణమూర్తి 'పరీక్ష చదువు' నాటకాన్ని, శేషుబాబు 'అశోక రాజ్యం' నాటకాన్ని రచించారు. మెదక్ జిల్లాకు చెందిన వెల్దుర్తి మాణిక్యరావు 'దయ్యాల పన్గడ' అనే నాటకాన్ని ఆ జిల్లా మాండలికంలో రాశాడు. హైదరాబాద్ కు చెందిన ఎస్.కె. ఆంజనేయులు "రాధికా స్వాంతనం, స్మృతి ప్రతీక, శిరోమణి, వలయం, ఆత్మీయులు, రాగరాగిణి, పవిత్రులు, చావకూడదు, నీడలు – నిందలు " వంటి పలు నాటికానాటకాలను రచించాడు. ఆర్.వి.ఎస్. రామస్వామి " చీకటి కోణాలు, వలయం, సుడిగాలి, గాలివాన, కెరటాలు, వెల్లువ, శ్రీమాన్ శ్రీపతి, వర్ధంతి, గాలిపటం " వంటి నాటకాలను రచించాడు.

ప్రసిద్ధ సంపాదకులు, చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి " భక్త తుకారం, ఉచ్చల విషాదము" అనే నాటకాలను రచించాడు. శేషాద్రి రమణ కవులు 'విచిత్ర వివాహం, సుశీల, చంద్రరేఖ' వంటి సామాజిక నాటకాలను రచించాడు. సందేశాత్మక రచనగా 'విచిత్ర వివాహం' నాటకం రచించబడింది. 'చంద్రరేఖ' నాటకంలో అస్పృశ్యత, నిరుద్యోగం, బాలవితంతువు, రైతుల శ్రమ వంటివి పేర్కొనబడ్డాయి. తెలంగాణా నాటకరంగంలో తొలి ప్రయోగాత్మక నాటకమైన

'భిషగ్విజయం' ను డాక్టర్ చొల్లేటి నృసింహ్మ రామశర్మ రచించాడు. ఈ నాటకం ఆయుర్వేద వేదవిజ్ఞానానికి సంబంధించినది. ప్రఖ్యాత నాటక కర్త, నాటక సాహిత్య పరిశోధకుడు డాక్టర్ పి.వి.రమణ ' ఆకు రాలిన వసంతం, వెంటాడే నీడలు, దేవతలెత్తిన పడగ, చలిచీమలు, మహావీర కర్ణ, ప్రతాపరుద్ర, మహస్సు, మానవతకూ నిండాయి నూరేళ్లు, లోలకం, మృత్యునీడ, కళ్యాణమే ఒక కానుక, ప్రేమ పోరాటం, గురువుగారూ మన్నించండి ' వంటి నాటికానాటకాలను రచించాడు. ఇవన్నీ బహుళ ప్రాచుర్యం పొందాయి. ఒద్దిరాజు సీతారామాచంద్రరావు 'మైత్రి పరిణితి, ఎరువు సొమ్ము, మేనరికం, మేనత్త, ఆడపెత్తనం, మగసంసారం' మొదలైన సాంఘిక నాటకాలను రచించాడు. ఇంకా వానమామలై వరదాచార్యులు 'రాజ్యశ్రీ', దాశరథి 'వాసనలేని పూలు', పాములపర్తి సదాశివరావు 'ఆత్మగౌరవం, కర్తవ్యం, పోరాటం' నాటకాలను రచించాడు. ఎం. మధుసూదనరావు 'సార్థకజీవి', వల్లంపట్ల నాగేశ్వరరావు ' మాయాజూదం, రాతిబొమ్మ, కళాకారులారా కళ్ళు తెరవండి, మహిమా నీ చోటెక్కడ, ఎలచ్చన్లచ్చినయ్ ' వంటి నాటకాలు వివిధ సామాజిక రుగ్మతలపై మార్కెట్ మాయాజాలంపై రచించబడ్డ నాటకాలు. నల్గొండకు చెందిన ప్రముఖ కవి, విమర్శకులు, ప్రొఫెసర్ దేవరాజు మహారాజు 'దయ్యాల పన్గడీ' అనే నాటకాన్ని తెలంగాణా భాషలో మొదటిసారిగా రచించాడు. కోదాటి లక్ష్మీనరసింహ్మరావు "గెలుపు నీదే, ఆదర్శలోకాలు, అభాగ్యులు, స్వార్ధం, అడుగుజాడలు, కొత్తగుడి, అగ్ని పరీక్ష, వసంత భారతి, కొడిగట్టిన దీపాలు, కల్పతరువు, ప్రజాదేవత, పుట్టినరోజు పండుగ, మతిలేని మహారాజు, ముచ్చట్లు, అందరికీ చదువు" వంటివి రచించాడు. వరంగల్లుకు చెందిన తూము రామదాసు (1856 – 1904) 'కాళిదాసు' అనే నాటకం రాశాడు.

ఎ.ఆర్.కృష్ణగా ప్రసిద్ధిపొందిన అడుసుమిల్లి రాధాకృష్ణ ప్రముఖ నాటక రచయిత. ఆంగ్ల నాటకాలను అనేకం తెలుగులోకి అనువాదం చేశాడు. ఆస్కార్ వైల్డ్ 'ఐడియల్ హజ్బెండ్' ను 'ఆదర్శమూర్తి' (1967) పేరుతో, హెరాల్డ్ పింటర్ రచించిన 'కేర్ టేకర్' నాటకాన్ని 'సంరక్షకుడు' (1968) పేరుతో, 'హ్యూయర్స్ ఆఫ్ కోల్' నాటికను 'చీకటివెలుగులు' (1962) పేరుతో అనువదించాడు. "అరగంటలో అదృష్టం" వంటి స్వతంత్ర నాటక రచనలు కూడా చేశాడు. హైదరాబాద్ కు చెందిన జమ్మలమడక శశిమోహన్ " కోహినూర్ ఫర్ సేల్, మాకు శాంతి కావాలి, మంచితనం మరోసారి చచ్చింది, మాకో నియంత కావాలి "నాటికలను, " కాగితం పులి, అశ్వత్థామా హతః, సిరికిన్ చెప్పడు " వంటి నాటకాలను రచించాడు.

తెలంగాణ సాయుధ పోరాటకాలంలో నాటికలు, నాటకాలు చాలా వచ్చాయి. " న్యాయం, సరబరాహి, పగ, వీరకుంకుమ, కాంగ్రెసా – అంగ్రేజా, శాంతిరక్షణ కోసం, రిపబ్లిక్ వెలిసింది, వీరనారి " వంటి నాటకాలు ఆవిర్భవించాయి. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకుని సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు లు కలిసి 'మా భూమి' నాటకాన్ని రాశారు. వీరిద్దరూ తెలంగాణకు చెందినవారు కాకపోయినా నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకుని దీన్ని రాశారు. ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగానే వాసిరెడ్డి భాస్కరరావు "పోతుగడ్డ" అనే నాటికను రచించాడు. తెలంగాణ పోరాట చరిత్ర మలిదశను చిత్రించిన నాటకం 'గెరిల్లా'. దీనిని సుంకర, భాస్కరరావులు రాశారు. ఈ నాటకానికి కూడా నల్లగొండ జిల్లాలో జరిగిన సాయుధ పోరాటమే ఇతివృత్తం కావడం విశేషం. ఈ గెరిల్లా నాటకాన్ని ఆరు రంగాలుగా రచించారు. శ్రీకాకుళ పోరాటం ప్రేరణతో తెలంగాణ నక్సలైట్ ఉద్యమానికి ఊపిరి పోసేందుకు సుంకర సత్యనారాయణ "వీరకుంకుమ", డాక్టర్ రాజారావు "వీరనారి" నాటికలను రాశారు. వీరిద్దరు కూడా తెలంగాణేతర రచయితలే కావడం గమనార్హం. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్రను వీరనారి తెలియజేస్తుంది.

మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం ఇప్పటూర్ గ్రామానికి చెందిన కొల్లాపూర్ మఠం రాచయ్య గాంధీజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని 'శ్రీ మహాత్మాగాంధీజీ జీవిత చరిత్ర' అనే పేరుతో బృహత్ నాటకాన్ని రచించాడు. ఇది వందసార్లకు పైగా ప్రదర్శించబడింది. ఇది సరళ గ్రాంథికంలో రచించబడ్డ నాటకం, గాంధీజీ జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఈ నాటకం ఆవిష్కరించింది. నవాబ్ పేట్ మండలానికి చెందిన దాయపంతులపల్లి చెన్నదాసు 'మాయానాటకం,

అశ్వత్థామ, బంగారు లేడి' అనే నాటికలను రచించాడు. వనపర్తి జిల్లాకు చెందిన ఉమ్మెత్తల యజ్ఞరామయ్య "ధర్మచక్రం" పేరుతో నాటకాల సంపుటిని వెలువరించాడు. ఇందులో ధర్మచక్రం, అంగులీమాల, వేనుడు, మహాకవి భారవి వంటి నాటకాలున్నాయి. ఇందులో ఒక పౌరాణికం, మూడు చారిత్రక నాటకాలున్నాయి. ఇందులోని 'ధర్మచక్రం' ఆకాశవాణిలో ప్రసారమైంది. గంధం కుప్పదాసు " యయాతి చరిత్ర " పేరుతో ఒక నాటకాన్ని రచించాడు. కవిగా, గేయకవిగా, నాటక కర్తగా పేర్గాంచిన టి. రామకృష్ణారెడ్డి " స్వప్నబాల, ఊర్వశి, ఉలూచి, ఉమర్ ఖయూమ్, కలువరాణి, ఏకాదశి, రాసలీల" వంటి సంగీత నృత్య నాటికలను రచించాడు. మహబూబ్ నగర్ పట్టణ కేంద్రానికి చెందిన గాధిరాజు సత్యనారాయణ రాజు' హనుమ సాక్షాత్కారం' పేరుతో ఒక సాంఘిక నాటకాన్ని రచించాడు. ఇది అభయవీర హనుమాన్ క్షేత్ర మహిమను తెలిపే నాటకం.

ప్రముఖ నాటకకర్త బి.ఎల్. నరసింహారావు 'కులం' మొదలైన నాటకాలను రచించాడు. 'కులం' నాటకాన్ని తెలంగాణ మాండలికంలో రచించాడు. ఇందులో ప్రాంతీయ భాషాచైతన్యాన్ని ఆవిష్కరించాడు. మానవ పురోభివృద్ధికి, ప్రగతికి కులం అనేది ఎంత అవరోధంగా ఉంటుందో ఈ నాటకంలో తెలియజెప్పాడు. అనేక నాటక రచనల్లో తెలంగాణ భాషా మాండలికాలను ప్రవేశపెట్టి భాషాపరమైన ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్ జిల్లా నుంచి సురమౌళి గొప్ప నాటక సాహిత్యాన్ని ఆవిష్కరించాడు. ఆవిష్కరించడమే కాదు "ఎథియిస్ట్ బాయిస్ క్లబ్ " అనే నాటక సమాజాన్ని స్థాపించి నాటకాలను వేయించాడు. సురమౌళి, రెడ్డి చినవెంకటరెడ్డిలు కలిసి అనేక నాటికలు రాశారు. వీరిద్దరూ కలిసి రాసిన నాటకం 'కీలుబొమ్మలు'. ఈ కీలుబొమ్మలు నాటకం సమకాలీన గ్రామ పంచాయితీ వ్యవస్థ తీరుతెన్నులను కళ్ళకు కడుతుంది. పంచాయితీ వ్యవస్థ ద్వారా లబ్ధిపొందే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరనీయకుండా అడ్డుపడి సామాజికాభివృద్ధికి నిరోధకులుగా మారిన సజీవ దృశ్యాలను కీలుబొమ్మలు నాటికలో రచయిత సురమౌళి చక్కగా చిత్రించాడు. వరంగల్ జిల్లాకు చెందిన పొట్లపల్లి రామారావు " పగ, సరబరాహి, న్యాయం " వంటి నాటికలను రచించాడు.

నల్లగొండ జిల్లాకు చెందిన తిరునగరి రామాంజనేయులు పలు నాటకాలు, నాటికలు రాశారు. "వెట్టిచాకిరి" వంటి నాటికలను "తెలంగాణ, వీర తెలంగాణ" వంటి నాటకాలను రచించాడు. ఆనాటి తెలంగాణ ప్రజల జీవితాన్ని, పోరాటాన్ని ఇవి ప్రతిబింబించాయి. కవిగా, నవలారచయితగా ప్రసిద్ధుడైన చెరబండరాజు "గంజినీళ్లు, గ్రామాలు మేల్కొంటున్నాయి" అనే నాటకాలను, టెంపరరీ లేబర్, పల్లె పిలుస్తోంది, వెన్నెల్లో మంటలు, సంఘర్షణ " అనే నాటికలను రచించాడు. తెలంగాణలో నక్సలైట్ ఉద్యమం నేపథ్యంగా ప్రసిద్ధ రచయిత అల్లం రాజయ్య "నాగేటి చాళ్లల్లో " అనే నాటకాన్ని రచించాడు. అలాగే ప్రసిద్ధ రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డితో "బొగ్గు పొరల్లో" నాటకాన్ని రచించాడు.

సాహిత్య ప్రక్రియలన్నింటిలో హాస్యరసానికి పెద్దపీట వేసింది మాత్రం నాటకరంగమేనని చెప్పవచ్చు. డాక్టర్ పల్లా దుర్గయ్య 'మాయరోగం' అనే హాస్యనాటికను చక్కగా రచించాడు. ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకోవడానికి ఒక కొడుకు తండ్రి ముందు నటించిన నటనే 'మాయరోగం' నాటిక. గీట్ల రాంరెడ్డి " మధ్యతరగతి మానవుడు, ఈ బ్రతుకు మాకొద్దు " వంటి నాటికలను రచించాడు. నంది రాజారెడ్డి " సబల, మా మతం మానవత్వం" వంటి నాటికలను రచించాడు. గంటి వెంకటరెడ్డి " కనువిప్పు, స్వార్థానికి సంకెళ్లు " నాటికలను రచించాడు. ఆనంద్ కుమార్ " పూలపల్లకి, సఖరాం బిందర్" వంటి నాటికలను రాశాడు. అబ్దుల్ కరీం 'గగనంలో గడ్డిపూవు' నాటికను రచించాడు. వరంగల్ కు చెందిన నాటక రచయిత, పరిశోధకుడైన డాక్టర్ వనం మధుసూదన్ '' నాటకం, అమ్మయ్యో గాంధీ బ్రతికాడు, ఋణం తీరిపోయింది, భారతి కళ్లు తెరిచింది, అంటరాని వాళ్లు '' వంటి నాటికలను రచించాడు. రంగస్థల నటుడు, రచయిత అయిన రొట్టె విశ్వనాథశాస్త్రి "చైనాతో యుద్ధం" (1962) సందర్భంగా 'జయం మనదే' నాటకాన్ని రాశాడు.

తెలంగాణ మాండలిక రచయిత్రి, పరిశోధకురాలు, కథా రచయిత్రి అయిన ఆచార్య పాకాల యశోదారెడ్డి పలు నాటకాలను రచించింది. 'నందుని ధర్మదీక్ష, జీవన యాత్ర, ప్రహసనం' వంటి నాటకాలను రచించి ప్రదర్శింపజేసింది.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి పలు గేయ, వచన నాటికలు రాశాడు. ఆయన రచించిన వచన నాటికలు 'నారాయణరెడ్డి నాటికలు' పేరుతో సంపుటిగా వచ్చాయి. అవి ఊర్మిళ, వరూధిని, మేఘమాధురి, దీపలీల, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విజయ సంక్రాంతి, రఘుపతి రాఘవరాజారాం, కాళిదాసు పునరాగమనం, హరిచరణ దాసి మొదలైనవి. " వలపునాడు, దగ్ధశాంతి, భిన్నస్వరాలు, అజంతా సుందరి, సుగాత్రి, ఋతువుల రాణి, వెన్నెలవాడ, దివ్వెల సంగీతం, సంక్రాంతి, గోకుల విహారం, మనిషి – యంత్రం" వంటి గేయనాటికలను రచించాడు. ఇవేకాక "వసంతలక్ష్మి, భలే లక్ష్మి, శిథిలశీల, సినీకవి" వంటి నాటికలు రాశాడు సినారె. తెలంగాణ గేయనాటికను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళిన మహాకవి డాక్టర్ సినారె. యువకళావాహిని ఆధ్వర్యంలో పి.వి.కృష్ణమూర్తి " స్వామి వివేకానంద, నేతాజి, సమ్రాట్ అశోక " తదితర చారిత్రక నాటకాలను రాసి ప్రదర్శించాడు. మామునూరు రామదాసు 'రంగుటద్దాలు' నాటకాన్ని రచించాడు.

నల్లగొండకు చెందిన పెరిక రాజారత్నం 'ఇష్టంలేని పెళ్ళి, నూతన కాంతులు, ఎవరు బాధ్యులు' వంటి సామాజిక నాటకాలను రచించాడు. చిల్లర భావనారాయణ 'కళాభిమాని, దేశద్రోహం, ఉప్పెన, కామందు, పరిణామం, కొత్త మనిషి, పదవులుపెదవులు' నాటకాలను, ఎ.ఆర్.కృష్ణ 'అరగంటలో అదృష్టం, కల్లోలం ఎక్కడికి, దేశంకోసం చేసిన నేరం' నాటకాలను రచించారు. ఇంకా గుండాల నరసింహరావు 'మరుగుతున్న తరం, ఎర్రబస్సు' లను, అంకం లింగమూర్తి 'జలతారు, చక్రశీల, అగ్నిదీపం, పితృదేవోభవ' నాటకాలను, ఎం.వి.సుబ్రహ్మణ్యం 'చదరంగం, జెండాపై కపిరాజు, మీరు మారాలి' నాటకాలను, డాక్టర్ నాంపల్లి మధుబాబు 'మేడిపండు, దూరపుకొండలు' నాటకాలను, తక్కెళ్ల బాలరాజు 'నవతరానికి నాంది, చైతన్యపథంలో, మరో పొద్దు పొడుపు' నాటకాలను డాక్టర్ పెద్ది వెంకటయ్య 'చైతన్యరథం, అంబేద్కర్ మళ్ళీ పుట్టాడు, మేలుకొలుపు, చెమట బిందువులు, నేను సైతం' వంటి నాటకాలను రచించారు. ఎ.వి.నరసింహరావు 'అభయపదం, మలయ సమీరం, నీలిరాగం, జీవనసమరం' నాటకాలను, వల్స పైడి 'ఆచార్య దేవోభవ' వంటి నాటకాలను రచించాడు. జాజాల వెంకటశేషయ్య "వసంతవన విహారం" అనే నాటక రచన చేశాడు. గద్వాలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభాకరవర్ధన్ " ప్లాను సాగింది, విద్వత్ గద్వాల, భూదాన్, ప్రమీలార్జునీయం " అనే నాటికలను రచించాడు. ప్రసిద్ధ పరిశోధకులు డాక్టర్ కపిలవాయి లింగమూర్తి 'రాజరథం' అనే భువన విజయ నాటకంను, ఇతర సాంఘిక నాటకాలను రచించాడు. ప్రసిద్ధ రచయిత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అనేక నాటికలు రాశాడు. "వికృత శిశువు, ఆపరేషన్ వంకాయ, పూలమ్మిన చోట – ప్లాట్లు అమ్మబడును, జంతువు " వంటి నాటికలను రచించాడు. అలంపురంకు చెందిన డా.వి.వీరాచారి అనేక నాటకాలు రచించాడు. "వర్ణమాల" నాటిక సంపుటిని వెలువరించాడు. ఇందులో 15 నాటికలు, 3 ఏకపాత్రాభినయాలు ఉన్నాయి. హాస్య, చారిత్రక, రేడియో, స్త్రీపాత్ర లేని నాటికలు ఇందులో కనిపిస్తాయి. టి.వి.రంగయ్య "అందరూ అందరే, డాక్టర్ తికమక, మాకు స్వతంత్ర్యం కావాలి, అక్షరజ్ఞానం, ఔన్నత్యం, గురువును కొట్టిన శిష్యుడు, అక్షరమే ఆయుధం, చదువు విలువ " వంటి నాటకాలను రచించాడు. విశ్రాంత ఆంగ్ల ఉపాన్యాసకుడు రాజేంద్రబాబు 'నడుం బిగించుదాం' అనే నాటికను రచించాడు. ఖమ్మం జిల్లాకు చెందిన దెంచనాల శ్రీనివాస్ 'దొంగ సత్తయ్య' అనే నాటకాన్ని, "ఆదిశక్తి, మా ఊళ్లో మా రాజ్యం, ఒక్క నువ్వు నాకు కోటి నేనులు నీకు" వంటి నాటికలను రచించాడు. కల్వకుర్తికి చెందిన బాల సాహిత్య రచయిత గుర్రాల లక్ష్మారెడ్డి "ముల్కీరి, యమలోకం" అనే నాటికలను రచించాడు.

షాద్ నగర్ తాలూకా వెలికట్టె గ్రామానికి చెందిన వంగీపురం నరసింహచార్యులు 'అభినవ శశిరేఖ' అనే నాటకాన్ని రచించాడు. పాలమూరు జిల్లాకు చెందిన ప్రసిద్ధ కళాకారుడు, నటుడు అయిన దుప్పల్లి శ్రీరాములు పలు భక్తి, చారిత్రక, సాంఘిక, ఏకపాత్రాభినయాలతో 'బాల నాటికలు' అనే పుస్తకాన్ని రచించాడు. గుహునిభక్తి, దానవీరం, కుంతీకర్ణ సంవాదం, అహంకారం, క్రమశిక్షణ, మాతృదేవోభవ, జ్ఞానోదయం, విజయరహస్యం వంటి నాటికలను రచించాడు. స్వామి వివేకానంద, ఝాన్సీ లక్ష్మీబాయి, వీరపాండ్య కట్టబ్రహ్మన, చంద్రశేఖర ఆజాద్, జిజియాబాయి, కైక, భీముడు

వంటి ఏకపాత్రాభినయాలను రచించాడు. పాలమూరు పట్టణానికి చెందిన ప్రముఖ కవి కమలేకర్ డాగోజీరావు 'దేశంకోసం, చెప్పినట్టు చేస్తారా' వంటి బాల నాటికలను రచించాడు. బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన గంగారం నరసింహ్మాచార్యులు 'సప్తాహ మహాత్మ్యం' అనే నాటకాన్ని రచించాడు. షాద్ నగర్ కు చెందిన డాక్టర్ టి.వి.భాస్కరాచార్య దూరదర్శన్ కోసం 15 దాకా బాల నాటికలను రచించాడు. అలాగే రేడియో నాటకాలను కూడా రచించాడు. విశ్రాంత తెలుగు పండితుడైన మఠం అల్లమప్రభు 'విద్యార్థి జీవితం, చీకటిపల్లె, జన్మభూమి' వంటి నాటికలను రచించాడు. జిల్లాలో ప్రసిద్ధకవిగా పేర్గాంచిన వల్లభాపురం జనార్ధన మొట్టమొదటిసారిగా "విజయక్రాంతి" అనే సంగీతరూపకాన్ని రచించాడు. ఇది గేయ రూపకం. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చెందిన కడదాసు వెంకటయ్య 'భక్త శిరియాల చరిత్ర, దత్తాత్రేయ చరిత్ర, భక్త మార్కండేయ చరిత్ర, శ్రీ అయ్యప్ప విజయం' వంటి నాటకాలను రచించాడు. ఇటిక్యాల మండలం వేముల గ్రామానికి చెందిన వేముల కృష్ణమూర్తి 'శమంతకమణి, వయోజన విద్య' అనే నాటకాలను రచించాడు. శమంతకమణి ప్రాచీన నాటకం. శ్రీకృష్ణుడి చుట్టూ అల్లిన నాటకం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ అధ్యక్షుడిగా పనిచేసిన ఆచార్య మసన చెన్నప్ప బహుముఖ ప్రజ్ఞాశాలి 'వీర సావర్కర్' అనే పేరుతో ఒక దృశ్యనాటికను రచించాడు. దేవరకద్ర మండలం డోకూరులో జన్మించిన వరకవుల నరహరిరాజు 'భువన విజయం, శ్రీశ్రీ విరాట్ వీరబ్రహ్మంగారి పద్యనాటకం, కలినిగ్రహం, వివేకానంద, శివపార్వతుల కళ్యాణం, అభినవ పడక దృశ్యం' వంటి నాటకాలను రచించాడు. బల్మూరు మండలానికి చెందిన తిరుమల కృష్ణదేశికాచార్యులు ప్రముఖ పద్య, నాటక కవి. అనేక రచనలు చేశాడు. పిల్లలమర్రి పినవీరభద్రుడు రచించిన నాటకం 'వాణి నారాణి', రెండవది 'బిల్హణీయం' లను పద్యనాటకాలుగా రచించాడు. గద్వాలకు చెందిన తిరుమల వెంకటస్వామి 'ఈ భక్తులు మాకొద్దు' అనే పేరుతో నాటకాన్ని రచించాడు. దురాశతో దేవుళ్ళను వాడుకునే దొంగ భక్తుల నేపథ్యంలో దేవతలే ఈ భక్తులు మాకొద్దు అనే నాటకాన్ని రాశాడు. కోస్గికి చెందిన ఆర్.ఎం. ప్రభులింగశాస్త్రి "బెజ్జమహాదేవి" అనే నాటకాన్ని రచించాడు. ఖిల్లాగణపురం మండలం మామిడిమాడకు చెందిన ఛందోజీరావు 'అభినవ సావిత్రి' పేరుతో ఒక చిన్న హాస్య నాటికను రచించాడు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాలెల అంజిలయ్య గౌడ్ 'బలి, తాగితే వొట్టు, పాఠశాలోపాఖ్యానం' తదితర నాటకాలను రచించాడు. ఉపాధ్యాయ ఉద్యమకర్తగా పేర్గాంచిన జి.అంపయ్య "తుఫాను గాలి, నారూ పోయా పోతావుంటే " వంటి నాటికలను రచించాడు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన పల్లెర్ల రామ్మోహన్ రావు "గద్వాల వైభవం, శ్రీవినాయక వైభవం" అనే సాహిత్య రూపకాలను రచించాడు. మద్దూర్ మండలం చింతలదిన్నె గ్రామానికి చెందిన పోతుల హన్మంత్ రెడ్డి 'భీమార్జున విజయాలు, భక్త తుకారం, భక్త మార్కండేయ' వంటి నాటకాలను రచించాడు. పాలమూరు పట్టణానికి చెందిన యువకవి డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ "స్వాతంత్ర్య దినోత్సవం" అనే నాటికను రచించాడు. స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యత గూర్చి నేటి తరానికి చెప్పాలనే ఉద్దేశ్యంతో దీనిని రచించాడు. పెబ్బేరుకు చెందిన ఎడవల్లి నాగరాజు "కాకి-కోకిల" అనే చిన్న నాటికను రచించాడు. ప్రముఖ కవి, ఆధ్యాత్మిక వక్త అయిన డాక్టర్ పి. భాస్కరయోగి 'స్వామి వివేకానంద' అనే ఏకపాత్రాభినయం అనే పుస్తకాన్ని రచించాడు. తాండూరు కు చెందిన రచయిత రుద్రారం శ్రీనివాస్ రెడ్డి 'కుచేల సంసారం, అపూర్వసంపద, భారతనారి, క్రమశిక్షణ' వంటి నాటికలను రచించాడు. అచ్చంపేటకు చెందిన ప్రసిద్ధ వైద్యుడు డాక్టర్ బి. బాలనారాయణ ' ఔట్ పేషెంట్ ' అనే నాటికను రచించాడు. గద్వాలకు చెందిన ప్రముఖ కవి తిరుమల వెంకటస్వామి '' వినాయక చవితి " అనే హాస్యనాటికను రచించాడు.

ఇంకా ఎందరెందరో తెలంగాణ నాటకరంగానికి ఊపిరిపోశారు. శక్తివంతమైన మాధ్యమంగా ప్రజల్లోకి చొచ్చుకెళ్ళ గల ఏకైక సాహిత్య ప్రక్రియ నాటకం. ఒకప్పటి రాజసాన్ని పొందిన నాటకానికి ఊపిరిపోయడానికి ప్రభుత్వం, సంస్థలు, కంకణం కట్టుకున్నప్పుడే అది సజీవమై నిలుస్తుంది. 'నాటకాంతం హి సాహిత్యం' అన్న ఆర్యోక్తికి దర్పణంగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. డా॥ నారాయణరెడ్డి సి. ప్ర.సం. (2018), తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్.
2. గౌరీశంకర్ జులూరి ప్ర.సం. (2022), తెలంగాణ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.
3. ఆచార్య శ్రీహరి రవ్వా ప్ర.సం. (2016), తెలుగు అకాడమీ, హైదరాబాద్.
4. డా॥ శ్రీకాంత్ భీంపల్లి (2011), మహబూబ్‌నగర్ జిల్లా తెలుగు సాహిత్య వికాసం.

# త్రికాలాల్లో తెలుగు నాటకం

**డా. వి.వి. సుబ్బారావు**
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
ఖైరతాబాద్
సెల్: 9492030012

నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనం

**Abstract**

"నాటకాంతంహి సాహిత్యం" అని ఆర్యోక్తి సంస్కృత సాహిత్యంలో నాటకాలు సమాంతరంగా కావ్యాలతోపాటు శ్రవ్య దృశ్య కావ్యాలుగా వెలుగొందాయి.

తెలుగు లిఖిత సాహిత్యం పుట్టే నాటి నుండి నాటకాలకి సాహిత్య గౌరవం ఏర్పటానికి చాలా శతాబ్దాలే పట్టింది. తెలుగు జానపద కళల్లోని వివిధ వీధి నాటకాలు తొలి ప్రదర్శన కావ్యాలు, ప్రక్రియలు అవి మరిన్ని హంగులు కూర్చుకున్నాక యక్షగానాలు. యక్షగానాల రూపాంతరీకరణే పద్యనాటికాలు (పౌరాణిక నాటకాలు), సాంఘిక నాటకాలు (పాటలు పద్యాలు లేనివి) నాటక వికాస దశ్లలో ఎక్కువగా కనిపిస్తాయి. వాటి మీద ఆంగ్ల నాటక ఆధునిక పోకడలు ఎక్కువగా మనం గ్రహించవచ్చు.

నాటకాలే రూపాంతరం చెంది తొలి మూకీలయ్యాయి. అవే నాటకాలు తొలి టాకీలు అయ్యాయి. యక్షగానాల్లోని పద్యాలు పౌరాణిక చలనచిత్రాలకు బదలి అయ్యాయి. సాంఘిక చలన చిత్రాలకు పద్యాలు తప్ప, డాన్సులు, పాటలు ,పౌరాణిక చిత్రాలకు యక్షగానాల వలె సమానంగా వచ్చి చేరాయి.

తొలి తెలుగునాటకం వికాసం చెందుతూ పౌరాణిక చారిత్రిక సాంఘిక నాటకాలు అభినయిస్తున్న తరుణంలోనే తెలుగు సామాజిక యవనికపై వెండి తెర తళుక్కుమన్నది. నాటకం ప్రజారంజకంగా వున్న దశ ఎగసిపడ్డ కెరటం పడిపోయిన విధముగా మారింది. నాటకం కన్నా ప్రదర్శనలో వున్న సౌలభ్యలు సాంకేతికత చలనచిత్రాలను మరింత గొప్పవినోద మాధ్యమంగా చేశాయి.

నాటకాలు స్వయంప్రతిపత్తితో ఆర్థికంగా తెలుగులో ఏదశలో ఎదగకపోవడం, నాటకాన్ని ఆశ్రయించి జీవించే కళాకారులు, సంస్థలు నిలదొక్కుకుని ఈ ప్రజాక్షేత్రంలో తమ ఉనికిన కాపాడుకునే అవకాశం చిక్కలేదు. ఈ తరుణంలో నాటకం గతం, వర్తమానం ఏమిటి అనేది స్థూలంగా చెపుతూ, నాటకానికి భవిష్యత్తు ఏమిటి? ప్రపంచ సాహిత్య జగత్తులోనే బలహీన పడుతున్న ప్రాచీన సాహిత్య ప్రక్రియల వలె నాటకం కుడా కనుమరుగు కానున్నదా అనే విషయాలను తర్కించే ప్రయత్నం చేస్తున్నది ఈ వ్యాసం.

Until reading Habits prevail among masses, one must look only the stage to exert such healty influence – గురజాడ, కన్యాశుల్కం,ముందుమాట.

'కావ్యేషు నాటకం రమ్యమ్'. దృశ్య శ్రవ్యకావ్యాల్లో ఉత్తమోత్త మైనది నాటకం. పండిత పామర జన రంజకం నాటకం. పఠనకళ వికసించేంతవరకు దృశ్యశ్రవ్య కావ్యం అయిన నాటకమే పరమావధి అన్న గురజాడ మాటలు నాటకం యొక్క వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి. సంస్కృత సాహిత్యంలో వికసించిన నాటకం గ్రీకు రోమను నాటక సంప్రదాయాలతో, తొలి రోజుల్లో ఆదాన ప్రదాన ప్రభావాన్ని కలిగి వుంది. తెలుగులో కావ్య గౌరవాన్ని తొలినాళ్ళలో పొందకపోయినా, మౌఖిక సంప్రదాయంలో వీధి నాటకాలు, భాగవతాలు చాలా ప్రదర్శించబడుతూనే వున్నాయి నన్నయ,

సోమనాదులు ఈ జానపదకళల ప్రదర్శనా విషయ ప్రస్తావనలు చేసారు. ఈ జానపద వీధి భాగవతాలు యక్షగానాలుగా కావ్య గౌరవాన్ని ప్రబంధానంతర యుగం లో సాధించాయి.

**ప్రాఙ్నాటక యుగం :**

"నటులది దొరసముద్రము
విటులది యోర్గల్లు, కవిది వినుకొండ మహా
పుట భేదన మీత్రితయము
నిటు 'గూర్చెను బ్రహ్మరసికులెల్ల మెచ్చన్ ".

(క్రీడాభిరామం)

మౌఖిక సంప్రదాయపరంపరలో నాటకాలు తెలుగు భాష ఆవిర్భావం నుండి 1860 వరకు బహువిధాలుగ ప్రదర్శించబడుతున్నాయి. భామాకలాపం, గొల్ల కలాపం, వీధి భాగవతాలు, బహురూపం, ఛాయా నాటకం, యక్షగానలు మొదలైన పేర్కొనలేని పెక్కుదేశి నాటక రూపాలుకనిపిస్తాయి. ఇవి సంస్కృత రూపక లక్షణముగ రచించబడినవి కావు . మహారాష్ట్ర యక్షగానాలలో సూత్రధారి, పారిపార్శ్వకులతో పాటు అంక విభాగం వుండి సంస్కృత నాటక లక్షణాలు కలిగి వుంటాయి. కన్నడ, తెలుగు యక్ష గానాలు దేశి నాటకములు, ప్రగాఢ ప్రభావంతో 'చతుర్విధ అభినయాలు' కలిగి, హాస్యరసం వుండి ప్రజాప్రియత్వాన్ని చూరగొన్నవి. ఇవి దరువులు, ఏలలు, పదములు మున్నగు దేశిరచనతో కూడిన నాటక బేధములు.

బొడ్డుచర్ల తిమ్మకవి 'రాఘవ నాట్య ప్రబంధం' అనే కావ్యాన్ని రచించాడు. ఇది శ్రవ్య కావ్యమే అయినా దృశ్యకావ్య ప్రయోగాల లక్షణాలు కనిపిస్తాయి. తిమ్మకవి ప్రవేశ పెట్టిన ఈ సరికొత్త పద్ధతి ప్రాచుర్యం సంపాదించుకొలేదు.

తెలంగాణములో 1940ల ప్రాంతాలలో దాదాపు 10,000 ప్రదర్శనలకు ఎదిగిన పక్రియ తందాన భాగవతం. ఇది వీధి నాటకంను పోలి వుంటుంది. దీని రూప కర్త శ్రీ విధుమౌళి శాస్త్రి వేషధారులు మౌనంగా (వీఅఎవ) నటిస్తూవుంటారు. తెరవెనుక ప్లేబ్యాక్ వలె శాస్త్రి గారు కథాగానం చేసేవారు. ప్రతి పర్యాయం రెండు మూడు పాత్రల కన్నా ఎక్కువ పాత్రలు రంగం పైకి రావు. గానం చేస్తున్న కథకు అనుగుణంగా నటన వుంటుంది. కోస్తాంధ్ర, రాయల సీమలను పోలిస్తే నిజామాంధ్ర ప్రాంతం లో 20వ శతాబ్దం తొలి దశకాలవరకు ఇటువంటి దేశీయ నాటక నిర్మాణ నిర్వహణలను ఉంటూనే వుండేవి.

**ఆధునిక నాటకారంభం**

ఇన్ని ఏళ్ళ చరిత్ర వున్న నాటక సాహిత్య సంపద వున్నా మన నాటక కళ మరుగున పడిపోయింది. చివరికి ఆంగ్లేయుల పాలనా కాలంలో ఆధునిక పోకడలు ప్రారంభం అయ్యే దశలో తిరిగి నాటకాలు సాహిత్య రంగం పైకి ప్రవేశించాయి.

20 వ శతాబ్దం తొలి మూడు దశాబ్దాలలో మంచి వికాసాన్ని పొందాయి . వేల సంఖ్యలో నాటకాలు వచ్చాయి. పౌరాణిక, చారిత్రిక, సాంఘిక ఇతివృత్తాలతో నాటకాలు సమకాలీన సమస్యలను, స్వాతంత్ర్య ఉద్యమాన్నినూ, వాచ్యంగానో, సూచ్యంగానో స్పృశించినవి . మూడుదశకాలు కడచిన నాటికి, నాటకానికి సమాంతరంగా 'మూకీ' చలనచిత్రాలు రంగ ప్రవేశం చేశాయి, అని మరో దశకంలోనే 'టాకీ 'చిత్రాలుగా స్థిరబడ్డాయి. భారత స్వాతంత్ర్యోద్యమ వేళకి చలనచిత్రాల ప్రభావం ఉచ్ఛదశలో వుంటే, నాటకాల ప్రాభవం అధోగమనం చెందకపోయినా ఆరోహణ దిశగా పయనించేస్థితిని కొల్పోయాయి.

1947-87 మధ్య కాలంలో నాటక రచనలో, ప్రయోగంలో కొత్త మలపులు వచ్చాయి . అయిదారు గంటల పాటు ప్రయోగించే నాటకం గంట లేదా అరగంటకు సమయాన్ని కుదించుకోవలసి వచ్చింది. ఈచిన్ననాటకాలనే నాటికలంటూ పిలువసాగారు. చలన చిత్రాల నిడివి, వాటికి ప్రదర్శనా పరంగా నాటకాల కన్నా అధికమైన విస్తృతులు

వుండడం వలన, అనేక పరిమితుల కల నాటక వ్యవస్థ ఆర్థికంగా పరిపుష్టిని పొందలేక పోయాయనేది కఠోర సత్యం .

1935 నాటికి 'శ్రవ్య నాటిక ' అనే కొత్త ప్రక్రియ పుట్టుకొచ్చింది. ఒక్క వాచికాభినయం'తోనే మిగిలిన అభినయాల స్ఫూర్తిని కలిగించ వలసిన పక్రియ ఇది. రేడియోలో '6'శతాబ్దాల పాటు నాటిక, నాటకం పేరిటి విశేషంగా ఆదరణ పొందింది. టి.వి మాధ్యమం ప్రసిద్ధిలోకి వచ్చిన కొత్తలలో నాటికలు దృశ్యశ్రవ్యంగా ఈ మధ్యమాలలో కనిపించినా, 'డైలీ సీరియల్స్' పోటి పెరిగి వెనుకబడ్డాయి. 1995-2023 మధ్యలో రేడియోలో వచ్చే నాటకాలను, నాటికలను ప్రసారం చేసే పద్ధతి వున్నా, 2023 మధ్య నుండి స్వస్తి చెప్పేసిన వైనం మనం గమనించవచ్చు. దూరదర్శన్ వంటి ప్రభుత్వ మాధ్యమాలలో సైతం నాటకం కోసం ప్రత్యేక 'హశ్రీశీ' లను కేటాయించే దశ సమాప్తం అయ్యింది. గత వైభవ దీప్తులను, ఆనాటి కమ్మని తావిని ఆస్వాదించేవారికి`శీబ్‌బఎవ, ఋుఎవఎశీశీఎ, వంటి మాధ్యమాలలో బజూశ్రీశీఖుఎ చేయబడి ఇవి లభిస్తూ వున్నాయి.

1987 తర్వాతి కాలంలో వినోద మాధ్యమాల్లో దృశ్యమాధ్యమాలు రావటం, తదనంతరం కేబుల్ విప్లవం, 2010 దశకం తర్వాత ంఎఖఱ్‌ జూష్ట్రశీఅవ లయుగంలో నాటకాలు కొన్ని రీల్స్, షార్ట్ ఫిలిమ్స్ లుగా రూపాంతరీకరణ చెందాయనేది సత్యం.

తెలుగులో నేడు వ్యాప్తిలో వున్న నాటకాలు సంస్కృతాంగ్ల నాటకాలను అనుసరించేవున్నాయి. కాని యక్ష గానాలనుండి పరిణమించ లేదు అని నిశ్చిత అభిప్రాయం కల విమర్శకులున్నారు. ఆంగ్ల నాటకాల ప్రభావం చారిత్రిక, సాంఘిక నాటకాలపై ఎక్కువ గా వుంది. పౌరాణిక నాటకాలపై అది ఇసుమంతే! సంస్కృత నాటక లక్షణాలను పాటించిన ఆధునిక నాటక కర్తలు వున్నా, నేటి అవసరాల మేరకు స్వీకరించారే తప్ప తూ॥చ॥ తప్పక సంస్కృత లాక్షణికుల నిర్ధేశాన్ని పాటించలేదు.

పద్య నాటకాలుగా వున్న పౌరాణిక, చారిత్రక నాటకాలలో నటుల ఆహార్యం, వేదిక అలంకరణ, హంగులు ఆర్భాటాలు యక్షగాన సంప్రదాయం నుండి పరిణమించినవి కావా? సాంఘిక నాటకాలలో పద్యాలు, పాటలు లేకున్న చలనచిత్రాలలో కనిపించే సంగీతం, నృత్యం ఏనాటివి? అవి యక్షగానం వంటి దేశినాటకల సంప్రదాయానుసరణ కాదా? ఆంగ్లంలో నూటికి 99 శాతం చలనచిత్రాలలో నృత్యం, సంగీతం కనిపిస్తాయా? వీటికి మన సమాధానాలే నేటి మన చలనచిత్రాలు నాటకాలు మన దేశి 'బయలాటల ' పరిణామక్రమంలోనివే అని నిర్ధారించవచ్చు.

**యక్షగానాలు రూపాంతరీకరణ**

యక్షగానాలు

సంప్రదాయ నాటకాలు
(పౌరాణిక/చారిత్రికనాటకాలు)

పౌరాణిక/చారిత్రక చలనచిత్రాలు

సాంఘిక చలన చిత్రం
(పాటలు, నృత్యాలతో అలరించేవి)

తొలినాళ్లలో(1860 - 1910) చాలా నాటక సంస్థలను స్థాపించిన విద్యాధికులు ఆంగ్ల సంస్కృత నాటకాల అనువాదాలు చేసారు. ఆతర్వాతి కాలంలో నాటక వికాసం స్వరాజ్య ఉద్యమం చెట్టపట్టాల్ వేసుకుని సాగాయి. స్వాతంత్ర్యోదమ కాలంలో పౌరాణిక నాటకాలలో స్వరాజ్య స్ఫూర్తిని విభిన్న పాత్రల ద్వారా ధ్వనింపచేసేవారు. చారిత్రిక

నాటకాలలో ఆత్మాభిమాన ధోరణి కల్పించి దేశ ఔనత్యాన్ని, కీర్తిని ఉగ్గడింప చేసుకున్నారు. వీరుల గాథలను రంగస్థలంపై ఆడేవారు. ప్రత్యక్ష చిత్రణ ద్వారా కుడా చాలా నాటకాలు ఈ యుగంలో అవతరించాయి. దామరాజు పుండరీకాక్షయ్య అనేక నాటకాల ద్వారా స్వరాజ్య ఉద్యమ చిత్రణ నాటకాల్లో చేసాడు. ఉదాహరణకు 'స్వరాజ్య సోపానం", "గాంధీ విజయం", "నవయుగారంభం" వంటివి. జలియన్‌వాలాబాగ్ దురంతం (1919) తర్వాత పుండరీకాక్షుడు రాసిన నాటకం 'పాంచాలీ పరాభవం'. గాంధీజిని శ్రీకృష్ణుని అవతారంగా చిత్రించాడు రచయిత. ఈ నాటకంలోనిదే ఈ సుప్రసిద్ధ గేయం

**"శ్రీ గాంధీ నామము మరువాం మరువాం**
**కూడి భారత మాత గొలుతాం గొలుతాం.."**

ఇది గ్రామాల్లో ప్రజలు పాడుకునే భజన పాటగా రాసారు. నాటకంలో రచయిత. శ్రీ పాద కృష్ణ మూర్తి శాస్త్రి రాసిన పెద్ద నాటకం 'తిలక్ మహారాజ నాటకం' (1921). పరిషత్తు నాటకాలు. స్వరాజ్య ఉదయానంతరం నాటకాలను బతికిస్తూ అనేక సాంఘిక సమస్యలపై సునిశిత విమర్శ, అధిక్షేపాలతో నాటకాలను ప్రదర్శించారు. వాస్తవిక నాటకం తీముఖ్రీర్ఆఅ జూశ్రీఖఎం అనే వర్గీకరణతో చూస్తే ప్రజా నాట్యమండలి (స్థాపన 1943) సామాజిక సమస్యలని ఇతివృత్తాలుగా చేసుకుని వర్గ పోరాటం, ఆర్థిక అసమానతలు, భుస్వాములు. రైతుకూలీల సంఘర్షణ వంటి అంశాలతో నాటకాలను ప్రదర్శించింది. ఆంధ్ర నాటక కళాపరిషత్, ఆంధ్రపదేశ్ ప్రయోగత్మక నాటక సంస్థ మొదలైనవి అనేక గొప్ప నాటకాలకి పురుడుపోశాయి.

ఇంత గొప్ప గతం కల నాటకం వర్తమానంలో బక్క చిక్కిన వేసవి ఏరులా తన ఉనికిని సాగిస్తోంది. 'భూమిక', 'సమాహార, 'నిశుంభిత వంటి నాటక సంస్థలు సామాజిక నాటకాలను నూతన ప్రయోగశీలతతో ముందుకు తీసుకు వెళుతున్నాయి.

కన్నడ, మరాఠ, తమిళ నాటకాలకి ఆర్థికప్రయోజనాలు ఎక్కువ. ప్రభుత్వం నుండి నిధులు అందుతాయి. అన్నిటి కన్నా ముఖ్యంగా టికెట్టు కొని నాటకాన్ని ఆదరించే ప్రేక్షకులున్నారు. తెలుగు నాటకం విషయంలో ప్రభుత్వ నిధులు అరకొర, ప్రజల స్పందన హళ్ళికి హళ్ళి.

31,డిసెంబర్,1980 నాడు మొదటన ఇండియా టుడే, సంచికలో "Future prospects for Telugu Drama are bleak " అనే శీర్షికతో ఒక కథనం వెలువడింది. ధార్వాడ నాటక సమాజం తెలుగునాట నాటకాలను ప్రారంభించి, వందేళ్ళ తెలుగు నాటక ప్రస్థానం జరిగిన (1980) సమయంలో ఈ కథనం కఠోర సత్యాల్ని వెల్లడించింది. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షుడు కె.వి. గోపాలస్వామి తెలుగు నాట నాటకాల స్థితి 'సుప్త చేతనావస్థ'లో వుందని, భవిష్యత్తుపై ఆశలు సన్నగిల్లుతున్నాయని అనడం శోచనీయం.

హైదరాబాద్ నగరంలో విద్యలో ఒక ఐచ్ఛికాంశంగా నాటక విద్యా బోధన' వున్న సంస్థలో పనిచేసే నాటక కళా బోధకుడు డా॥ చంద్రశేఖర్ మరోతరం విద్యార్థులను రంగస్థలానికి అందించే ప్రయత్నం చేస్తునే వున్నా "May be this culture of drama will die out one day " అనడం రానున్న భవిష్యత్తును చెప్పకనే చెప్పుతున్నాయి.

మరి ఈ నాటకాలని (ఆరోగ్యవంతమైన వినోద వైజ్ఞానిక సాధనం) మనం పరిరక్షించుకునేందుకు ఎలాంటి కృషి చెయ్యాలి? అని ప్రశ్నించుకుంటే వివిధ వ్యక్తుల నుండి సేకరించిన సమాచారం ప్రకారం

1. నాటక ప్రదర్శన కళా, పాఠ్య ప్రణాళికలను ప్రతికళాశాలలో ప్రారంభించాలి.
2. నాటకం పై కార్యశాలలను అడపాదడపా విఖ్యాత నటకుల పర్యవేక్షణలో నిర్వహించాలి.
3. తెలుగు నాటక వికాసం కోసం ఒక ప్రాధికారిక సంస్థను ఏర్పాటు చేసి నిధులను కేటాయించి మౌలిక వసతుల కల్పన చేయాలి.
4. జాతీయ స్థాయిలో వివిధ భాషల నాటకోత్సవాలు ఏర్పాటుచేయ్యాలి .

5. ఒకప్పుడు 'నంది' అవార్డులు ఇచ్చినట్లు, ఇప్పటి ప్రభుత్వం 'గద్దర్' అవార్డులను ఇస్తానని చెప్పినట్లు అవి ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో 'నాటకాలు, కొంత మేర నిలదొక్కుకోవడానికి ఆస్కారం వుంటుంది.

6. ఔత్సాహికులు, విద్యాధికులు అయిన సామాజికులను ఆకట్టుకునే విధంగా నాటక ప్రయోగాలను చేయడం ద్వారా టిక్కెట్టు కొని నాటకం చూసే ప్రేక్షకులను పెంపొందించవచ్చు.

'తెలంగాణ యువ నాటకోత్సవం', 'ఆదిరంగమహోత్సము' వంటి నాటక ఉత్సవాల కొడిగడుతున్న దీపానికి మరికొంత చమురు అందించే ప్రయత్నాలే!

డిగ్రీకళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలైన "యువతరంగం" లో నాటకాల ఏకపాత్రాభినయనాలు వంటి వాటిని తప్పక ప్రోత్సహించడం వలన యువత వ్యక్తిత్వ వికాసంలో అవి సాధనాలు అవడమే కాకుండా నాటకరంగ భవిష్యత్తు ఆశావహం చేస్తుందనేది కొందరి అభిప్రాయం.

ప్రసిద్ధ నాటక, చలన చిత్ర నటుడు, ప్రయోక్త దర్శకుడు, కథకుడైన తనికెళ్ళ భరణి మాటలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. "రంగస్థలం మీద మ్యాజిక్ జరుగుతోందని ప్రేక్షకులు విశ్వసించినపుడు నాటకాలకు పునర్వైభవం మరలా వస్తుంది. ప్రపంచ ప్రసిద్ధ నాటకం "మౌస్ ట్రాప్ "65 ఏళ్ళగా ఇంకా నిరాటంకంగా కొనసాగుతూ వుండటం మనకు స్ఫూర్తి కావాలి, తెలుగు నాటకం ఆస్థాయికి చేరి టికెట్లు కొని ప్రజలు నాటకాలు చూసే రోజులు రావాలి"

**"నాటకాంతం హి కవిత్వమ్"**

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య శ్రీహరి రవ్వా (2016), తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, తెలుగు అకాడమీ హైదరాబాద్.
2. నాగయ్య జి.(2004), తెలుగు సాహిత్య సమీక్ష, ద్వితీయ సంపుటం, నవ్య ప్రచురణ, తిరుపతి.
4. Telugu Drama & Stage, Internet Archive, 2004.
5. Telugu Iconic plays, AIR Hydrabad, Youtube, channel 2021
6. India Today (Magzine), Dec 18, 2014
7. www.Agakhan academics.org
8. India net Zone (e-magazine)
9. The Hans India, 27 April, 2016.
10. With the hope of making Telugu Theatre a Sustainable career option, Neeraja Murthy, 19 June 2022.

ISSN 2457 - 0796 UGC CARE List Approved Journals
మూసీ మాస పత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-27: సంచిక - 7(2) హైదరాబాద్ మే - 2024

# శతాబ్ది బాలల నాటికలు - పరిశీలన

**డా. తండు కృష్ణయ్య**
అధ్యక్షులు, తెలుగుశాఖ
నాగార్జున ప్రభుత్వ కళాశాల(స్వ), నల్లగొండ
సెల్:9704731346

**నాటిక నేపథ్యం:** పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో వెలువడిన ఆధునిక సాహిత్య ప్రక్రియలలో నాటకం ఒకటి. క్రీ.శ.1860 ప్రాంతంలో తెలుగు నాటకం ఆవిర్భవించిన తర్వాత సుమారు 50 ఏళ్లకు నాటిక వెలువడింది. తొలి రోజుల్లో పౌరాణిక, చారిత్రక అంశాలతో కూడిన నాటికలు వచ్చినా కాలక్రమేణ సాంఘిక ఇతివృత్తాలతో సమకాలీన జీవితానికి అద్దం పట్టే నాటికలు వేల సంఖ్యలో వెలువడి ప్రజాదరణ పొందాయి. స్వరూపాన్ని బట్టి దృశ్య నాటిక, పద్యనాటిక, గేయనాటిక, నృత్యనాటిక, వీధి నాటిక, శ్రవ్యనాటిక మొదలగు రూపాలుగానాటికలు వెలువడ్డాయి. నాటిక విశిష్టతను గూర్చి ప్రముఖ చరిత్ర పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మ కరుణశ్రీ రాసిన 'కరుణామయి' నాటికకు ముందుమాట రాస్తూ ఇలా అన్నారు."జీవితానుభవంలోని ప్రతి స్వల్ప విషయమూ, జీవిత పథములోని ప్రతి సంఘటనమూ నాటికారచనమునకు అనువైన ఇతివృత్తమే. సంఘంలోని అనాచారములను, దురభ్యాసములను, దోషాలను ఎత్తిచూపి దానిని సంస్కరించడానికి చక్కని అభ్యుదయ మార్గం చూపి సంఘాన్ని సరిదిద్దడానికి గొప్ప లక్ష్యం ముందుంచి సంఘాన్ని తదనుగుణంగా నడిపించి ఉన్నతికి కొనిపోవడానికీ, లోక ప్రవృత్తిని చిత్రించి గుణావ గుణముల మంచి సెబ్బరలను నిరూపించి చూపడానికీ నాటిక అమిత ప్రయోజనకారి." బాలల నాటికల అవసరాన్ని గూర్చి ప్రస్తావిస్తూ డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు తెలుగు నాటక వికాసం అనుగ్రంథంలో ఈ విధంగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు."బాలల నాటికలు అనునప్పుడు రెండు విధములైన రచనలు లేదా ప్రదర్శనములు ఆవశ్యములగుచున్నవి. బాలల వినోదార్థము పెద్దవారు ప్రదర్శించుటకు తగిన నాటికలు మొదటి విధము. కేవలం బాలలు ప్రదర్శించుటకు తగిన నాటికలు రెండవ విధము. అసలు బాలల కొరకు ఉద్దిష్టమైన ప్రత్యేక సాహిత్యము తెలుగులో చాలా తక్కువ. అందున మొదటి విధమగు రచనలు లేనే లేవని చెప్పవచ్చును. ఇప్పుడిప్పుడే కొందరు రచయితలు ఆ లోపమును పూరించుటకు సమకట్టుచున్నారు".

తెలుగు నాటికా ప్రస్థానం విద్యార్థులను ఉద్దేశించి రాయబడిన నాటికలతోనే ప్రారంభమైందని చెప్పాలి. 1912లో శృంగారకవి సర్వారాయుడు 'సివిక్స్ డ్రామాలు' అన్న పేరిట తొలి నాటికల సంపుటిని వెలువరించాడు. ఈ సంపుటిలో విద్యార్థులు ప్రదర్శించడానికి వీలుగా చిన్న చిన్న నాటికలు మొత్తం 11 ఉన్నాయి. గ్రామ కచేరి, రెవెన్యూ,మెజిస్ట్రేట్, సివిలు, రిజిస్ట్రేషన్, పోస్ట్ ఆఫీస్, మున్సిపల్, ఎడ్యుకేషన్ మొదలైన సమకాలీన సాంఘిక సమస్యలు, రైతులకు సంబంధించిన సమస్యలు వీటిలో ఇతివృత్తాలు. అదేవిధంగా రెవెన్యూ డిపార్ట్మెంట్ అక్రమాలు, పోలీసు వ్యవస్థ దుర్మార్గాలు, న్యాయ వ్యవస్థలోని అన్యాయాలు,పన్నుల పేరిట మున్సిపాలిటీల దోపిడీ, లంచగొండితనం, మూఢాచారాలపై దాడి ఇలా పలు అంశాలు చోటుచేసుకున్నాయి. దీనిని బట్టి చూస్తే తెలుగులో స్వతంత్ర నాటికారచనకు పిల్లల నాటికలతో శ్రీకారం చుట్టబడటం మంచి విశేషంగానే చెప్పుకోవాలి. ప్రదర్శనా విషయంగా కూడా విద్యార్థులే తొలి ప్రదర్శకులుగా చరిత్ర సృష్టించారు. మొట్టమొదటి తెలుగు ఔత్సాహిక నాటక సమాజం వీరేశలింగం పంతులు వ్యవహార ధర్మబోధిని ప్రదర్శించినప్పుడు దానిలో పాల్గొన్న వారంతా విద్యార్థులే. ఆధునిక రచన విషయంలో, ప్రదర్శన విషయంలో ప్రముఖ పాత్ర పోషించినా, తదనంతర కాలంలో ఆ స్ఫూర్తిని అందుకొని పుంజుకోలేకపోయింది బాలల నాటక రంగం. అందుకు పెద్దల అలసత్వం, విద్యారంగం ప్రోత్సాహం ఇవ్వకపోవడం ప్రధాన కారణాలని చెప్పుకోవాలి. ఈ నాటకాల వలన

పిల్లలకు కలిగే ప్రయోజనం గురించి సరైన అవగాహన అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాల నిర్వాహకులకు లేకపోవడం విచారకరం. అసలు నాటకాలు అంటేనే ఒక రకంగా చిన్న చూపు ఉండేది.

బాల సాహిత్యంలో కథలు, గేయాలు వెలువడినంతగా నాటకాలు రాలేదు. బాలల కోసం నాటికలు రాసిన వారిలో ప్రముఖంగా పేర్కొనదగిన వారు శిష్టాచంద్రశేఖర్, తెన్నేటి సూరి, నార్ల చిరంజీవి, జనమంచి రామకృష్ణ, కరుణశ్రీ, న్యాయపతి రాఘవరావు, న్యాయపతి కామేశ్వరి, ఏడిద కామేశ్వరరావు,కావ్యశ్రీ, నండూరు సుబ్బారావు, అన్నపర్తి, జమ్మలమడక పూర్ణచంద్రరావు, ఇల్లిందల సరస్వతీ దేవి, దాశరథి, డాక్టర్ సి.నారాయణరెడ్డి మొదలగువారు. నాటికల సంకలనాల విషయానికొస్తే తెలంగాణ రచయితల సంఘం 1953లో డాక్టర్ సి.నారాయణరెడ్డి, దాశరథి, వట్టికోట ఆళ్వారు స్వామి, డాక్టర్ పి. యశోదారెడ్డిల నాటికలతో 'చిరుగజ్జెలు' పేరిట ఒక సంకలనం వెలువరించింది. 1979లో అంతర్జాతీయ బాలల సంవత్సరం సందర్భంగా ఎక్కువగా సంకలనాలు వెలువడడంగమనార్హం. బుక్ లవర్స్ యూనియన్, చిత్తూరు వారు ప్రముఖుల గేయ నాటికలు, నాటికలు, ఏకపాత్రాభినయాలతో 'పూలజల్లు' సంకలనం వెలువరించారు. ఇలా తెలుగు సాహిత్యంలో పలు సంకలనాలు రావడం జరిగింది. అదే కోవలో వల్లూరు శివప్రసాద్ సంపాదకులుగా గంగోత్రి సాయి ఉపసంపాదకులుగా గతశతాబ్ది కాలంలో  వెలువడిన నాటికలలో సుప్రసిద్ధ నాటికలను సేకరించి 'ప్రసిద్ధ బాలల నాటికలు' పేరుతో ఒక సంకలనాన్ని వెలువరించారు. ఈ సంకలనంలో మొత్తం 30 నాటికలు ఉన్నాయి. రచనా వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సాంఘిక నాటికలతో పాటు పౌరాణిక, చారిత్రక, గేయనాటికలు ఈ సంకలనంలో ఉన్నాయి. పిల్లలు కులమత బేధాలు, పేద, ధనిక తారతమ్యాలు ఉండకూడదని, మనుషులంతా ఒకటేనన్న సమభావంతో మెలగాలని, చదువు సంధ్యల పట్ల శ్రద్ధ, ఏకాగ్రత, పట్టుదల ఉండాలని, పరీక్షల్లో అడ్డదారులు తొక్కరాదని, చదువు భవిష్యత్ జీవితానికి పునాది వంటిదని ఇలా అనేక నైతిక విలువలకు సంబంధించిన విషయాలను ఈ నాటికల ద్వారా అందించడం జరిగింది.

**నాటికల ఇతివృత్తం – విశ్లేషణ:** తొలి నాటికల సంపుటియైన 'సివిక్స్ డ్రామాలు' రచయిత శృంగార కవి సర్వారాయుడు 1912లో రాసిన ఎడ్యుకేషను నాటిక అప్పటి విద్యా వ్యవస్థను, బోధనా విధానాన్ని తెలియజేస్తుంది. ఆనాటి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరిపై ఒకరు విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నలుగా సంధించడాన్ని మనం ఈ రచనలో గమనించగలం. ఆ రోజుల్లో విద్య పట్ల ఎవ్వరికీ అంతగా అవగాహన లేకపోవడం అన్నది ప్రధానంగా ఈ నాటిక ద్వారా తెలుస్తుంది.తెన్నేటి సూరి 1944లో రాసిన 'గొడ్డకాడ' నాటిక జమీందారు రౌడీలు గొడ్లను దౌర్జన్యంగా తోలుకెళ్తుంటే గొడ్లు కాసే పిల్లలు చేతులు కట్టుకొని కూర్చోకుండా ఉండేలు బద్దలతో బుర్రలు పగలగొడుతుంటే ప్రాణాలు అరచేత పట్టుకొని పారిపోతారు. జమీందారు పోలీసుల సహాయంతో వ్యవసాయ పనులు సాగకుండా అరెస్టులు, దౌర్జన్యాలు చేయిస్తాడు. తల్లుల్ని, తండ్రుల్ని తీసుకెళ్లినా భయపడని భారత వీర కుమారులు ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ సంఘటితంగా నిలబడుతారు. జమీందారీ వ్యతిరేక ఉద్యమం ఈ నాటికలో కనిపిస్తుంది. జాతీయోద్యమం ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో వామపక్ష భావజాల ప్రభావంతో తెన్నేటి సూరి రాసిన నాటిక ఇది. 1945లో శిష్టా ఉమామహేశ్వరరావు రాసిన నాటిక 'దసరాదళం'. కొంతమంది పిల్లలు దసరాదళంగా ఏర్పడి పంతులు గారితో కలిసి ఇంటింటికి వెళ్లి కానుకల్ని స్వీకరిస్తుంటారు. అయితే పిల్లలకు పప్పు బెల్లాలు, పంతులుకి కానుకలు ముడుతున్నాయి. ఒక బీద తండ్రి వట్టి తాంబూలం ఇచ్చినాడని కారాలు మిరియాలు నూరిన పంతులు గారి ఆగడాన్ని సహించలేని పిల్లలు అంతా ఏకమై ఆయనకు సరైన గుణపాఠం చెప్పిన కథ ఈ నాటికలోనిఇతివృత్తం. కొంతమంది పంతుళ్ళు తల్లిదండ్రులను ఎలా వేధిస్తుంటారో ఈ నాటిక ద్వారా మనకు తెలుస్తుంది.

1946లో డాక్టర్ కరుణశ్రీ రాసిన నాటిక కరుణామయి. కన్నతల్లి సుశీలను తల్లి లేని బిడ్డను చేసి కన్నుమూస్తుంది సవతి తల్లియైన కాళికాంబకు సవతి బిడ్డ మీద అంతులేని ఈర్ష్య ఉంటుంది. ఎప్పుడూ తిట్లు, శాపనార్థాలు తప్ప ప్రేమగా చేరదీసేది ఉండదు. తండ్రి గోపాలరావు మాత్రం ఏమి చేయలేని నిస్సహాయుడు. సవతి తమ్ముడు కిశోర్ కు

మాత్రం అక్కంటే పంచప్రాణాలు. సవతి తల్లి పెట్టే బాధలు భరించలేక ఇల్లు విడిచి వెళ్ళిపోతుంది సుశీల. అక్క మీదబెంగతో తమ్ముడు మంచం పడుతాడు. చివరకు తమ్ముని కాపాడి సవతి తల్లి మన్ననల్ని పొంది కరుణామయిగా నిలుస్తుంది సుశీల. స్వార్థం వేళ్ళూనుకొనిపోతున్న సమయంలో అనుబంధాల గొప్పతనాన్ని ఈ నాటిక తెలియజేస్తుంది.

న్యాయపతి రాఘవరావు 1950లో రాసిన నాటిక 'బూరెల మూకుడు'. భార్యాభర్తలు అర్థంలేని పంతాలు, పట్టుదలలు కలిగి ఉంటే ఎలాంటి అనర్థాలకు దారితీస్తుందో తెలియజేసే ఇతివృత్తం ఈ నాటికలోనిది. భార్యాభర్తల మధ్య ఉ ండాల్సింది సయోధ్య కానీ పంతాలు, పట్టుదలలు కావని ఈ నాటిక ద్వారా రచయిత చక్కని సందేశాన్ని అందించారు. పాకాల యశోదా రెడ్డి 1953లో రాసిన నాటిక

'బుచ్చయ్య పెబ్బ'. బడికి వస్తున్న కొత్త పంతులుకు తలా పావుశేరు బియ్యం, పావెడు నూనె, తనకో పైస తీసుకురావాలని లేకుంటే ఒక్కొక్కడి వీపులు పగలగొట్టిస్తానని అంటాడు స్కూలు పెబ్బబుచ్చయ్య. చదువుసారెడు, బలపాలు దోసెడంటూ తల్లులు తల్లడిల్లిపోతారు. చదువులో శ్రద్ధ, అందరిలో తెలివిగలవాడే పెబ్బ అంటూ వచ్చిన కొత్త పంతులు బుచ్చయ్య ఆటలు కట్టించేస్తాడు. పిల్లలంతా ఆనందంగా ఉంటారు.

దాశరథి కృష్ణమాచార్య 1953లో రాసిన గేయనాటిక 'వెన్నెల మడుగులు'.పిల్లలకు వెన్నెల్లో ఆడుకోవడం ఎంతో ఇష్టం. కాని కారు మబ్బులు కమ్మి ఉరుములతో, మెరుపులతో అంతా చీకటి వ్యాపించినప్పుడు ఆడుకునే పిల్లలకు కష్టాలు కమ్మినట్లే అనిపిస్తుంది. మబ్బుల చీకటిలో బంధీలయినట్టు తోస్తుంది. తిరిగి మబ్బులు తొలగి వెన్నెల వెలిసినప్పుడు పిల్లల ఆనందానికి అంతు ఉండదు. అటువంటి ఆనందాన్ని చందమామ పిల్లలకు ప్రసాదించినట్టుగా కవి అద్భుతంగా వర్ణిస్తాడు. పిల్లలను ఊహాలోకంలో విహరింపజేసే చక్కని గేయనాటిక ఇది. డాక్టర్ సి.నారాయణరెడ్డి 1953 లో రాసిన గేయ నాటిక 'సమతా ఫలం'. ఈ నాటికలో రాము, సోము,భీములతో పాటు తోటకూడా ఒక పాత్రగా ఉంటుంది. ఆ పాత్ర ద్వారా మనుషులంతా సమానమేనని కవి చెప్పిస్తాడు. తోట భూమాతకు సంకేతంగా చెప్పుకోవచ్చు. భూమాత ఫలాల పైన నాదే నాదే అధికారం అని భీము విర్రవీగుతాడు. కాని తోట చేసిన బోధతో పిల్లలంతా కలిసి భీముని చిక్కబట్టి సమతాఫల సాధనకై ఉద్యమిస్తారు.భీముకు గర్వభంగం అవుతుంది. పిల్లల్లో ఎలాంటి స్వార్థం ఉండకూడదనే సందేశాన్ని ఈ నాటిక ద్వారా రచయిత అందించారు.వట్టికోట ఆళ్వారుస్వామి 1953లో రాసిన నాటిక 'సావాసం'. తల్లిదండ్రుల ప్రభావం పిల్లల మీద తప్పకుండా ఉంటుందని వారి బుద్ధులు, అలవాట్లే పిల్లలకు వస్తుంటాయని ముఖ్యంగా మద్యపానం, పొగతాగడం లాంటివి పిల్లల కంటబడటం ఏమాత్రం మంచిది కాదని, దురలవాట్లు పిల్లలకైనా, పెద్దలకైనా హానికరమే అంటూ ఒక చక్కనిసందేశాన్ని అందించారు. నార్ల చిరంజీవి 1954లో రాసిన నాటిక 'వేణు చదువు సంధ్యలు'. ఎదిగే వయసు పిల్లలకు మంచి చదువు, క్రమశిక్షణ ముఖ్యం. రకరకాల వంకలు పెట్టి బడి ఎగ్గొట్టి ఏవేవో వ్యాపకాలతో చదువు నిర్లక్ష్యం చేస్తే వృద్ధిలోకి రారని, శ్రద్ధగా చదివి మంచి వ్యక్తిత్వం పెంపొందించుకున్నప్పుడే ఏ రంగంలోనైనా రాణించే అవకాశం ఉంటుందని ఈ నాటిక ద్వారా తెలియజేశారు.

1954లో అలపర్తి వెంకట సుబ్బారావు రాసిన నాటిక 'చివరకు మిగిలేది'. గోదానం, అన్నదానం, భూదానం ఇలా రకరకాల దానాలు చేసిన మహనీయులు ఎందరో ఉన్నారు.మనిషికి తాను చేసిన మంచి పని వల్ల కలిగే సంతృప్తి గొప్ప సంతోషాన్ని ఇస్తుంది. అందువల్ల వచ్చే కీర్తిమాత్రమేచివరికి మిగిలి ఉంటుంది తప్ప ఏ సంపద ఉండదనే సందేశం ఈ నాటిక ద్వారా అందుతుంది. అదేవిధంగా ఇల్లిందల సరస్వతీ దేవి రాసిన నాటిక 'బొమ్మల పెళ్లి'. ఈనాటికను 1961 లో రాశారు. మన సంస్కృతిని ప్రతిబింబించే చూడముచ్చటైన పిల్లల ఆట ఇది. బొమ్మల పెళ్లి ఆటలాడకుండా పెరిగి పెద్దవాళ్ళు అయ్యే పిల్లలు ఉండరు కదా! బాల్యంలో పిల్లలు బొమ్మల పెళ్లి ఏవిధంగా పెద్దల్ని అనుకరిస్తూ జరుపుకుంటారో తెలియజేసే నాటిక ఇది. పిల్లలకు మాత్రమే కాకుండా పెద్దలకు కూడా మంచి వినోదాన్ని అందిస్తుంది. చిత్రకవి ఆత్రేయ'మోహన్ గాంధీ' నాటికను 1968లో రాశారు. జాతిపిత బాపూజీ బాల్యంలో జరిగిన సంఘటనల ఆధారంగా రూపొందించిన నాటిక ఇది. చిన్నప్పటినుంచి మంచి గుణాలు గాంధీలో గూడు కట్టి ఉన్నాయి. పుస్తకాలే ఆయనకు

మిత్రులు. చదువే కర్తవ్యం. ఉపాధ్యాయుడు తనకు తెలియని దానిని పక్కవాని దాంట్లో చూచి రాయమంటే గాంధీ వ్యతిరేకిస్తాడు. పితృభక్తి నాటకం చూచి తల్లిదండ్రులను సేవించడం బిడ్డల విధి అని భావించాడు. పాకీ పని చేసే తోటి బాలల్ని ప్రేమించాడు. పసితనంలోనే అంటరానితనాన్ని వ్యతిరేకించాడు. ఇన్ని సుగుణాలు ఉన్న బాలుడే పెరిగి పెద్దవాడై జాతికి ఆరాధ్యుడయ్యాడని ఈనాటిక ద్వారా తెలియజేశారు. కోడూరి లీలావతి 1971లో రాసిన నాటిక 'అల్లరి బాజా'. చదువు పట్ల ఇష్టం లేని అల్లరి పిల్లలుపంతులును ఏ విధంగా ఇబ్బంది పెడతారో తెలియజేసే నాటిక ఇది.

'స్కూల్ డ్రెస్' నాటికను దొప్పలపూడి రాధాకృష్ణమూర్తి 1973లో రాశారు. పాఠశాలల్లో పేద, ధనిక భేదాలు, కులమత బేధాలు లేకుండా పిల్లలందరూ ఒకటే అన్న భావం కలగడానికి ఏకరూప దుస్తులు ఎంతో దోహదపడుతాయి. బాలల లేత మనసుల్లో భేదభావాలు, అసూయ ద్వేషాలు చెలరేగకుండా ఉండాలంటే ఒకే రకం స్కూల్ డ్రెస్ ఎంతో అవసరమని తెలియజేసే నాటిక ఇది. ఉన్నవ సేతు మాధవరావు రాసిన నాటిక 'సున్నారాయుళ్ల సంఘం'.దీనిని 1973లో రాశారు. క్లాసులో మంచి మార్కులు వచ్చినవారు తమను అవమానిస్తే తట్టుకోలేకపోయారు సున్నా మార్కులు వచ్చినవారు. అందుకే వారు సున్నారాయుళ్ల సంఘం ఏర్పాటు చేసి తాము గౌరవంగా బతకాలనే భావనతో ఉంటారు. అందుకోసం పరీక్షలనే లేకుండా చేయాలని భావిస్తారు. కాని చివరికి బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్న పోటీ తత్వాన్ని పెంపొందించుకుంటారు. 1974లో మద్దిపట్ల వెంకటరావు రాసిన నాటిక 'పగటి వేషాలు'. కూచిపూడి భాగవతులు పగటి వేషాలతోఒక ఊరిలో పలు కళారూపాలను ప్రదర్శించి శక్తి కొద్ది ఇమ్మని ఆ ఊరి వ్యాపారులని వేడుకుంటారు. కాని వారు రెండు నయా పైసలు ఇచ్చి చేతులు దులుపుకుంటారు. ఆ పగటి వేషగాళ్ళు పోలీసు వేషాలు వేసుకొని ఆ వ్యాపారులకు బుద్ధి చెప్పిన విధానమే ఈ నాటికలోని ఇతివృత్తం.

1978లో న్యాయపతి కామేశ్వరి రాసిన నాటిక 'ఇద్దరు లలితలు'. కొందరు పిల్లలు బయట బుద్ధిగా ఉంటారు. ఇంట్లో మాత్రం తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినరు. వారిపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తారు. ఇలాంటి భిన్న మనస్తత్వాలు కలిగిన పిల్లల గురించి తెలియజేసే నాటిక ఇది. ఇంటా బయటా అంతా ఒకే విధంగా ఉంటూ మంచి పిల్లలుగా రాణించాలనే సందేశం ఈ నాటిక ద్వారా అందించారు. 1979లో లవణం రాసిన నాటిక 'వెర్రి గారాబం'. ఉపాధ్యాయులు అనవసరంగా ఏ విద్యార్థినీ కొట్టరు. ముందు నయానా భయానా చెప్పి చూస్తారు. కొడతామని బెదిరిస్తారు. ఇక లాభం లేదని అనిపించినప్పుడే పిల్లల్ని దండిస్తారు. అయితే తమ పిల్లల పట్ల వెర్రిగారాబం కలిగిన తల్లిదండ్రులు మాత్రం పిల్లలు చెప్పేదంతా నమ్మి ఉపాధ్యాయుల్ని నిందిస్తారు. తమ పిల్లల్ని దండించకూడదని అంటారు. కాని ఆ పిల్లల భవిష్యత్తుకు ఆ గారాబం ఎంత ఆటంకం కలిగిస్తుందో వారికి తెలియదు. ఇలాంటి సంఘటనల్నినేడు చాలా విద్యాసంస్థల్లో మనం చూస్తున్నాం.తల్లిదండ్రులు పిల్లల పట్ల గారాబం కలిగి ఉండడంమంచిది కాదన్న సందేశం ఈ నాటిక ద్వారా మనకు అందుతుంది. కెవిఎల్ నరసింహారావు రాసిన నాటిక 'పుట్టినరోజు పండుగ'. ఒక మనిషి ఎలాంటి జీతభత్యాలు లేకుండా జీవితాంతం వెట్టిచాకిరి చేయవలసి రావడం ఎంతో అన్యాయం. పిల్లలచే అలాంటి వెట్టి చాకిరి చేయించడం మహా ద్రోహం. పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులను ఒక విలువైన వరాన్ని కోరుకొని తన పుట్టినరోజు పండుగను వట్టి కాలక్షేపం వేడుకగా కాక గొప్ప ప్రయోజనంగా రాజు అనే అబ్బాయి మారుస్తాడు. అతడు తన తండ్రిని తమ ఇంట్లో పనిచేసే సుబ్బన్నకు వెట్టిచాకిరి నుండి విముక్తి కలిగించుమని తన పుట్టినరోజున వేడుకొని పెద్ద మనసును చాటుకుంటాడు. పిల్లల్లో ఇలాంటి దయాగుణం ఉండాల్సిన అవసరం ఉందని ఈ నాటిక ద్వారా రచయిత చెప్పారు.

సుప్రసిద్ధ కథా రచయిత మధురాంతకం రాజారాం 1979లో రాసిన నాటిక 'వాల్మీకి పూర్వాశ్రమం'. వాల్మీకి పూర్వాశ్రమంలో కిరాతుడు. నారదుని వల్ల అతడు ఏ విధంగా మహర్షిగా మారాడో తెలియజేసే ఇతివృత్తం ఈ నాటికలోనిది. కలువకొలను సదానంద రాసిన నాటిక 'కోతి మంత్రం'. దీనిని 1979లో రాశారు. మనిషి అత్యాశకు పోతే ఎదురయ్యేది ఆశాభంగమేనని, ఎప్పటికీ అందని స్వర్గం కంటే ఇప్పుడు అందే ఉట్టి మేలని తెలియజేసే కథ ఈనాటికలోనిది. జె. పూర్ణచంద్రరావు రాసిన నాటిక 'పాలిష్ భయ్యా'. దీనిని 1979లో రాశారు. చిన్నచిన్న చేతివృత్తులు చేసుకుంటూ అర్థాకలితో

అలమటించే పాలిష్ భయ్యాలు ఈ దేశంలో ఎంతోమంది ఉన్నారని, వారి పట్ల కరుణ చూపించి చేయూతనిస్తే మట్టిలో మాణిక్యాల్లా వారు కూడా అన్ని రంగాల్లో రాణిస్తారని తెలియజేసే కథ ఇందులోనిది. 1979లో ఏడిద కామేశ్వరరావు రాసిన నాటిక 'గుశ్వం'.పరమానందయ్య గారి కథల్లోని ఒక కథ ఈనాటికకు ఆధారం. అమాయకులైన శిష్యులు గురువు చెప్పిన దానిని చెప్పకుండా మరో రకంగా చెప్పి తమ అమాయకత్వాన్ని వ్యక్తీకరించడంతో వారి చేష్టల వల్ల హాస్యంపుడుతుంది. పిల్లలకు మంచి వినోదాన్ని అందించే నాటిక ఇది. వల్లూరు శివప్రసాద్ 1980లో రాసిన నాటిక 'నిన్ను నువ్వు దిద్దుకో'. పునాది ఎంత బలంగా ఉంటే కట్టే భవనం కూడా అంతే బలంగా నిలబడుతుంది. అలానే పిల్లల బంగారు భవిష్యత్తుకు మంచి చదువు సంధ్యలే పునాది లాంటివి. అవే వారి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి అనే గొప్ప సందేశాన్ని అందించే నాటిక ఇది. డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు 1985లో రాసిన నాటిక 'పరీక్ష చదువులు'. ఒక క్రమమైన పద్ధతిలో చదువుకునే విద్యార్థులకు పరీక్షలు అంటే ఎలాంటి భయం ఉండదు. కాని కేవలం పరీక్షల సమయంలో మాత్రమే చదువు మొదలుపెట్టిన విద్యార్థులకు భయం ఉంటుంది. అలాంటి మొక్కుబడి చదువులు విద్యార్థులు చదువకూడదు అనే సందేశం ఈ నాటిక ద్వారా లభిస్తుంది.

కావ్యశ్రీ 1989లో రాసిన నాటిక 'బాల విజయము'. భాగవతంలోని ప్రహ్లాద చరిత్ర ఆధారంగా రాయబడిన నాటిక ఇది. హిరణ్యకశిపుడు తన కుమారుడైన ప్రహ్లాదుని విష్ణువు ఎక్కడ ఉన్నాడు చూపుమని ప్రశ్నించగా అంతటా ఉన్నాడని ప్రహ్లాదుడు సమాధానమిస్తాడు. ఈ స్తంభమున కలడాయని స్థంబమును పగలగొట్టగా అందుండి విష్ణువు నారసింహ రూపంలో వెలువడి హిరణ్యకశిపుని వధించి ప్రహ్లాదుని కాపాడడం ఇందులోని ఇతివృత్తం. నందూరు సుబ్బారావు 1992లో రాసిన నాటిక 'చిన్నారి మనసు'. పిల్లల మనస్తత్వం సున్నితమైనది. పెద్దలు అర్థం చేసుకొని సహనంతో, వివేకంతో పెంచాలి. పిల్లల్ని మంచిగా పెంచడం కూడా ఒక కళే. చీటికిమాటికి వారిని దండించడం మంచిది కాదు. తల్లిదండ్రుల పెంపకంలో బిడ్డలు మొండిగా, మూర?ంగా తయారు కాకుండా ఉండాలంటే ఎంతో ఓపికగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ నాటిక ద్వారా రచయిత తెలియజేశారు. 1996లో డివి రమణమూర్తి రాసిన నాటిక 'వేళకు గూడు చేరకపోతే'. బడికి వెళ్లిన పిల్లలు సమయానికి ఇంటికి చేరకపోతే తల్లిదండ్రులు పడే ఆందోళన ఎంత వర్ణనాతీతంగా ఉంటుందో తెలియజేసే నాటిక ఇది. బిడ్డ ఏమైపోయాడో, ఏ ప్రమాదం జరిగిందోఅనుకుంటూ కంటికి బిడ్డ కనిపించేదాకా తల్లిదండ్రులు తల్లడిల్లిపోవడం ఎంతో సహజం. పిల్లల పట్ల తల్లిదండ్రులకు ఉండే ప్రేమను, బాధ్యతను ఈ నాటిక ద్వారా రచయిత తెలియజేశారు.

**నాటికల విశిష్టత:** 'మొక్కై వంగనిది మ్రానై వంగునా' అన్నట్లు పిల్లలుగా ఉన్నప్పుడే వారిని మంచి మార్గంలో పయనింప జేయడానికి అవకాశం ఉంటుంది.ఎలాంటి కల్మషం లేని వారిలో కులమత బేధాలు,ధనిక బీద తారతమ్యాలు, వర్గ వైషమ్యాలు లేకుండా తోటి పిల్లల పట్ల సోదర భావం,పరస్పర సహకారం, అనురాగం, దయాగుణం మొదలగు సుగుణాలను పెంపొందింప జేయుటకు ఈ నాటికలు ఎంతో తోడ్పడుతాయి. పిల్లల కోసం పిల్లలే ప్రదర్శించే నాటికలే కాకుండా పిల్లల కోసం పెద్దలు ప్రదర్శించే నాటికలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ నాటికలన్నీ పిల్లల ఉన్నతికి తోడ్పడేవి. ఆయా నాటికల రచయితలు పిల్లల్లో మంచి సుగుణాలను పెంపొందింపజేయాలనే ఉద్దేశ్యంతో రచనలు చేశారు. రచయితల లక్ష్యం నెరవేరాలంటే ఆయా నాటికల్ని విజయవంతంగా పిల్లలచే ప్రదర్శింపజేసినప్పుడు తప్పకుండా ప్రభావితులై మంచిదారిలో పయనించడానికి అవకాశం ఉంటుంది. గాంధీజీ బాల్యంలో సత్యహరిశ్చంద్ర సినిమా చూసి ప్రభావితుడనయ్యానని ఆత్మకథలో చెప్పుకున్నారు. గొప్ప విలువలు కలిగిన ఈ నాటికల్ని చదవడం వల్ల, ప్రదర్శనను తిలకించడం వల్ల పిల్లల లేలేత హృదయాలపై చెరగని ముద్ర వేసి, వారు ఉన్నత శిఖరాలకు వెళ్ళేటట్లు చేస్తాయి. పిల్లల మనసు మీద దృశ్యం గాఢంగా హత్తుకుపోతుంది. అందువల్ల ఇలాంటి నాటికల ప్రదర్శన ద్వారా పిల్లలకు మానవవిలువలను, జీవితాలకు సంబంధించిన ఎన్నో విషయాలనుబోధించవచ్చు. అదేవిధంగా విద్యా విజ్ఞాన విషయాలను సైతం ఆయా నాటికల ప్రదర్శనలో చెప్పించి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దవచ్చు. ఇలాంటి ప్రదర్శన వల్ల పిల్లల్లో ఏకాగ్రత,

క్రమశిక్షణ, స్నేహభావం, సమైక్యతానురాగం, సంఘీభావం వెల్లివిరుస్తుంది. అంతేకాకుండా మానసిక ఒత్తిడి తొలగిపోయి చదువు పట్ల శ్రద్ధను కలిగి ఉంటారు.ఆ విధంగా జరిగినప్పుడే ఈనాటికల రచనకు, ప్రదర్శనకు అర్థం,పరమార్థం ఉంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1. శివప్రసాద్ వల్లూరు (2016), సం. ప్రసిద్ధ బాలల నాటికలు, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. డా. శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణ, హైదరాబాద్.

# తెలంగాణ తొలి నాటక సమాజం- ప్రాభవం, ప్రస్థానం

**డా. హరీశ్ కుమార్ శ్రీధర**
సహాయ ఆచార్యులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల
సెల్: 9491366356

భారతదేశ బానిసత్వపు బతుకులు ఒకవైపు, నిజాం నిరంకుశత్వంతో జాతి సాంస్కృతిక మూలాల విధ్వంసకాండ కొనసాగుతున్న రోజుల్లో భారతదేశ సాంస్కృతిక మూలాలు క్రమేణా అంతరిస్తున్న సమయంలో ఆ మూలాలకి ఊపిరిలూది నేటికీ సజీవంగా, జ్వాజ్వల్యమానంగా వెలుగుతున్న ఒకానొక సాంస్కృతిక కెరటం 'శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి' (ధర్మపురి).

1936 లో విజయదశమి నాడు పురుడు పోసుకుని సాంప్రదాయ ఆధునికతల మేళవింపుతో నేటికీ కళామతల్లికి సేవలందిస్తున్న చైతన్య స్రవంతి "శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి". నాలుగు తరాల నటులు- నూతన ఒరవడుల్ని ఆకళింపు చేసుకుంటూ తమ సాంస్కృతిక జీవన చైతన్యాన్ని ప్రదర్శనల ద్వారా ప్రదర్శిస్తూ, సంప్రదాయాన్ని సజీవంగా ఉ ంచడంలో విజయవంతం అవుతున్నారు. ప్రసిద్ధ నారసింహ క్షేత్రం, పవిత్ర గోదావరి తీరం- ధర్మపురిలో పురుడు పోసుకున్న ఈ నాటక సమాజం తెలంగాణలోనే మొదటిది. సాంస్కృతిక చైతన్యం, సామాజిక బాధ్యత రెండింటినీ తన భుజానికి ఎత్తుకొని అజరామరంగా నడుస్తున్న సంస్థ ఇది.

ప్రారంభం-ప్రాభవం (1936-1956) :

నాటక సమాజం ఏర్పాటు చేయాలనుకుంటే సరిపోదు కదా! దానికి తగిన హంగులు అన్నీ సమకూరవలసిందే. సరైన నటులు,రకరకాల సీనరీలు,మేకప్ సామాగ్రి,కర్టెన్లు,విద్యుత్ దీపాలు,మైకులు, నిచ్చెనలు, ఉయ్యాలలు, విగ్గులు, డ్రెస్సింగ్, ఫైర్ వర్క్స్,వైర్...ఇలాంటివెన్నో.

నలభైయవ దశకంలో ఆధునిక వాసనలు, పోకడలు లేని స్వచ్ఛమైన, సంప్రదాయం...వేద శాస్త్రాలు, యజ్ఞయాగాది క్రతువులలో "యజనయాజనాధ్యయనాధ్యాపన దాన ప్రతిగ్రహా"లనే షట్కర్మ నిరతులైన బ్రాహ్మణోత్తములచే శోభాయమానంగా ఉన్న గ్రామం. కట్టుబాట్లు,ఛాందస భావాలు పూర్తిగా తొలిగిపోని అగ్రహారం. నిత్యావసరాలకే కరెంటు సరిగా లేని ప్రాంతం,రవాణా సదుపాయం అంతంతే.. రంగస్థలం అంటే అజబోగం అనే చులకన భావం.. ఇన్ని వ్యతిరేకతల మధ్య బ్రహ్మశ్రీ కాసర్ల వేంకటరాజయ్య,కాకర్ల లక్ష్మీకాంత శాస్త్రి,రొట్టె చంద్రశేఖర శాస్త్రి,జగన్నగారి విశ్వనాథ శాస్త్రి,విటాల రామయ్య మున్నగువారి నాటకముల మీద ఆసక్తి, సామాజిక సాంస్కృతిక చైతన్య దీప్తి వలన నాట్య మండలికి అంకురార్పణ జరిగింది.

ఈ నాట్య మండలి అన్ని హంగులను సమకూర్చుకొని, సుమారు 2 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా బహుధాన్య సంవత్సరం జ్యేష్ఠ శుక్ల పౌర్ణమి (వట సావిత్రి పున్నమ) తేది: 12.6.1938
నాడు బ్రహ్మశ్రీ కాసర్ల వేంకటరాజయ్య గారి శిక్షణ, దర్శకత్వ పర్యవేక్షణలో 'సతీసావిత్రి' ప్రదర్శించారు. తరువాతి నెలలో రెండవ నాటకంగా ద్రౌపది వస్త్రాపహరణం,మరుసటి నెలలో మూడవ నాటకంగా భక్త ప్రహ్లాద, నాలుగవ నాటకంగా గయోపాఖ్యానం,తరువాత వరుసగా తులాభారం,లవకుశ,భక్త రామదాసు,సతి తులసి, రాయబారం.. ఇలా ఒక సంవత్సరం పాటు నెలకు ఒక నాటకం చొప్పున ప్రదర్శించారు.

పరదా పద్ధతి దాటి స్త్రీ ని బయటకు రానీయని నిజాం తురక సంప్రదాయాలు ఒకవైపు,ఆర్థిక,సాంఘిక స్వాతంత్ర్యం

లేక ఛాందస భావాలతో ఇంట్లోనే స్త్రీని కట్టిపడేసే జాగీర్ ఇనాం మఖ్తా(అగ్రహారం)ఆచారాలు మరోవైపు...ఇలాంటి సందర్భంలో నాటకాలలో స్త్రీ పాత్రని పోషించడానికి విధుషీమణులైన స్త్రీలు ముందుకు రాలేదు.కానీ చైతన్యం ఏ ఒక్క వర్గానిదో కాదుకదా. మొదటి నాటకం 'సతీసావిత్రి'లో సావిత్రిగా భోగం రాజమ్మ నటించడం అప్పట్లో ఒక సంచలనమే. మిగిలిన స్త్రీ పాత్రలను దెమ్మా బాలకిష్టయ్య, కాకర్ల లక్ష్మీనరహరి పోషించారు. మిగిలిన పాత్రలలో సత్యవంతుడిగా కాకర్ల లక్ష్మీకాంత శాస్త్రి, యముడిగా చంద్రశేఖర్ శాస్త్రి , అశ్వపతిగా బాచంపల్లి రామయ్య, మాళవిగా బలిజెపల్లి రాయన్న మొదలగు వారు నటించారు. తరువాతి కాలంలో దెమ్మా బాలకిష్టయ్య చాలాకాలం స్త్రీ పాత్రల్లో నటించి యశస్వి అయినారు. దెమ్మా బాలకిష్టయ్యను స్థానం వారితో పోల్చినారు శ్రీ మాడపాటి.

01-02-1946 రోజున అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుత మంచిర్యాల జిల్లా) మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహాసభలు రాజా మురళీ మనోహర్ రావు అధ్యక్షతన కె.వి కేశవులు గారి కార్యదర్శిగా నిర్వహించబడినాయి. కేవీ కేశవులు ధర్మపురి నాట్యమండలి రథసారథులలో ఒకరు. నాట్యమండలిని ఆహ్వానించి శ్రీకృష్ణతులాభార నాటకాన్ని ప్రదర్శింప చేశారు. ఆ సభకి మాన్యులు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షులు. మాడపాటి హనుమంతరావు ఇతరత్రా వధాన్యులు నాటక సమాజ సమాజం యొక్క ప్రదర్శనల్ని వీక్షించి, ఆశ్చర్యపోయి అద్భుతంగా ప్రశంసించారు.

పాండవోద్యోగం, ఛత్రపతి శివాజీ, రంగూన్ రౌడీ, పరవిక్రయం, చింతామణి వంటి నాటకాలు ఎన్నిటినో బ్రహ్మశ్రీ కాసర్ల వెంకటరాజయ్య దర్శకత్వంలో వివిధ ప్రాంతాలలో ప్రదర్శించారు. లక్ష్మీనరసింహ నాట్యమండలి నటుల ప్రదర్శనలను సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటివారు, దేవరపల్లి రామానుజ రావు, కాళోజి నారాయణరావు, నార్ల వెంకటేశ్వరరావు, బూర్గుల రామకృష్ణారావు, వానమామలై వరదాచార్యులు, దివాకర్ల వెంకటావధాని మరియు పూజ్యులు, అపర చాణక్యులు అయిన మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు ఇలాంటి బహుముఖీన ప్రజ్ఞావంతులందరూ వేనోళ్ళ పొగిడారు.

ఆంధ్ర నాటక కళా పరిషత్తు 19వ వార్షిక మహాసభలు 21 నుంచి 24 అక్టోబర్ 1955లో ఎగ్జిబిషన్ థియేటర్ హైదరాబాదులో జరిగినప్పుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, రేలంగి వెంకటరామయ్య, శ్రీమతి శాంతకుమారి తాపీ ధర్మారావుతో పాటు మండలి నటులు కాకర్ల లక్ష్మీకాంత శాస్త్రికి సన్మానం జరిగింది. మొదటి తరంలో గొప్ప కళాకారులుగా పేరొందినవాళ్లు కాకర్ల లక్ష్మీకాంత శాస్త్రి, రొట్టె చంద్రశేఖర్ శాస్రి, మాణిక్య శాస్త్రి, దెమ్మ బాలకిష్టయ్య, గుండి కిష్టయ్య, కాకర్ల లక్ష్మీ నరహరి, కె.వి కేశవులు, పెండ్యాల
సీతారాములు, ఇందారపు సుజన్ రావు, వజ్జల రామచంద్రం, కాసర్ల కిష్టయ్య, పాలెపు కిష్టయ్య, బలిపెల్లి రాజన్న, సారంగుల కిష్టయ్య, నేరెళ్ల వెంకటేశ్వర్లు, చిలకముక్కు అనంతాచారి, పాత పాపారావు, శివరామయ్య,
కిష్టయ్య, చాచం కిష్టయ్య మొదలగువారు ఇంకా అనేకం ఉన్నారు. ఇలా తొలి తరం నటుల్లో చాలామంది వివిధ రకాలైనటువంటి సన్మానాన్ని పొందడంతో పాటు నాట్య సమాజ అస్థిత్వానికి ఒక బలమైన పునాదులు ఏర్పడు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడంతోపాటు కొంత సామాజిక స్పృహని కల్పించడమే లక్ష్యంగా మొదటి తరం నాటకాలు కొనసాగినాయి. వీరి సాధన సృజన మరో తరానికి స్ఫూర్తివంతం.

**వికాసదశ -విశేషం (1966-1986):**

రెండవ తరం నాటి నాట్యమండలి సామాజిక స్పృహతో పాటు సామాజిక బాధ్యతని కూడా తన భుజాన ఎత్తుకుంది. స్థానికంగా (ధర్మపురిలో) లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల 1966 లో ఏర్పాటు చేయడం జరిగింది. 1966 నుండి 1969 వరకు అంటే కళాశాలకి గ్రాంట్-ఇన్-ఎయిడ్ వచ్చే వరకు సుమారు మూడు సంవత్సరాల పాటు కళాశాల నిర్వహణ నిమిత్తం,అధ్యాపకుల జీతభత్యాల నిమిత్తం కావలసిన ఆర్థిక సహాయాన్ని లక్ష్మీనరసింహ నాట్యమండలి తన ప్రదర్శనలు ద్వారా వచ్చే సొమ్మును ఇవ్వడం ద్వారా సమకూర్చినది.

ధర్మపురిలో సంస్కృత, ఆంధ్ర భాషల్లో ప్రత్యేకమైన డిగ్రీలు ఇచ్చే ఒక కళాశాల జవ జీవాల్ని సంతరించుకుంది. ఇప్పటికీ ఈ కళాశాల కొన్ని వందల కుటుంబాలకి జీవనాధారాన్ని అందించింది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాల్లో పనిచేసిన, పని చేస్తున్న అత్యధిక మంది తెలుగు పండితులు, అధ్యాపకులు,ఆచార్యులు 'శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల' పూర్వ విద్యార్థులే. అటువంటి ఒక కళాశాలను కాచిన కన్నతల్లి లాంటిది లక్ష్మీనరసింహ నాట్య మండలి. ఆనాటి దార్శనికులైన,విద్వజ్జనులైన నాటక సంఘ సభ్యులకు, సమాజానికి ఈ తరం వాళ్లు సదా రుణపడి ఉండాల్సిందే.

రెండవ తరంలో వీరపాండ్య కట్టబొమ్మన, ఆకురాలని వసంతం, గయోపాఖ్యానం, వీర కాపయ, నాగమ నాయకుడు, సుందరకాండ ఇట్లాంటి అనేక అనేక నాటకాల్ని 1967 నుంచి 1982 మధ్య కాలంలో ప్రదర్శించారు.మాన్యులు దాద గారి కిషన్ రావు అధ్యక్షతన ఏఆర్ కృష్ణ ఆంధ్ర నాటక అకాడమీ తో సత్సంబంధాల వలన శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలికి సంబంధించిన నటకులు ఎందరో ప్రభుత్వ సన్మానం అందుకున్నారు. నాటక అకాడమీ అధ్యక్షురాలు శ్రీమతి జమున, మాజీ ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య ఈ నటకుల్ని సన్మానించారు. రెండవ తరంలో శ్రీ రొట్టె విశ్వనాథ శాస్త్రి, గుండయ్య, గుండి పెద్ద హనుమాన్లు, బండి సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, వజల రామచంద్రం, కాకర్ల దత్తాత్రేయ ఇలా ప్రశస్తి పొందిన ప్రముఖులెందరో ఉన్నారు.

**పునరుజ్జీవన దశ - నైపుణ్యాల నవీకరణ (1987-2007):**

మొదటి రెండు తరాల వారు సాంస్కృతిక చైతన్యం సామాజిక బాధ్యతను భుజానికెత్తుకుంటే మూడవ తరం వారి ప్రాధాన్యాల్లో సాంస్కృతిక పునరుజ్జీవనంతో పాటు ముంచుకొస్తున్న టీవీలు, సినిమాలు ఇతర రంగుల కలల ప్రపంచాన్ని దాటి ప్రేక్షకుల్ని నాటకానికి రప్పించి మెప్పించాల్సిన పరిస్థితి. అయినా పాతతరం వాళ్ళ సామాజిక బాధ్యతని భుజాన మోస్తూనే, సాంస్కృతికంగా సంప్రదాయాన్ని కాపాడడానికి 1997లో" చాచం కిష్టయ్య స్మారక సంగీత కళాశాల" (సంగీతంలో విశేష కృషి చేసిన సంగీత సరస్వతి శ్రీ చాచం కిష్టయ్య)ఏర్పాటు చేసి సంప్రదాయ సాహిత్యాన్ని, కళల్ని, సంగీతాన్ని తర్వాత తరానికి అందించడం మొదలుపెట్టారు. ఈ తరంలో అనేకానేక సన్మానాలు పొందడం జరిగింది. అందివస్తున్న ఆధునిక సాంకేతికతల్ని అందిపుచ్చుకుంటూ కొత్త పోకడల్ని అవలోకిస్తూ, ఆచరిస్తూ, కొత్త నాటకాలు రచిస్తూ సాంస్కృతిక కళావైభవాన్ని కొనసాగించారు.

కాకర్ల లక్ష్మీనారాయణకు అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య గారి చేత రవీంద్రభారతిలో 1983లో సన్మానం జరిగింది, పెండ్యాల సీతారామయ్యకు అప్పటి మంత్రి గారైన దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారి చేతసన్మానం జరిగింది. అలాగే డా.సంగనభట్ల నరసయ్యకు కళా జ్యోతి అవార్డు, రొట్టె విశ్వనాథ శాస్త్రికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేత సన్మానం ఇలా చాలామందికి సన్మానాలు జరిగాయి.

వీరు ప్రధానంగా గయోపాఖ్యానం, వీరపాండ్య కట్టబొమ్మన మొదలు నాటకాల్ని విస్తృతంగా ప్రదర్శించారు. ఈ తరం నటులలో శ్రీ కొరిడే నరహరి, డా.సంగనభట్ల నరసయ్య, కాకర్ల దత్తాత్రేయ, గుండి చిన్న హనుమాన్లు, ద్యావల్ల గుండయ్య, సంగనభట్ల కిషన్, చిలకమర్రి నరసింహచారి, మంచిరాజు లక్ష్మీనరసింహారావు, సంగనభట్ల పెద్ద రామకృష్ణయ్య, కాకర్ల చిన్న దత్తాత్రేయ, సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, గుండి హనుమాన్లు, పెండ్యాల బాలకృష్ణ, సురేందర్ కుమార్, కొంటికర్ల రామయ్య, కాసర్ల శివరామ శర్మ మొదలగువారు ప్రసిద్ధులు. ఈ తరంవారు చేసిన, చేస్తున్న గొప్ప విశేషం- సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరో తరాన్ని చైతన్య పరచడం అందుకే 5జి కాలంలోనూ 4వ తరం నటులు ప్రాచీన పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలతో పాటు ఆధునిక నాటకాన్ని కొనసాగిస్తున్నారు.

ఉత్తేజిత దశ-వారసత్వపు కొనసాగింపు (2008-నేటి వరకు ):

ప్రస్తుత తరం వారు శ్రీకృష్ణరాయబారం, పాండవోద్యోగం, దక్షయజ్ఞం, వీరపాండ్య కట్టబొమ్మన వంటి పౌరాణిక, చారిత్రక నాటకాలతో పాటు ఆధునిక నాటకాలను రాష్ట్రమంతటా ప్రదర్శిస్తూ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఇక నేటి

తరంలో కాకర్ల అనిల్ కుమార్, అమర్, ముత్యాల సురేష్, బుగ్గారపు నరహరి, కిషోర్, కాసర్ల నరసింహమూర్తి, ద్యామక్క శ్రీనివాస్,పాలెపు చంద్రమౌళి, జన్మంచి నరసయ్య, జన్మంచి వంశీకృష్ణ, కాసర్ల వెంకటరమణ, నరసయ్య, పెంద్యాల మహేందర్, గుండి రామ్‌కుమార్, కొరిడే శివప్రసాద్, సంగనభట్ల విజయ్, బొజ్జ రాజు, చిన్నారులు కాకర్ల కావ్య, గాయత్రి మొదలగువారు ఉన్నారు

**విశేషాంశాలు :**

రంగస్థలం పైన మొదట చూపించే దేవి పరదా – వాస్తవానికి అది రాట్నం మధ్యలో ఉన్న త్రివర్ణ పతాకం చేత పూనిన భారతమాత చిత్రం. అటు ఇటు లక్ష్మీ, సరస్వతి. ఇది నిజానికి ఆ కాలంలో దేశద్రోహంగా భావించే పరిస్థితి. అయినా జాతీయతా భావాలు కల వీరు దాన్ని ప్రదర్శించడం ఆపలేదు. వైర్ వర్క్స్, ఫైర్ వర్క్స్ బ్రహ్మాండంగా ఉండేది. దేవతా ప్రత్యక్షం.. ఇలాంటి సందర్భాల్లో పటాకులు పేల్చేవారు. శిశుపాలుని శిరచ్ఛేదం అద్భుతమైన వైర్ వర్క్స్‌తో నడిచేది. కృష్ణుడు సుదర్శన చక్రం విడవగానే అది ప్రేక్షకులు చూస్తుండగానే వెళ్లి శిశుపాలుని తలనరికేది. చక్రం వైర్ మీద నడిచేది. యముడు దున్నపోతుపై ఎక్కి దిగివచ్చేవాడు. నారదుడు ఆకాశం నుండి పాట పాడుతూ కిందికి దిగివచ్చేవాడు. ద్రౌపది వస్త్రాపహరణం వింతగా ప్రేక్షకులు చూస్తుండేవారు. గుట్టల మీద నుండి ప్రహ్లాదుని తోసే ఘట్టం, స్తంభం మీద వేటుపడగానే స్తంభం పగిలి నరసింహుడు బయటకు వచ్చే ఘట్టం, ప్రధాన పరదాలతో సముద్రపుటలలు, మంటలు, చితి, అట్టలతో కైలాస శిఖరం, పరదాపై సత్యవంతుడు గొడ్డలితో కొడితే కట్టెలు విరిగిపడే ఘట్టం, సీతమ్మని కూర్చోబెట్టుకుని గుర్రాలతో రథం మీద లక్ష్మణుడు స్టేజి మీదకి వచ్చే ఘట్టం, ప్రహ్లాదుని మరియు లోహితుని పాము కరుచుట వంటి ఘట్టాలు చూపిస్తుంటే ప్రేక్షకులు మైమరచి చూసేవారు. తులాభారం వంటివి గొప్పగా ప్రదర్శించారు. లైట్లు అందుబాటులో లేని సమయంలో బిజిలీలతో కూడా కొన్ని రోజులు నాటకాలాడిన సందర్భాలున్నాయి.

"తెలుగు నాటక వికాసం"లో డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు చతుర్ధ భాగంలో ధర్మపురి లక్ష్మీనరసింహ నాట్య మండలి గురించి ప్రస్తావించారు. అలాగే "ఆంధ్ర నాటక రంగ చరిత్ర"లో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి కూడా లక్ష్మీనరసింహ నాట్యమండలి గురించి తెలియజేశారు. లక్ష్మీ నరసింహ నాట్య మండలికి సమకాలీనంలో అనగా 1936 –38 ప్రాంతంలో కాలేజ్ ఆఫ్ డ్రమాటిక్స్, వెంకటగిరి అమెచ్చురెస్ (1930) జనతా ఆర్ట్ థియేటర్, తెనాలి (1942), సీతారామ బాల భారతి, రేపల్లె (1933) ప్రభాకర్ నాట్యమండలి, గుడివాడ (1942) నాట్యమండలి నర్సీపట్నం (1936) ఇలా ఆంధ్ర ప్రాంతంలో చాలా నాటక సమాజాలు ఉన్నాయి. శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం, ఇండియన్ నేషనల్ థియేటర్, కరీంనగర్ జిల్లా సాంస్కృతిక సంస్థల సమాఖ్యలకి అనుబంధంగా ఉంది.
ఈ కళా పోషణ సాంస్కృతిక వారసత్వం త్వరలోనే శతవసంతాలు పూర్తిచేసుకుని–నిరంతరంగా, నిరాటంకంగా తన చైతన్య స్రవంతిని కొనసాగిస్తూ ఆ లక్ష్మీనరసింహస్వామి కరుణాకటాక్షాలతో మరింత యశస్సుని సాధించాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు :**


1. డా॥ నరసయ్య సంగనభట్ల సం. (1968), శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి స్వర్ణోత్సవ సంచిక, శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి ప్రచురణలు, ధర్మపురి.
2. డా॥ నరసయ్య సంగనభట్ల సం. (2013) శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి అశీతి సంచిక, శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి ప్రచురణలు, ధర్మపురి.
3. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణలు, హైదరాబాద్
4. ప్రస్తుత నాట్యమండలి కళాకారులతో సంభాషణల ద్వారా సమాచార సేకరణ.

# శ్రీకాకుళం జిల్లా నాటక సాహిత్యం - పరిశీలన

**డా. పప్పల వెంకటరమణ**
తెలుగు విభాగాధిపతి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)
శ్రీకాకుళం
సెల్ : 9491811710

నాటకము పరిచయము: తెలుగు సాహిత్య చరిత్రలో నాటకము అనే ప్రక్రియ ప్రధానమైనది. దశ రూపకాలలో నాటకము ఉత్తమమైనదిగా నిర్ణయించడమే కాక నిరూపించబడినది. నాటకము సర్వకళల సమాహారము. కవిత్వం, సంగీతము, నృత్యము, అభినయాలతో సర్వ జనానందదాయకమైన ప్రక్రియ నాటకం. నాటకానికి సహృదయ సామాజికుడు(ప్రేక్షకుడు) ఉండాలనీ, లేకపోతే నాటకకర్త ఎంత ప్రతిభావంతంగా రచించినా ఫలితం ఉండదని ధనుంజయుడనే లాక్షణికుడు చెప్పాడు. నాటకానికి ఇతివ్రతం ప్రధానమని, పంచ సంధులతో విలాసము, బుద్ధి మొదలైన గుణాలతో, సుఖదుఃఖాది నానా విధమైన భావాలతో, శృంగార వీర రస ప్రధానమై, ఐదు మొదలు పది అంకాల వరకు ఉండేది నాటకం అని
నిర్వచించారు.

తెలుగులో నాటక సాహిత్యానికి నాంది పలికినవారుగా కోరాడ రామచంద్రశాస్త్రిని పేర్కొనాలి. ఈయన రాసిన "మంజరీ మధుకరీయం" అనే స్వతంత్ర రూపకమే తొలి నాటకముగా నిర్ణయించబడినది. 'చిత్రనళీయము' నాటకం రచించిన ధర్మవరం రామకృష్ణమాచార్యులను 'ఆంధ్రనాటక పితామహులు'గా పేర్కొందురు.

నాటకాలలో అనువాద నాటకాలు, అనుసరణ నాటకాలు, పౌరాణిక నాటకాలు, చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలు, విషాదాంత నాటకాలు, ప్రమోదాంత నాటకాలు, సమస్యాత్మక నాటకాలు, స్టేజి నాటకాలు, పోటీ నాటకాలు, ప్రయోగాత్మక నాటకాలు, రేడియో నాటకాలు, స్త్రీ పాత్రగల నాటకాలు, స్త్రీ పాత్ర లేని నాటకాలు, పాశ్చాత్య నాటక ప్రభావముగల నాటకాలు మొదలగు నాటకరకాలు గలవు.

నాటకాలపై పరిశోధన చేసిన వారిలో పి.ఎస్.ఆర్. అప్పారావు, మొదలి నాగభూషణ శర్మ , ఎస్. గంగప్ప, గండవరం సుబ్బరామిరెడ్డి, పి.వి. రమణ, కప్పగంతుల మల్లికార్జున రావు, జయప్రభ, శ్రీకాంత్ శర్మ, అబ్బూరి మొదలైనవారు నాటక సాహిత్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించి విశ్లేషించారు. వారు వెల్లడించిన అంశాలను బట్టి నాటక సాహిత్య స్వరూపాన్ని తెలుసుకోవచ్చును.

శ్రీకాకుళం జిల్లా పరిచయం: బ్రిటీష్ వారి పరిపాలనా కాలంలో "చికాకోల్"గా ప్రసిద్ధి చెంది తర్వాత శ్రీకాకుళముగా పేరును సంతరించుకొని 1950 ఆగస్టు 15న ప్రత్యేక జిల్లాగా అవతరించినది. ఈ జిల్లా నుండి ఎందరో సాహితీవేత్తలు, కళాకారులు, క్రీడాకారులు, స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ నాయకులు అవతరించి
జిల్లాకు కీర్తి ప్రతిష్టలను తెచ్చిరి. ఒకప్పుడు వెనుకబడిన జిల్లాగా పేరొందిన శ్రీకాకుళం నేడు ఉన్నత విద్యలో, ఉద్యోగావకాశాలలో రాష్ట్రంలో ప్రథమ స్థానం కొరకు పోటీపడుతున్నది. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, చంపావతి, బహుద, బెంజిగడ్డ, వరహాలుగడ్డ, పెద్దగడ్డ, కందివలసగడ్డ, కుంభికోటగడ్డ నదులు జిల్లాను సస్యశ్యామలం
చేస్తున్నాయి. మూడు రెవెన్యూ డివిజన్లు, ముప్పది మండలాలు, ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గం ఈ జిల్లాలో గలవు.

**శ్రీకాకుళం జిల్లా నాటక రచయితలు - వారి సాహిత్య సేవ:**

ఈ జిల్లా నందు నాటక రచయితులుగా ప్రసిద్ధి పొందిన వారిలో దీర్ఘాసి విజయభాస్కర్, పింగళి నాగేంద్రరావు, మల్లాది వెంకటకృష్ణ శర్మ, మీగడ రామలింగస్వామి, చింతాడ రామారావు, గోపాలరావు, మెట్ట పోలినాయుడు, గణేష్ పాత్రో, పేడాడ పరమేశ్వరరావు, మల్లాది విశ్వనాథ శర్మ (కవిరాజు), గుమ్మలూరి సత్యనారాయణ, బంకుపల్లి మల్లయ్య శాస్త్రి, బలివాడ కాంతారావు, ముత్తంశెట్టి హనుమంతరావు, రాంభొట్ల లక్ష్మీనారాయణ మొదలగు నాటక రచయితలు శ్రీకాకుళం జిల్లా నాటక సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు.

**మల్లాది వెంకట కృష్ణ శర్మ:**

కృష్ణశర్మది పండితవంశం. అందరూ సంస్కృతాంధ్రంలో ప్రసిద్ధులు. కృష్ణశర్మ 1907లో శ్రీకాకుళంలో జన్మించారు. మెట్రిక్యులేషన్ చదివి కొంతకాలం కలెక్టర్ ఆఫీసులో గుమస్తా ఉద్యోగం చేసిరి. నాటక రచనలు అతనికి మంచిపేరు తెచ్చిపెట్టాయి. సురభివారు ప్రదర్శిస్తున్న మాయాబజార్, బాలనాగమ్మ, భూకైలాస్, దశావతారాలు, దక్షయజ్ఞం మొదలైన నాటకాలన్నీ శర్మగారి రచనలే. 'మిస్ ప్రేమ బి.ఏ.' నాటకం కృష్ణశర్మకు ఎంతో పేరు తెచ్చి పెట్టినది. ఆంధ్రదేశంలోని చాలా పట్టణాల్లో ప్రదర్శితమైనది. వారసత్వము, ప్రత్యక్ష దైవము, సుబ్బమ్మ విరహము, నామకరణము వంటి హాస్య నాటికలు కూడా రాసి ప్రసిద్ధి చెందిరి. సుప్రసిద్ధ నాటకాలు, నాటికలు చాలా వ్రాసి సినిమా రంగంలోకి ప్రవేశించారు. ఆర్. కె., కృష్ణశర్మ మంచి స్నేహితులు. ఆ పరిచయం ఉండడం వల్ల కృష్ణశర్మ పరదేశి సినిమాకి రాస్తున్నప్పుడు రావి కొండలరావు సహాయకుడిగా చేరాడు. అన్నదాత, బంగారు భూమి, వద్దంటే డబ్బు, బీదల ఆస్తి మొదలైన చిత్రాలకు కథలు, కొన్ని పాటలు రాశారు. కొన్ని చిత్రాలకి మాటలు రాయడం, హాస్య సన్నివేశాలు కల్పించడం కూడా చేసేవారు. సురభి సంస్థలోనే ఉంటూ అక్కడే 1973 జనవరి 19 లో మృతి చెందారు.

**మల్లాది విశ్వనాథ శర్మ (కవిరాజు):**

ఇతనికి కవిరాజు బిరుదు. ఆ బిరుదుననే పేరుగా వాడుకున్నారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు వ్యవస్థాపకుల్లో కవిరాజు ఒకరు. ఈయన రాసిన హాస్య నాటకాలు ఎన్నో కలవు. దొంగాటకం, డొంకలో షరాబు, గ్రీన్ రూమ్, కిర్రు గానుగ వంటి నాటకములు బాగా ప్రదర్శితమయ్యేవి. తర్వాత సినీరంగంలో ప్రవేశించి భక్త మార్కండేయ, మాలతీమాధవం, పంతులమ్మ, సౌదామిని మొదలైన చిత్రాలకు రచనలు చేశారు.

**గరిమెళ్ళ సత్యనారాయణ:**

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న గరిమెళ్ళ సత్యనారాయణ జన్మించిరి. పిడుగుల జడి గరిమెళ్ళ 'మాకొద్దీ తెల్ల దొరతనము' అనే గేయము స్వాతంత్ర సంగ్రామ వీరులకు ఉత్తేజాన్ని కలిగించినది. ఈయన రాసిన ఒకే ఒక్క నాటకం "మాణిక్యం" అనే పేరుతో 1924 లో గ్రంథరూపంలో వెలువడెను. ఈ నాటకము ఎందరో యువతీ యువకులను ఆకర్షించి ఎన్నో ప్రదర్శనలను గావింపబడెను.

**డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్:**

నాటక రచయితగా, కవిగా, కథకుడిగా అనువాద రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. నాటక రంగానికి సంబంధించిన పరిశోధనలో మంచి పేరు సంపాదించిన రచయిత విజయభాస్కర్.

శ్రీకాకుళం జిల్లా అంపోలులో 1958 జులై 31న జన్మించారు. తండ్రి పేరు సూర్యనారాయణ, తల్లి పేరు వరాలమ్మ. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతుండగానే "తూర్పు తెల్లారింది" అనే నాటికను మొట్టమొదట రచించారు. నాటక రంగంపై ఉన్న మక్కువతో బెర్నాల్డ్ బ్రేక్ కావ్య నాటిక "రాగం. ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తూ నాటక సాహిత్యానికి సేవ చేశారు. ఇతని కళాసేవను మెచ్చుకుంటూ కేంద్ర ప్రభుత్వం 2010లో కేంద్ర సంగీత నాటక అకాడమీ వారి ఉత్తమ నాటక రచయిత పురస్కారాన్ని అందించింది. ఇతడు సుమారు 30 నాటకములు రాసి తిరుగులేని నాటక రచయితగా పేరు పొందారు.

దీర్ఘాసి విజయభాస్కర్ రాసిన నాటకములలో మహాత్మ జ్యోతిరావు పూలే, బొమ్మలు చెప్పిన భజగోవిందం, కుర్చీ,

ఋత్విక్, పులిస్వారీ, కించిత్ భోగం, హిరణ్యగర్భ, కాలకూటం, గాంధీ జయంతి, జీవన్నాటకం, కబీర్ దాస్, యోగివేమన, శ్రమణకం, శత్రువు, బ్రహ్మారాత, మినిస్టర్, మీరే దేవుళ్ళు, చిత్రం, మబ్బులో బొమ్మ, దేవుడు కావాలి, బాపు చెప్పిన మాట, గృహప్రవేశం, తూర్పు తెల్లారింది, ఒంటరి రెక్కలు, మౌనంతో మాటలు, రాజిగాడు - రాజు అయ్యాడు, గాలి బతుకులు, మహా శూన్యం, వంశధార వైభవం అనే నాటకములు రాశారు. ఇతను నాటక సాహిత్యానికి చేసిన కృషికి ఫలితంగా ఎన్నో పురస్కారాలను పొందిరి.

1. కుర్చీ నాటకానికి గాను 1999 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తమ రచయితగా నంది పురస్కారం పొందారు.

2. మబ్బుల్లో బొమ్మ నాటకానికి గాను 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తమ రచయితగా నంది పురస్కారం పొందారు.

3. జీవన్నాటకం నాటకానికి 2003వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తమ రచయితగా నంది పురస్కారము.

4. 2003లో ఆంధ్రసారస్వత సమితి నుండి ఉగాది సాహిత్య పురస్కారం.

5. మినిస్టర్ నాటకానికి 2004 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తమ రచయిత నంది పురస్కారం.

6. 2004 సంవత్సరానికి ఢిల్లీ తెలుగు అకాడమీ నుండి రాష్ట్రీయ వికాస్ శిరోమణి పురస్కారం.

7. 2004లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం.

8 బొమ్మలు చెప్పిన భజగోవిందం నాటకానికి గాను 2009 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తమ రచయిత నంది పురస్కారము.

9. 2010లో కేంద్ర సంగీత నాటక అకాడమీ వారి ఉత్తమ నాటక రచయిత పురస్కారము.

10. 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అందించిన గురజాడ సాహితీ పురస్కారం.

ఈయన దూరదర్శన్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఊరులో చిన్నప్పుడు పండుగలకు జరిగే నాటక ప్రదర్శనలతో ప్రభావితమై తన గ్రామంలో ఉన్న గ్రంథాలయములో వివిధ పత్రికలను చదివి అందులోని సాహిత్యంతో ప్రభావితమై సాహిత్య రచనల వైపు అడుగులు వేసినట్లు చెప్పారు. కాళీపట్నం రామారావు దగ్గర స్ఫూర్తి పొంది కథలు రాశానని, కాళీపట్నం రామారావు పరిచయం చేసిన ఎస్. కె. మిశ్రో ప్రభావంతో నాటక రచన చేసినట్లు తెలిపారు. ఇతని రచనలలో సామాజిక, రాజకీయ అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలను ఉటంకిస్తూ హిందూమతంలోని సామాజిక న్యాయాన్ని ఈయన నాటక రచనలలో ప్రతిబింబించును. కొన్ని హిందీ, కన్నడం, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదం అయ్యాయి.

**పింగళి నాగేంద్రరావు:**

ఇతను 1901 డిసెంబర్ 29వ తేదీన శ్రీకాకుళం జిల్లా రాజాంలో జన్మించారు. పింగళి నాగేంద్రరావు రచించిన నాటకాలన్నింటిలోనూ డి.వి. సుబ్బారావు నటించారు. పింగళి వారికి సుబ్బారావు యొక్క ఇండియన్ డెమోక్రటిక్ కంపెనీలో సెక్రటరీ పదవి లభించింది. 1946 దాకా నాగేంద్రరావు ఆ కంపెనీలోనే ఉంటూ, వారి కార్యక్రమాలను నిర్వహిస్తూ, నాటకాలు ఆడిస్తూ, నాటక రచన గురించి, ప్రేక్షకుల అభిరుచులను గురించి, ప్రదర్శనలో మెలకువలు గురించి అపారంగా నేర్చుకున్నారు. దీని మూలంగా "నారాజు", వింధ్యరాణి నాటకాలు అద్భుతమైన విజయం సంపాదించాయి. తరువాత 1956లో "క్షాత్రహిందూ" అనే మరో చారిత్రక నాటకాన్ని వ్రాశారు. ఈ నాటకాలు అన్నీ "పింగళీయం" పేరుతో విడుదలయ్యాయి. తను సినిమాలోకి రావడానికి తోడ్పడిన కమలాకర కామేశ్వరరావుతో కలిసి ఎన్నో చిత్రాలకు మాటలు, కథలు రాశారు. ధూమకేతు, నిక్షేపరాయడు, బుజ్జాయి, చిన్ని మున్నగు నాటక రచనలు చేశారు. పింగళి నాగేంద్రరావు

1971 మే 6న కన్నుమూశారు.

**చింతాడ రామారావు:**

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం తాడివలస నాగావళి నదీతీరము గంగ్రేడు గ్రామంలో 1953 జూన్ 4వ తేదీన జన్మించారు. వీరు 'నరబలి' అనే నాటకం 1994లో రాశారు. ఇది శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతంలోని మాండలికములో రాయబడింది. అయితే విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని గిరిజనుల భాష, యాస కూడా సమ్మిళితమై ఉంటుంది. ఈ నాటిక చదువుతున్నప్పుడు భాషను అర్థం చేసుకోవడం కష్టమైనప్పటికీని, మాట్లాడుతున్నప్పుడు బాగా అర్థమవుతుందని పద్మశ్రీ డాక్టర్ బోయి భీమన్న ఈ నాటికకు రాసిన ముందుమాటలో ఉటంకించారు. చింతాడ రామారావుకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిన నాటకం 'ఊడలు'. ఇది గ్రీన్ క్లైమేట్ మాసపత్రికలో 2013 జూలై నుంచి 2013 నవంబర్ వరకు ధారావాహికగా వెలువడింది. ఈ నాటకం ప్రస్తుత రాజకీయ అవినీతిని బట్టబయలు చేస్తుంది. పోరాట వ్యూహాల్లోనూ ప్రజలను సమైక్యపరచి కార్యోన్ముఖులను గావించి సమైక్య పోరాటాలకు సమాయత్త పరుస్తుంది. అనుభవశాలి అయిన జగన్నాథం రాజు ఆధ్వర్యంలో ఉష, సూర్యతేజలు సింహబలనాయుడుని ఎదిరించి తమ ఊరిని, అక్కడున్న అత్యంత విలువైన ఖనిజనిక్షేపాన్ని, తమ సంస్కృతిని కాపాడుకొని భావితరాలకు మార్గదర్శకంగా కనిపిస్తుంది.

ఇతని మూడవ నాటకం తప్పెటగుళ్ళు. ఇది 1995లో రాయబడింది. ఇందులో శ్రీకాకుళంలో పుట్టిన తప్పిటగుళు ్ళ జానపద కళారూపాన్ని కృతక కళలు ఎలా డామినేట్ చేశాయో కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు రచయిత. వారసత్వంగా తమ కుటుంబానికి తరతరాలగా సంక్రమిస్తూ వస్తున్న తప్పెటగుళ్ళు కళను ఎలా అణగారిస్తున్నది చర్చిస్తాడు. అలాగే తమ కళాప్రదర్శన ద్వారా ప్రజాహితమైన విద్య, వైద్యము, నేత్రదానము, రక్తదానము, పచ్చదనము, పరిశుభ్రత వంటి ప్రజాహితమైన కార్యక్రమాల ప్రచారం

కల్పించడానికి తమ వంతు సహకారం అందిస్తూ ఈ కళను ప్రజల్లో బతికిస్తారు. ఇందులో ప్రాచీన కళను కాపాడుకోవడం, సామాన్య జనం సృష్టించే సంపదను కాపాడుకోవడం అనే రెండు కోణాలు కనిపిస్తాయి. ఇతను రాసిన 'నాగలి' నాటకం రైతు సమస్యలను చర్చిస్తుంది. రైతుకు ప్రభుత్వ పరంగా తగినంత ప్రోత్సాహం లేక తన చుట్టూ ఆవరించియున్న ఆర్థిక సామాజిక అవరోధాలను అధిగమించలేక, పెట్టుబడిదారుల దోపిడీ వ్యూహాలను ఛేదించలేక ఆఖరికి ప్రకృతి పరమైన విపత్తుల నుండి గట్టెక్కలేక సుడిలో చిక్కిన నావలా రైతుల ఆత్మహత్య వైపు పయనం కదుతుంది. 28 పాత్రలు కలిగిన ఈ నాటకం ప్రదర్శించగలిగితే నాటకాలలో గొప్ప నాటకంగా స్థిరపడుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. చింతాడ రామారావు శ్రీకాకుళం జిల్లా సర్వ శిక్ష అభియాన్ వారి కోరికపై 2016లో 'బడీడు' అనే రూపక నాటకమును రచించారు. మధ్యలోనే బడి మానేసిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులను, ప్రజల్లోనూ అవగాహన కల్పించేటందుకు రూపొందించబడినది. నిర్బంధ ప్రాథమిక విద్య, బాల కార్మిక వ్యవస్థ రద్దు ఇందులో ప్రధాన అంశాలుగా కలవు. ఈ రూపకాన్ని శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతంలోని కొవ్వాడ నుండి ఇచ్ఛాపురం వరకు గల జిల్లాలోని ఆరు కళాబృందాలు కళాజాతగా సుమారు వంద ప్రదర్శనలు ఇచ్చాయి.

**మెట్ట పోలినాయుడు:**

ఇతను శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం సనపలవాని పేటకు చెందినవారు. ఈయన వృత్తిరీత్యా పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ సాంకేతిక అధికారి అయినప్పటికీ చిన్నప్పటి నుంచి తండ్రి ప్రోత్సాహముతో తనకున్న కళాతృష్ణతో నాటక రంగంలో రాణిస్తూ వివిధ పోటీలలో పాల్గొని బహుమతులు సాధిస్తూ పలువురి మన్ననలను పొందారు. పోలినాయుడు నాటకాల్లో నటించడమే కాక నాటకాలకు దర్శకత్వం వహించడంతోపాటు నాటకాలను రచించారు. ఇతను ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడే స్నేహితులతో పాఠశాలలోనే నాటకాలు ప్రదర్శించేవారు. ఈ స్ఫూర్తితోనే గ్రామంలో యువకులతో నాటకాలు ప్రదర్శించేవారు. ఇతని నాటకాలలో "భూమికోసం, ఎన్నాళ్ళీ అంధకారం, బలి, సారీ స్వాతంత్ర్యం వచ్చింది" మున్నగు సాంఘిక నాటకములను రచించి పేరు ప్రఖ్యాతులు పొందారు. ఇతను నటించిన నాటకాలలో హుష్ కాకి,

ఎన్నాళ్లీ అంధకారం, ఆసరా, ఆనందామృతం, సారీ, స్వాతంత్ర్యం వచ్చింది, గమనిక, అగ్నిపథం, అరణ్యఘోష, నీతి నీ స్థానమెక్కడ, కట్నాలు- కాపురాలు తదితర పలు సందేశాత్మక నాటకాలు ప్రదర్శించి బహుమతులను కైవసం చేసుకున్నారు. దీనితో పాటు 85 నాటకాలకు దర్శకత్వం వహించిరి. 1992లో ఉత్తరాంధ్ర ఉత్తమ నటుడుగా అవార్డును సాధించారు. నాటక రంగాన్ని బతికించాలన్నది ఆయన ఆశయం. తన తండ్రి అప్పారావు నాయుడు స్ఫూర్తితోనే నాటక రంగంలో రాణించారు. ఆయన ప్రోత్సాహం మరువరానిది. తన స్వగ్రామములో 'అరుణోదయ ఆర్ట్స్' పేరుతో నాటకాలను రాయడం, ప్రదర్శించడం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో 'మదర్ ఆర్ట్స్' సంస్థను స్థాపించారు. రాష్ట్రంలో, దేశంలో నలుమూలల ప్రదర్శనలు ఇచ్చారు. నటన జీవితానికి మార్గదర్శకత్వం వహిస్తూ సమాజంలో గుర్తింపు తెచ్చి పెడుతుంది. నూతన కళాకారులను, నాటక రచయితలను ప్రోత్సహించడం అతని గొప్పతనం.

**బలివాడ కాంతారావు:**

ఈయన శ్రీకాకుళం జిల్లాలోని మడపాం అనే గ్రామంలో జన్మించారు. భారత సైన్యంలో అనేక పదవుల్లో పనిచేశారు. సుప్రసిద్ధ తెలుగు నవలా రచయితగా పేరొందిరి. ఇతడు 38 నవలలు, 400 కథలు, ఐదు నాటికలు, నాలుగు నాటకములు ఎన్నో రేడియో రచనలు చేశారు. ఈయన 1998లో అడవి మనిషి, అజంతా, ఎల్లోరా, హిప్పీ నాటకాలను వ్రాసి నాటక సాహిత్య ప్రక్రియలోనూ తన ప్రత్యేకతను నిలుపుకున్నారు.

**బంకుపల్లి మల్లయ్య శాస్త్రి:**

ఇతని స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలానికి చెందిన ఉర్లాం గ్రామం.ఇతను ప్రముఖ పండితులు, సంఘసంస్కర్త, రచయిత. మల్లయ్య శాస్త్రి యక్షగాన నాటక రచనలో సుప్రసిద్ధులు. చైతన్య చరిత్ర, కంసవధ, శ్రీకృష్ణ జననము, రామకృష్ణ పరమహంస చరిత్ర, భాగవత కలాపము, అస్పృశ్యత, వివాహతత్వం అనే యక్షగాన నాటకములను రచించి పేరొందారు.

**గుమ్మలూరి సత్యనారాయణ:**

ఇతను శ్రీకాకుళం జిల్లా సంగం అగ్రహారంలో జన్మించారు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాల నుండి పట్టభద్రులైరి. శాంతినికేతన్ లో రవీంద్ర కవీంద్రుని అంతేవాసిగా చేరారు. నేటి రైతాంగం పేర 1969 నుండి ఆంధ్రప్రభ దినపత్రికలో ధారావాహిక వ్యాసాలు ప్రచురించారు. ఇతను "మాలి, చిన్నయ్య, చెరువు, బ్రతుకుతెరువు, కళాపిపాసి" అనే సుప్రసిద్ధ నాటకములు వ్రాసి ప్రసిద్ధికెక్కిరి. కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం వారి కోరిక మేరకు వీరు రచించిన 'గోదావరి కిన్నెర' అనే రూపకానికి జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది.

**మీగడ రామలింగస్వామి:**

శ్రీకాకుళం జిల్లాలోని రాజాం పట్టణం ఇతని జన్మస్థలము. ప్రముఖ రచయిత, దర్శకుడు, నటుడు, ఆయన బహుముఖమైన ప్రజ్ఞతో పౌరాణిక రంగస్థలంపై జేజేలు అందుకుంటున్నారు. నటుడిగా, పద్య నాటక రచయితగా రాగయుక్తంగా అలరించే సంగీతజ్ఞుడిగా తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. శ్రీ మీరా కళా జ్యోత్స్న నాటక సమాజాన్ని 1982లో ఏర్పాటు చేశారు. స్వీయరచనలైన శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యము, అశ్వత్థామ, గుణనిధి, కుంతీ కర్ణ, యమునాచార్య, ఉత్తర రామాయణం, భక్త ప్రహ్లాద వంటి పౌరాణిక నాటకాలు రచించారు. నటుడిగా దేశ విదేశాల్లోనూ పలు ప్రదర్శనలు చేశారు. పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, టీవీ సీరియల్స్, ఏకపాత్రాభినయాలు, పరిశోధన గ్రంథాలు, ప్రబంధ నాటికలు, నృత్య రూపకాలు వంటి ప్రక్రియల్లో వందకు పైగా

రచనలు చేసి ప్రసిద్ధి చెందారు. ఉత్తమ పద్య నాటక రచయితగా నంది అవార్డును శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యము అనే నాటకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది నాటక పరిషత్తు వారు 2022లో ప్రధానం చేశారు. ఇతని నాటకరంగ సేవకి మెచ్చుకుని పలుసంస్థలు స్వర్ణ కిరీటము, స్వర్ణ పుష్పాభిషేకం, స్వర్ణ మకర కుండలాలు, స్వర్ణ కంకణము వంటి ఘన సన్మానాలు చేశారు.

**గణేష్ పాత్రో:**

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పార్వతీపురంలో పుట్టిన గణేష్ పాత్రో గొప్ప నాటక రచయిత. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో ఐదేళ్ల కాలంలో ప్రథమ శ్రేణి నాటకకర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా వ్రాసిన ప్రతి నాటికా, నాటకం రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందినది. కథా వస్తువును పరిగ్రహించడంలో, కథనంలో, పాత్రచిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం ఈయన రచన విధానంలో ప్రత్యేకత. "మృత్యుంజయుడు, తెరచిరాజు, తరంగాలు, అసురసంధ్య అనే నాటకాలను, కొడుకు పుట్టాలా, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి" మొదలైన నాటికలు ఆంధ్ర ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ నాటక రచనలు.

**ముద్దంశెట్టి హనుమంతరావు:**

ఇతడు సుప్రసిద్ధ కథా, ప్రఖ్యాత నవలా రచయిత, నాటక ప్రయోక్త, చిత్రకారుడు, నటుడు. శ్రీకాకుళం జిల్లా కలివరం గ్రామంలో జన్మించారు. ఉద్యోగరీత్యా ఖరగ్ పూర్ రైల్వే శాఖలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ఇతడు సాహితీ సేవలో 150 కథలు, 50 నవలలు, 20 రేడియో కథానికలు, 10 టెలీ ఫిల్ముల కథలు రచించి పేరొందారు. నాటకాలలో "నిమిత్తమాత్రులు, ఆలుమగలు" అనే సాంఘిక నాటకాలు ఇతనికి పేరు తెచ్చి పెట్టినవి. రావూజీ నేతృత్వంలోని అమ్మ సంస్కృతి సంస్థ ప్రదర్శించిన 93 నిరంతర నాటక ప్రదర్శనలకు ముద్దంశెట్టి హనుమంతరావు ప్రత్యేక ఆహ్వానితుడు.

**రాంభొట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి:**

ఇతను శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలంలోని గుడివాడ అగ్రహారంలో జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి వద్ద రామాయణ, భారత, భాగవతాలను విని తెలుసుకున్నారు. కొంతకాలం అధ్యాపకునిగా పనిచేశారు. వీరు "ప్రతీకారం" పేరుతో సంస్కృత నాటకాన్ని రచించి పేరుపొందారు.

ఇంకను శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాటక రచయితలలో పాలకొండకు చెందిన గోపాలరావు "రాయి" అనే నాటకమును, పేడాడ పరమేశ్వరరావు "పక్షి" అనే నాటకమును రచించారు. ఈ విధముగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాటక రచయితలు, కళాకారులు నాటకరంగము వికాసానికి దోహదపడ్డారు. ప్రభుత్వపరంగా కూడా రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా 686 మంది కళాకారులకు జీవనభృతిని అందిస్తుండటం, శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య లాంటి సాంస్కృతిక సంస్థలు పేద కళాకారులకు ప్రతినెలా ఆర్థిక చేయూతతో పాటు జిల్లా కేంద్రము, ఇతర ప్రాంతాలలో ప్రదర్శనకు అవకాశాలు కల్పిస్తుండడంతో చిక్కోలు నాటక రచనారంగం చిగురిస్తుందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రొఫెసర్ సిమ్మన్న వెలమల (2011), తెలుగు సాహిత్య చరిత్ర, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం.
2. డా॥ ద్వా.నా. శాస్త్రి (1998), తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణలు, హైదరాబాద్.
4. రంగస్థలశాస్త్రము (2002), తెలుగు అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్.
5. అంతర్జాలం వికీపీడియా నుండి కొంత సమాచారం.

# నల్లగొండ జిల్లా సాంఘిక నాటక సాహిత్యం

**శీలం భద్రయ్య,**
పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్
తెలంగాణ మోడల్ స్కూల్, వల్లాల
శాలిగౌరారం, నల్గొండ జిల్లా
సెల్ : 9885838288

**1. పరిచయం:**

ప్రపంచంలో మొట్టమొదటి ఆధునిక రూపకం క్రీస్తు పూర్వం 525-456 మధ్య గ్రీసులో పుట్టింది. గ్రీకు నాటకానికి సాహిత్య రూపాన్ని "ఈస్కిలస్" కలుగజేశాడు. పాత్ర రూపం, వేషం, భాష, భావం వంటి అంశాలను నటుడు ఆరోపించుకునే పరిణత స్థితిని "రూపకం" అంటారు. దీని పర్యాయపదమే "నాటకం". సాహిత్యం, అభినయ కళ ఇమిడి ఉన్న సంపూర్ణ సమాహారకళ నాటకం. కళ మానవ జీవితానికి వాస్తవిక, కల్పిత ప్రతిబింబం. చిత్రలేఖనము, శిల్పము, సంగీతము, నృత్యము, కవిత్వమును కలిపి "లలిత కళలు"(Fine Arts) అంటారు. లలిత కళలలో కావ్యం గొప్పదయితే, కావ్యాలలో నాటకం గొప్పది. అందుకే కాళిదాసు "కావ్యేషు నాటకం రమ్యం" అన్నాడు.

భారతీయ సాంప్రదాయ సంస్కృత నాటకంలో మొదటి రచయిత అశ్వఘోషుడు (క్రీ. శ. 80-150). ఆధునిక భారతీయ తొలి ఆంగ్ల స్వతంత్ర నాటకం కృష్ణ మోహన్ బెనర్జీ రాసిన "ద పెర్‌సెకుటేడ్ (The Persecuted-1837). ఇది సాంప్రదాయ సామాజిక నిబంధనలను సవాలు చేస్తూ వచ్చింది. హిందీ నాటక పితామహుడుగా భావించే భారతేందు హరిశ్చంద్ర మాంసాహారం వలన కలిగే హింసను గురించి "వైదిక హింసా న భవతి"(1873) అనే నాటకాన్ని రాశాడు. వేశ్య జీవితంపై క్రీ.శ. 14వ శతాబ్దంలో వినుకొండ వల్లభరాయడు రాసిన తొలి తెలుగు వీధినాటకం "క్రీడాభిరామం".

సంస్కృత, ఆంగ్లం నుండి అనువాదాలు కొక్కొండ వెంకటరత్నం (నరకాసుర విజయ వ్యాయోగం-1871), వావిలాల వాసుదేవ శాస్త్రి (సీజరు చరిత్ర-1872) లతో ప్రారంభమై, స్వతంత్ర్య రచనగా ఎదిగి, ఔత్సాహిక నాటకరంగంగా, ప్రయోగనైపుణ్యంతో విస్తృతంగా పరిణామం చెందింది. వినోదంతో బాటు ఉపాధిరంగంగా మారడంతో తెలుగు నాటకరంగంలో నాటకసమాజాలు, నాటక కళాకారులు ఏర్పడ్డారు. రంగం తయారీ, సంగీతం, నటుల పారితోషికం, రంగురంగుల కాంతి వెలుగులు తెలుగు పద్య, గద్య నాటకాలతో ప్రజలు పులకించిపోయారు. కాలక్రమేనా నాటకప్రదర్శన వ్యయభరితమైంది.

రెండవప్రపంచయుద్ధం, మాంద్య ప్రభావంతో జమిందారులు, సంపన్నుల ఆదరణ నాటకానికి తగ్గింది. దాంతో కాంట్రాక్టుపద్ధతిన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. 19 శతాబ్దం చివరలో ఐరోపా నాటకంలో చప్పట్లు కొట్టడానికి కిరాయి మనుషులను ప్రేక్షకులలో కూర్చోబెట్టడమనే "క్లాకర్ పద్ధతి" వచ్చింది. ఆంధ్రప్రాంతంలో 1960 లో దీనిని పరిచయం చేశారు. అదే సమయంలో మూకీ సినిమా టాకీగా(భక్తప్రహ్లాద-1932) మారింది. కాంట్రాక్టు నాటకాలపై ప్రజల ఆసక్తి తగ్గింది. కాంట్రాక్టర్ల దోపిడీ నచ్చని ప్రతిభ కలిగిన కళాకారులు సినిమావైపు వెళ్ళడంతో నాటకానికి క్షీణదశ ఆరంభమైంది.

అదేసమయంలో 'కళ అనేది కళ కోసమే కాదు, ప్రజల కోసమనే' అభిప్రాయంతో సాంఘిక నాటక యుగం మొదలైంది. సాంఘిక నాటకం సమాజంలోని సమస్యలను ఎత్తిచూపుతూ సామాజికుడికి వినోదంతోబాటు, సమస్యా చైతన్యాన్ని కలుగజేసింది. దీనికి గొప్ప ప్రేక్షకాదరణ లభించింది.

తెలుగులో తొలి సాంఘిక నాటకాలు "నందకరాజ్యం" (వావిలాల వాసుదేవ శాస్త్రి), "వ్యవహార ధర్మ బోధిని/ ప్లీడరు నాటకం (కందుకూరి) అవినీతి, ధనాశవంటి అంశాలను చర్చకు బెట్టింది. తరువాత వచ్చిన గురజాడ "కన్యాశుల్కం(1897)"ను వాడుక భాషలో రాయడంతో తెలుగు సాంఘిక నాటకం మరింత బలంగా ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది.

19వ శతాబ్ది ద్వితీయార్థంలో సంఘంలో అతిబాల్య వివాహాలు, వేశ్యాలోలత్వం, భోగం మేళాల మీద మోజు, కన్యాశుల్కం, కుల కక్షలు, మత కలహాలు, అంటరానితనం, శకునాలు, శాతబడులు, జాతర్లు, జంతుబలులు, మద్యపానం మొదలైన సమస్యలున్నాయి. 20వ శతాబ్దంలో విదేశీపాలన, పాశ్చాత్య నాగరికత, పెట్టుబడిదారి దోపిడి, దళారుల అన్యాయాలు, బెంగాల్ లో బయలుదేరిన సాంఘిక, మత, సామాజిక సంస్కరణల ప్రభావం, మార్క్సిస్టు సిద్ధాంతాలు, భౌతికవాదం, అతివాద భావాలు యువకులను విశేషంగా ఆకర్షించాయి. పతనావస్థలోనున్న భూస్వామ్య, జమిందారీ వ్యవస్థలు ఆత్మరక్షణ కొరకు ఆకృత్యాలకు తెగబడ్డాయి. దానికి వ్యతిరేకంగా పేదరైతులు, రైతుకూలీల జరిపిన పోరాటం అభ్యుదయ సాంఘిక నాటకానికి ఊపిరిలూదింది.

తెలుగు ప్రాంతంలో కాలంతోబాటు, సమాజం, సమస్యలు మారుతూ వచ్చాయి. దానితో బాటు సాంఘిక నాటకరచన కూడా మార్పుకులోనయింది. తెలుగు రచయితలకు అంతర్జాతీయ సాహిత్యం అందుబాటులోకి వచ్చింది. "ఇబ్సన్, బెర్నార్డ్ షా, చెకోవ్, టాల్ స్టాయ్" వంటి రచయితలచే ప్రభావితులయ్యారు.

తెలంగాణలో నాటకం దేశీ రూపకం. ఆంధ్రాప్రాంతంలో నాటక కళాభివృద్ధి జరిగినంతగా తెలంగాణలో జరుగలేదు. ఇక్కడ ప్రదర్శనలు జరిగినంతగా, నాటక రచన జరగలేదు. తెలంగాణలో భద్రాచలం, దుమ్ముగూడేనికి చెందిన భూస్వామి సోమరాజు రామానుజరావు మొట్టమొదటి నాటక రచయిత. జాతీయోద్యమ ప్రభావంతో 'స్వరాజ్య రథం(1921)' అనే నాటకాన్ని రాశాడు. దీనిని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.

1933లో తెలుగు ప్రాంతంలో కమ్యునిస్టు పార్టీ ఆవిర్భవించింది. యువత ప్రగతిశీల దృక్పథంవైపు ఆకర్షించబడ్డారు. "కళ, కళ కోసమే కాదు, ప్రజల కోసమనే" అభిప్రాయంతో 1943లో 'ప్రజా నాట్యమండలి' స్థాపించబడింది. తెలంగాణ విమోచనోద్యమం, కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతో ప్రభావితమై ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ ఎన్నో నాటకాలు రచింపబడి, ప్రదర్శింపబడ్డాయి. ఈ ప్రజాపోరాటం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన నల్లగొండ జిల్లాలో జరిగిన పోరాటం ఇతివృత్తంగా సుంకర వాసిరెడ్డి రచించిన "మా భూమి"(1947) నాటకాన్ని రచించగా, 125 నాటక దళాలు పాల్గొని, దీనిని ఏడాదిలో వెయ్యి ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన రాసిన "ముందడుగు" నాటకంలో భూస్వాముల దోపిడీ, రైతుల తిరుగుబాటును, వర్గసంఘర్షణను చూపారు. తెలంగాణ పోరాట పరిణామాలను చిత్రిస్తూ, 'మా భూమి' నాటకానికి కొనసాగింపుగా సుంకర సత్యనారాయణ 'గెరిల్లా" నాటకం, పొట్లపల్లి రామారావు 'పగ, సురభరాహి, న్యాయం' లాంటి నాటికలు, భారత యూనియన్‌లో ఈ ప్రాంతం కలవాలని, డా. రాజారావు "వీరనారి"(1948) అనే నాటకం, సుంకర సత్యనారాయణ 'వీర కుంకుమ', కాంగ్రెసా-ఆంగ్రేజా', మహీధర రామ్మోహనరావు 'శాంతి రక్షణ కోసం, 'రిపబ్లిక్ వెలిసింది' అనే నాటకాలను రచించారు. తెలంగాణ పోరాటంతో పట్టణాలకు పారిపోయి తిరిగి గ్రామాలకు వచ్చిన దేశ్ ముఖ్ లు ప్రజలను హింసించిన తీరును వాసిరెడ్డి భాస్కరరావు "పోతుగడ్డ" నాటకంలో రాశారు. భూదానోద్యమం ప్రభావంతో సుంకర "భూమికోసం", రమణారెడ్డి "అన్నపూర్ణ" నాటకాలను రాశారు. సుంకర వాసిరెడ్డి "అపనింద" అనేది మధ్యతరగతి యువతి తనను తిరిగి ప్రేమించలేదని నీలాపనిందలు వేసే యువకుడి నీచప్రవృత్తిని బహిర్గతం చేసిన సాంఘిక నాటకం.

**2. నల్లగొండ జిల్లా సాంఘిక నాటక సాహిత్యం:**

ఒక ప్రాంతం చరిత్ర పాలకులచే, సంస్కృతి భౌగోళిక పరిస్థితులచే ప్రభావితమవుతుంది. పూర్వ నల్లగొండ జిల్లాలో కృష్ణానది, మూసీ నదులున్నాయి. నదీతీరాల వెంట సంస్కృతి వృద్ధి చెందుతుంది. నాటకం సంస్కృతిలో ఒకభాగం. నల్లగొండ ప్రాంతాన్ని ప్రాచీనకాలంలో శాతవాహన, ఇక్ష్వాకులు, మధ్యయుగంలో రాచకొండ, కాకతీయ, కుతుబ్‌షాహీలు,

ఆధునిక యుగంలో అసఫ్‌జాహీలు(నిజాం రాజులు) పరిపాలించారు. పోలీస్ చర్య అనంతరం1948లో స్వతంత్ర భారత యూనియన్‌లో విలీనమయ్యింది. నల్లగొండ ప్రాంతం ఎక్కువకాలం రాచరికపు నీడలో ఉంది. కాబట్టి ఈ ప్రాంతం ఆర్థిక, సామాజిక, సాంఘిక, రాజకీయ, భాష, విద్యాపరంగా తీవ్ర వెనుకబాటుకు గురైంది. ఫ్యూడల్ సమాజం ఇక్కడి ప్రజలను తీవ్రపీడనకు గురిచేసింది. దీనికి వ్యతిరేకంగా జాతీయోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, కమ్యునిస్టు పోరాటాలతో ప్రజలు చైతన్యవంతమై, నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధపోరాటం చేశారు. ఈ పోరాటాలకు గొల్ల సుద్దులు, బుర్ర కథలు, వీధి భాగోతాలవంటి జానపద కళారూపాలతో బాటు సాంఘిక నాటకం ఉపయోగపడింది.

నల్లగొండ జిల్లా నాటకసంస్థలపై డా. లింగనబోయిన లేఖానందస్వామి పరిశోధన చేశారు. వారి పరిశోధన ప్రకారం ఇక్కడ దాదాపుగా 50కి పైగా వివిధ నాటక సంస్థలు ఉన్నాయి. కానీ ప్రదర్శించిన నాటకాలతో పోలిస్తే, నాటక రచయితలు చాలా తక్కువగా ఉన్నారు. ప్రదర్శించిన నాటకాలు రాసినవారు ప్రాంతేతరులవే ఎక్కువగా ఉన్నాయి. వాటికే ప్రాచుర్యం దక్కింది. తెలుగు నాటక రంగానికి కేంద్రబిందువుగా నాటకప్రియులు పేర్కొనే గుంటూరు జిల్లా "తెనాలి" నల్లగొండకు సమీపంలో ఉంది. ఆంధ్రాప్రాంతం బ్రిటీషుపాలిత తెలుగు ప్రాంతం. అక్కడ ఆంగ్లమాధ్యమ మిషనరీ పాఠశాలలు నెలకొల్పడంతో, వారు ఆంగ్లనాటక సాహిత్యాన్ని అధ్యయనం చేసి, ప్రభావితమయి ఆకర్షణీయమైన నాటక రచన చేశారు. అదేవిధంగా నాటక పరిషత్తు నిర్వహణ, పోటీలు ఎక్కువగా ఆ ప్రాంతాల్లోనే జరిగేవి. ఈ పోటీలకు తయారయ్యే ఔత్సాహిక నల్లగొండ నాటక సంస్థలు సహజంగా అక్కడి రచనలనే ఎంచుకోవడం ప్రారంభించారు. అయినా నల్లగొండ జిల్లాలో కె.యల్. వంటి రచయితలు సాంఘిక నాటకాలు, నాటికలు రాసి తెలుగు నేలంతా మెచ్చేవిధంగా ప్రదర్శించారు. ఆంధ్రా ప్రాంతంలో నాటకరంగంలోని నటులు వృత్తిగా మలుచుకోగా, నల్లగొండ ప్రాంతంలోని నటులు ప్రవృత్తికళగా, పవిత్రమైన కళగా భావించినట్టు అర్థమవుతుంది.

తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీ నరసింహారావు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మునగాల పరగణా, రేపాల గ్రామంలో జన్మించాడు. ఈయన నల్లగొండ నాటకానికి వెన్నుపూస వంటివాడు. తెలుగు నాటకరంగానికి తన జీవితాన్ని, యావదాస్తిని నిస్వార్థంగా అర్పించిన మహనీయుడు. తండ్రి కోదాటి వెంకట నరసింహారావు గ్రామ కరణంగా పనిజేస్తూ, రైతుల పక్షం వహించి, భూస్వామ్య వ్యతిరేక ఉద్యమం చేశాడు. కె.యల్. టీచర్ల ప్రేరణతో అభ్యుదయ సాహిత్యంవైపు ఆకర్షితుడైనా, ఆ ప్రభావం నుండి త్వరగా బయటపడ్డాడు. 1945 కాలంలో ఆ ప్రాంతంలో భూస్వాములు తమ దగ్గర పనిజేసే జీతగాళ్ళను చులకనగా చూసేవారు. వారిలో చైతన్యం తేవాలని "విప్లవ శంఖం" నాటకం రచించాడు. దీనిని ప్రదర్శించడానికి ఎవరూ సాహసించకపోతే మిత్రులు వేముల నరసింహం, కందిబండ మంగయ్య, వారణాసి, చివలూరి, ఆచార్యలాంటి మిత్రులతో కలిసి నటించి, ప్రదర్శించాడు. ఈ నాటక ప్రభావంతో జీతగాళ్ళు తమ హక్కులను కోరుతూ, భూస్వాములకు ఎదురుతిరిగారు. దాంతో కె.యల్. "గ్రామవెలుగు నాట్యమండలి"ని 1 జనవరి1946లో "రేపాల" గ్రామంలో స్థాపించారు. దీనిద్వారా గ్రామ ప్రజలలో మార్పు తేవడానికి, వారి బాధలను, వారి భాషలోనే నాటకాలను రచించి, ప్రదర్శింపజేయాలని సంకల్పించాడు.

ఈ కార్యక్రమాలను ప్రజారంజకంగా మార్చడానికి "వైజ్ఞానిక మహాసభలు ప్రదర్శనల" పేరుతో లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో భాగంగా ప్రతీయేడు నాటకాలను అట్టహాసంగా ప్రదర్శించేవాడు. ఈ ప్రదర్శనలకు మాజీ ప్రధాని పివి నరసింహారావు మొదలు ఎందరో సినీ, రాజకీయ, సాహిత్య దిగ్గజాలను ఆహ్వానించేవాడు. ఈయన రచించిన సాంఘిక నాటకాలపై త్రిపురనేని గోపీచంద్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సామాజిక సమస్యలు, సంభాషణల్లో హాస్యం, సంస్కరణ వాదం ఈయన నాటకాల్లో ముఖ్యమైన అంశాలు. ఈయన నాటక సంభాషణలు పూరిగుడిసెల్లో నివశించే పేదల స్థాయికి చేరి, వారిని ఆలోచింపజేసే స్థాయిలో ఉండేవి. కెయల్ దాదాపు 150 కిపైగా నాటకాలు రాశాడు. ఇవన్నీ సాంఘీక నాటకాలే కావడం విశేషం. ఈయన రాసిన నాటకాలు జిల్లా నాటకాల సంఖ్యకు మించి ఉంటుందంటే

అతిశయోక్తి కాదు.

"విప్లవ శంఖం, ఆదర్శ లోకాలు(కులమత రహితమైన సమసమాజాన్ని స్థాపించాలని), అభాగ్యులు, స్వార్థం, సుడిగుండం, ఒడిదొడుకులు, దూరపు కొండలు, తేజోమార్గం, పాముల పుట్ట, ప్రజారథం, తోడునీడ, కల్పతరువు, గెలుపు నీదే, అడుగుజాడలు, తొలకరి, ప్రజాదేవత, మతిలేనిమహారాజు, అపరాధ పరిశోధకులు, రేపటికి వాయిదా, అక్బర్, క్రీనీడలు" మొదలైన సాంఘిక నాటకాలు అశేషజనాన్ని ఆకట్టుకున్నాయి. గ్రామాల నుండి నక్సలిజం సమస్యను తొలగించడానికి, ప్రజలను చైతన్యపరచడానికి కెయల్ సాయంను ప్రభుత్వం కోరింది. ఆయన నక్సలిజం వలన ధన, ప్రాణ నష్టాలను పేర్కొంటూ, కరుణరసాత్మకంగా "భారతి" అనే నాటకాన్ని రాశారు. ఆయన నాటకరచన, దర్శకత్వం, నాటక నిర్వహణతో బాటు బాలల, చారిత్రక, మనస్తత్వ నిరూపక, రేడియో నాటకాలను రాశాడు. వయోజన విద్యా కార్యక్రమం, నక్సలిజం, అంతరానితన నిర్మూలన ఇలా సాంఘీక సంస్కరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. అనేక చోట్ల దీనిని రాష్ట్ర సాంస్కృతిక శాఖ ప్రదర్శించింది. ప్రదర్శనలో పాల్గొన్న నటులకు ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది.

నల్లగొండ జిల్లాలో జాతీయోద్యమంతో బాటు హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటం ఉవ్వెత్తున సాగింది. దీని ప్రభావం వలన అభ్యుదయ నాటకాలు వెలువడ్డాయి. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల ఆగడాలు, వెట్టిచాకిరి, దొరలు, దేశ్ ముఖ్ నిరంకుశ వైఖరి వలన ప్రభావితమైన రచయితలు నిజాంకు వ్యతిరేకంగా గవ్వా మురహర రెడ్డి "గుంటక పురాణం, కళ్యాణి" నాటకాలు, వట్టికోట ఆళ్వారుస్వామి "కనువిప్పు" నాటకాన్ని, గవ్వా జానకీ రామిరెడ్డి "దేశబంధు, సత్పథం", పులిజాల గోపాలరావు "విజయ భాస్కరం, ధర్మ జీవనం, తెలుగు పొలం", ఏలే ఎల్లయ్య "బీద రైతు, మార్కేండేయ, సీతా కళ్యాణం" వంటి సాంఘిక నాటకాలను రాశారు. ముదుంబయి వెంకటనరసింహచార్యులు "తిండికి మెండు, సింహ స్వప్నం, ద్రోహం, మహిళాభ్యుదయం" వంటి నాటకాలు, బద్దం భాస్కర్ రెడ్డి(చెరబండరాజు) "గంజినీళ్ళు, బీదల బతుకులు" వంటి విప్లవాత్మక నాటకాలు రచించారు.

పెరిక రాజారత్నం (1957-58) "ఎవరు బాధ్యులు?, నూతన కాంతులు(పంచవర్ష ప్రణాళికను ప్రజలకు వివరించిన నాటిక), డాలియా(రవీంద్రనాథ్ ఠాగూర్ రచనకు అనువాదం), తపస్విని-1978 (తరువాత దీనిని టెలిఫిలింగా కూడా తీశాడు), పుణ్యభూమి, ఎడారి బతుకు" నాటకాలను, ఇష్టంలేని పెళ్లి, నూతన కాంతులు" నాటికలను రచించి, ప్రదర్శించాడు. వీరు 1973లో రామన్నపేట శాసనసభ్యులుగా పనిజేశారు. సుద్దాల హనుమంతు తెలంగాణ పోరాటకాలంలో (1945-46) రచించిన "పల్లెటూరి పిల్లగాడ... గేయం ప్రతి సాంఘిక నాటకంలో వేదికలపై ప్రదర్శించి మన్ననలు పొందింది. హైదరాబాద్ విమోచనోద్యమంలో పాల్గొన్న ప్రముఖ శాసన చరిత్రకారుడు బి.ఎన్. శాస్త్రి ఆ ప్రభావంతో "నీరాజనం(1951-52), కిరాయిదారు, గ్రామ జీవనం, సహకారం" నాటికలను రాశాడు. సమాజంలోని మంచి చెడులపై అవగాహన కల్పిస్తూ, ఎలిశెట్టి బాలకృష్ణ "న్యాయం తప్పుకుంది, గ్రామ సింహాలు" వంటి నాటికలను, దేవులపల్లి వెంకటప్రభాకర రావు "ఓటరు లీలలు" నాటిక, మరిగంటి వెంకటసింహచార్యులు "లలిత", ప్రసిద్ధ కథా రచయిత బోయ జంగయ్య తన కష్టాలు, అనుభవాలను పొందుపరిచి పాఠశాల స్థాయిలో రాసిన "కష్ట సుఖాలు (1963)నాటికతోనే అతని రచనారంభం ప్రారంభమైంది.

ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలు తొలగించడానికి పెంటపాడు సర్వేశ్వరరావు "అష్టాగ్రహ కూటమి" నాటకం, సామాజిక సమస్యలను ఇతివృత్తంగా ఆలేర్ శంకర్ "జంగబిల్లి, చావుకేకలు, రేపటి రేపు, భూత గణం, చట్టం క్షమిస్తుందా?, కాళీ, ఓ తల్లి తీర్పు, అర్చన, ఎన్నికలు, భద్రం కొడుకో" లాంటి నాటికలను రాశాడు. ఇదే అంశంలో బి. మల్లారెడ్డి "తుది తీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, లంకె బిందెలు, శంఖారావం, ఆదర్శం, గ్రామ దేవతలు" అనే నాటికలను రాశాడు. మూర్తిగారి జనార్ధన్ "రచ్చబండ" నాటికను, సూర్యాపేటకు చెందిన కవిరాజు "సంగం పెళ్లి, రిహార్సల్స్" హాస్య వంగ్య నాటికలను రాశాడు. సరస్వతీభట్ల కృష్ణమూర్తి "వీరపత్ని" నాటకాన్ని, పగిడిమర్రి దుర్గారావు "ఉత్తర గోగ్రహణం, నాట్యశాల, భూమితల్లి బిడ్డలు, శోణపద్మం" నాటికలను రాశారు.

కుటుంబ, వైయుక్తిక బాధలు, కష్ట సుఖాల, బాంధవ్యాలు, వివిధ సాంఘిక సమస్యలు నేపథ్యంగా వచ్చిన పగిడిమర్రి దుర్గారావు "అందరికీ నచ్చిన కోడలు" నాటకం, గంజి గోవర్ధన్ "భూమితల్లి" నాటకాలను రచించారు. మునగాల మండలం జగన్నాథ పురానికి చెందిన కొల్లు మధుసుధన్ రావు "మన విశ్వంలో మానవుడు" పిల్లల ప్రభోదాత్మక రూపకం రచించాడు. ఇతను "స్వప్న జీవులు(1967), పైరవీకార్ (బాలల నాటిక), గ్రామ సింహాలు, మామకు తగ్గ అల్లుడు" వంటి సాంఘిక నాటికలను రాశాడు. బోయపల్లి నర్సయ్య "సగటు బతుకులు, ఇది మనకథ, మామూలు మనిషి, సమాధులపై పునాదులు" నాటకాలను రాశాడు. ఆకెళ్ళ నరసింహమూర్తి "గెలుపు నీదే, అడుగు జాడలు" నాటికలు రాశాడు. కె.యల్. తర్వాత జిల్లానాటక రంగంలో పేరెన్నికగన్నవారు తడకమళ్ళ రాంచందర్ రావు. ఈయన పద్య, చారిత్రక నాటకాలతో బాటు సాంఘిక నాటకాలైన "దండకారణ్యం, మమజీవన హేతునా, కళాజీవి, రిగ్ వేదం, పంజరం, ఎందుకు పారేస్తాను?, ఇంట గెలిచి, సారారక్కసి, స్వాతంత్ర్య సమరజ్వాల (చారిత్రాత్మక నాటిక) వంటివి రాశాడు. గజ్వెల్లి సత్యం రచయితగా "పరివర్తన, మార్పు, మధుపర్కం" లాంటి నాటికల ద్వారా సమకాలీన సమాజంలోని అంతరాలను దృశ్యీకరించాడు. డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్యులు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత, సాహిత్యరంగాలలో జిల్లాలోనే కాకుండా సినీసంగీతంపై "జాతీయ ఉత్తమ విమర్శ అవార్డు"ను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నాడు. ఈయన పౌరాణిక, సాంఘిక నాటకాలను రాశాడు. "ప్రాణత్యాగం, కనువిప్పు, ఎత్తుకు పై ఎత్తు, నకిలీ మెజిషియన్, ఇదేబాట, కర్ణ సందేశం, యెంకన్న ఎరుక, పెళ్ళికుదిరిది, చీకటి తెరలు, ఇనిస్పెక్షన్, ఉత్తరాయణం, రెండు వరాలు, కొత్త వెలుగు, శుకనాదం, ప్రభాత భేరి, శివాలు, ప్రదక్షిణం, ఇదీ వరస, కళ్ళు తెరచిన బాల్యం, మళ్ళీ బడికిరా, తిరగబడిన పద్యం, పదివేలు, ఇలాగైతె!?" లాంటి నాటిక, నాటకాలను రంగస్థలంపై ప్రదర్శించుటకు అనుకూలంగా రాశాడు. ఈయన "కాలం మారింది, పట్వారి(1975), జీతగాడు, తొలగిన తెరలు, బస్టాండు లో బాధితుడు, రక్తపాశం, క్షమిత" లాంటి సాంఘిక నాటికలను రాశాడు. బి. మల్లారెడ్డి "తుది తీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, లంకెబిందెలు, శంఖారావం, ఆదర్శం, గ్రామ దేవతలు" అనే నాటికలను రచించారు.

"రచ్చబండ" అనే నాటికను మూర్తిగారి జనార్ధన్ రాశాడు. సూర్యాపేటనుండి కవిరాజు వ్యంగహాస్యరసస్ఫోరకంగా "సగం పెళ్ళి, రిహర్సల్స్" లాంటి నాటికలు రాసి ప్రదర్శించాడు. సరస్వతీభట్ల కృష్ణమూర్తి "వీరపత్ని" అనే నాటకాన్ని కవిరాజ్ రాశాడు. బిస్నూరు నరసింహశాస్త్రి "నీరాజనం, కిరాయిదారు, గ్రామ జీవనం, సహకారం" లాంటి నాటికలను రాశాడు. యెలిశెట్టి బాలకృష్ణ "న్యాయం తప్పుకుంది, గ్రామ సింహలు" నాటికలను రాశాడు. లెక్కల మల్లారెడ్డి "తుది తీర్పు మీరే చెప్పండి, కనువిప్పు, శంఖారావం, ఆదర్శం, గ్రామదేవత, లంకె బిందెలు" లాంటి నాటికలను రాశాడు. అంబడి పూడి వెంకటరత్నం "దక్షిణం, ఇందిరా విజయమ్(సంస్కృతం), కౌముదిక ఏకాంకికలు, చూడాల, అకృతజ్ఞోనరస" నాటికలు రాశాడు. పరిమిశ్రీరామమూర్తి "అభ్యుదయం"(నాటకం) దీక్ష, ముందడుగు నాటికలను రాశాడు.

వారణాసి వీరనారాయణ శర్మ "మనమంతా ఒక్కటే", పరిమి శ్రీరామ మూర్తి "అభ్యుదయం" లాంటి నాటకాలను రచించారు. సూర్యాపేటకు చెందిన ఖాజా పాషా "శాపగ్రస్తులు" అనే నాటకం రచించాడు. ఈ నాటకం 2006 నంది నాటకోత్సవాల్లో ఏకంగా 6 నందులను కైవసం చేసుకుంది. దళిత భాషాసాహిత్యానికి చుక్కాని అనదగిన వేముల ఎల్లయ్య ఉద్యమం పేరుతో అమాయకులను సమాజం మీదకు ఉసిగొల్పే రాజకీయ దుర్నీతిని ఎండగడుతూ "బహువిధ"(2016) నాటకాన్ని అచ్చమైన తెలంగాణ భాషలో రాశాడు. నకిరేకల్ కు చెందిన ప్రభుత్వ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ఎర్రా యాదగిరి చదువు వెలుగు, ఎయిడ్స్ మహమ్మారి వంటి పలు సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించుటకు, పౌరాణిక కథలను, "మార్పు" వంటి నాటకాలుగా మలిచి ప్రదర్శించాడు. చెడు వ్యసనాలకు బానిసై వృద్దులైన తల్లిదండ్రులను అనాదరించే కొడుకుకు బుద్ధి చెప్పే నాటిక శీలం భద్రయ్య "ఖూనీ(2023)" వంటివి ఈ జిల్లానుండి వచ్చాయి.

నల్లగొండ జిల్లా నాటకరంగాన్ని పరిశీలిస్తే ఎక్కువగా నటీనటులు, దర్శకులు, సంగీత వాయిద్య నిపుణులు,

అరుదుగా రచయితలున్నారు. ఇక్కడి నాటకసమాజాలు వేల ప్రదర్శనలు యిచ్చారు. మద్యపానం మహమ్మారి, చదువు గొప్పదనం, నక్సలిజం, దుర్వ్యసనాలు, మూఢనమ్మకాలు వంటి అనేక సామాజిక సమస్యలను కథలుగా ఎంచుకుని ప్రదర్శించిన గ్రామవెలుగు, స్త్రీలచేత పౌరాణిక నాటకాలు వేయించిన శారద కళాసమితి, బుద్ధులు మారాలి నాటకాన్ని వెయ్యి ప్రదర్శనలు ఇచ్చిన ఓంకార నాటక సంస్థ, శ్రీ జాగృతి, విజయభాను, శ్రీనికేతన్, కేవలం సాంఘిక నాటకాలనే ప్రదర్శించిన కోమలి కళా సమితి, సినీనటుడు నాగభూషణం ఆధ్వర్యంలో వేల ప్రదర్శనలు జరుపుకున్న రక్తకన్నీరును నిర్వహించిన విజయభాను కళాసమితి వంటివి ప్రఖ్యాతి గాంచినవి ఈ జిల్లాలో ఉన్నాయి.

**3. ముగింపు:**

నల్లగొండ నాటకరంగం విలీన, ప్రత్యేకరాష్ట్ర, భూదానోద్యమంవంటి ప్రజాఉద్యమాలు, నక్సలిజం, మద్యపానం, వరకట్నం, సాంఘిక అసమానతల వంటి సామాజిక రుగ్మతల నిర్మూలనకు, చదువుగొప్పదనం, స్త్రీ అభ్యుదయం వంటి సామాజిక సమస్యల మేలుకొలుపుకు, ప్రభుత్వ పథకాలను పేదలకు చేర్చడానికి తీవ్రంగా కృషిచేసింది.

తెలుగు నాటక రంగం వ్యాపారమయం కావడంతో క్షీణదశకు చేరుకుంది. సామాజికమై విస్తృతమయినా ఆధునికత లోపించడం, యువతకు దూరమవడంతో నీరసించింది. సమాజ నాగరికతను పెంచి, ఆరోగ్యకర సమాజ స్థాపనలో సాంఘిక నాటకం పాత్ర ఎప్పటికీ ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం, ప్రజలు అందరూ నాటకాన్ని రక్షించుకోవాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటకరంగ ప్రోత్సాహకానికి సంగీత, నాటక అకాడమి ఉండేది. నాటకరంగ ప్రముఖులకు 'నంది పురస్కారాల'ను ప్రోత్సాహంగా ప్రకటించేది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం 'భాష, సాంస్కృతిక శాఖ' ఆ బాధ్యతను నెరవేరుస్తుంది. నిజానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఆర్థికపరమైనది. పరిమితమైనది. ప్రేక్షకులను ఆకట్టుకోనే పూర్తిబాధ్యత మాత్రం నాటకరచయితలు, నటులదే.

ఆంధ్రప్రదేశ్ నాటకరంగ ప్రభావంతో నల్లగొండ జిల్లాలో అభివృద్ధి చెందిన ప్రాంతాలలోనే నాటకప్రదర్శనలు విరివిరిగా జరిగాయి. ఇతరప్రాంతాల్లో జానపదకళలు బుర్రకథ, బాగోతం, శారదకాండ్లు, చిందు, యాక్షగానం, చిడతల రామాయణ, గంగిరెద్దులవారు, కథ చెప్పేవారు వంటి కళాకారులు వినోద, విజ్ఞానాన్ని అందించారు. జానపద కళలను ఆంధ్రప్రాంతంతో పోలిస్తే, నల్లగొండ నాటక రచయితలు, నాటకరంగం పెద్దగా ప్రభావితం చేయలేకపోయింది. జానపద కళలు ఉపాధికళగా, సంప్రదాయకళగా, వినోద కళగా ఉండడంతో ఇప్పటికీ కొన్ని సజీవంగానే ఉన్నాయి. ఆంధ్రాప్రాంతంలో నాటకానికి గొప్ప కళాపోషకులు, అభిమాన ప్రేక్షకులు ఉన్నారు. ఇక్కడ అటువంటి విలువైన దాతలు స్వల్పంగా ఉండడంతో బాటు ప్రజలు జానపదకళల మీద చూపిన ఆదరణ నాటకం మీద చూపలేదు. ఆంధ్రాప్రాంతంలో నాటకాన్ని సినిమారంగం ప్రభావితం చేస్తే నల్లగొండలో జానపదకళలు ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. రంగురంగుల రంగాలంకరణతో సింగారించుకునే నాటక రంగం, నల్లగొండ జానపద కళలపై ప్రభావం చూపలేకపోవడానికి గల కారణాలను అన్వేశించాల్సిఉంది.

దశరూపకాల్లో నాటకం, ఉపరూపకాల్లో నాటికను పేర్కొన్నారు. నాటకం దాదాపుగా కనుమరుగైంది. ఇకపోతే నాటిక నిడివి, సమయం, పాత్రలు, సన్నివేశాలు కుదించుకుని వామనావతారం ఎత్తినప్పటికీ ప్రేక్షకాదరణ కరువైంది. రంగం, అలంకరణ, ధ్వని యిత్యాది విషయాల్లో ఆధునిక సాంకేతికత పెరగడం వలన, ఇది ప్రేక్షకాదరణను పెంచడానికి బదులు నిర్వహణ వ్యయాన్ని పెంచింది. విదేశాలలో నాటకరంగం హాలివుడ్ తో పోటీబడుతుంది. వాణిజ్యపర థియేటర్లలో ప్రేక్షకులకు టికెట్ దొరకడం చాలా కష్టమైన సందర్భాలుంటాయి.

ఇప్పుడు నల్లగొండ ఔత్సాహిక నాటకరంగ సంస్థలు, నిర్వాహకులు, నటులు చాలావరకు వృద్ధులయిపోయారు. స్వంత ఖర్చులతో నాటక నిర్వహణ కష్టమై, అడపాదడపా అన్నట్టు నిర్వహించడంతో ప్రేక్షకులు తగ్గిపోయారు. ఒకప్పుడు టెలివిజన్లు, వెండితెర కారణంతో కరువైన ప్రేక్షకులకు ఇప్పుడు అరచేతిలోనే వినోదం, విజ్ఞానం లభిస్తుండడంతో ఈ తరానికి నాటకం తెలియకుండా అయిపోయింది. నాటకంపై సినిమా ప్రభావం చూపితే, సినిమాపై సామాజిక మాధ్యమాలు,

యూట్యూబ్, ఓటిటి వంటి స్ట్రీమింగ్ వేదికలు ఇప్పుడు ప్రభావం చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో "జేనరేటివ్ కృత్రిమ మేథ"(Generative Artificial Intelligence) ఈ రంగంపై చాలా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే ఈ డిజిటల్ వేదికలపై ప్రదర్శించడానికి కూడా 'ఆకర్షణీయమైన విషయం' (Attractive Content) అవసరం ఉందనే ప్రాథమిక విషయాన్ని గమనించాలి.

మొదట పేర్కొన్నట్టు 'సాహిత్యం, అభినయ కళ ఇమిడి ఉన్న సంపూర్ణ సమాహారకళ నాటకం.' ఈనాటి డిజిటల్ తెరలపై నాటకంలోని వేదిక మారిందేమో కానీ, నాటకంలోని సాహిత్య అవసరం ముందు తరాలకూ ఉంది.

**ఆధార గ్రంథాలు**


1. ఆచార్య శ్రీహరి రవ్వా సం. (2016), తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, తెలుగు అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్
2. డా॥ లేఖానంద స్వామి లింగనబోయిన, నల్లగొండ జిల్లా నాటక సంస్థలు - చరిత్ర (అముద్రితం).
3. మారయ్య మల్లం (2018), కోమలి కళాసమితి, నల్లగొండ జిల్లా - ఒక పరిశీలన, (ఎం.ఫిల్ గ్రంథం).
4 రామకృష్ణ శాస్త్రి శిష్టా (1949), నాటక విమర్శనం, ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, విజయవాడ.
5. డా॥ వెంకటేశ్వరరావు బోయిన (1998), ఆధునిక నాటకరంగం - ఈ దశాబ్ది ప్రయోగాలు, ఆంధ్రసారస్వత సమితి. మచిలీపట్టణం.

# కాళ్ళకూరి నారాయణరావు నాటకాలు - సంఘసంస్కరణ

**డా. రాపోలు శ్రీనివాస్**
అసోసియేట్ ప్రొఫెసర్
తారా ప్రభుత్వ కళాశాల (స్వ.)
సంగారెడ్డి
సెల్: 9848050694

**ఉపోద్ఘాతం**

నాటకం శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. యక్షగానానికి రూపాంతరం నాటకం. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము, యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా ఒక నాటకమే. నన్నయ్య తన భారత అవతారికలో *"రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి"* అనడాన్నిబట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసుకోవచ్చు.

**కాళ్ళకూరి నారాయణరావు**

బహుముఖ ప్రజ్ఞాశాలి, సంఘ సంస్కర్త, మహాకవి బిరుదాంకితుడు, ప్రఖ్యాత నాటక రచయిత కాళ్ళకూరి నారాయణరావు పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరము మండలం, మత్స్యపురి గ్రామంలో 28 ఏప్రిల్ 1871న జన్మించాడు. తల్లితండ్రులు అన్నపూర్ణమ్మ, బంగారురాజు. ఇప్పటికీ సమాజాన్ని వేధిస్తున్న వరకట్నం, మద్యపానం, వ్యభిచారం సమస్యలపై వంద సంవత్సరాల క్రితమే ఉద్యమించిన అభ్యుదయవాది కాళ్ళకూరి నారాయణరావు. ఆయన కేవలం కవి కాదు. నాటకకర్త, సంఘసంస్కర్త, హరికథకుడు, నటుడు, బహువాద్య దురంధరుడు, పత్రికా సంపాదకుడు, ప్రచురణకర్త, ఛాయాగ్రాహకుడు, న్యాయవాది. తన కవిత్వంలో, రచనలో, వాక్కులో ఏది చెప్పాడో, దాన్ని ఆచరించిన ఆదర్శపురుషుడు.

చింతామణి, వరవిక్రయము, మధుసేవ, చిత్రాభ్యుదయం, పద్మవ్యూహం, సంసార నటన మొదలైన నాటకాలు, కారణంలేని కంగారు, దసరా తమాషాలు, లుబ్ధగ్రేసర చక్రవర్తి, రూపాయి గమ్మత్తు, ఘోరకలి, మునిసిపల్ ముచ్చట్లు, విదూషక కపటము వంటి ప్రహసనాలు రచించారు. వీనిలో వరవిక్రయములో కట్నాల సమస్యను, చితామణిలో వ్యభిచారాన్ని, మధుసేవలో మద్యపాన దురాచారాన్ని ముఖ్యమైన సమస్యలుగా గ్రహించి నాటకీకరించారు. ఈ నాటకాలు నారాయణరావుగారి సంఘసంస్కణాభిలాషను, అభ్యుదయ భావాలను, సామాజిక స్పృహను తెలియజేస్తున్నాయి. సమకాలీన సమస్యల మీద ఎప్పటికప్పుడు పాత్రలచేత విమర్శలు చేయించడం వీరి రచనా విధానంలోని ప్రత్యేకత. వీరి నాటకాలు విస్తతంగా ప్రజాదరణ పొందాయి. చలన చిత్రాలుగా రూపొందడం విశేషం. ఈ రచనలన్నీ సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి చేసినవే. వీరి రచనలు ఆధునికతను, అభ్యుదయాన్ని ప్రతిబింబిస్తాయి. జగద్గురు శంకరాచార్యులు వీరిని మహాకవి బిరుదుతో సత్కరించారు. వీరు కేవలం రచనలలోనే గాక ఆచరణలో కూడా సంస్కరణవాది. ఆ రోజుల్లో కూడా తాను స్వయంగా కట్నం తీసుకోకుండా వర్ణాంతర వివాహం చేసుకొని ఆదర్శప్రాయునిగా, సంఘసంస్కర్తగా నిలిచాడు. తన సోదరి బాల్య వితంతువు అయినందున, ఆమెకు పునర్వివాహం చేయవలసిందిగా తండ్రిని కోరి, ఆయన అంత ధైర్యం చేయలేకపోయినందున, ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. రఘుపతి వెంకటరత్నంనాయుడుగారి శిష్యులై బ్రహ్మసమాజ మతాన్ని అవలంబించాడు. ఈ మహా రచయిత కేవలం ఏభై ఆరేళ్ళ కాలం మాత్రమే జీవించి, 1927 జూన్ 27వ తేదీన

స్వర్గస్తులయ్యారు.

**వరవిక్రయము**

సంఘసంస్కరణాభిలాష గల కాళ్ళకూరి నారాయణరావు వరకట్న దురాచారాన్ని ఎత్తిచూపుతూ వ్యంగ్య, హాస్య శైలిలో రచించిన నాటకం వరవిక్రయము. ఈ నాటకాన్ని నారాయణరావు 1923లో రచించాడు. వరకట్న సమస్యను చిత్రించిన నాటకం ఇది. తెలుగు నాటకాలలో ఆణిముత్యం వరవిక్రయము. నాటి నుండి నేటి దాకా చలామణిలో ఉన్న వరకట్నం దురాచారం సమాజాన్ని ఏ విధంగా పీడిస్తుందో వివరిస్తూ, ఈ దురాచార నిర్మూలనకు పరిష్కారం చూపుతూ నారాయణరావు సామాజిక చైతన్యాన్ని కలిగించాడు. పెళ్లి చేసుకోవడానికి కట్నకానుకలు వసూలు చేయడం, వివాహం ఐదు రోజులు అట్టహాసంగా జరిపించుకోవడం, ఆడపిల్లల తల్లిదండ్రులను అప్పులపాలు చేయడం వంటి పరిస్థితులను చిత్రిస్తూ వరకట్న సమస్యను ప్రతిఘటించాడు కాళ్ళకూరి నారాయణరావు.

లోభి అయిన అక్క మామగారిని సాధించడం కోసం చెల్లెలు ఆ ఇంటి కోడలై మామగారిలో మార్పును తీసుకొనిరావడం ఇందులోని ఇతివృత్తం. ఈ నాటకాన్ని చదివి, చూసి ఆనందించడమే కాక అభ్యుదయ భావాలుగల యువకులు స్ఫూర్తి పొంది వరకట్న పిశాచాన్ని రూపుమాపడానికి కృషి చేయాలనే సామాజిక ప్రయోజనాన్ని ఆశించి కాళ్ళకూరి నారాయణరావు ఈ నాటకం రచించడం హర్షనీయం.

ఆనాడు వరకట్న సమస్య తీవ్రతను భ్రమరాంబ, పురుషోత్తమరావులతో ఇలా చెప్పిస్తాడు కాళ్ళకూరి. *"కన్య నొక్కరి కొసఁగి సద్గతులు గాంతు – మనుచు సంతోషపడు కాల మంతరించి, – కట్నములు పోయఁజాలక కన్య నేల – కంటిమా యని వ్యథపడు కాల మెదవె."* – భ్రమరాంబ. *"చెడె ధర్మంబు నశించెనీతి, హరియించెం బూర్వమర్యాద, లం – గడిఁ గూరాకు విధాన వేలమునఁ జొక్కా టోపి పాగాలకై – వడి సంతం బశువట్లు పెండ్లి కొడుకున్ వ్యాపార మార్గంబునం – బడయంగావలె ద్రవ్యముంగురిసి దైవంబైన నేఁ దమ్మహిన్"* – పురుషోత్తమరావు.

తల్లిదండ్రులను బాధించే వరకట్న సమస్య వల్ల ఆడుపుట్టుకనే పుట్టరాదని కమల వాపోతుంది. ఈ మాటల వల్ల ఆడవాళ్ళు ఎంత మనోవేదనకు గురయ్యేవాళ్లో తెలుస్తుంది. *"ప్రాణములనైన విడిచెదంగాని యడిగిన విత్తమిచ్చి వరుని గొనితెచ్చునట్టి వివాహమునకు సమ్మతింప"* నని కాళింది ప్రతినబూనడం వల్ల అభిమానవతులైన నాటి మహిళలు ఆత్మన్యూనతతో ఎంతగా విచారించేవారో తెలియజేస్తాడు కాళ్ళకూరి. *"త్రాగువారుంటచేతనే తాళ్ళ గీత, – గొనెడువా రుంటచేతనే గోవుల వధ, – పోవువారుంటచేతనే భోగవృత్తి, – అట్లే ప్రోత్సాహమే హేతువన్నిటికి."* అని కాళింది పాత్రచేత వరకట్న సమస్యకు హేతువును కాళ్ళకూరి చెప్పిస్తాడు. కట్నం ఇచ్చేవారుండడం చేతనే తీసుకునే వారుంటారనీ వరకట్న సమస్య సమసిపోవాలంటే కట్నం ఇవ్వకూడదనే సందేశాన్ని ఇచ్చాడు.

వరకట్న సమస్యను అంతమొందిచడానికి అవసరమైతే యువతులు వివాహాన్ని కూడా త్యాగం చేయాలని కాళింది పాత్రచే కాళ్ళకూరి చెప్పిస్తాడు. *"కూఁతురనుచుఁబరుల చేతిలో బెట్టక – కొడుకటంచు నన్నుఁ గొంపలోనె- యుంచుకొనుఁడు, మీరు పెంచలేకున్నఁగ – ష్టించి మిమ్ము నేనె పెంచుదాన."* *"కట్నమర్పించి వరునిచే గంఠమునకు – బుస్తె కట్టించుకొని తృప్తిఁ బొందుకంటెఁ – దనకుఁ దానుగ ముప్పేట త్రాటితోడఁ – గంఠమున కురియిడుకొంటె గౌరవంబు"* అంటుంది. అంతేగాక *"అంతరాత్మ సహింపని పనికొద, బడుట కంటె జచ్చుటే యుత్తమంబు"* అని తన వివాహం కొరకు ఉన్న *"పది యెకరములు విక్రయించి అల్లునకుఁ చెల్లించుచుంటిరి గదా, ఆవల వీరిగతి యేమికావలసినది? మా ప్రాణముల కుసూరుమనుచు మలమల మాడవలసినదేనా? ఈ మాట వినికూడా నేనీ దుర్నయ కార్యమున కెట్లును దైవమా, యిందులకేదియు దారి యగపఱుపవా?"* అని దైవాన్ని వేడుకుంటుంది కాళింది.

ఓరుగల్లులో ఓ యువతి కోరుకొన్న యువకుని చేసుకొటకు తల్లిదండ్రులు కట్నమీయలేక ఇతర సంబంధం కుదర్చగా,

అది నచ్చక విషం తీసుకుని మరణించగా ఆ విషయమును తెలుసుకుని కాళింది సంతోషిస్తుంది. కాళింది తన

మనసులో ఇలా చింతిస్తుంది. *"మానము కాపాడుకొనలేకున్న మానవతి యనిపించుకొనఁగలవా? స్వాతంత్ర్యమా కలిగినదే జన్మము. మర్యాద కాపాడుకొన్నవాడే మగవాడు. మానము దక్కించుకొన్నదే మగువ. ఇప్పుడు తప్పిన నీవిక నెన్నఁడును జావకుండ బ్రతకగలవా? ఏనాడు ప్రాణులు తల్లికడుపునఁ బడునో ఆనాడే మృత్యువు కూడా వెంటపడును", "అవమానమును దప్పించుకొనుటకై ప్రాణములను విడుచుట ఆత్మారాధనము కాక, ఆత్మహత్య యెట్లగును? కాదు ముమ్మాటికిని గాదు. ఈ త్యాగము వల్ల నా గౌరవము నాకు దక్కుటయేగాక తల్లిదండ్రుల ధననష్టము కూడఁ దప్పును", "చెల్లీ, కమలా, తప్పునిసరియైనచో, నీవుంగూడ నా దారినే యనుసరింపుము, కాని అవమానమున కొడంబడి, నీయక్క కప్రతిష్ట మాత్రము కలిగింపకుము", "అడుగువారికిఁ బాప భయంబు లేక - యిచ్చువారికి సిగ్గుని నెగ్గులేక - నడుచుచున్నట్టి వరశుల్క నాటకమున - నకట, మనమును బాత్రల మగుల తగునె." "ఈ లొచ్చు పనికంటె వివాహమే విసర్జింపఁగూడదా", "అమ్మా, యిన్ని బాధలుపడి పెంచిన బిడ్డకు ఇట్టి లంచగొండులకు గట్టబెట్టుట కంటె నవమాన మింకేమున్నదే", "అట్టి స్థితిలోఁ జావున కంత సందేహింపవలసిన పనియేమున్నది? లెమ్ము, లేచి నీ తల్లిదండ్రులకొక లేఖ వ్రాసి అవమానకరమైన నీ యాదుబొంది నింతటితో విడిచిపెట్టుము."* అని కాళింది అంతరాత్మ ప్రబోధించగా ప్రాణత్యాగం చేస్తుంది.

**చింతామణి**

చింతామణి వేశ్య. ఆమె తల్లి శ్రీ హరి, చెల్లి చిత్ర. భవాని శంకరుడనే బ్రాహ్మణుడు, సుబ్బిశెట్టి అనే వ్యాపారి ఆమె విటులు. ఆమె వారి ఆస్తి నంతా అపహరిస్తుంది. భవాని శంకరం ద్వారా అతని స్నేహితుడు, ధనవంతుడు, శీలవంతుడు, విద్యావంతుడు బిల్వమంగళుని ఆకర్షిస్తుంది. బిల్వమంగళుడు, ఆమె వలలో పడి భార్యను, వార్ధక్యంతో అనారోగ్యం పాలైన తండ్రిని కూడా నిర్లక్ష్యం చేస్తాడు. ఒక రోజు బాగా వర్షం పడుతున్న వేళ బిల్వమంగళుడు అర్ధరాత్రి నీటిలో తేలివచ్చిన ఒక దుంగ ఆధారంతో వాగు దాటి చింతామణి గృహం చేరుకొని, తలుపులు వేసి ఉంటే గోడమీద వ్రేలాడుతున్న తాడు సాయంతో ఇంట్లో ప్రవేశిస్తాడు. దీపం తెచ్చి చూస్తే అది తాడు కాదు పాము. అదే విధంగా వాగు దాటడానికి సహకరించింది దుంగ కాదు బిల్వమంగళుని భార్య రాధ శవం. చింతామణిని విడిచిపెట్టమని ఎవరు యెంతగా చెప్పినా భర్త వినకపోవడంతో విరక్తిచెంది వాగులో పడి మరణిస్తుంది రాధ. బిల్వమంగళునికి తనపై ఉన్న వ్యామోహానికి చింతామణి విస్తుపోతుంది. ఆ రాత్రి చింతామణికి శ్రీకృష్ణుడు కనబడతాడు. దానితో ఆమెలో వైరాగ్యం కలిగి సన్యసిస్తుంది. బిల్వమంగళునిలో పరివర్తన వస్తుంది. సోమదేవ మహర్షి పిలుపువల్ల ప్రభావితుడై ఆశ్రమ స్వీకారం చేసి అనంతర కాలంలో లీలాశుక యోగీంద్రుడుగా మారి శ్రీ కృష్ణకర్ణామృతం అనే సంస్కృత గ్రంథాన్ని రాస్తాడు. ఇది ఈ నాటక ఇతివృత్తం.

వేశ్యలు విటులను ఆకర్షించి వారి ఆస్తిపాస్తులను కొల్లగొట్టే విధానాన్ని, వేశ్యల మోజులో పడి తమ పరువును కోల్పోయి, కుటుంబ సభ్యులను విస్మరింస్తూ, తమ కుటుంబాలను ఎలా ఛిద్రం చేసుకుంటారో కళ్ళకు కట్టినట్లు ఈ నాటకంలో కాళ్ళకూరి నారాయణరావు రూపుకట్టించాడు. విటులతో యెట్లు మెలగవలయునో చింతామణి తల్లి ఇలా చెబుతుంది. *"విత్తమున్నంత వఱకును విటుని మనము / కోరి నెత్తిపై నెక్కించు కొనఁగ వలయు, / విత్త ముడిగినతోడనె బిడియ ముడిగి / కుక్కనుంబోలె బయటికి గొట్టవలయు.", "చెఱకు రసమెల్లఁ బీలిచి చెత్త యవలఁ / బాఱవైచెడు చందానదఁ బడుపు గత్తె / విటుని సర్వస్వముం బిండి పిప్పియైన / వెంటనే యవ్వలకుఁ గొట్టి వేయవలయు."*, ఈ మాటలు విని చింతామణి తనలో ఇట్లనుకుంటుంది. *"విటశలభములను భస్మీకరించుటకు మేళములు కారుచిచ్చులే!", "ఈ విధముగా నిప్పటికిని నాచేత మాడిపోయిన మగమిడుతలెన్ని యుండునో!".*

భవానీశంకరం తాను చింతామణి మోజులో పడి యేమేమి కోల్పోయాడో చెబుతాడు. *"తాతలనాఁటి క్షేత్రములెల్ల తెగనమ్మి / దోసిళ్ళతోఁ దెచ్చి పోసినాను / తండ్రి కట్టిన యిల్లు దాయాదులకు విక్ర / యించి వస్తువులు చేయించినాను / అత్తవారిచ్చిన యంటుమామిడితోఁట / యీవు కోరఁగ వ్రాసియిచ్చినాను / కులసతి మేనిసొమ్ములు పుస్తెతోఁ గూడఁ*

*/ గొనివచ్చి నీయింట గుప్పినాను / కులమువారెల్ల నీకిది కూడదన్న / భార్య నూతికి గోతికిఁ బఱువు విడిన / లెక్కసేయక నీయిల్లు కుక్కవోలెఁ*
*/ గాఁచికొని యిట్టు లున్నాను గలికి! నేను!"*

విటులను బలహీనతల గూర్చి చిత్రతో చింతామణి ఇలా చెబుతుంది. *"పొగడిన నొక్కఁడు పొంగి యాకసమంటుఁ / దిట్టిన నొకఁడు సంతృప్తిఁ జెందు / అలిగిన నొకఁడు పాదాక్రాంతుఁడగు కాల / దన్నిన నొక్కఁడు దాసుఁడగును / పాడిన నొక్కఁడు*
*పారవశ్యము నొందు / గెంటిన నొక్కఁడి ల్లంటియుండు / కఱకుట్లు పెట్ట నొక్కఁడు కుక్కవలె నగు / త్రాగింప నొక్కఁడు విత్తంబు గురియు / పాపపుణ్యంబులకు మది భయము విడిచి / విటుల చిత్తంబు రజించు విధము తెలిసి / మసలినం జాలు, మతిలేని మాట కాని / వలపుమందులు మఱివేఱె కలవె మనకు!"*

విద్యావంతుడు, జ్ఞాని, పండితుడైన బిల్వమంగళుడు తండ్రికి తనపైనున్న ప్రేమ గురించి ఇలా చెబుతాడు. *"వేళ కేఁగకున్న వెదుకుచుఁ జనుదెంచుఁ / బంక్తి కరుగకున్నఁ బరితపించు / సుంత యలపుఁగొన్న నెంతయుఁ బలవించుఁ / దరమె తీర్పనిట్టి తండ్రి రుణము!."* తండ్రి యెడల ఇంతటి భక్తి ఉన్నవాడు సైతము చింతామణి వ్యామోహంలో పడి చావుబతుకుల్లో ఉన్న అతడిని పట్టించుకొనడు. చింతామణి అందానికి ఆశ్చర్యంతో బిల్వమంగళుడు *"భక్తవర్యుని వైకుంఠ పట్టణంబుఁ / గవివరేణ్యుని స్వర్గలోకంబుఁ చిత్ర / కారు వేరుగిరీంద్ర మీ కాంత చెంతఁ / జిల్లిగవ్వకు నేనియుఁ జెల్లఁ గలవె!"*

వేశ్యల రొంపిలో మరల నడుగుపెట్టగూడదని పరివర్తన చెందిన భవానీశంకరం ఇలా అంటాడు. *"తల్లి పేరిట మాఱు దయ్యమెప్పుడు దేని / కై యగ్గి గురియునో యనెడుబెంగ / యేపూఁట కాపూఁట యేమివ్యయంబు నె / త్తిని వచ్చిపడెడునో యనియెడుబెంగ / తానింట లేనప్డు తార్పుడుకత్తె లె / వ్వనిఁ దెచ్చి కూర్తురో యనియెడుబెంగ / యేవేళ బయటఁ గాలిడి సాని యెవరికం / టను బడిపోవునో యనియెడుబెంగ / మేళముల కేఁగినపుడు కామించి యెవఁడు / తనకుఁ గొక్కిడఁ జూచునో యనియెడుబెంగ / యిన్ని బెంగలచేత రేయింబవళులు / పొగలుటయె కాదె వెలయాలి పొత్తనంగ!"*

మీకు వ్యాపారచింతయే లేదా అని చింతామణి యడుగగా ఆమె మోహంలో పడ్డ బిల్వమంగళుడు *"నేనాకాశమునై, అందలి నక్షత్రము లన్నియు నాకు నేత్రములైనచో నిన్నుఁ దనివితీఱఁ జూడఁగలుగుదును గదా యనుచింత దక్క మఱేచింతయు లేదు"* అంటాడు. భర్త బిల్వమంగళుని ప్రవర్తనకు కుమిలిపోతూ రాధ *"భార్యలకు జీవితేశు లట్టి పరమపావనమైన చుంబనముఁ, దనివితీఱ నాలింగనముఁ బ్రసాదింపకుంట కంటె నన్యాయమింకను గలదె వేఱె?", "మీ దర్శనమే నాకు దేవతాదర్శనము, - మీ సాన్నిధ్యమే నాకు స్వర్గము - మీ యాదరమే నాకైశ్వర్యము - మీ ప్రేమయే నా ప్రపంచము", "మీ హృదయమును నా హృదయముతోఁ జేర్చి యదిమిపట్టని యెడల నీ గుండె యెప్పుడో పటాలున బ్రద్దలగును!"* అని వేడుకుంటుంది. వేశ్యాసంగమం వల్ల నాటి గృహిణులు ఎలాంటి వేదనను అనుభవించారో కాళ్ళకూరి నారాయణరావు రాధ పాత్ర ద్వారా చెబుతాడు.

రాధకు బిల్వమంగళుడు సమాధానమిస్తూ *"ఈ వ్యసన ప్రవాహము నన్నెచ్చటికో నెట్టుకొనిపోవుచున్నది! ఈ వరదలో నెందాఁకఁ గొట్టుకొని పోవుదునో నాకే తెలియకున్నది! ప్రస్తుత మింతకంటె జెప్పవలసిన దేమియు లేదు."* వ్యసనపరుడు ఏవిధంగా తనమీద తాను పట్టుకోల్పోతాడో బిల్వమంగళుని ద్వారా తెలుస్తుంది. భార్య రాధ, స్నేహితుడు దామోదరము, తండ్రి ఎందరు ఎన్ని విధాలా చెప్పినా వినని స్థితితో బిల్వమంగళుడు వారితో ఇలా అంటాడు. *"అంటు మామిడి పండు నారగించెడు తఱి / నుడు కటన్న నెవ్వఁడు దూరకుండు? / జుంటి తేనెఁ బ్రీతి జుఱ్ఱెడువేళను / ఛ్ఛిష్ట మనిన రోఁత జెందు నెవఁడు? ... కాబట్టి నీవిక కంఠశోష పడక వెనుకకు వెళ్లిపొమ్ము!"* అని స్నేహితుడు దామోదరంతో అనడం ద్వారా బిల్వమంగళుడు ఎంతగా చింతామణి మోజులో పడ్డాడో తెలుస్తుంది.

దామోదరం వేశ్యాలోలత్వం ఎంత ప్రమాదమో చెబుతూ పాముకాటు కంటే వేశ్యకాటు ప్రమాదకరము అంటాడు. *"పాము కాటు వలనఁ బ్రాణముల్ మాత్రమే / పాయు, వేశ్యకాటు వలన జనుని / యశము, తెలివి, పుణ్య మైశ్వర్య మారోగ్య / మాయువును దుదంట పాయు నిజము!".* తండ్రి వాసుదేవమూర్తి చావుబతుకుల మధ్య మంచాన బడగా బిల్వమంగళుడు

చింతామణి వద్దనుండి వస్తూ *"ఎందులకన్ని వర్తమానము లంపినారు?"* అని అసహనంతో తండ్రిని ప్రశ్నిస్తాడు. అప్పుడు వాసుదేవమూర్తి *"ఎందులకా! నాకీరాత్రి గడవదు! కాశీలోనైనఁ జావవలెను, కన్నకొడుకు చేతిలో నైనఁ జావవలెను."*, *"కన్నతండ్రిని గంటఁ జూచుట లేదు! చేసికొన్న యాలిని జెంతకు రానిచ్చుటలేదు! మాయ ముండ! ఆ ముండ యేమి మందు పెట్టినదో!"* అని కోపించును. చింతామణిని ఏమన్నా సహించనంటూ బిల్వమంగళుడు తండ్రితో *"నన్ను వేయి యన్నను సరియె కాని, దానిని పల్లెత్తుమాట యన్నచో నేను సహింపను. దాని గుణము మీరెరుఁగరు. మీ శరీరస్థితి యెట్లున్నదియు వెంటనే వచ్చి తెలుపవలసినదని యొట్టుపెట్టి నన్నుఁ బంపినది."*, *"నూరు చెప్పుడు వేయి చెప్పుడు చింతామణి మీఁదనుండి నాచిత్తమిఁక మరలదు!"* అని తండ్రితో నిర్లజ్జగా అంటాడు. అంతగా దిగజారి పోతాడు బిల్వమంగళుడు.

అది విని తట్టుకోలేక వాసుదేవమూర్తి చనిపోతాడు. అప్పుడు ఉరుములు, మెరుపుల చప్పుడు వినిపస్తుంది. *"చింతామణికిఁ బిడుగన్న తగని భయము కదా! ఇప్పుడిచ్చట నాపని యేమియు లేదు. తెల్లవారఁగానే వచ్చెదను."* అని భార్య రాధతో చెప్పి వెళ్లబోతాడు. *"ఇది మీకు ధర్మము కాదు! ఈ శవజాగరణము నే నొంటిగాఁ జేయఁగలనా!"* అని రాధ యెంత వేడుకున్నా విదిలించుకుని వెళ్ళిపోతాడు. దానికి తట్టుకోలేక రాధ కాలువలో దూకి మరణిస్తుంది. ఆ వర్షంలో కాలువ దాటడానికి ప్రయత్నిస్తూ కాలువలోని శవాన్ని ఆధారంగా చేసుకుని ఒడ్డుకు చేరుకుంటాడు. చింతామణి ఇంటికి గడియపెట్టి వుండగా వెనుకనున్న పామును తాడు అనుకుని పట్టుకుని ఇంటిలోకి ప్రవేశిస్తాడు. తన బట్టలకు అంటిన రక్తమును చూచి చింతామణి అడుగగా తాడును పట్టుకొని వచ్చితినని చెప్పి దానిని చూపించగా అది పాము అని, దానిని పట్టుకొని పైకి ప్రాకునప్పుడు దాని పొట్టచిదికి రక్తమంటినదని తెలుసుకుంటారు. కాలువ దాటివచ్చుటకు ఆధారముగా చేసుకున్న శవమును చూడగా అది తన భార్య రాధ శవమని తెలుసుకుని దుఃఖిస్తాడు. అది చూచి చింతామణి ఆశ్చర్యపోతూ తన తుచ్ఛ శరీరము కొరకు ఇంతగా సాహసించాడని తాను విరక్తిభావంతో అంతకు ముందు రాత్రి కలలో కన్పించిన శ్రీకృష్ణుని మనసులో తలచుకుని సన్యసిస్తుంది. ఇంతకాలం విటుల వద్దనుండి పొందిన ఆస్తినంతా వారికి పంచిపెట్టి వేశ్యాలోలత్వం వల్ల కలిగే అనర్థాలను లోకానికి చాటుతూ ప్రచారం చేస్తుంది.

**మధుసేవ**

*"మద్యరస మనుకార్చిచ్చు మానవుడను / తరువునకు సోకినంతనే తత్తదవయ / వమ్ములనెడి కొమ్మలతోడవమ్ము చేసి / బుద్ధియను చేవతో గూడ బుగ్గి సేయు!"* అంటూ మద్యపాన వ్యవసనంపై పదునైన బాణాన్ని ఎక్కుపెట్టారు కాళ్ళకూరి నారాయణరావు. మద్యం రక్కసి కోరల్లో చిక్కి కొంపలను ఆరోగ్యాన్ని గుల్లచేసికొనే వారి జీవితాల్లోని విషాదాన్ని గూర్చి మధుసేవ నాటకం ద్వారా కాళ్ళకూరి చాలా బలంగా చిత్రీకరించారు.

ఇప్పటికీ సమాజంలో చాలా బలంగా వేళ్ళూనుకొన్న అతిపెద్ద సమస్య ఈ మద్యపానం. ఈ సమస్యను ఏ ప్రభుత్వాలు కూడా అంతమొందించలేక పోతున్నాయి. కారణం ప్రభుత్వాలకు అధిక రాబడి మద్యాన్ని అమ్మడం ద్వారా రావడమే. దాంతో ప్రజల ఆరోగ్యాన్ని, జీవితాన్ని ఫణంగా పెట్టి ప్రభుత్వాలు మనుగడ కొనసాగిస్తున్నాయి. ఈ అంశాన్నే తీసుకొని కాళ్ళకూరి 1926లో 'మధుసేవ' నాటకాన్ని రాసారు. ప్రముఖ గాంధేయవాదియైన నారాయణరావు మహాత్ముని ప్రభావానికి లోనై మధుసేవను కథావస్తువుగా స్వీకరించి ఈ నాటకాన్ని రాసాడు.

ఇందులో నాయకుడు జమిందార్ రఘునాథరావు. చాలామంచివాడు, దైవభక్తి పరుడు, దుర్వ్యసన పరాఙ్ముఖుడు. మరీ ముఖ్యంగా మద్యపానాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. ఒక్క మద్యపానమనేకాదు, నస్యము, సిగరెట్టు, బీడీ, నల్లమందు,

గంజాయి – ఇవన్నీ మనిషికి ఎంత హాని చేస్తాయో తన మేనేజర్ అయిన విశ్వాసరావుకు చెపుతాడు. అతనిచేత నశ్యంకూడ మానిపిస్తాడు. త్రాగుబోతు రంగని పనిలోంచి తీసేస్తాడు.

అటువంటివాడు ఒకసారి అనుకోకుండా గుర్రం మీద నుండి పడిపోయి స్పృహతప్పుతాడు. అప్పుడు రంగడు అతని నోటిలో కొంత మద్యం పోసి డాక్టర్ వద్దకు తీసుకువెళతాడు. ఆ డాక్టర్ కూడ కొన్ని రోజులపాటు రఘునాదరావుచే మద్యం త్రాగిస్తాడు. అక్కడి నుండి రఘునాథరావు మద్యానికి బానిస అయిపోతాడు. శర్మ అని మరొకడు తన పబ్బం గడుపుకోవటం కోసం రోజూ రఘునాథరావుతో కలిసి మద్యం సేవించటమే కాక, కస్తూరి అనే వేశ్యని పరిచయం చేస్తాడు. పూర్తిగా ఆమె వలలో చిక్కిన రఘునాథరావు మొత్తం తన ఆస్తినంతా పోగొట్టుకొంటాడు. కనబడిన చోటెల్లా అప్పులు చేస్తాడు. రోడ్డున పడతాడు. ప్రాణంగా ప్రేమించిన భార్య కూడా బెంగతో మరణిస్తుంది. చివరకు జ్ఞానోదయ మవుతుంది. మామగారు చనిపోతాడు. కూతురు పేర రాసిన ఆస్తి ఇతనికి దక్కుతుంది. ఆ ధనాన్ని మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి వినియోగించాలనే ఒక స్థిర నిశ్చయానికి వస్తాడు రఘునాథరావు. ఇతని మేనేజరు విశ్వాసరావు కూడ రఘునాథరావుకు చేదోడు వాదోడుగా ఉంటాడు. ఇదీ స్థూలంగా ఇందలి కథ.

మద్యప్రియుల మనస్తత్వాలు ఎలా ఉంటయో చెప్పబడింది. రఘునాథరావు – శర్మ కలిసి మద్యాన్ని సేవిస్తుంటారు. ఇంతమంది ఎందుకు మద్య ప్రియులుగా మారుతున్నారు, ఏమిటి దాని మహాత్మ్యం? అని రఘునాథరావు అడిగిన ప్రశ్నకు శర్మ దాని మహిమయే దానికి కారణమంటూ ఇలా వర్ణిస్తాడు. *"బ్రాందిసీసా కంటబడగానె వరహాల / పాతు కాన్పించిన పగిది దోచు / తప్పుమంచును గార్కు చప్పుడైనంతనె / జయభేరి విన్నంత సంబ్రమొదవు / దొడదొడ గ్లాసులో దొలికించు సమయాన / నమృతంబు పడుచున్న యట్టులుండు / చుఱ చుఱ గొంతులో జొచ్చెడు తరి, పోయి / నట్టి ప్రాణము వచ్చినట్టులొప్పు / అవలనానంద వార్ధినోలాడునట్లు / స్వర్గ భూమి విహారము సలుపునట్లు / రంభ యొడిలోన నిద్దుర క్రమ్మినట్లు / తన్మయావస్థలోన జిత్తము సుఖించు".* అంతేకాదు మధువు ఒక్క గ్లాసు సేవించటం వల్ల కసుకందు కూడ లేచి హనుమంతునికి గంతులు నేర్పుతాడని, మూగవాడు వేనోళ్ళతో ఆదిశేషుని వెక్కిరిస్తాడని, పిరికివాడు సహితం శత్రువును చాచికొడతాడని, పుంస్త్వహీనుడు సింహబలుడౌతాడని, లోభి దానకర్ణుడౌతాడని, శోకభరితుడు హర్షాంబుధిలో తేలుతాడని – ఇలా సాధారణంగా మద్యప్రియులు చెప్పే ప్రయోజనాలన్నిటినీ ఏకరవు పెడతాడు.

ఈ నాటకంలో రఘునాథరావును మద్యమే సర్వభ్రష్టుణ్ణి చేస్తుంది. ఆ మద్యం వల్లే అతనికి వేశ్య కస్తూరి దగ్గరౌతుంది. ఆమె పరిచయం వల్లే మొత్తం అతని జమిందారీగిరి అంతా సర్వనాశన మవుతుంది. చివరకు భార్యను కూడ పోగొట్టుకొంటాడు. రఘునాథరావు చాలా అందగాడు. విపరీతంగా తాగుడుకు బానిసైపోవడంతో, అప్పులపాలవడంతో అతని రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. రఘునాథరావును ఎంతో అభిమానించే ఆతని మేనేజర్ విశ్వాసరావు తాగుడుకు అలవాటుపడ్డ తన యజమాని రూపురేఖల్ని తలచుకొని, మద్యం గౌరవాన్ని పోగొడుతుంది. ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అందాన్ని హరిస్తుంది. సాధారణంగా ఇలాంటి మద్యవ్యసనం ఎవరికైనా చెడు స్నేహాలవల్లే అలవాటవుతుందని అంటూ, నీచునితో మైత్రి ఎంత ప్రమాదమో చెపుతూ, శర్మతో స్నేహమే తన యజమాని పతనానికి కారణమంటూ వాపోతాడు. *"కాలకూటంబు సురకన్న మేలు కాదె"* అంటూ బాధపడతాడు.

మద్యం బానిసల ఇల్లాళ్ల అగచాట్లు కూడా ఈ నాటకంలో తెలిపాడు కాళ్ళకూరి. రఘునాథరావును మద్యవ్యసనం నుండి, వేశ్యావ్యసనం నుండి మరల్చాలని భార్య నిర్మల ఎంతగానో ప్రయత్నిస్తుంది. అయినా అతడు దారికి రాడు. తనలాంటి స్త్రీలు లోకంలో ఎందరున్నారో, వారెలా ఈ నరకాన్ని భరిస్తున్నారో అంటూ ఆమె ఇలా బాధపడుతుంది. *"భర్త యే వేశ్య మజ్జనో పండుకొనగ / నింటనొంటిగ శయనించి కంటగూర్కు / వెంట తోడును లేక తపించునట్టి / రమణికంటెను నిర్భాగ్యురాలు కలదె?"* – అంతేకాదు, "కానలోన *మొఱడుగా బుట్టవచ్చును / నీటికుక్కగా జనింపవచ్చు / పరగ త్రాగుబోతు భార్య కాకూడదు / కలను నైన – నాటకమున నైన"* అంటూ వాపోతుంది. భర్త ఆస్తి అంతా హరించుకుపోయినా, తండ్రి మరణంతో ఆమెకు ఆస్తి దక్కుతుంది. ఆ ఆస్తికోసం శర్మ కస్తూరులు రంగడి ద్వారా ఆమెను హతమారుస్తారు.

రఘునాథరావు పై ఆ హత్యానేరం మోపబడుతుంది. విశ్వాసరావు సహకారంతో రఘునాథరావు నిర్దోషిగా బయటకొస్తాడు. చివరకు రఘునాథరావు ఇలా పశ్చాత్తాపడతాడు. తన ఇల్లాలిని అంత బాధ పెట్టినందుకు, ఆమెను పోగొట్టుకొన్నందుకు చాలా బాధపడతాడు రఘునాథరావు. *"ఎచటనో పుట్టి తమయిండ్లకేగుదెంచి / తమ్మెదైవములుగ చిత్తముననమ్మి / తమనిమిత్తము బ్రతుకులు ధారవోయు / సతులనేడ్పించు పతులకు గతులు కలవె?"* అంటూ పరితపిస్తాడు.

ఈ విధంగా చెడు స్నేహాలు, వాటివల్ల ఏర్పడే మద్యపాన వ్యసనం, దాని వల్ల ఏర్పడే వేశ్యా సంపర్కం, వీటన్నిటివల్ల సంప్రాప్తమయ్యే పతనం, సర్వభ్రష్టతలను కవి చాలా స్పష్టంగా ఈ నాటకంలో వివరించారు. కాళ్ళకూరి నాటకాలు వరకట్నం, వేశ్యాసంపర్కం, మద్యపానం వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా సంఘసంస్కరణాభిలాషతో రచించాడు. అంతేగాక ఈ వ్యసనపరుల యిల్లాండ్రు తమ తప్పులేకనే పడే బాధలను వివరించాడు. స్త్రీల బాధలను, వేదనను చాటాడు. ఈ నాటకాలు కవి యొక్క ఖ్యాతిని ఇనుమడింపజేసాయి. నాటక సాహిత్యంలో కాళ్ళకూరికొక ప్రత్యేక స్థానాన్ని కలుగజేశాయి.

**ఆధార గ్రంథాలు**

1. నారాయణరావు, కాళ్ళకూరి. (1921), వరవిక్రయము, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ.
2. నారాయణరావు, కాళ్ళకూరి. (1923), చింతామణి, సుజనరంజనీ ముద్రాక్షరశాల, కాకినాడ.
3. నారాయణరావు, కాళ్ళకూరి. (1947), మధుసేవ, శ్రీసరస్వతీ ముద్రాక్షరశాల, బెజవాడ.

# పీవీ రాజమన్నారు నాటకాలు - సామాజిక స్పృహ

**ఎన్. లవేందర్‌రెడ్డి**
అసిస్టెంట్ ప్రొఫెసర్
నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)
నల్లగొండ సెల్ : 849723772

**ఉపోద్ఘాతం:**

"రాయబడినదంతా సాహిత్యం ఎప్పుడూ కాదు ఒక సత్యాన్ని సుందరంగా వ్యక్తీకరించడంలో మనసు మీద మేధస్సు మీద ప్రభావాన్ని చూపేదే సాహిత్యం అనవచ్చు. సమకాలీన జీవితాల్లోని అనుభవాల్ని అనుభూతుల్ని యథాతథంగా వర్ణించి చెప్పడమే సాహిత్యం యొక్క లక్షణం. సామాజిక వ్యవస్థలోని 'జీవితాన్ని విమర్శించేదే సాహిత్యం[1] అవుతుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక ప్రక్రియ అయిన నాటక రంగం 20వ శతాబ్దపు మొదటి అర్థ భాగాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. భావం, భాష రచనలో అది కొత్తదనాన్ని తెచ్చింది. హేతువాద దృక్పథం అభ్యుదయ భావనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో స్వాతంత్ర కాంక్షతో జాతీయోద్యమం ఒకవైపు, అర్థము లేని సాంఘిక కట్టుబాట్లకు వ్యతిరేకంగా స్వేచ్ఛ సమానతల కోసం చైతన్యవంతమైన సమరం మరోవైపు మొదలైనాయి. వీరేశలింగంగారి సంఘసంస్కరణ దృష్టి, గిడుగువారి వ్యవహారిక భాష ఉద్యమం, స్త్రీ పురుష అసమానతపై గురజాడ ప్రారంభించిన సాంస్కృతిక ఉద్యమం నాటక రంగాన్ని ప్రక్రియ పరంగా ఎంతగానో ప్రభావితం చేశాయి.

ఈ నేపథ్యంలోనే స్త్రీ జనాభ్యుదయాన్ని ఆశించి అనేక ప్రక్రియలలో రచనలు చేసిన వారిలో ప్రథముడు గుడిపాటి వెంకటాచలం. అనేక స్త్రీ సమస్యలను ఎత్తి చూపడానికి నాటక ప్రక్రియను బాగా వినియోగించుకున్నాడు చలం. తర్వాత వరుసలో పేర్కొనదగిన వ్యక్తి శ్రీ పాకాల వెంకట రాజమన్నారు. సమకాలీన సమస్యలలోని మంచి చెడులను విస్తృతంగా తెలియజేస్తూ సంకుచితత్వం నుండి అర్థము లేని సనాతన సాంప్రదాయాల నుండి జనం ఏ విధంగా బయటపడాలో తెలియజెప్పడమే ఇతని నాటక రచన లక్ష్యం.

**పరిచయం:**

స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో 1901 మే 10వ తేదీన రాజమహేంద్రవరంలో పాకాల వెంకట రాజమన్నారు జన్మించాడు. ఆ కాలాన స్వదేశీ ఉద్యమ ఆదర్శాల ప్రచారానికి ఒక ప్రముఖ కేంద్రంగా రాజమహేంద్రవరం పేరొందినది. స్వేచ్ఛ స్వాతంత్ర భావనలు పరివ్యాప్తమవుతున్న ఈ తరుణంలో పి.వి.రాజమన్నారు ఊహ తెలుసుకోగలిగిన వాడయ్యాడు . పై చదువుల కోసం మద్రాస్ (చెన్నై) వెళ్లి SSLC పచ్చయ్యప్ప హైస్కూల్లో పూర్తిచేసి, అనంతరం మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చేరాడు. 1921లో 'లా' పూర్తి చేసుకుని న్యాయవాద వృత్తిలో చేరి 'కళ' అనే మాస పత్రికను 1922లో స్థాపించాడు. న్యాయవాద వృత్తి చేపట్టిన తొలినాళ్లలో సాంఘికంగా స్త్రీలు పురుషాధిక్య సమాజంలో వంచింపబడుతున్న తీరు ఈయన దృష్టిలో పడింది. తనలోని సాహిత్య జిజ్ఞాసను స్త్రీ జాతి విముక్తికి సంబంధించిన సమస్యలపై మళ్లించాడు. సమకాలీన సమాజంలోని కుళ్ళును వెలికి తీసి బహిరంగపరిచి సంఘసంస్కరణ దృక్పథాన్ని చెప్పడం కొరకు నాటక ప్రక్రియను ఎన్నుకున్నాడు. సాంఘిక రూపకర్తలైన ఇబ్సెన్స్, గాల్స్ వర్ది వంటి పాశ్చాత్య రచయితలచే ప్రభావితుడైనాడు. మరోవైపు స్త్రీ సాంఘిక కట్టుబాట్ల మధ్య వంచనకు గురవుతున్న తీరు వీరేశలింగం పంతులు దగ్గర నుండి గురజాడ మీదుగా చలం వరకు జరిగిన విశ్లేషణ విమర్శనల దృక్పథం కూడా రాజమన్నారుపై పడింది. రాజమన్నారు న్యాయవాద వృత్తిలో సామాజిక వ్యవస్థలోని అనేక రుగ్మతలను చూస్తూ వచ్చాడు. మానసికంగా కోర్టులో ఎదురైన అనేక సంఘటనలు కలచివేసాయి. స్వయంగా భావుకత కలిగిన రాజమన్నారు సామాజిక దృష్టి

కోణంలో తన అభిప్రాయాన్ని తెలియజేయడానికి రచన రంగాన్ని ప్రవృత్తి పరంగా ఎంచుకున్నాడు. ముఖ్యంగా నాటక రంగం ఇతన్ని ప్రభావితం చేయటం వల్ల నాటక రంగం వైపు తన రచన వ్యాసంగాన్ని మరల్చాడు.

**నాటక ఇతివృత్త విశ్లేషణ:**

సాంఘిక ఇతివృత్తాలతో కూడిన మూడు ఆధునిక నాటకాలను రాశాడు. 1930వ సంవత్సరంలో తప్పెవరిది?, 1934వ సంవత్సరంలో ప్రసిద్ధ రంగస్థలం నటుడు బళ్ళారి రాఘవతో కలిసి 'తెగని సమస్య' అనే పేరుతో మరో నాటకాన్ని రాశాడు. 1940వ సంవత్సరంలో 'మనోరమ' అనే పేరుతో ఇంకొక నాటకాన్ని పూర్తి చేశాడు. ఈ మూడు నాటకాల్లో ఇతివృత్తం సామాజిక చైతన్యాన్ని కాంక్షించే "సంఘసంస్కరణ దృక్పథం కనిపిస్తుంది. 1929 నుండి 1940 మధ్య కాలం నాటి తెలుగు, తమిళ భాషలు మాట్లాడే ప్రాంతాల సామాజిక జీవితాల్లోని సాంఘిక అకృత్యాలకు అద్దం పట్టాయి ఈ నాటకాలు. సామాజిక వ్యవస్థలోని మూల అంశాలను తీసుకొని నాటక రచనకు పూనుకున్నాడు రాజమన్నారు. అర్థం లేని మత సంప్రదాయాలతో ముడిబడ్డ వివాహ వ్యవస్థ పట్ల, వయోతారతమ్య వివాహాల పట్ల, స్త్రీని భోగ వస్తువుగా చేసిన దేవదాసి వ్యవస్థ పట్ల, భార్యాభర్తల మధ్య అసమ సంబంధాన్ని తెలియజెప్పడం పై మూడు నాటకాల లక్ష్యంగా కనిపిస్తుంది.

**మత వివాహ వ్యవస్థ:**

మానవ జీవన విధానములో మతము ఒక సామాజిక చైతన్య రూపం. "సామాజిక పరిణామంలో ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలు మారుతున్న క్రమంలో ఉపరితల అంశమైన మతము కూడా వాటికి అనుగుణంగా మార్పు చెందుతూ కొత్త రూపాలను సంతరించుకుంటూ వచ్చింది"[2]. "మానవుడు ఆహార అన్వేషణ దశను దాటి వ్యవసాయం పశుపోషణ చేస్తూ స్థిరమైన జీవితం ఏర్పరచుకోవడం జరిగింది. దీనివల్ల ఉత్పత్తిలో మిగులు ఏర్పడటం వల్ల అంతవరకు స్వేచ్ఛాయుతంగా గుంపుపరంగా జంట పెళ్లిళ్లుగా కొనసాగిన స్త్రీపురుష సంబంధాలు మారి ఒక స్త్రీకి ఒక పురుషుడికి మధ్య జీవితాంతం సంబంధం అన్న సూత్రం ప్రాతిపదికన దాంపత్య వ్యవస్థ ఆవిష్కరింపబడింది"[3].

ఈ విధంగా ఏర్పడిన మతం దాంపత్య వివాహ భావనలు మానవ నాగరికత పురోగమిస్తున్న కాలంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హిందూ మత వ్యవస్థలో మతానికి వివాహానికి విడదీయరాని సంబంధం కాలగమనంలో ఏర్పడుతూ వచ్చింది. మత సూత్రాల చాటున సతీసహగమనం, బహుభార్యత్వం, బాల్యవివాహాలు కొనసాగింపబడుతూనే స్త్రీ పట్ల వివాహము ఒక హింసాత్మక వ్యవస్థగా పరిణమించింది. తెలుగుదేశంలో హిందూ మత వ్యవస్థ కింద వివాహంలో చోటు చేసుకున్న స్త్రీ పురుష అసమానతల్ని సంఘసంస్కరణ దృక్పథంతో వీరేశలింగం, గురజాడ వంటి వారు ఎదుర్కోవడానికి ముందుకు వచ్చారు. మతవ్యవస్థలోని లొసుగుల్ని ఎత్తి చూపి వైవాహిక జీవితంలో రావలసిన మార్పులకు దారులు వెతకడం ప్రారంభించారు. ఆ చారిత్రక వారసత్వం నుండి హిందూ మత వ్యవస్థలోని దయనీయమైన పరిస్థితుల చేత ప్రేరేపితుడై వివాహ వ్యవస్థలోని లోపాల్ని నాటక రచన ద్వారా ఎండగట్టడానికి ముందుకు వచ్చాడు రాజమన్నారు.

తప్పెవరిది? నాటకంలో పితృస్వామ్య సామాజిక వ్యవస్థ లక్షణము నుండి 60 ఏళ్ల వృద్ధుడు 20 ఏళ్లు నిండని యువతిని వివాహ మాడాడు. కూతురు ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే యువతి తల్లిదండ్రులు తమ బరువు తీర్చుకున్నామని అనిపించుకోవడానికి "ఆడపిల్ల ఎన్నడైనా ఇక్కడి పిల్ల కాదు అక్కడ పిల్ల" కావలసిందే అన్నట్లుగా యువతి మనసుతో ప్రమేయం లేకుండానే పెళ్లి చేశారు. బలవంతంగా కట్టబెట్టిన వివాహాన్ని జీర్ణించుకోలేకపోయింది యువతి. యువతిని బానిసను చేసి వృద్ధుడికి సేవలు చేయడానికి ప్రధానంగా తోడ్పడినా మానసికంగా ఆమె ఆలోచనలకు, సహజమైన కోరికలకు హద్దులు విధించలేకపోయింది. భర్తపై ప్రేమలేని యువతి ఇంట్లోనే ఉన్న తన సమవయస్కుడైన సవతి కొడుకును ప్రేమించింది ఈ క్రమంలోనే. ఇక్కడ ఇష్టం లేని వివాహం వల్ల మత సూత్రాల ప్రమాణాలకు అర్థం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే హిందూమత వివాహంపై ఆ యువతితో తిరుగుబాటు చేయించాడు రాజమన్నారు.

'తెగని సమస్య' నాటకంలో ఇలాంటి భగ్న దాంపత్యన్నే ఇతివృత్తంగా తీసుకున్నాడు రాజమన్నారు. స్త్రీకి పాతివ్రత్యాన్ని పురుషుడికి వంశ వారసులను పొందటాన్ని విధులుగా ధర్మాలుగా చేసిన పితృస్వామ్య సామాజిక లక్షణం నుండి 50 ఏళ్ల నరసింహారావు 20 ఏళ్ల లలితా దేవిని వివాహము అడగలిగాడు. వైవాహిక దాంపత్య జీవితానికి వయోతారతమ్య భేదం కొంత కారణమైతే అవగాహన అనురాగం అనే మానసిక భావనలు ఆటంకాలయ్యాయి. పెళ్ళికి ముందు శ్రీనివాసరావు అనే యువకుడిని లలిత ప్రేమించిందన్న విషయం తెలుసుకొని తాగుడుకు బానిసైనాడు. నరసింహారావుకు లలిత పట్ల అనుమానం పెరిగింది. తాగిన మైకంలో లలితను అనుమానపు మాటలతో వేధించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న లలిత అన్న కృష్ణయ్య నరసింహారావుతో ఘర్షణకు దిగాడు. చివరకు పెనుగులాటకు దారి తీసి రివాల్వర్‌తో కృష్ణయ్యను నరసింహారావు కాల్చాడు. కృష్ణయ్య మరణించాడని భావించి దిక్కుతోచక పారిపోయాడు. కొంతకాలానికి నరసింహారావు తన తప్పును తెలుసుకున్న తర్వాత చిదంబర దీక్షితులుగా మారిపోయాడు. "ఇప్పటి హిందూ సమాజపు స్థితులు హిందువులను దుర్బలులుగా మార్చేస్తున్నాయి. వివాహ పద్ధతులు హిందూ స్త్రీలకు సౌఖ్యానికి బదులుగా దుఃఖాన్ని పెంచుతున్నాయి. ఈ విషయాన్ని హిందువులందరూ నిష్పక్షపాత బుద్ధితో ఆలోచించాలి" (తెగని సమస్య-పుట 25) అని వివాహ బంధంలో రావలసిన మార్పును చిదంబర దీక్షితులుతో చెప్పించాడు రాజమన్నారు.

**దేవదాసీ వ్యవస్థ**

హిందూమత ఛాందస భావాల మద్దతుతో ఉనికిలోకి వచ్చిన పితృస్వామ్య ఆధిపత్యానికి మరో రూపం దేవదాసి వ్యవస్థ. పురుషుల విశృంఖల లైంగిక జీవితాసక్తికి నగ్న ప్రతిబింబం ఇది. భారతదేశ దేవాలయాలలో ముడిపడిపోయిన దేవదాసి వ్యవస్థ చాలా కాలము నుండి ఉంది. అది ప్రాచీన మధ్యయుగాల ఫ్యూడలిజం యొక్క అవశేషం".[4] "క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దము నాటి జోగిమర శాసనం దేవదాసీలు ఉన్నట్లు పేర్కొంది'. 'ఫ్యూడల్ వ్యవస్థలో రాజులు, ఫ్యూడల్ ప్రభువులు, అధికారులు ఒకరితో ఒకరు పోటీపడి దేవాలయాలు కట్టించడం, కొత్త దేవుళ్లను సృష్టించడం ఆ దేవుళ్లకు ఉత్సవాలు రక్తి కట్టే విధంగా జరిపించడంలో విస్తారమైన దానధర్మాలు చేయడం జరిగింది. అందులో భాగంగానే స్త్రీలను కూడా భగవంతుడి భోగానికి ఏర్పాటు చేయబడ్డారు. దేవాలయాలలో నృత్య గాన వినోదాలు నిర్వహించటం వీరి బాధ్యత. దేవాలయాలలో సేవకురాండ్రుగా బ్రతికే స్త్రీలు కనుక వీరు దేవదాసీలుగా పేర్కొనబడ్డారు"[5].

19వ శతాబ్దం నాటికి భోగం వాళ్ళు, సానులు అనే పేర్లతో దేవదాసీలు ప్రత్యేకంగా పరిగణింపబడ్డారు. సంస్కరణ ఉద్యమంలో భాగంగా దేవదాసి నిర్మూలనా కార్యక్రమాన్ని రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862-1939) చేపట్టాడు. ఇతనిచే ప్రారంభమైన దేవదాసి వ్యతిరేక ఉద్యమం తొందరలోనే పురోగమించి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రమంతటా వ్యాపించింది. అనేక పత్రికలు ఈ ఉద్యమానికి అండగా నిలిచాయి. తదనగుణంగా దేవదాసి వృత్తి నిర్మూలన పట్ల సంస్కరణ దృక్పథం సాంఘిక స్వచ్ఛత ఉద్యమంలో భాగమయ్యింది. ఈ స్వచ్ఛత ఉద్యమ, సంస్కరణ దృక్పథంతో "మనోరమ" అనే సాంఘిక నాటకానికి ఇతివృత్తాన్ని తీసుకొని దేవదాసి జనోద్ధరణనను దారి చూపాడు రాజమన్నారు.

'మనోరమ' నాటకం ప్రారంభంలోనే దేవదాసీలుగా జీవితం గడుపుతున్న మనోరమ, నిరూపమ దీన పరిస్థితిని తెలియజేస్తూ దాని నుండి బయటపడాలన్న కోరిక వారిలో ఎంత తీవ్రంగా ఉందో తెలిపాడు రాజమన్నారు. మనోరమ దేవదాసి వ్యవస్థ కూపము నుండి ఎప్పుడు బయటపడతామో అని నిరూపమతో అంటే నిరూపమ దేవదాసి వ్యవస్థ హిందూమత వ్యవస్థ చట్రంలో ఎట్లా భాగం అయిందో చెప్తుంది. నూటికో కోటికో ఒక్కరు ఈ కూపము నుండి బయటపడినా అది వైకుంఠమంతా బాగా ఏమీ ఉండదని అప్పటి సమస్యలు అప్పుడు ఉండకపోవు అని చెబుతూ పెళ్ళాడిన దాసిని దాసిగానే పరిగణిస్తారని" (మనోరమ- పుట:18) చెప్తుంది. నిరుపమ లోకజ్ఞానము కలది. సామాజిక స్థితిగతుల్ని దేవదాసుల పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకోగలిగింది. అందుకే బయటి ప్రపంచంలో దేవదాసికి గల స్థానాన్ని అంచనా వేయగలిగింది. హిందూ మత వ్యవస్థ చట్రంలో దేవదాసి స్త్రీ ఎలా బంధింపబడిందో తెలియజేయగలిగింది.

దేవాలయ ట్రస్టీ కొడుకు సుబ్బారావు అతని స్నేహితుడు రామ్మూర్తి దేవాలయాన్ని చూడడానికి వస్తున్నారని

తెలిసిన సందర్భంలో మనోరమ వాళ్లకు తను సహాయం చేస్తానని ఒప్పుకున్నప్పుడు, పూజారి రంగాచార్యులు మనోరమను దీర్ఘాయుష్మాన్ భవ: అని ఆశీర్వదించాడు. మనోరమ 'ఉపయోగంగా ఉన్నామనేగా ఆశీర్వదించారు? ఈ యవ్వనం కాస్త వెళ్ళిపోతే శీఘ్రమే స్మశాన ప్రాప్తిరస్తు అని శపించరు! (మనోరమ-పుట:19) అని అనడంలో దేవదాసి ఎంతటి భోగ వస్తువుగా పరిగణింపబడుతున్నదో అది ఆ స్త్రీకి ఎంత బాధాకరంగా ఉంటుందో తెలియజేశాడు రాజమన్నారు. ఒక స్త్రీ యవ్వనత్వాన్ని మనసుతో ప్రమేయం లేకుండా విలాస వస్తువుగా వాడుకునే ధోరణి పట్ల రాజమన్నారుకు ఉన్న అసహనం ఇక్కడ బోధపడింది.

రామ్మూర్తి, మనోరమ దేవదాసి వృత్తిలోకి రావడానికి గల కారణాన్ని తెలుసుకొని ఆ వృత్తిని ఇష్టపూర్తిగానే అవలంబిస్తున్నారా-అని అడిగినప్పుడు స్వతంత్రంగా ఇటువంటి నీచ వృత్తిని చేపట్టాలని ఏ స్త్రీ కోరుకోదని వేరే గత్యంతరం లేనప్పుడు బలవంతంగానో, స్వతంత్రంగానో చేపట్టక తప్పదని అంటుంది మనోరమ. నిస్సహాయులు, నిరాదాయులు అయిన స్త్రీలను నిర్బంధంగా ఇందులోకి లాగటం మరొక గత్యంతరం లేక ఇందులో జీవించాల్సిన పరిస్థితులను కల్పించడం భోగలాలస దృష్టిగల పురుషాధిక్య వ్యవస్థ చేసిన కుట్రలో భాగమే. అందువల్ల ఇక్కడ బలవంతానికి, స్వాతంత్ర్యానికి మధ్య చెప్పుకోదగ్గ తేడా లేకుంటే పోయింది. రెండింటి ఫలితం ఒకటిగానే పర్యవసి
స్తుంటుంది. ఈ పరిస్థితి కల్పించిన నిస్పృహ ఇక్కడ మనోరమ మాటల్లో వ్యక్తం అవుతుంది. దేవదాసి వృత్తిలో తృప్తి పడుతున్నారా అని రామ్మూర్తి మనోరమను అడిగినప్పుడు నా ఒళ్ళు భగ్గుమని దహించుకపోతుంది, నా గుండె చిల్లులు పడుతుంది అని అనుక్షణం తన శరీరం మనసు పడే హింసను గురించి తెలియజేసింది ఆమె. రాజమన్నారు మనోరమ చేత చెప్పించిన ఈ మాటల ద్వారా స్త్రీలకు హింసావ్యవస్థగా ఉన్న దేవదాసి వ్యవస్థ ఎంతో అవమానమైనదో సూచించాడు.

రామ్మూర్తి మేనమామ శోభనాద్రిరావు రామ్మూర్తి దృష్టిని మనోరమ నుండి తన కూతురుపై మరల్చడానికి ఈ తరహా స్త్రీలకి మంచి నడవడిక చాలా దూరమని చెప్పాడు. నిజానికి దేవదాసీలను సృష్టించినది ఆర్థిక, లైంగిక అసమానతలు ఉన్న సమాజం. పురుషుల విశృంఖల లైంగిక వాంఛలు తీర్చడానికి సృష్టించినది దేవదాసి వ్యవస్థ. కానీ శోభనాద్రిరావు లాంటి వ్యక్తులు దేవదాసిలను అవినీతిమయ స్త్రీలుగాను, విశృంఖల శృంగార జీవితము గడిపే వారు గాను చూడటం జరిగింది. ఇది ద్వంద విలువల లక్షణం. పురుషాధిక్య సమాజంలో పురుషుడి భోగలాలసత్వం కొరకు దేవదాసి వ్యవస్థ ఏర్పాటు చేసి ఆ స్త్రీని విశృంఖలమైన వ్యభిచారినిగా పేర్కొనడం నిజంగా ద్వంద నీతే అవుతుంది.

అందుకే సాంఘిక స్వచ్ఛత సంస్కరణోద్యమాన్ని బలపరచడానికి రాజమన్నారు ద్వంద విలువల లక్షణాన్ని వ్యతిరేకించి దేవదాసి స్త్రీకి మనసు ఉంటుందని దాంపత్య జీవితానికి వారు అర్హులేనని రామ్మూర్తి మనోరమల దాంపత్యాన్ని సుఖాంతం చేశాడు.

**ముగింపు**

సాధారణంగా నాటక ప్రక్రియ రక్తితో కూడుకొని ఉంటుంది. ఇందులో నవరసాల్లో ఏదో ఒకదానిని గాని అంతకంటే ఎక్కువగానీ ప్రధానం చేసి నాటక కర్త నాటకాన్ని రక్తి కట్టిస్తాడు. కానీ వీరేశలింగం, గురజాడ మొదలైన మహనీయులు రసపోషణ కంటే సామాజిక స్పృహకు తమ నాటకాల్లో ప్రాధాన్యత ఇచ్చారు. వారి అడుగుజాడల్లోనే రసపోషణకు ప్రాధాన్యతను ఇవ్వక, పాఠకుడికి, శ్రోతకు సామాజిక స్పృహ కలిగించడం, ఒక వాస్తవ జీవితానికి సంబంధించిన సందేశాన్ని ఇవ్వడం తన నాటకాల రచనకు లక్ష్యంగా పెట్టుకున్నాడు రాజమన్నారు. రాజమన్నారు నాటక సాహిత్య దృక్పథంలో కనిపించే ప్రబలమైన అంశం స్త్రీ - పురుష సంబంధాలు. స్త్రీ పురుష సంబంధాల్లో ముఖ్యంగా కుటుంబేతర లైంగిక సంబంధాలను చర్చకు పెట్టాడు. కుటుంబ పరిధిలోని వైవాహిక సంబంధాలను, అదేవిధంగా వితంతు సంబంధాలను, అదే విధంగా పురుషాధిక్య సమాజం తనకు అనుకూలంగా ఎలా మలుచుతుందో విమర్శనాత్మకంగా విశ్లేషించాడు. కుటుంబానికి బయట ఇదే పితృస్వామ్య వ్యవస్థ ఎలా పురుషుడికి తన లైంగిక వాంఛను తీర్చుకోవడానికి అవకాశాన్ని కల్పించేందో కూడా నాటకాల్లో చూపాడు. పితృస్వామ్య వ్యవస్థ నుండి పుట్టిన వేశ్య వ్యవస్థను, దేవదాసి వ్యవస్థను

సాంఘిక దురాచారాలుగా భావించి రాజమన్నారు విమర్శనాత్మకత వాస్తవికత దృక్పథముతో చూశాడు. సామాజిక సమస్యలను విమర్శకు పెట్టి సమాజాన్ని మార్చుకోవాలన్న ఆలోచనతో ప్రేరణ ఇవ్వగల రచనలు చేశాడు.

**పాద సూచికలు:**

1. ప్రేమ్ చంద్-సాహిత్య వ్యాసాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, పుట:6
2. కాత్యాయని, జ్యోతి రాణి, శోభ-మహిళా జనజీవన సమస్యలు, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, వరంగల్-1994, పుట: 49.
3. రామ్మోహన్ రావు మహీధర-మోర్గన్ లూయీ హెన్రీ, పురాతన సమాజం, విజ్ఞాన వికాస సమితి, విజయవాడ-1987. పుట: 421
4. రామకృష్ణ వి (అనువాదం) రాచమల్లు రామచంద్రారెడ్డి-ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ ఉద్యమాలు (1848-1919), హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1986, పుట:88
5. సుబ్బమ్మ మల్లాది-హైందవం-స్త్రీలు, మల్లాది పబ్లికేషన్స్, 1986, పుట: 143

**ఆధార గ్రంథాలు :**

1 కాత్యాయని. కె (1994), సంప్రదాయ సాహిత్యం, స్త్రీవాద దృక్పదాలు, స్త్రీ జనాభ్యుదయ సంస్థ, వరంగల్.
2. కుటుంబరావు కొడవటిగంటి (1980), సాహిత్య ప్రయోజనం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
3. కోటిరెడ్డి ఏ.వి (1994), ఆధునిక ఆంధ్రదేశచరిత్ర, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
4. నారాయణ రావు వెల్చేరు (1987), తెలుగు కవితా విప్లవాల స్వరూపం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
5. నారాయణరెడ్డి సి. (1993),ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయములు ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,హైదరాబాద్.
6. బిపిన్ చంద్ర (1990), ఆధునిక భారతదేశ చరిత్ర (సహవాసి), హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.
7. మునిరత్నం రెడ్డి ఎ (1995), సామాజిక మానవ శాస్త్రం-పరిచయం, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
8. మూర్తి, డి బి ఎస్ ఆర్ సి హెచ్ (1984), సామాజిక పరిణామం లో స్త్రీ, ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ.
9. రమణ పి.వి (1993), తెలుగు నాటక రంగం, వెంకటరమణ బ్రదర్స్, వరంగల్.
10. రంగనాథాచార్యులు కె కె సం. (1984), తెలుగు సాహిత్య వికాసం (1900-1947), ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.
11. శకుంతలా దేవి బొందలపాటి సం.(1958), రాజమన్నారు నాటికలు, దేశీ కవిత మండలి, విజయవాడ.
12. సుదర్శనం ఆర్ ఎస్ (1982), సాహిత్యంలో దృక్పథాలు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ.

# పెద్దింటి అశోక్ కుమార్ నాటకాలు - పరిశీలన

**డా. వెల్దండి శ్రీధర్**
అసిస్టెంట్ ప్రొఫెసర్
నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)
నల్లగొండ
సెల్: 9866977741

కథా రచయితగా, నవలా రచయితగా, సినిమా రచయితగా, నటుడిగా పెద్దింటి అశోక్ కుమార్ విఖ్యాతి గాంచినవారు. వీరు రాసిన కథలకు, నవలలకు ఎన్నో అవార్డులు అందుకున్నారు. పెద్దింటి రాసిన 'జిగిరి' నవల ఆటా ఉత్తమ నవలా పురస్కారం పొందడంతో పాటు పది ఇతర భారతీయ భాషల్లోకి అనువాదమైంది. కథలు, నవలలేగాకుండా విజయవంతమైన నాటకాలు కూడా రాశారు పెద్దింటి. అవి ఎన్నోసార్లు విజయవంతంగా ప్రదర్శింపబడి విశేషమైన ప్రేక్షకాదరణ పొందాయి. వీరు మొత్తం ఐదు నాటకాలు రాశారు. అవి. ఎండమావి, మినిస్టరొత్తాండు, నెనరు, పోరుగాలి, తెగారం.

ఎండమావి నాటకం పెద్దింటి అశోక్ కుమార్ రాసిన మొదటి నాటకం. దీనిని 2005లో రచించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆకాశవాణి హైదరాబాద్ రేడియో కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ప్రసారమయ్యే నాటకంలో దీన్ని చాలా సార్లు ప్రసారం చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా ఉపాధి కోసం చాలామంది ఎడారి దేశాలకు వెళు తుంటారు. అలా ఎడారి దేశం వెళ్లిన ఒక కుటుంబం కథ ఇది. పుట్టెడు అప్పులు చేసి, వడ్డీకి తెచ్చి, ఆశపడి ఎడారి దేశం వెళితే, అక్కడ ఆశించిన పని దొరకక, చేసిన పనికి జీతం రాక పడే అష్టకష్టాలు ఈ నాటకంలో ఉంటాయి.

నాటకంలో ప్రధాన పాత్ర అంజయ్య. ఆయన ఇక్కడ వ్యవసాయం సరిగా నడవక నీళ్లు లేక, కరెంటు లేక, పండిన పంటకు ధర లేక, అప్పుల పాలై ఎడారి దేశం పోవాలని అనుకుంటాడు. అప్పటికే ఊర్లో చాలా మంది ఎడారి దేశాలు పోతారు. దుబాయ్, సౌదీ అరేబియా, బైరాన్, రెహమాన్ ఇలా ఏ దేశానికి వలస వెళ్లినా తెలంగాణ పల్లెల్లో మాత్రం మస్కట్ పోయిండు, మస్కట్ వెళ్ళాడు అని అంటారు.

అంజయ్య మస్కట్ వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. మస్కట్ వెళ్లాలంటే ఊరిలో ఒక ఏజెంట్‌ను పట్టుకోవాలి. బొంబాయి వెళ్లాలి. బొంబాయిలో రోజుల తరబడి ఉండాలి. మెడికల్ టెస్ట్, పాస్‌పోర్ట్ టెస్టు, ఇమిగ్రేషన్ వీసా ఇలాంటివి ఎన్నో ఉంటాయి. మస్కట్ వెళ్లాలనుకున్న అంజయ్య ఏజెంట్‌ని కలిసి తన పాస్‌పోర్ట్ ఇస్తాడు. కొన్ని డబ్బులు కూడా ఇస్తాడు. వీజాలు కూడా ఏజెంట్ల చేతిలో ఉన్నాయి. వాళ్లు ఇంకొకరికి ఏజెంట్లుగా ఉంటారు. ఇలా నాలుగు చేతులు మారితే తప్ప సరి అయిన వ్యక్తి దగ్గరికి చేరదు. పాస్‌పోర్ట్ ఇచ్చి, డబ్బులు ఇచ్చి రోజుల తరబడి బొంబాయిలో ఉండి ఉత్తరాలు లేక మనిషి రాక ఎన్నో అవస్థలు పడ్డ సంఘటనలు ఈ నాటకంలో ఉన్నాయి. నాటకంలో అంజయ్య భార్య అంటున్న మాటలు శ్రోతలను కంటతడి పెట్టిస్తాయి. "ఉన్నదే తిందాము. కలిగిన కాడికి ఉందాం. అప్పు అయితే ఉన్నది. అమ్ముకుందాం కానీ ఇద్దరం కలిసి ఉందాం. నువ్వు ఎక్కడున్నా తొందరగా రా!" అని ఉత్తరం రాయడం మనకు కన్నీటిని తెప్పిస్తోంది. అలా ఎన్నో కష్టాలు పడి అతడు గల్ఫ్ వెళ్తాడు అంజయ్య. గల్ఫ్ వెళ్లిన తర్వాత ముందు ఏజెంట్ చెప్పిన పని ఉండదు. హొటల్లో క్లీనింగ్ సెక్షన్ అంటాడు. కానీ అక్కడికి వెళ్ళాక గొర్రెల కాపరిగా ఉంచుతారు. గొర్ల కాపరిగా అంజయ్య ఎడారిలో గొర్ల మధ్య తిండి లేక, తలదాచుకునే నీడ లేక, మాట్లాడే మనిషి లేక, గొర్రెల్లో గొర్రెలాగా గడిపిన జీవితం మనకు కన్నీటిని తెప్పిస్తుంది.

బహుశా గల్ఫ్ వలసల మీద ఎన్నో కథలు, కవితలు వచ్చినా, నాటకం మాత్రం ఇదే మొదటిది అనుకుంటాను. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'ఎడారి మంటలు' అనే నవలనే గల్ఫ్ మీద రాసిన మొదటి నవల అనుకుంటాను. ఇదే జీవితం మీద 2024లో మరాఠీలో 'గోట్ లైఫ్' అని ఒక గొప్ప సినిమా వచ్చింది. దాని పూర్వ వృత్తాంతమంతా ఇదే ఎడారిలో జరిగిన సంఘటన. ఒక వ్యక్తి గుర్రం కాస్తు పడ్డ ఆవేదన ఆ రచయిత మరాఠీలో రాశాడు కాబట్టి అది గొప్ప సంచలన సినిమాగా పేరు పొందింది. పెద్దింటి అశోక్ కుమార్ తెలుగులో రాశాడు కాబట్టి ఇది మామూలు నాటకంగానే మిగిలిపోయింది.

నాటకంలో ప్రధాన పాత్రధారులైన అంజయ్య, అతని భార్య, పిల్లలు, ఏజెంట్ యాదగిరి, ఏజెంట్ భార్య శ్రీలత, ఊర్లో ఉండే ఒక ఉపాధ్యాయుడు వెంకట్ వీళ్ళందరూ తమ తమ పరిధిలో సమాజంలో ఉన్న చలనశీలతను పట్టించారు. మస్కట్‌లో ఉన్నటువంటి అంజయ్యకు కొద్దికొద్దిగా చదువు వస్తుంది కాని, రాయడానికి ఉత్తరాలు ఉండవు. రాసినా వాటిని పోస్టుడబ్బాలో వేయడానికి మనుషులు ఉండరు. ఎప్పుడో కొన్ని నీళ్లు, కొంత ఆహారంతో వచ్చిన యజమాని వాటిని అంజయ్యకు ఇచ్చి, అంజయ్య రాసిన ఉత్తరాలు తీసుకెళ్తాడు. అవి వేస్తాడో లేదో కూడా తెలియదు. అలా ఒక సంవత్సరం వరకు అతడు ఉన్నాడా లేదా చనిపోయాడా? బతికాడా? అన్న విషయం ఇక్కడ కుటుంబానికి తెలియదు. సంవత్సరం తర్వాత వచ్చిన ఒక ఉత్తరాన్ని చూసి, చదివించుకొని విని, అతడి భార్యపడ్డ ఆవేదన అంతా ఇంతా కాదు. ఇది ఉత్తరం కాదు మనిషే వచ్చినట్టుగా ఉంది. నా భర్తనే నా కళ్ళ ముందుకు వచ్చినట్టుగా ఉంది అంటూ ఉత్తరాన్ని భద్రంగా కొంగుకు కట్టుకున్న సంఘటన నాటకంలో మనసును ద్రవించేలా చేస్తుంది. ఇక్కడ భార్యకు చదువు రాదు కాబట్టి, ఊర్లో ఉన్న ఒక టీచర్ దగ్గరికి వెళ్లి ఉత్తరం రాయించడం, ఏడుస్తూ తన బాధనంతా అతనితో వలబోసుకోవడం చూస్తే మన కళ్ళల్లో కన్నీళ్ళు ఉబికి వస్తాయి.

ఒక కుటుంబ పెద్ద, ఇంటికి దూరమై సంవత్సరాల తరబడి ఎక్కడో ఉంటే, ఇక్కడ ఆ కుటుంబం పడే ఇబ్బందులు, అప్పుల బాధ, అప్పు ఇచ్చిన వాళ్ళు అడగడం, అక్కడి నుంచి డబ్బులు రాకపోవడం ఇవన్నీ ఈ నాటకంలో మనకు సంభాషణల ద్వారా కనిపిస్తాయి. ముఖ్యంగా భార్య ఉత్తరాలు రాసే ఆ ఊరి టీచర్తో ఏడుస్తూ మా బతుకులు ఏంటి సార్ ఇలా తగలబడ్డాయి, మేమేం తప్పు చేశాం? మేమేం మిద్దెలు, మేడలు కోరుకోవడం లేదు కదా! కనీసం కష్టం చేస్తాం, పంట పండించుకుంటాం, దోసెడు నీళ్ళు ఇవ్వండి అని కోరుతున్నాము. బోర్లేసి బోర్ల పడ్డాము. అప్పు సాయం చేయండి అని అడిగాం. ఎవరు స్పందించలేదు అంటూ బాధపడుతుంది. వలసల వల్ల ఎక్కువగా నష్టపోయింది స్త్రీలు మరియు పిల్లలే. స్త్రీలు అనేక రకాల నిందలు మోయాల్సి వచ్చింది. కుటుంబ పెద్ద లేక, పిల్లలకు భద్రత లేక ఎన్నో చెడు అలవాట్లకు దగ్గరగా వెళ్లడం జరిగింది. సామాన్య శ్రోతలను, ప్రేక్షకులను అతలాకుతలం చేసిన సంఘటనలతో సాగిన ఈ నాటకం ఆకాశవాణి హైదరాబాద్ రేడియో కేంద్రం ద్వారా పలుమార్లు ప్రసారం అయింది. ఇప్పటికి కూడా ప్రసారం అవుతున్నది. ముగింపులో తను ఎడారి నుంచి తప్పించుకొని రావడం, అలాగే ఉన్న అప్పులు ఎలాగైనా కష్టం చేసి తీర్చుకుంటానని ధైర్యంగా చెప్పడం శ్రోతలను ఆకట్టుకుంటుంది.

పెద్దింటి రాసిన రెండో నాటకం మినిస్టరొత్తాండు. బి.యం. రెడ్డి దర్శకత్వంలో విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్‌లో ఈ నాటకాన్ని పలు సార్లు ప్రదర్శించారు. ఈ నాటకం నిండా గ్రామ రాజకీయాల పరాకాష్ఠ, కుళ్ళు కనిపిస్తుంది. కల్లంల వద్ద రాశి మీద దస్తగిరి అనే రైతు పురుగుల మందు తాగి చనిపోతాడు. ఈ శవాన్ని ఆసరగా చేసుకొని ఆ గ్రామ సర్పంచ్ చక్రపాణి చేసిన శవరాజకీయమంతా ఈ నాటకంలో చిత్రించబడింది. మినిష్టర్ వచ్చే వేళ రైతు ఆత్మహత్య బయట పడితే ఊరికి రావాల్సిన పథకాలు రావని గాబరా పడిన జెడ్పిటీసి, సర్పంచ్‌లు ఆడిన నాటకమంతా శ్రోతలకు కళ్లకు కట్టినట్టు ప్రదర్శిస్తాడు రచయిత.

దస్తగిరి మరణాన్ని అడ్డం పెట్టుకొని ఆటో డ్రైవర్ నారాయణ, గ్రామస్తులైన బాలరాజు, గోపాలం, రైస్‌మిల్ ఓనర్ చంద్రం, ఎం.ఆర్.ఓ., ఎక్కడ అన్యాయం జరిగినా ఎదిరించే గ్రామ యువకుడు విప్లవ్ అందర్ని బోల్తాకొట్టించి

గ్రామ సర్పంచ్ చక్రపాణి తన స్వార్థానికి వాడుకుంటాడు.

నాటకం చివరలో దస్తగిరి భార్య యాదమ్మ "మీ ఇల్లొద్దు, మీ బూమొద్దు, మీ పైసలొద్దు- మీ పదకాలొద్దు- సచ్చినోడు ఎట్లనో- సచ్చిండు- ఇకనుంచి బతికున్న రైతులనైనా సంపకుండ్రయ్యా - అన్యాయంగా మా పుస్తెలు తెంపకుండ్రి- ఉద్యోగం చేసెటోనికి జీతం వస్తదని నమ్మకముంటది- యాపారస్తునికి- పెట్టుబడి మీద ఎంతో కొంత లాబమొస్తదనె నమ్మకముంటది- రైతు బతుకులకే సార్ నమ్మకం లేంది- ఎంతో కష్టపడి- అడ్డగోలు అప్పులు చేసి- పంటేస్తె - ఒకసారి వానలు పడక ఎండిపోతాయ్- ఓసారి వానలెక్కువై కుళ్ళిపోతాయ్ - ఒక వస్తువును తయారు చేస్తే- దాన్ని తయారు చేసినోళ్ళే, దాని దరను కరారు జేస్తరు- కాని మా దరిద్రమేంది సార్- మేం పండించిన పంటకు దరను కరారు జెయ్యమని దళారీలను అడుక్కోవాల్సిన కర్మ పడుతుంది. అయినా మేమేమన్న- మనులడుగుతున్నమా, మాన్యాలడుగుతున్నమా- పండించిన పంటకు గిట్టుబాటు దర ఇయ్యమంటున్నం - సారూ- మీరైన- మేమైనా తినేది పిడికెడు అన్నమే- ఆ అన్నాన్ని పండించేది రైతు-ఆ రైతును వరికయ్యలల్లనె ఉరితియ్యకుండ్రి- కల్లాలను రైతులకు దింపుడు కల్లాలు జెయ్యకుండ్రి" అని బోరున ఏడుస్తుంది.

ఇంతలో మినిష్టర్ గ్రామానికి వచ్చి "మాది రైతు రాజ్యం- మా గవర్నమెంటులో రైతే రాజు- రైతు సంక్షేమమే మా ధ్యేయం- అసలు మా ప్రభుత్వం వున్నదే రైతుల కోసం- రైతులు పండించే ప్రతి చివరి గింజనూ మేమే కొంటాం- జై రైతన్న- జై జై రైతన్న" అని గ్రామ నడిబొడ్డులో ప్రసంగిస్తాడు.

పెద్దింటి రాసిన మూడో నాటకం. 'నెనరు' అంటే దయా, క్షమ అని అర్థం. వీడికి నెనరు లేదు అంటారు అంటే ఏమాత్రం దయాగుణం లేదు అన్నట్టు. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన నాటకాల్లో అద్భుతమైన నాటకం ఇది. సంగీత పరంగా చాలా గొప్పగా, పక్షులు పల్లె జీవన విధానాలు, పశువుల అరుపులు వీటితో నాటకం మొదలవుతుంది. చిన్న మెలోడియన్ సంగీతంతో మొదలైన ఈ నాటకం ఆసాంతం శ్రోతలను ఆకట్టుకుంటుంది. నాటకం ప్రధానంగా ఒక గ్రామంలో వలస వచ్చిన కుటుంబ నేపథ్యంగా సాగుతుంది. సంచార జీవులు అనేక గ్రామాలు తిరుగుతూ తమ జీవనం గడుపుతారు. అలా ఒక గ్రామానికి వచ్చిన సంచార జాతి జీవితాన్ని ప్రతిబింబించిన నాటకం ఇది. కథలోకి వెళితే భార్యా, భర్త, కొడుకు, కూతురు, కొన్ని కుక్కలు, ఒక ఆవు ఇవి పాత్రలు. వంచిన డేరా, మంచం, నాలుగు కోళ్లు, వండుకునేందుకు నాలుగు గిన్నెలు, కట్టుకునే బట్టలు ఇవి వాళ్ళ ఆస్తులు. ఇలా సంచార జాతులు గ్రామాల్లో తిరుగుతూ ఒక గ్రామంలో ఉన్నప్పుడు నాటకం మొదలవుతుంది.

తండ్రి కొడుకులు వేటకు వెళ్లడం, వేట నుంచి అడవి జంతువులను చంపి తెచ్చుకొని ఆహారంగా వండుకోవడం జరుగుతుంది. భార్య పగటిపూట గ్రామంలో తిరిగి చిన్న చిన్న వస్తువులను, కాగితాలను, ఖాళీ బీరు సీసాలను సేకరించడం, ఆట వస్తువులు, బొమ్మలను పిల్లలకు అమ్మడం, జీవనోపాధిలో భాగంగా జరుగుతుంది. ఒక కూతురు ఉంటుంది. కూతురును అత్తవారింటికి పంపిస్తారు. ఆమె కూడా ఇలాగే సంచార జాతికి చెందిన కుటుంబానికి కోడలుగా వెళు తుంది. వాళ్ళు కూడా ఇలాగే ఇళ్ళు తిరుగుతూ సామాను అమ్ముకుంటూ జీవనం గడుపుతూ ఉంటారు. ఆమె ప్రెగ్నెంట్. పురుడుపోసుకునే టైం వస్తుంది. ఏ ఊర్లో ఉంటే ఆ ఊరిలోనే పురుడు పోసుకోవాలి. తల్లిగారింటికి వచ్చి పురుడు పోసుకునే అవకాశం లేదు. ప్రతి ఊరు వీళ్ళకి తల్లిగారి ఊరే. ఎందుకంటే నిరంతరం సంచారం చేస్తూ ఉంటారు, ఒకచోట స్థిరంగా ఉండరు కాబట్టి. అలా ఒకనాడు అల్లుడు, అత్తను తీసుకుపోవడానికి వస్తాడు.

అంతకు ముందు రోజు గ్రామంలో చిన్న గొడవ జరుగుతుంది. వేటకు వెళ్లిన తండ్రి కుందేలును తెచ్చి ఊర్లో అమ్మకానికి చూస్తాడు. దాన్ని ఉచితంగా కొట్టేయాలని ఆ గ్రామ పెద్ద పథకం వేస్తాడు. వాళ్లకు ఇవ్వకుండా అమ్ముకోవడంతో గ్రామ పెద్ద పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. పోలీసులు వచ్చే సమయానికి ఇంట్లో తండ్రి, కొడుకులు ఉండరు. అల్లుడు ఉంటాడు. అల్లుడ్ని పోలీసులు పట్టుకెళ్తారు. భర్త రాగానే ఈ విషయం చెప్తే తండ్రీ, కొడుకులు ఇద్దరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తారు. వాళ్లను పొద్దంతా స్టేషన్‌లోనే ఉంచుకొని, చాకిరి చేయించుకుని, పందిని వేటాడి తెస్తేనే అల్లుడ్ని

వదిలిపెడతామంటారు. అలా తండ్రి, కొడుకులు ఇద్దరు పందిని వేటాడడానికి అడవికి వెళ్తారు. ఎంత వెతికినా పంది దొరకదు. ఒకచోట చివరికి పంది కనిపిస్తుంది. తండ్రి, కొడుకులు ఇద్దరు మాటు వేసి పందిని చంపాలని పథకం వేస్తారు. చేతుల్లో ఆయుధాలు ఉంటాయి. గుండు చాటుకు ఒకరు మార్గమధ్యంలో ఒకరు ఉండి పందిని అరుపులతో పరిగెత్తిస్తారు. పొదల్లోంచి లేచిన పంది తండ్రి వైపు వెళ్తుంది. అది పరిగెత్తకుండా నెమ్మదిగా వెళుతుంది. చేతిలో ఉన్న ఈటెతో బలంగా పంది వైపు విసరబోతూ తండ్రి ఆగిపోతాడు. విసరకుండా అలాగే నిలబడతాడు. పంది దూరంగా పారిపోతుంది. కొడుకు తండ్రిపై విసుక్కుని ఎందుకలా చేశావు దాన్ని చంపాల్సింది కదా అంటాడు. అప్పుడు తండ్రి మాట్లాడిన మాటలు శ్రోతల గుండెను మెలిపెడతాయి. "అది పొట్టతో ఉంది రా! పరిగెత్తలేకపోతుంది. అది గనుక మామూలుగా ఉంటే నీకు నాకు కనిపించకుండా క్షణంలో మాయమయ్యేది. దాన్ని చూస్తుంటే పొట్టతో ఉన్న నా కూతురు గుర్తొస్తుంది రా!" అంటూ కన్నీళ్లు పెట్టుకుంటాడు. నాటకంలోనే ఒకచోట "డబ్బు దేముందిరా! చెయ్యి చాపినా వస్తుంది. చెయ్యి లేపినా వస్తుంది. కొంగు చాపినా వస్తుంది. కొంగు పరిచినా వస్తుంది" అంటూ జీవిత సత్యాన్ని చెప్తాడు. నాటకమంతా అడవి నేపథ్యంగా, చిన్న కుటుంబం నేపథ్యంగా సాగుతుంది. మొదటి అంకంలో వలస కుటుంబం, వాళ్ళ జీవనము చూపిస్తే, ద్వితీయ అంకంలో ఊరిలో రాజకీయాలు, అల్లుడ్ని పోలీసులు పట్టుకపోవడం, భార్య, కూతురు కోసం బాధపడడం వివరిస్తాడు. మూడో అంకంలో పోలీస్‌స్టేషన్ వెళ్లడం, పోలీస్‌స్టేషన్లో వీళ్ళని అవమానించడం, పందిని తెస్తేనే అల్లుడ్ని వదిలిపెడతామని టార్గెట్ ప్రకారం తండ్రీకొడుకులను హింసించడం కనిపిస్తుంది. నాల్గవ అంకంలో వేటకు వెళ్లిన తండ్రి, కొడుకులు, అడవిలో పొట్టతో ఉన్న పంది, అడవి నేపథ్యం, తండ్రీకొడుకుల మధ్య సంభాషణ ఒక మానవీయ కోణం కనిపిస్తుంది. సంభాషణలకు, కథనానికి పెట్టింది పేరైన పెద్దింటి అశోక్ కుమార్ తనదైన శైలిలో రాసిన గుండెలో దింపే సంభాషణలు ఇందులో ఉన్నాయి.

పోరుగడ్డ నాటకం 2014లో వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమ స్ఫూర్తిని తెలంగాణ పోరాట పటిమని ప్రజల ఆకాంక్షను బలంగా తెలియజెప్పిన నాటకం ఇది. దీనిని కుమారస్వామి దర్శకత్వంలో రవీంద్ర భారతిలో ప్రదర్శించారు. ప్రముఖ నాటక రచయిత షేక్స్పియర్ నాటకం ద టెంపెస్ట్‌కు అడాప్షన్‌గా రాసిన నాటకం ఇది. ద టెంపెస్ట్ నాటకంలో పీడితులైన ఒకానొక దీవి ప్రజలు స్వేచ్ఛను కోరుకుంటూ చేసిన తిరుగుబాటు లాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు తమ హక్కులకు భంగం కలుగుతుందని తమ భాష,
సంస్కృతి వెక్కిరింతకు గురవుతున్నాయని, వాటికి సమాన స్థాయిలో గౌరవం దక్కాలని, అంతేకాకుండా తమ హక్కులు హరించబడుతున్నాయని, వనరుల్లో, నిధుల్లో తమకు సరిగా న్యాయం జరగడం లేదని తిరగబడి చేసిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం. టెంపెస్ట్ నాటకంలో కూడా ఆ ప్రాంత ప్రజలు పాలకులపై తిరుగుబాటు చేసి తమని మనుషులుగా కాకుండా జంతువుల్లా హీనంగా చూస్తున్న పాలకులపై తిరుగుబాటు చేసి విజయం సాధిస్తారు.
తెలంగాణ పోరాటానికి సింబాలిక్‌గా ఉన్న ఈ నాటకాన్ని అడాప్షన్‌గా తీసుకుంటూ తెలంగాణ సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ సాగిన నాటకం ఇది. నాటకం మొదట్లో రాసిన పాట తెలంగాణ వెయ్యేళ్ళ చరిత్రను గొప్పదనాన్ని సంస్కృతిని తెలియజేస్తోంది. ఆ నాటకం ఈ పాటతోనే మొదలవుతుంది. నాటకంలో టెంపెస్ట్‌లో ఉన్న పాత్రలే ఉంటాయి. తమ భాష ఎక్కడ కించపరుస్తున్నారో, తమని ఎక్కడ అణచివేస్తున్నారో, తమ పోరాటాన్ని ఏ విధంగా అణగదొక్కుతున్నారో ఇందులో వివరంగా ఉంటుంది. నాటకంలో తెలంగాణ తల్లి ఊరేగుతుంటే ఆమెకు సంబంధించిన అనేక అంశాలు పాటల రూపంలో, గీతాల రూపంలో వినిపిస్తూ ఉంటాయి. మొదటి అంకంలో తెలంగాణ ప్రాంతం ఎలా అణగదొక్క పడుతుంది. ప్రజలు ఎలా అన్యాయానికి గురవుతున్నారు. ఎలా బాధించబడుతున్నారో వివరంగా ఉంటుంది. రెండవ అంకంలో ఆ ప్రజల్ని, అన్యానికి గురవుతున్నటువంటి ఆ జనాన్ని మేల్కొల్పడానికి ఒక వ్యక్తి రావడం, వాళ్ళలో ఉద్యమ స్ఫూర్తిని నింపడం, ఉద్యమానికి సమాయత్తం చేయడం జరుగుతుంది. మూడో అంకంలో పోరాటం మొదలవుతుంది. పోరాటంలో ధర్నాలు, ఉద్యమాలు, ఎదురు తిరగడం, అణచివేత ఇవన్నీ

ఉంటాయి. అంతర్లీనంగా ఒక ప్రేమ కథ కూడా ఇందులో ఉంటుంది. ఒక అమ్మాయి ఒక అబ్బాయి ఒకరినొకరు ఇష్టపడడం, చివరగా వారి ప్రేమను త్యాగం చేయడం ఉద్యమానికి తమ జీవితాలను అంకితం చేయడం కనిపిస్తుంది.

పెద్దింటి రాసిన ఐదవ నాటకం 'తెగారం' అంటే తెగింపు అని అర్థం. తెలంగాణలోని శివసత్తుల మీద వచ్చిన ఒక చారిత్రాత్మకమైన నాటకం. ఉత్తమ నటన కేటగిరీలో నంది అవార్డుతో పాటు ఇతర అవార్డులు పాతిక దాకా ఈ నాటకాన్ని వరించాయి. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇప్పటిదాకా సుమారు 30 దాకా ఈ నాటక ప్రదర్శనలు జరిగాయి. దేవత పూనకం అనే ఒక మానసిక రోగం దళిత, బహుజనులకు మాత్రమే ఎందుకు వస్తుంది. దాని వెనక దాగున్న ఊరి కుట్ర, ఆధిపత్య వర్గాల కుట్రను బట్టబయలు చేసేదే ఈ నాటకం.

ఎల్లవ్వ అనే దళితురాలు శిగమూగుతది. ఆమెకు శివసత్తి వచ్చి పూనకం ఊగిన ప్రతిసారి ఏదో ఒక దేవతకు చేసి దేవతను శాంతింపజేస్తారు. ఇదే రోగం ఆమె కూతురు లలితకు కూడా వస్తుంది. బిడ్డకు పెళ్లిచేసి అత్తగారింటికి పంపిద్దామనేసరికి లలితకు కూడా ఈ రోగం వచ్చేసరికి ఎల్లవ్వ ఆందోళన పడుతుంది. రాజారాం, సర్పంచ్, ఇతర గ్రామ పెద్దలంతా కలిసి లలితను కూడా ఈ రొంపిలోకి దింపుదామని ప్రయత్నిస్తారు. కాని రాజారాం చిన్న కొడుకు నవీన్ ఎల్లవ్వకు జరిగిందంతా వివరిస్తాడు. మానసిక ఒత్తిడి వల్లనే ఆనాడు నువ్వు, ఈనాడు నీ బిడ్డ శివసత్తులవుతున్నారు. అదే ఆధిపత్య వర్గాల్లో ఆడపిల్లలు లేరా వాళ్లకు ఎందుకు ఈ పూనకం రావడం లేదు. వాళ్లెందుకు శివసత్తులుగా మారడం లేదు? ఒకసారి ఆలోచించు నీ బిడ్డను కూడా శివసత్తిగా మార్చి ఊరందరూ ఆమెను ఉంపుడుగత్తెగా మార్చుకునే కుట్ర చేస్తున్నారు. ఇదొక మానసిక రోగం. దీనికిప్పుడు ఎన్నో మందులున్నాయి. చికిత్స ఉంది. మనం పట్నంబోయి నీ బిడ్డను మంచి మానసిక డాక్టరుకు చూపిద్దాం. ఈ సమయంలో నువ్వు ధైర్యం చేసి నీ బిడ్డను కాపాడుకోకపోతే నీ బిడ్డ కూడా నీ లాగే ఊరి ఉమ్మడి ఆస్థిగా మారుతుందని
హెచ్చరించి, ఎల్లవ్వకు ధైర్యం చెప్పి మెల్లగా ఎల్లవ్వ ఊరి నిర్ణయాన్ని ఎదిరించేలాగా చేస్తాడు.

నాటకం చివరలో ఎల్లవ్వ ఊరందరికి ఎదురు తిరిగి తన బిడ్డను కాపాడుకుంటుంది. "శభాష్... ఎల్లవ్వ నువ్వు ఇదే తెగారంతో ఉండు... ధైర్యం నీ గుండెలో ఉంటే చట్టం నీ వెంట ఉంటది... బలవంతంగా శివసత్తిని చేయడం నేరం... రేపే కేసు పెడదాం...నిన్నెవ్వడు కన్నెత్తి చూడడు.." అని నవీన్ ధైర్యం చెప్తాడు.

"ఎదురు తిరుగుడే పటేలా! కుక్క బతుకు బతికిందానికంటే సచ్చింది నయం. ఈ తెగింపు లేకనే నలపయి ఏండ్ల కింద నా బార్యను పోగొట్టుకున్న, ఈ తెగింపు లేకనే ఇరువై ఏండ్ల కింద నా బిడ్డ బతుకు ఆగం చేసిన...ఇప్పుడు... ఇప్పుడు.. నా మనుమరాలు బతుకు ఆగంజెయ్య... రేపు ఎవడత్తడో రానీ..." అని ఎల్లవ్వ తండ్రి ఆశయ్య కూడా ఎదురు తిరిగి సమాధానం చెప్పడంతో నాటకం ముగుస్తుంది. ఊరందరూ తోక ముడుస్తారు.

పెద్దింటి కథలు, నవలల్లాగే ఆయన రాసిన నాటకాలు కూడా ఎంతో సామాజిక మార్పును ఆశించే నాటకాలు. మొదటి నుంచి తెలంగాణ సామాజిక చలనసూత్రాలను బాగా అర్థం చేసుకొని కథలు, నవలలు, వ్యాసాలు రాస్తున్న పెద్దింటి తాను రాసిన నాటకాల్లో కూడా ఎంతో సమాజ స్థితిగతులను, ప్రజల విప్లవ స్వరూపాన్ని చిత్రించి వర్తమాన సమాజంలో ఎంతో గుణాత్మకమైన మార్పును తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

పెద్దింటి రాసిన చాలా కథలు, నవలలు కూడా నాటకాలను తలపిస్తాయి. అందుకే ఆయన రాసిన కొన్ని కథలు కూడా నాటకాలుగా మలచబడ్డాయి. అవి. భూమడు, పేగుముడి, చీమా చీమా ఎందుకు కుట్టావ్?. తెగారం నాటకం కూడా ముందు కథగా ప్రసిద్ధమైందే. దాన్ని తరువాత నాటకంగా మలచడంతో పెద్ద సంచలన నాటకంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. అంతేకాదు ఈ తెగారం నాటకానికి ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి. పెద్దింటి తనదైన మార్క్‌తో రాసిన డైలాగులు, పాత్ర చిత్రణ ఆయన నాటకాలకు ప్రాణంగా నిలుస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు**

1. నరసింహారావు తాటికొండాల (2021), తెలంగాణ నాటక రంగ చరిత్ర, ఖమ్మం.
2. అశోక్ కుమార్ పెద్దింటి (2005), ఎండమావి.
3. పైదే (2007), మినిష్టరొత్తాండు.
4. పైదే (2010), నెనరు.
5. పైదే (2014), పోరుగడ్డ.
6. పైదే (2010), తెగారం.

# మిత్ర నృత్యరూప నాటకాలు - వస్తు వైవిధ్యం

**సి. అనిత కుమారి**
పరిశోధక విద్యార్థి
తెలుగు విభాగం
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్
సెల్ : 9866238682

**ఉపోద్ఘాతం :**

సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగు నాటకం సమాజం మీద ఎంతో ప్రభావాన్ని చూపింది. భారతీయ నాటక ప్రక్రియలైన పౌరాణిక, చారిత్రక, కాల్పనిక, సాంఘిక నాటకాలు ప్రజల జీవితానుభవంలో భాగమైనప్పటికీ, ఆధునిక కాలంలోని నాటకాలు సాంఘిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పరమైన అంశాలను లేవనెత్తటానికి ఉపయోగపడ్డాయి. రూపక ప్రక్రియకు చెందిన ఈ నాటకం అతి ప్రాచీన కాలంలోనే ఆదివాసీల జీవన విధానంలో నృత్య గానాలుగా కనిపించిందని మానవ నాగరికత పుట్టక ముందు నుంచే ఉందని పరిశోధనల ద్వారా నిరూపితమయింది. అది మానవుని ఉత్తేజం కోసం వీరనాట్యం, ఆనందం కోసం శృంగారం, హృదయ ప్రాయశ్చిత్తం కోసం శోకం, లాంటి రసాల్లో కనబడుతుంది. ఈ విధంగా ఆదిమానవులు నృత్యంతో రసానందం పొంది తద్వారా తన్మయత్వం చెందే వారి నుంచి వెలువడిన 'నృత్య గానాలు' క్రమంగా 'వీధి నాటకాలు'గా అభివృద్ధి చెందాయి.

నాలుగు దశబ్దాల పైచిలుకు కాలం నుంచి ఈ దేశంలోని అసమ సమాజాన్ని నిర్మూలించడమే అంతిమ లక్ష్యంగా కలిగిన మిత్ర సాహిత్య క్షేత్రంలో కవిగా తెలుగు సమాజానికి సుపరిచితులే. ప్రస్తుతం వీరి సాహిత్యం పై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన కొనసాగుతుంది. విప్లవోద్యమ అనుబంధంలో విభిన్న ప్రాంతాలను కలియతిరుగుతూ ఆయా ప్రజల సమస్యలను అనేక సాహిత్య ప్రక్రియలలో పొందుపరిచారు. వందల కొలది పాటలు, వ్యాసాలు, పదుల సంఖ్యల్లో వచన కవితలు, గేయ రూపకాలు, రచించడమే కాకుండా పదికి పైగా 'నృత్యరూప నాటకాలు' కూడా రాశారు. అందులో 7 నాటకాలు ప్రసిద్ధిగాంచిన వేదికలపై ప్రదర్శించబడ్డాయి. అవి పుస్తక రూపంలో ముద్రించబడి మేధావుల చేత ముందు మాటల రూపంలో గుర్తింపు పొందాయి. ఆ నృత్య రూప నాటకాలను, నాటక సాహిత్యంగా పరిగణించగల పరిస్థితిని, ఆయా సామాజిక ఉద్యమ అవసరాల వస్తువును, వైవిధ్యంగా సాహిత్య లోకానికి పరిచయం చేయడమే ఈ పత్ర సమర్పణ ప్రధాన ఉద్దేశం.

**నృత్యరూపకాల పరిచయం :**

ఇవాళ మనం నాటకం అంటున్న పదానికి తొలి పదం 'రూపకం'. వివిధ రకాలైన నాటకాలను క్రోడీకరించి 'దశరూపకాలు'గా వింగడించారు మన పెద్దలు. (ఆచార్య నాగభూషణ శర్మ, మొదలి.నాటక శిల్పం. 2008:17) అందుకే మిత్ర కూడా బ్యాల (Ballet) వంటి ఆంగ్ల పదాన్ని వాడి రూపక రచనలకు పూనుకున్నారు. అందులోని కొన్నింటిని కాలాను క్రమంగా ప్రాధాన్యతనిస్తూ కింద వివరిస్తున్నాను.

**అడివంటుకుంది బ్యాలె (నృత్య నాటకం):**

ఆదివాసుల హక్కులను జల్ -జంగల్- జమీన్ పై అధికారాన్ని నిర్వీర్యం చేసే 1(70) అనే "షెడ్యూల్డ్ ప్రాంతాల పరిరక్షణ చట్టం" రద్దు పై వచ్చిన స్పందన ఈ నృత్యనాటకం. కాలక్రమంలో అడవి - భూమి- జలసంపదపైనే కాదు

అడవి గర్భంలోని ఖనిజ సంపదను దోచుకునే బహుళ జాతి దోపిడీలతో దేశమంతా నిండిపోయింది. దానికోసం దేశ ప్రజలపైన గ్రీన్ హంట్ పేరిట యుద్ధం ప్రకటించబడింది.సందర్భం ఏదైనా ఆదివాసుల మనుగడ రోజురోజుకు క్లిష్టతరం అయింది. అలాంటి వారి సమస్యలను తెలిపే ఈ నృత్య నాటిక నేటికీ ప్రామాణికమే అవుతుంది.ఇందులో ఆదివాసులు, సేటు వ్యాపారస్తుడు, షావుకార్లు, విప్లవకారుడు, పోలీసులు, పి. ఓ, మంత్రి, ముఖ్య మంత్రి, భూస్వాముల పాత్రలు ఉంటాయి. విశాలమైన అడవిలో గోండులు, కోలాములు, నాయక పోడులు, కోయలు, కొండరెడ్లు, సెంచులు, జాతాపులు, సవరలు మొదలైన అనేక గిరిజన తెగలు వేల ఏళ్ల నుండి బతుకుతున్నాయి. ఆకులు అలములు తిని ఏదీ దొరకకుంటే ఇసపు గడ్డలు తిని, చింతగింజల అంబలి దాగి, సగం కడుపు కాలిన చింతలేకుండా బ్రతుకుతారు. జానెడు గుడ్డతో మానం దాసుకొని, మందులు మాకు లేకుండా అమ్మోరు మీద ఆశ పెట్టుకుని బతుకులెల్ల తీస్తారు. అలాంటి వారిని నమ్మించి మోసం చేయటానికి పైగా అడవి సంపదను దోచుకోవాలనే ఆలోచనతో సేట్లు వ్యాపారం కోసమై అడవికి వెళ్తారు. పొగాకులు, పోపిత్తులు, అంగీలు, లుంగీలు, బొట్టు బిళ్ళలు అమ్ముతామంటూ మరియు ఉప్పు పప్పులు ఉద్యరకని బలవంతంగా కట్టబెడతారు. తరువాత వడ్డీలు పెరిగాయి అని అప్పు కిందికి భూములను దోసెయ్యటానికి సిద్ధమవుతారు. ఈ క్రమంలో గిరిజనులకు కనువిప్పు కలుగుతుంది. వారు తిరుగుబాటు చేయడం మొదలు పెడతారు. దీనిని మిత్ర అల్లూరి సీతారామరాజు సిచ్చు,పడాలన్న హడలు, గంటం దొర ధైర్యం, కొమురం భీముని తెగువ, గోండు దాద పోరు నుండే రగల్ జెండాలు పుట్టి దేశమంతా 200 ఆదివాసి తిరుగుబాట్లు జరిగినట్లు చెప్పారు.

ఇన్నేళ్ల స్వతంత్ర పాలనలో తమ బతుకుల్లో వెలుగులేని గిరిజనులకు విప్లవకారుడు తోడు నిలవడానికి సిద్ధపడతాడు. కానీ వీళ్లు కూడా దోపిడిదారులేనని ఆదివాసులు భయపడతారు. కాలక్రమంలో వారి జీవితాలతో పెనవేసుకుపోయి వారి సమస్యల కొరకు పోరాడుతుంటే నమ్మి దగ్గరవుతారు. దీనితో చైతన్యయుతమైన గిరిజన ప్రజానీకం గోదావరి లోయ అడవి ప్రాంతంలో శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్ వరకు పోరాటాలు చేస్తుంటుంది. వాటిని అణచటానికి పోలీసులు ఎన్ని అణచివేత చర్యలు చేసినా, పి.ఓ (ప్రాజెక్ట్ ఆఫీసర్) గిరిజన కార్పొరేషన్, ఐ.టీ.డీ.ఏ లు పెట్టి ఆదుకుంటామన్న గిరిజనులు తిరస్కరిస్తారు. 1970లో 'గిరిజన ప్రాంతాల భూ బదలాయింపు చట్టం' భూస్వాములు,షావుకారులు,కాంట్రాక్టర్లకు, ఉపయోగకారి అయింది. అది గిరిజనేతరులకు, ఆదివాసీలకు మధ్య భూతగాదాలకు దారితీసింది. దీనితో మంత్రి రంగ ప్రవేశం చేసినా ఆదివాసులు లొంగలేదు. విప్లవకారుల అండతో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తారు. దానిని చూసిన భూస్వాములు, కాంట్రాక్టర్లు, లీడర్లు మొదలైన వారంతా వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని రద్దు చేయమని ముఖ్యమంత్రిని కోరుతారు . ఈ మాటకు ముఖ్యమంత్రి వారిని ఎదురు కాల్పుల పేర ఏరివేస్తాననడం దానితో భూస్వాములు సంతోషంతో ఊగిపోతుంటారు. ఈ సందర్భంలో ఈ దున్నిన భూములు మావి. మా ఆకలి పోరును ఆపం. మా పోడు పోరు మరింతగా సాగుతుంది. మా ఆకలి మంట ఆరితేనే ఈ అడవి మంట చల్లారుతుందని ఆదివాసులు ఉద్యమిస్తారు. ఈ రకమైన పోరునే 'అడివంటుకుంది' అని నామకరణం చేసి ఈ నాటకాన్ని రచించారు మిత్ర.

'అడవి - భూమి - నీరు' మీద హక్కు ఆదివాసులదనే వస్తువు ఇందులో కనబడటం ప్రధానం.

**స్త్రీ విముక్తి నృత్యగానం:**

1985లో రచించబడిన ఈ రూపకంలో మూడు పాత్రలు కనిపిస్తాయి. అందులో ప్రధాన పాత్ర కథకురాలు, సహాయంగా వంతలు ఉంటారు. వంతలు అడిగిన ప్రశ్నల సమాధానంగా కథకురాలు బోధిస్తుంది. ముగ్గురు వేషధారులై గానం అభినయంతో కథ చెబుతారు. వీరికి నేపథ్యంలో వాయిద్య సహకారం, కోరస్ అందించబడుతుంది.స్త్రీలకు పుట్టుక మొదలు చచ్చే వరకు అనేక సమస్యలు ఉంటాయి. అనేక రంగాల్లో పనిచేసే వారి నుండి గ్రామీణ స్థాయిలోని వారందరికీ ఉండే రకరకాల సమస్యల నుండి ఏ విధంగా విముక్తి కలుగుతుందో చెప్పడమే ఈ రూపకంలోని ప్రధాన విషయం.

ప్రాచీన కావ్యాలను కవులు దేవతా స్తుతితో ప్రారంభం చేసినట్లు మిత్ర ఇందులో మహిళా అమరవీరుల స్మరణ గానం చేత కథను ప్రారంభింప చేశారు. ఒక్కొక్కటిగా స్త్రీల విధివిధానాలను తెలుపుతూ మొదట ఆదిమ కాలంలో

స్త్రీలకు ఎంత ప్రాధాన్యత ఉందో చూపెట్టారు. తరువాతి క్రమంలో స్త్రీ అనుమానించబడిన, అవమానానికి గురైన తీరు కనబడుతుంది. కోట్ల సంఖ్యలో ఉన్న గ్రామీణ స్త్రీల పరిస్థితి చెప్పబడింది. వారు భూస్వామ్య దోపిడీకి, శ్రమ దోపిడీకి, ఇంటి చాకిరికి గురైన తీరు అర్థం అవుతుంది. రైతు కూలీ, బీడీలు చుట్టే మహిళల కష్టాలు వివరించబడ్డాయి. కొలువులు చేసే ఆడోళ్లకు కూడా అధికారుల, యాజమాన్యాల దోపిడీ, లైంగిక వేధింపులు, అణిచివేత తప్పలేదని తెలుస్తుంది.

చదువుకుంటున్న ఆడ బతుకుల్లో ప్రేమ పేరుమీద జరిగే యాసిడ్ దాడులు కనబడతాయి. ఆర్థిక దోపిడీ, అవమానాలతో ఇండ్లలో బండ చాకిరి చేస్తూ, విలువ లేని బతికీడుస్తున్న కోట్ల మంది ఆడవాళ్ళ పరిస్థితి కనబడుతుంది. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో దేవుని పేరిట జోగినియంటూ, దేవదాసులంటూ ఆచారాల పేరిట వారిని వ్యభిచారిణులుగా మార్చిన తీరు కళ్ళ ముందు కదలాడుతుంది. దేశాన్ని మాతృభూమిగా పూజించే తెలుగుతల్లులే దేశంలో అత్యధికంగా వ్యభిచార కొంపల్లో నలిగిపోవటం కనిపిస్తుంది. బాల్య వివాహాలు, భారతీయ కుల వ్యవస్థలో అగ్ర- నిమ్నకుల తారతమ్యాలంటూ పరువుహత్యల ఘోరాలు కనిపిస్తాయి. ఆధునికత పేరుతో పట్టణాల్లో సామ్రాజ్యవాద సంస్కృతి బూతు బొమ్మలతో స్త్రీలను అంగడిబొమ్మగా చేసి యువతను పక్కదారి పట్టించడం కనిపిస్తుంది. సర్కారు చేసిన చట్టాలు సంపన్నుల సుఖ భోగాల కోసం ఏ విధంగా దుర్వినియోగం అవుతున్నాయో తెలుస్తుంది.కట్నం బాధతో రోజు కొక్క కొత్త వార్తలు దినపత్రికల్లో కనబడతాయి. ఈ విషయాలన్నింటినీ కథకురాలు చెబుతుంటే వంతలు మాకెందుకు కష్టాలంటూ పారిపోచూస్తారు. ఈ సందర్భంలో మహిళా లోకమంతా నిరాశతో చావకుండా ఈ బాధలన్నింటికీ కారణమైన ఈ వ్యవస్థకు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా వర్గ-కుల పోరు బాటలో ముందుకు నడవాలని కథకురాలు తెలుపుతుంది. ఈ సందర్భంలో ఎదురయ్యే అణిచివేతలను గుర్తు చేస్తూ మరింత ముందుకు ధైర్యంగా కొనసాగిన రోజే స్త్రీలకు విముక్తి కలుపుతుంది. అదే నిజమైన స్త్రీ విముక్తి అవుతుందని ఈ రచన ద్వారా తెలుస్తుంది.

**తెలంగాణ ధూంధాం:**

తెలంగాణకు వలస బతుకులొక శాపం. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ పల్లెలకు 1975 దశకంలో ముంబాయి కార్మికోద్యమంలో, దళిత ఉద్యమంలో పనిచేసిన వలస ప్రజల నుండి వర్గ-కుల చైతన్యం కూడా దిగుమతి అయింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొనడానికి ముంబై నుండి వచ్చిన ఒక కార్మికుడు ఉద్యమంలో జరుగుతున్న ద్రోహాలను చూసి నిరాశతో తిరిగి బొంబాయికే పైనం అవుతుంటాడు. గ్రామంలోనే ఉండిపోయిన ప్రజలకు వలస కార్మికునికి మధ్య జరిగిన సంభాషణ ఇతివృత్తంగా 2000 సంవత్సరంలో రాయబడ్డ రూపకమిది. అక్కడక్కడ వేదికలపై కూడా ప్రదర్శించబడింది.

వలసెల్లటానికి సిద్ధమైన బుచ్చన్నను లక్ష్మయ్య, యాదగిరి అనే వ్యక్తులిద్దరూ వద్దంటారు. ముఖ్యంగా లచ్చయ్య అడ్డుకొని ఏమంటాడంటే దేశ దేశాలు తిరిగి నాలుగు ముక్కలు నేర్చుకున్నోడివి నువ్వే వెళ్ళిపోతే ఎట్లా? సావో బతుకో ఊర్లోనే ఉందాం. మన భూమి, మన తెలంగాణ, మన నీళ్లు, చెరువులు, కుంటలు, కొలువులు మనయి మనకి ఇవ్వమని కొట్లాడుదాం. వెంటనే యాదగిరి బుచ్చన్న ఎదిరించే టందుకు మనకు ఇంకా తావుంది నువ్వు బోవద్దే అంటాడు. అప్పుడు బుచ్చన్న నీళ్లంటే యాదికి వచ్చింది జలయజ్ఞం పేరిట అన్ని మింగిండ్రు.అనగానే లచ్చయ్య విశాలాంధ్రులకు గుండెలు ఏమి విశాలంగా లేవు వాళ్ళని నమ్మి బొందల పడొద్దు అంటాడు. ఇన్ని తీర్లా అన్యాయమైన తెలంగాణ ముచ్చటనిక వట్టిగా ఇడవద్దు. ఓట్ల ముందు ఉడుం పట్టు పట్టాలి అంటూ ఉద్యమ బాట పడతారు.

"ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయం" అన్న వస్తువుగా ఈ రూపకం రచించబడింది.

**ముంబై తెలంగాణం:**

వందలేండ్లుగా తెలుగు ప్రజలు ముంబైతో అల్లుకున్న బంధమిది. తెలుగు నేల మీద రగిలిన ఉద్యమాలన్నింటినీ ఎదలకద్దుకొని ముంబై తెలుగు ప్రజలు, తెలంగాణ వాసులు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సంఘీభావంగా నిలిచారు. అందుకే కొంతమంది కళాకారుల సమూహం ద్వారా ఇది పాటలు- వచనంగా

ఆలపించబడుతుంది. బలవంతపు చావులొద్దు పోరాడి గెలుద్దాం అంటూ సందేశాన్నిస్తూ తెలంగాణ ధూం ధాం కళాజాతర ముంబై నడిబొడ్డున ఉన్న 'బాంద్రా' దాకా చేరి సాగిన తీరు కనబడుతుంది.

ఒక ముంబై నగరంలోనే 15 లక్షల మంది తెలుగు ప్రజలు ఉంటే అందులో నూటికి 80 శాతం మంది తెలంగాణ వాసులే. వారి సంఘీభావాన్ని కూడగట్టడమే ప్రధాన వస్తువుగా ఇది రాయబడింది. రాజుల కాలం నుండి కోటలు గట్టి, ఆధునిక భవంతులు, ఛత్రపతి రైల్వే స్టేషన్, రోడ్ల నిర్మాణంలో తెలుగు ప్రజలు ఎంతో శ్రమించారు. తుకారం భక్తి ఉద్యమంలో, మహాత్మా పూలే సత్యశోధక సమాజంలో భాగమైనారు. బాబాసాహెబ్ కు అనుచరులుగా పేరొందారు. ముంబైతో వందల ఏండ్లుగా బంధాన్ని పెనవేసుకున్న తెలంగాణ ప్రజలు, తెలుగు బిడ్డలు ముంబాయికి సాదుకున్న పిల్లలైనారు అంటూ వారి కీర్తిని కొనియాడారు. ముంబైలోని ఆంధ్ర తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బదినకుండా తెలంగాణది ఆత్మగౌరవ పోరాటం, స్వయంపాలన ఆరాటం. అది సహజ సంపదను, రాజధాని హైదరాబాదును దోసి కుబేరులైన పిడికెడు మంది వలసవాదుల వ్యతిరేక పోరాటం అంటారు. పొరుగు రాష్ట్రంలో ఎవరు అస్తిత్వాన్ని వారు కాపాడుకుంటూనే ఉమ్మడి తెలుగు సంఘాల్లో కలిసి ఉందామని ప్రతిపాదించడం ఇందులో గొప్ప విషయంగా కనిపిస్తుంది.

**వీర తెలంగాణ:**

తెలంగాణ చారిత్రక వైభవం ఒక అంశం అయితే 'నూరేండ్ల తెలంగాణ చరిత్ర వీర తెలంగాణమే' అని చెప్పటానికి ఈ రూపకాన్ని రచించారు. ముల్కీరూలు –ఆదిహిందూ ఉద్యమాన్ని ప్రామాణికంగా తీసుకొని తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఉన్న చరిత్రను తీర్చిదిద్దారు. 2014 మార్చిలో హైదరాబాదులో జరిగిన ఒక అంతర్జాతీయ సెమినార్లో ఇది ప్రదర్శించబడింది. సాహసాన్ని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న తెలంగాణలో సంఘర్షణలు అనివార్యం. కవిత్వాన్ని రాజులకు అంకితం ఇవ్వని పాలకుర్తి సోమన్న, కరువులో కప్పం కట్టలేమని కాకతీయులను ఎదిరించిన సమ్మక్క-సారక్కలు, మొగలాయిల గోల్కొండను జయించిన సర్వాయి పాపన్నల వీరత్వం కొనియాడబడుతుంది.

స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై తుర్రెబాజ్ ఖాన్, రాంజీ గోండులతో పాటు రోహిల్లా వీరుల దండయాత్రల ప్రేరణ చెప్పబడింది. అరిగెరామస్వామి, భాగ్యరెడ్డి వర్మల కుల నిర్మూలన పతాకగా తెలంగాణ యువత ముల్కీ రూలును సాధించారు. స్వావలంబనతో కూడిన పల్లెల్లో రైతు కూలీలపై దొరగడీల హింస ఉండేది. తెలుగు భాషపై అణిచివేత ఉండేది. వీటి విముక్తి కోసం ఆంధ్ర మహాసభకు జై కొట్టిన తీరు కనబడుతుంది. తర్వాత దేశ్‌ముఖ్‌ల దాడిలో దొడ్డి కొమరయ్య అమరత్వం చెందటం దొరల అండతో నిజాం పంపిన రజాకార్ల దాష్టీకాలు వివరించబడ్డాయి. తరువాత ప్రజలు విప్లవోద్యమం వైపు పయనించటం కనిపిస్తుంది. తెలంగాణ సాయుధ పోరాట వెలుగులో సిరిసిల్ల- జగిత్యాల పోరాటాలు జరగటం, ఎమర్జెన్సీ విధించడం వల్ల తెలంగాణ దొరల దోపిడీ, అంతర్గత వలస దోపిడితో తెర్లయిపోయిందని తెలుస్తుంది. 1995లో దేవెగౌడ ప్రకటనతో మలిదశ పోరాటం తీవ్రమైంది. ఇట్లా రెండు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం వల్ల పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది. సంబరాలతో సరిపెట్టుకోకుండా నవనిర్మాణానికి ప్రజలను సిద్ధం చేస్తూ 'మేమెంతో మాకు అంత' అనే సామాజిక న్యాయపోరు నుండి సమానత్వం సాధించేదాకా ముందుకు సాగుతామంటూ ముగుస్తుంది.

**దళిత జన ధర్మాగ్రహం:**

6 ఆగష్టు 1991న గుంటూరు జిల్లా చుండూరు గ్రామంలో దళితులపై జరిగిన హత్యాకాండ దేశమంతటా తెలిసిందే. పాతిక సంవత్సరాల తరువాత దోషులను నిర్దోషులుగా పరిగణించి విడుదల చేస్తారు. అందుకే సాధారణ ప్రజలు, ప్రజాస్వామిక వాదుల నిరసనలు వెల్లువెత్తుతుంటే న్యాయదేవత కళ్ళు తెరవాలని వ్యంగ్యాస్త్రాలను విసురుతూ దళితులు ప్రకటించే ధర్మబద్ధమైన ఆగ్రహాన్ని 'బ్యాలె'గా రచించారు.

పాటలు, వచన రూపంలో ఘటనకు ముందు చుండూరు ప్రజల సాధారణ పరిస్థితి నుండి వారి ఎదుగుదలను సహించని అగ్రకుల అహంకారాలు, కుల దురహంకారాలు చెప్పబడ్డాయి. దీనితో దళితులు ఈ దాడిని ప్రతిఘటిస్తూనే

పంట పొలాల వైపు పారిపోయినా వెంటాడి చంపి సంచిలో మూటగట్టి తుంగభద్ర కాలువలో విసిరేసిన తీరు కనబడుతుంది. ఇవన్నీ జరగడం వెనుక శ్రామికుల్ని విభజించే కుల-వర్గ దోపిడి నిలయంగా ఉంది. అందుకే దళితుల ధర్మాగ్రహం ప్రజారాజ్యాధికార నిర్మాణం దాకా కొనసాగాలని చెబుతారు.

**యురేనియం - ఉరేయనియ్యం:**

ప్రకృతి వనరుల రక్షణలో యురేనియం తవ్వకాలు ఆపాలంటూ నల్లమల్ల చెంచులు పరిసర ప్రాంతాల ప్రజల ఉద్యమానికి సంఘీభావంగా ఈ నృత్యగానం సెప్టెంబర్ 2019లో రచించబడింది. పొద్దుతో పోటీపడి బతికే చెంచులు ఎలాంటి అనర్థాలకు గురవుతారో లింగన్న, నాగన్న, కర్రెమ్మ, ఎర్రమ్మ అనే పాత్రల ద్వారా ఇందులో కనిపిస్తుంది. యురేనియం అంటే ఏమిటో కూడా తెలియని వీరికి ప్రజా ఉద్యమ కార్యకర్త ద్వారా దాని పూర్వాపరాలు తెలుపబడతాయి. యురేనియం ద్వారా 'అణు విద్యుత్ తయారీ' మాటేమో గాని రష్యా దేశంలోని చర్నోబిల్ ప్లాంట్ లీకై రెండు లక్షల మంది ప్రాణాలు గాలిలో కలిసిన ప్రమాదం ఉందంటారు. తవ్వకాలు జరిపినప్పుడు ముడిసరుకు గాలిలో కలిసిన, నీటిలో కలిసిన అది ప్రమాదం అని అర్థమవుతుంది. చెంచుల అడ్డంకిని చూసి పోలీసు అధికారులు మీ చైతన్యం వెనుక ఎవరున్నారని ఆరా తీయగా ఒక ప్రైవేటు అధ్యాపకునిగా పని చేసే కార్యకర్త వారి తరఫున పోరాడి పోలీసులను సైతం దీన్ని 'శాంతిభద్రతల సమస్య'గా కాక 'మానవ మనుగడ సమస్య'గా చూడమని కోరుతారు. అంతేకాకుండా శివుని కంఠంలో దాగిన విషం లాగా యురేనియం భూమిలో ఉంటేనే సురక్షితం అనడంతో గొడవ సద్దుమణుగుతుంది. ఒక రకంగా యురేనియం తవ్వకాలు ఆపడానికి చేసిన ఉద్యమ సంఘాల ప్రయత్నానికి ఈ రచన బాసటగా నిలిచిందని చెప్పవచ్చు.

**ముగింపు:**

సమస్య ఏదైనా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందికర విషయాలపై మిత్ర ఇలాంటి రూపకాలు రాయడం హర్షించదగ్గ విషయం. భావి పరిశోధకులు వీటిపై మరింత లోతైన పరిశోధనలు చేయాలి. ఒక భావనాత్మకమైన వాస్తవికతను నేరుగా దృశ్యమానం చేసే ఈ రకమైన నాటక రచనలకు పూనుకోవాలి.

**ఆధార గ్రంథాలు**

1. డి.ఎస్.ఎన్ మూర్తి సం. (2012), తెలుగు నాటక సాహిత్యం, కేంద్రసాహిత్య అకాడమీ, బెంగళూరు.
2. మధుసూదనరావు త్రిపురనేని (1997), సాహిత్యంలో వస్తు శిల్పాలు, పర్స్పెక్టివ్ పబ్లికేషన్స్ హైదరాబాద్.
3. ఆచార్య నాగభూషణ శర్మ మొదలి (2008), నాటక శిల్పం, క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్ హైదరాబాద్.
4. మిత్ర (2016), కైతల కవాతు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, హైదరాబాద్.

# ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు చారిత్రక నాటకాలు - విశ్లేషణ

**గద్దల అనిల్**
పరిశోధక విద్యార్థి
అంబేద్కర్ సార్వత్రిక
విశ్వవిద్యాలయం
సెల్ : 9866534925

**నాటకం - ప్రస్తావన:**

"కావ్యేషు నాటకం రమ్యం" అంటాడు కాళిదాసు. అంటే కావ్యాలలోకెల్ల నాటకం రమ్యమైనదని దానర్థం. నిజమే నాటకం చాలా ఉత్తమమైన రచన. దానికి ఒకప్పుడు సంస్కృతంలో, తెలుగు సాహిత్యంలో చాలా విశేష ఆదరణ ఉండేది. సాహిత్యంలోనే కాదు ప్రజలలో కూడా నాటకాలకు చాలా ఆదరణ ఉండేది. ఆ ఆదరణ వల్ల, ధార్వాడ, సురభి వంటి నాటక సమాజాలు తెలుగులో చాలా ఏర్పడ్డాయి. "తెలుగు సాహిత్య వికాస చరిత్రలో క్రీ.శ. 19వ శతాబ్ది నాల్గో పాదమూ, 20వ శతాబ్ది మొదటి పాదమూ కలిసిన కాలం 'నాటక యుగం'గా పరిగణించటం సమంజసంగా ఉంటుంది" అని ప్రతిపాదిస్తారు సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం. ఆచార్య సుబ్రహ్మణ్యం వివేచన, ఆనాటి సమాజాన్ని సంస్కరించటానికి, జాతిని జాగృతం చేయటానికి "నాటకం" నాలుగు చేతులా సలిపిన అవిశ్రాంత కృషికి అద్దం పట్టేదిగా ఉంది. ఈ విధంగా వర్తమాన కాలం ఆరంభ సాహితీ యుగానికి నాటకమే ప్రాధాన్యం వహించటం, యుగాధిపత్య గౌరవాన్ని పొందటం ఆ ప్రక్రియ విశిష్టతకు, విలువను చేకూర్చి పెట్టింది.

వీధి నాటకాలు, యక్షగానాలు, కళాప్రదర్శనలుగా చెల్లుబడి అవుతున్న ఆ సమయంలో తొలి తెలుగుస్వతంత్ర నాటకంగా "మంజరీ మధుకరీయం" రూపం దిద్దుకుంది స్వర్గీయ కోరాడ రామచంద్ర శాస్త్రి 1860లో రాశారు ఈ నాటకాన్ని. తెలుగులో నాటకమైతే రూపకల్పన చేయడం జరిగింది గాని, ఆనాటి సమాజ జీవనాన్ని ఏ విధంగానూ ప్రతిబింబించ లేకపోయిందన్న భావంతో స్వర్గీయ వావిలాల వాసుదేవ శాస్త్రిగారు "నందక రాజ్యం" అన్న సాంఘిక నాటకాన్ని 1880లో రాశారు. అలా మొదలైన నాటకం చాలా గొప్ప ప్రభావాన్ని పొందింది. స్వరూపాన్ని బట్టి కావ్యాన్ని రెండు రకాలుగా విభజించారు. శ్రవ్యకావ్యం, దృశ్యకావ్యం. నాటకం వస్తువును బట్టి 3 రకాలు అవి 1) పౌరాణికం 2) చారిత్రకం 3) సాంఘికం.

**చారిత్రక నాటకాలు:**

చరిత్రలో మైలు రాయిగా మారిన ఘట్టాల, కథల, వ్యక్తుల ఆధారంగా రాయబడిన నాటకాలను చారిత్రక నాటకాలు అంటారు. ఇది చారిత్రక సంఘటనలు, పాత్రలను, చారిత్రక పురుషుల, వ్యక్తుల జీవిత చరిత్రలను ఆధారం చేసుకొని రచనలు కూడా చారిత్రక నాటకాల కోవలోకే వస్తాయి.

తెలుగులో వచ్చిన చారిత్రక నాటకాలలో చాలావరకు స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా ఉన్న రోజులలో రాయబడినవే. ఉద్యమాన్ని ప్రత్యక్షంగా చూసే రాజకీయ నాటకాలపై బ్రిటిష్ ప్రభుత్వం ఆంక్షలు విధించడంవల్ల పరోక్షంగా దేశభక్తిని ప్రేరేపించే చారిత్రక నాటకాలు అవసరం అయ్యాయి. "మాతృదాస్య విమోచనము" వంటి పౌరాణిక నాటకాలుకూడా అలాంటి పరోక్ష రచనలే. స్వాతంత్ర్యం రావడంతో తెలుగు నాటక కర్తకు ఈ దేశభక్తి ఉద్బోధకాలైన ఇతివృత్తాలన్నీ అంటరానివై పోయాయి. ఈలోపాన్ని పూరించడానికి సంఘ సమస్యల వైపుకు రచయితలు దృష్టి సారించారు.

తెలుగులో వేదం వేంకట రాయశాస్త్రి ప్రతాపరుద్రీయం, బొబ్బిలి యుద్ధం, ధర్మవరం గోపాలాచార్యులు భక్తరామదాసు వంటి చారిత్రక నాటకాలు బాగా ప్రసిద్ధి చెందాయి.

1901–1920 కాలంలో విశిష్టమైన చారిత్రాత్మక నాటకరచన కొనసాగింది. కోలాచలం శ్రీనివాసరావు 1907లో 'రామరాజు చరిత్ర', శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి 1909లో 'బొబ్బిలియుద్ధం', ధర్మవరం గోపాలాచార్యులు 'రామదాసు' మొదలైన నాటకాలను రచించారు. ఈ కాలంలోనే సోమరాజు రచించిన 'రంగూన్ రౌడీ' నాటకం అధిక సంఖ్యలో ప్రదర్శనలు అందుకున్న నాటకం. 1911లో తిరుపతి వేంకటకవులు రచించిన 'పాండవోద్యోగ విజయములు', బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి రచించిన 'సత్యహరిశ్చంద్రీయము' నాటకాలు ఇప్పటికీ ఘనమైన స్థితిలో కొనసాగుతున్న అద్భుత నాటక రాజములు. స్వాతంత్ర్య ఉద్యమ సమయములో దేశభక్తి నాటకాలను రచించిన వారిలో ముఖ్యులు దామరాజు పుండరీకాక్షుడు. సంఘ సంస్కరణ నాటక రచనలలో పేరు గాంచిన వారు కాళ్ళకూరి నారాయణరావు. వీరు 1921లో చింతామణి, 1926లో వరవిక్రయం నాటకాలను రచించారు. సాహిత్య రూపకాలను రూపొందించిన వారిలో దువ్వూరి రామిరెడ్డి ప్రథములు. విశ్వనాథ సత్యనారాయణ తొలి రచనలన్నీ సాహిత్య రూపకాలే. వీరి రచనలలో ముఖ్యమైనవి 'నర్తనశాల', 'త్రిశూలము', 'అనార్కలి', 'వేనరాజు' మొదలగునవి. మత, సాంఘిక సాంప్రదాయాలను తిరస్కరిస్తూ నాటక రచనలు చేసిన వారిలో త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రముఖులు. వీరు 'కురుక్షేత్రము' 'శంబూకవధ' మొదలైన నాటకాలను రచించారు. గుడిపాటి వెంకటాచలం గారి ఆలోచనారీతి చాలా భిన్నమైనది. వారి రచనాశైలి మాత్రం అద్భుతం. వీరి రచనలలో ముఖ్యమైనవి 'చిత్రాంగి', 'శశాంకం' మొదలైనవి. అనేక చారిత్రక నాటకాలను రచించి పోరాట దృక్పథానికి మరింత జీవం పోశారు. 1900లో కోలాచలం శ్రీనివాసరావు 'సుల్తాన్, 1921లో కొప్పరపు సుబ్బారావు 'రోషనార,' 1926లో ఉన్నవ లక్ష్మీనారాయణ 'నాయకురాలు', 1928లో ప్రభులింగాచారి 'పల్నాటి వీరచరిత్రము', 1932లో ముత్తరాజు సుబ్బారావు 'చంద్రగుప్త', 1938లో నండూరి బంగారయ్య 'ఆంధ్ర తేజము', 1944లో పోతుకూచి సుబ్బయ్య 'ఆంధ్రవాణి సామ్రాజ్యము' మొదలైన ఎన్నో చారిత్రక నాటకాలు జాతీయోద్యమ స్ఫూర్తి కోసం రాసిన రచనలు.

తెలంగాణ ప్రాంతంలో కూడా చారిత్రక నాటక రచన సమాంతరంగా కొనసాగింది. 13వ శతాబ్దంలో వెలసిన విద్యానాథుని ప్రతాపరుద్ర కల్యాణం మొదటి చారిత్రక నాటకం. ఆ తరువాత 20వ శతాబ్దం వరకూ లేవనే చెప్పవచ్చు. 1929 ఏప్రిల్ 'సుజాత' పత్రికలో ప్రచురింపబడిన 'పాదుకాపట్టాభిషేకము' శేషాద్రి రమణకవులు వ్రాసినది. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు జీవిత చరిత్రను 'దాసబోధ' అనే గ్రంథంగా వెలయించారు శేషాద్రి రమణకవులు. పాదుకా పట్టాభిషేక నాటకానికి మూలం దాసబోధయే. శివాజీ సతారా ప్రభువుగా ఉన్న రోజులలో, ఆయన గురువైన సమర్థ రామదాసు మాత్రం సన్యాస జీవనమే గడుపసాగాడు. ఒకరోజు ఆయన శిష్యులు భిక్షాటన చేస్తూ శివాజీ వద్దకు వెళ్లారు. శివాజీ తన రాజ్యాన్నంతటినీ దానం చేస్తున్నట్లు ఒక చీటీ మీద వ్రాసి వారి జోలెలో వేస్తాడు. సర్వసంగ పరిత్యాగం చేసిన తమకు రాజ్యమెందుకని చెప్పి, తిరిగి శివాజీనే దానికి అధికారిగా నియమిస్తాడు సమర్థ రామదాసు. శివాజీ మహారాజు గురుభక్తిని, సమర్థ రామదాసు శిష్య వాత్సల్యాన్ని చాటి చెప్పేది ఈ పాదుకా పట్టాభిషేక నాటకము. బొబ్బిలిసింహం అయిన తాండ్ర పాపారాయని ఇతివృత్తంగా చేసికొని శేషాద్రి రమణ కవులు వ్రాసిన 'పాపారాయ నిర్యాణం' నాటకం 1915లోనే వచ్చింది. ఆ స్ఫూర్తితో కావచ్చు రావుగారు రెండు చారిత్రక నాటకాలు రాశారు.

**ఎస్.ఎమ్.ప్రాణ్ రావు పరిచయం:**

ఎస్. ఎమ్. ప్రాణ్‌రావుగా ప్రసిద్ధి చెందిన రచయిత, కవి, నాటకకర్త అయిన సరబాద ముఖ్య ప్రాణ్‌రావుగారు ఆధునిక తెలుగు సాహితీవేత్తలలో చెప్పుకోదగిన వ్యక్తి. ముఖ్యంగా నవలారచనల్లో ముందు వరుసలో ఉండే వ్యక్తి. వైవిధ్యమైన, విశేషమైన ఇతివృత్తాలను ఎన్నుకొని రచనలు చేసిన గొప్ప రచయిత ఆయన. అటు సమాజంపై, ఇటు తెలుగు సాహిత్యంపై తనదైన ఒక ముద్రను వేసిన రచయిత సరబాద ముఖ్య ప్రాణ్ రావు గారు. కవిత్వం, కథ, నవల, నాటకం అంటూ సమాంతర సృజన చేసినప్పటికీ, ఎక్కువగా నవలలు ఉన్నాయి ప్రాణ్‌రావుగారి రచనలలో. తెలుగు

సాహితీ చరిత్రలో నవలా రచయితగా సుస్థిరస్థానం ఏర్పరచుకున్నారు. సామాజికంగా, చారిత్రకంగా జరిగిన వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఎక్కువ రచనలు రాశారు. రచనా వ్యాసంగానికి ముందే సినిమా రచయితగా ప్రసిద్ధులు. సరబాద ముఖ్య ప్రాణ్‌రావుగారు తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1943లో జన్మించారు. తండ్రి రమణారావు, తల్లి పద్మావతి గారు..ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆంగ్లసాహిత్యం లో బి. ఎ., ఎమ్. ఏ. డిగ్రీలను సంపాదించారు. 1972లో ఎం. ఏ. పట్టా పొందారు. తన రచనా ప్రస్థానంలో మొత్తం 24 రచనలు చేశారు. వాటిలో ఒక కథాసంపుటి, రెండు కవితా సంపుటాలు, రెండు నాటకాలు పందొమ్మిది నవలలు ఉన్నాయి.

**సాంఘిక నవలలు:** 1. నీలిపాప 1995 2. డ్రీంబాయ్ 3.వెన్నెలలో కోనేరు 4. కవిత 5.నీలాంబరి 6. సిరులయ్య 7. అందం 8. నీటి నీడ 9. పురివిప్పిన నెమలి10. మలగని బత్తి 11. రాంగ్ వే 12. నేలజారని ఊడలు13.మలగని బత్తి నవలాత్రయం ,చారిత్రక నవలలు1. కొమురం భీం (రెండవ ముద్రణ)2. రుద్రమ దేవి 3. మహామంత్రి మాదన్న 4. ప్రజాజ్యోతి పాపన్న 5. ప్రతాపరుద్రుడు 6. మెతుకు మాణిక్యం రాణి శంకరమ్మ రెడ్డిరాణి వీరగాథ నాటకాలు:1. రుద్రమదేవి - 2021 ,2. మాచలదేవి - 2021 కవిత్వం 1. తుఫానులకెదురు నడవరా-2. హంసగీతి (కాలుష్యంపై వచన కవిత) కథలు. చెలిమి కథలు - 1993 పురస్కారాలు “మా భూమి” చిత్రానికి ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా 1979లో నంది అవార్డు పొందారు.తొలితరం తెలంగాణ రచయితలకు, కళాకారులకు ఇచ్చే ‘తెలంగాణ స్వర్ణకమలం’ పురస్కారం 2012లో అందుకున్నారు. 2023 నవంబరులో డా. ఎం. ఎల్. నరసింహారావు సాహితీసేవా పురస్కారం పొందారు.ఇవే కాక అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. జాతీయ అంతర్జాతీయస్థాయిలో అనేక ప్రశంసలు, బహుమతులు పొందిన మా భూమి, రంగులకల, మట్టి మనుషులు చిత్రాలకి ఎస్. ఎమ్. ప్రాణ్‌రావు సహ రచయితగా పని చేశారు.

**ప్రాణ్ రావు చారిత్రక నాటకాలు:**

రావు రెండు నాటకాలు రాశారు. రెండూ చారిత్రక నాటకాలే. 1) రుద్రమదేవి, 2) మాచలదేవి. అవి రెండూ పరిమాణంలో చిన్నగా ఉన్నా రచనా విధానం, లక్షణాలను బట్టి వాటిని నాటకం అనవలసి వస్తోంది. లేదంటే అవి నాటికలు ఉన్నంత ఉంటాయి. రావుగారివి నాటికలు ఎందుకు కావు, నాటకాలు ఎందుకు అవుతాయో ఆయా విభాగంలోని విశ్లేషణలో గమనించవచ్చు. ఇవి రెండూ ఒకే పుస్తకంలో ఉన్నాయి. ఆ పుస్తకం 2021లో వెలువడింది.

రుద్రమదేవి:

రుద్రమదేవి చరిత్ర ఆధారిత నాటకం. ఇదే పేరుతో నవలను కూడా రాశారు రావుగారు. చరిత్ర ఒకానొక కాలంలో ఒక దేశం లేదా ఒక రాజ్యం యొక్క రాజకీయ, భౌగోళిక, సాంఘిక, అంశాలకు సంబంధించిన రికార్డు. చరిత్రలో ఒక రాజకీయ వ్యవస్థలోని వ్యక్తుల కృత్యాలు, యుద్ధాలు, వారు ఏలిన భూభాగం, అనుసరించిన పాలనా విధానం, సామాజిక సాంస్కృతిక ఆర్థిక విషయాలు, ఆచార వ్యవహారాలు, విద్య, వాణిజ్యం, న్యాయ వ్యవస్థ వంటివి యథాతథంగా నమోదు చేయబడతాయి. ఈ వాస్తవాల ఆధారంగా ఇదివరకు నిజంగా జీవించిన వ్యక్తులకు సంబంధించిన వివరాలను వారి ప్రవర్తనను, వారి చర్యలకు కారణాలను ఊహించి అల్లబడేదే కథ. చరిత్రలో వ్యక్తులు ఉండవచ్చు. కానీ వారి ఆలోచనలు, అనుభూతులు, ఉద్వేగాలు, మనోభావాలు ఆవిష్కరించడం క్రియేటివిటీకి సంబంధించిన అంశం. చారిత్రక ఆధారాలను వక్రీకరించకుండా, వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, వాస్తవిక సంఘటనలను కల్పనతో అతిక్రమించకుండా, చారిత్రక వ్యక్తుల జీవనాన్ని పునర్నిర్మిస్తుంది కథ. చరిత్రలో కనిపించే వాస్తవిక పాత్రలతోపాటు కథాగమనానికి కల్పిత పాత్రలను సృష్టించడం కూడా అవసరమవుతుంది. హిస్టారికల్ ఫిక్షన్ రాయడానికి రచయితకు చరిత్రను గురించి సరియైన అవగాహన, కల్పనాశక్తికి ఉన్న పరిమితిని గురించిన ఎరుక ఉండి తీరాలి. ఇందుకు రచయిత విషయ సేకరణ కోసం అనేక ఉపయుక్త గ్రంథాలు అధ్యయనం చెయ్యడం, వాస్తవాలను పరిశోధనాత్మక దృష్టితో పరిశీలించడం అవసరం. అన్నింటికీ మించి చరిత్రను కథగా మలచడానికి సరిపోయే విధంగా చదివించడానికి ఒక ప్రత్యేక కథన శైలీ రచయితకు

ఉంటే ఆ చారిత్రక గాథ కలకాలం నిలవ గలుగుతుంది. ఇవన్నీ ఎస్.ఎమ్. ప్రాణ్‌రావులో ఉండడం వల్లే చారిత్రక నాటకాలు కరువైపోతున్న ఈ రోజుల్లో తెలుగు పాఠక లోకానికి అంది వచ్చింది 'రుద్రమదేవి'. కాకతీయుల చరిత్రలో అందరికీ చిరపరిచితమైన 'రుద్రమదేవి' పాత్రను సజీవ మూర్తిగా చిత్రించడమే గాక, చారిత్రక వాస్తవాలకు కల్పనకు మధ్య సమన్వయాన్ని సాధించడానికి ఎంతో కృషి చేశారు ప్రాణ్‌రావు.

రుద్రమదేవి నాటకంలో మొట్టమొదట చెప్పుకోదగినది కథనం. రచయిత భూతకాలంలో జరిగిన కథని తానుగా చెప్పకుండా విరియాల కామసాని, కాకతీయ రాజ్యంలో ప్రతిష్ఠించిన అపర దుర్గ కాకతిదేవి ద్వారా చెప్పిస్తాడు. చెప్పించడమేకాదు చూపిస్తాడు.

కథకు అంతగా అవసరంలేని సందర్భాల్లో ఆమె కథని చెబుతూ వడివడిగా ముందుకు సాగిపోతుంది. అవసరమైన సందర్భంలో బలమైన సన్నివేశాలతో కూడిన దృశ్యాలని మన కళ్ళముందు ఉంచుతుంది. ఏక కాలంలో కథని చదవడానికి, చూడడానికి ప్రాణ్‌రావు వాడిన ఈ ప్రయోగం చరిత్రలోని వ్యక్తులని సచేతనుల్ని చేస్తుంది. చారిత్రక నాటకం, మనం కొన్ని వందల సంవత్సరాలు, కాలయంత్రంలో ప్రయాణించి వెనక్కి పోయేట్టు చేస్తుంది. కాకతిదేవి వెంట, నాటకం ఆరంభంలో ఓరుగల్లు ప్రాకారాలను, బురుజులను, రాజభవనాలను, స్వయంభూ దేవాలయం, రుద్రేశ్వరాలయం, వివిధ వాడలు, సంతలు, నగర వీధులు, కూడళ్ళలో వేదికల మీద జరిగే నృత్య గానాదులు చూస్తూ మనల్ని మనం మరచిపోయి ఒక చారిత్రక వాతావరణంలోకి ప్రవేశించి నాటకం చివరి దాకా బయటకు రాకుండా ఉండి పోతాం.

'రుద్రమదేవి' నాటకంలో రుద్రమదేవి 'రుద్రదేవుడు'గా గణపతి దేవుడు రాజ్య పరిరక్షణకు చేసిన ఏర్పాటు – ఒకవైపు పురుష వేషంలో ఉంటూ మరొక వైపు ఒక సుకుమార సుందర నారీ మనస్తత్వాన్ని ప్రజల పట్ల ఒక మాతృమూర్తికి ఉండవలసిన ప్రేమతత్వాన్ని ప్రదర్శిస్తుంది. రుద్రమ యుద్ధ రంగంలో వీరపురుషునిగా, అంతరంగంలో కుసుమ కోమలంగా కనిపిస్తుంది. ఈ వైవిధ్యాన్ని ఆమె వ్యక్తిత్వంలో ఎంతో కళాత్మకంగా జొప్పించి మెప్పిస్తాడు రచయిత ప్రాణ్‌రావు. మొట్ట మొదటిసారి శిల్పి రామప్ప ఆమెలోని ఆడతనాన్ని నిద్రలేపిన సందర్భం, కేసరి భీమునితో జరిగిన యుద్ధ సంఘటనలో నిడదవోలు చాళుక్య యువరాజు వీరభద్రుడు ఆమెలోని పురుషుడి పట్ల ఉండే కోరికలను నిద్ర లేపడంలాంటి దృశ్యాలు యిందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

స్త్రీ పాత్ర ప్రధానమైన ఈ నాటకంలో స్త్రీలందరూ ఉదాత్తమైన పాత్రలే. రుద్రమ రహస్యం తెలిసి ఎల్లవేళలా అంటి పెట్టుకొని వుండే శర్వాణి, చక్రవర్తి పురుషుడిగా జీవిస్తున్న కుమార్తెలో స్త్రీ తత్వాన్ని గురించి స్త్రీగా ఆమె కోల్పోతున్న దాన్ని గురించి ఆలోచించే తల్లిగా నారాంబ, తను నమ్మిన సిద్ధాంతం కోసం తన చాతుర్యాన్ని ప్రదర్శించి కడదాకా కర్తవ్య నిర్వహణం అయిపోయిన శత్రురాజుల కళ్ళ వేగు సుకన్య – ఎవరి ధర్మాన్ని వారు నిర్వహిస్తూ ఈ నాటకంలో స్త్రీ పాత్రల ప్రత్యేకతకి దోహదం చేస్తారు. కథనంలో వివిధ సందర్భాలలో allusions ని ఉపయోగించడం నాటకంకు మరింత బలాన్ని చేకూర్చింది. కాకతిదేవి, మహాభారతంలో సంజయుడు కురుక్షేత్ర సంగ్రామాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిన విధంగా కాకతీయుల యుద్ధాన్ని తను చూపుతానంటుంది. అసలు రాజకీయ సంక్షోభానికి మూలమైన గణపతిదేవుని మూడవ భార్య సోమలాదేవి సంతానానికి ఓరుగంటి సింహాసనం మీద హక్కు ఉండాలనే నిబంధన రామాయణంలో దశరథుడిని కైకేయి కోరిన కోరికలాంటిదని, రుద్రమదేవిని రుద్రదేవుడిగా పెంచాలనే గణపతిదేవుని ప్రయత్నం భారతంలో పాంచాల రాజు ద్రుపదుడు కూతురును కొడుకుగా పెంచడం లాంటిదని, కథనాన్ని రక్తి కట్టించిన రచయిత యుద్ధ సందర్భాల్లో వీరుల కదలికల్ని, కత్తుల ఎత్తుల్ని పై ఎత్తుల్ని దృశ్యమానం చెయ్యడంలో అసమాన ప్రతిభను కనబరుస్తాడు.

కథనంలో పైన చెప్పబడిన సుగుణాలతోపాటు చేర్చదగిన మరొక అంశం సంభాషణలు. ఈ గాథలో పదునైన సంభాషణలు, ఉదాహరించదగినవి ఎన్నో ఉన్నాయి. మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే మాటలు మనస్సుకి హత్తుకుంటాయి. రుద్రమదేవి ఒక సందర్భంలో తల్లి నారాంబతో నువ్వు, నేను మామూలు స్త్రీలం కాము. నువ్వు పట్టమహిషివి. నేను భావి చక్రవర్తిని. మనకి కళ్ళు మటుకే ఉండాలి. కన్నీళ్ళు ఉండకూడదు అంటుంది. ఇదే సందర్భంలో తల్లి "రుద్రమా, స్త్రీ

అయినా పురుషుడు అయినా ప్రకృతికి లోబడి ఉండాలి. నువ్వు దానికి వంచితురాలివి కావడం నా గుండెను నిలువునా కోస్తోంది" అంటుంది. మరొక సందర్భంలో రుద్రమ 'కోటలో నా బిడ్డలు ముగ్గురు మాత్రమే ఉన్నారు. కోట బయట, రాజ్య మంతటా నా బిడ్డలు లక్షల సంఖ్యలో ఉన్నారు. నా కోసం ముందుకు దూకుతున్నారు. నాతోనే చావో రేవో అనుకున్న వాళ్ళని చావుకి వదిలేసి నేను రేవుకి రాలేను. వాళ్ళ కోసమే పోరాడుతాను. పోరాటంలో చనిపోయినా వాళ్ళలోనే జీవిస్తాను' అనీ 'ఈ రుద్రమదేవి కుట్రలను కుతంత్రాలను ఉక్కుపాదంతో అణచివేస్తుంది. ప్రజలను రక్షించడానికి ప్రాణాలను లెక్కచెయ్యదు. ఓరుగల్లు నాది. దానిని శత్రువులకు వదలను. నా చివరి రక్తంబొట్టు ఇంకిపోయేవరకు కత్తి దింపను' అంటుంది.

ఇలా అనేకచోట్ల సంభాషణలు ఆయా పాత్రల మనస్తత్వాన్ని ప్రతిబింబించడంతోపాటు, పాఠకుల అనుభూతిని, ఉద్వేగాన్ని రెట్టింపు చేస్తాయి. నాటకం చారిత్రకమయినా సంభాషణల్లో భాష సులభంగానూ అంగీకారంగానూ ఉంటుంది.

'రుద్రమదేవి' ధ్రువతారలా వెలుగులు చిమ్ముతూ రాలిపోవడంతో నాటకం ముగిసినా, అరివీర భయంకరుడైన ప్రతాపరుద్రుడు అంబదేవుని తలని శూలానికి గుచ్చి అమ్మమ్మకి తర్పణం వదలడానికి కదం తొక్కుతున్న గుర్రంపై కదలివస్తున్న దృశ్యం విషాదాన్ని గతంగా వదిలేసి భవిష్యత్తులోకి మనం ఆశావహంగా చూసేట్టు చేస్తుంది.తెలుగువాడైన ప్రతివాడికీ రుద్రమదేవి పేరు విన్నప్పుడు ఒక అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతుంది. ఒంట్లో ఒక రకమైన దృఢత్వం వస్తుంది. తమ జీవనంతో, నడవడికతో, త్యాగంతో ప్రజల గుండెల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న పాత్రలను సజీవమూర్తులుగా పాఠకుల కళ్ళ ఎదుట నిలబెట్టటం, వాళ్ళను ఆ స్థల కాలాల్లోని దృశ్యాల్లో మమేకం చెయ్యడం సాధారణమైన విషయం కాదు. అసాధారణమైన రచనలు చెయ్యటం ప్రాణ్‌రావుకి కొత్తేమి కాదు.

ఈ నాటకంలో ప్రాణ్‌రావు సినిమా రచయితగా దృశ్యాల్ని చూపించి, నవలా రచయితగా కథనంలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టి చరిత్రనీ, కల్పననీ సమతుల్యం చెయ్యడానికి యిదివరకు నాటకంలో ఖర్చు చేయని, ఈ నాటకం కోసమే బహుశా తన ప్రతిభానైపుణ్యాలని ఉపయోగించాడనిపిస్తుంది.

**మాచలదేవి:**

ఇది రావుగారి రెండవ నాటకం. వీర శృంగార రసాత్మక నాటకం. కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలిన వీరనారి రుద్రమదేవి (కుమార్తె కొడుకు) మనవడు ప్రతాపరుద్రుడు, అతని భోగిని మాచల దేవికి సంబంధించిన కథ. శృంగార రసంతో ప్రారంభమై వీరరసావిష్కరణతో తారాస్థాయిని చేరుకొని కరుణరసంతో ముగుస్తుంది. ఇది కూడా రుద్రమదేవి నాటకంలాగానే విషాదాంత నాటకం. ఇది పన్నెండు అంకాల నాటకం. అయితే ప్రతాపరుద్రుడి చరిత్ర ఆధారంగా ఒక నవలను రాసిన రావుగారు. మాచలదేవికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తలచి ఆమె ప్రాధాన్యంగా ఈ నాటకాన్ని రాశారు.

సూత్రధారిగా కాకతిదేవి తెరవెనుక నుండి నాటక నేపథ్యాన్ని వివరిస్తుంది. దానితో మొదలై పాత్రల ప్రవేశంతో యథావిధిగా నాటకం నడుస్తుంది. మళ్ళీ 7వ అంకంలో కాకతిదేవి వస్తుంది. ఇక మిగిలిన చోటల్లా రచయిత నాటకాన్ని ప్రస్తావన చేస్తూ ఉంటారు.

మాచలదేవి వేశ్యాగృహంలో పుట్టిన గొప్ప లక్షణాలు గల వ్యక్తి. నాట్యం, సంగీతం, చిత్రలేఖనం వంటి కళలలో ఆరితేరిన శిరోమణి. ఆమె తల్లి పేరు తారామణి. చెలికత్తె చందల. నాటక ప్రారంభంలో దంపతుల సంగమాన్ని మాచలదేవి బొమ్మగా గీస్తూ ఉంటుంది. ఆమె చెలికత్తె చందల పక్కనే ఉంటుంది. మాచలదేవి చేతిలోని కుంచె తటాలున ఆగిపోతుంది. పక్కనే ఉన్న చందల ఏమైందని అడుగుతుంది. దంపతుల సంగమాన్ని గియ్యాలంటే సిగ్గేస్తుంది అని చెబుతుంది మాచల. అప్పుడు చందల నీ చేతిలోని కుంచెకు ఎలా సిగ్గు ఉండదో వేశ్యలకు కూడా సిగ్గు ఉండకూడదు అని చెబుతుంది. వేశ్యలు అంటే ప్రాణం ఉన్న పరికరాలు అంటుంది. కానీ ఆ మాటలకు మాచల జుగుప్స చెందుతుంది.

మాచల, చందల ఒకే ఈడువారు అయినా చందల వేశ్యావృత్తిని స్వీకరించి అప్పటికే ఆరేళ్ళు అవుతుంది. కానీ మాచలకు మాత్రం ఇంకా ముకుర వీక్షణం జరగదు. ముకుర వీక్షణం అంటే రజస్వల అయిన ఆడ పిల్లలకు వేశ్యావృత్తిలోకి ఆహ్వానం పలుకుతూ చేసే వేడుక. వేశ్యాసంఘం వారు ఇచ్చే అనుమతి. వేశ్యాసంఘానికి అధ్యక్షురాలైన తారామణి తన కూతురు మాచలదేవిని అందరిలాగా కాకుండా గొప్ప ధనవంతుడైన లింగాల అప్పయ శెట్టితో కన్నెరికం చేయించాలని అప్పుడే ముకుర వీక్షణం వేడుక కూడా జరిపించాలని నిర్ణయం తీసుకుంటుంది.

మరొక పక్క ప్రతాప రుద్రుడు విద్యామండపంలో సభ తీర్చి ఉంటాడు. తన మంత్రి నాగమ గన్నయతో రాజ్యంలోని విశేషాలు అడిగి తెలుసుకుంటూ ఉంటాడు. ఆయన రాజ్యంలోని విశేషాలన్నీ చెప్పి మాచలదేవి సంగతి గురించి కూడా చెబుతాడు. ఆమె కళా వైభవాన్ని వివరించి, త్వరలోనే ఆమె తన చిత్ర ప్రదర్శన పెడుతున్న సంగతిని కూడా చెబుతాడు. అప్పటికే మాచలదేవి చిత్రాలను, ఆమె గుణగణాలను, అందచందాల గురించి విన్న ప్రతాపరుద్రుడు ఆమెను కలవాలి అనుకుంటాడు. కానీ ఒక రాజులాగా కాదు. ఒక సామాన్య సైనికుడిగా. మంత్రి ఒప్పుకోడు. రాజు రక్షణకు ఇబ్బంది అవుతుందని చెబుతాడు. దానికి ప్రతాపరుద్రుడు తాను ఒక భటుడు వేషంలో వస్తానని చెబుతాడు. మంత్రి రాజు రక్షణను దృష్టిలో ఉంచుకొనే చివరికి అంగీకరిస్తాడు.

ఈ లోపు మాచల తల్లి తారామణి మాచలకు ముకుర వీక్షణానికి, అప్పయ శెట్టితో కన్నెరికం చేయించడానికి ముహూర్తం పెట్టిస్తుంది. కానీ అది మాచలకు ఇష్టం ఉండదు. అప్పయశెట్టి తండ్రిలాంటివాడు అని చెబుతుంది. కానీ వేశ్యలకు వావివరసలు ఉండవు. అప్పయశెట్టితో అయితే బోలెడంత ధనం వస్తుంది అని చెబుతుంది తారామణి. ఉన్న ఆస్తి ఏం చేసుకోవాలి అని అంటుంది మాచల. అది తన సంపాదన అని, అలా నువ్వు కూడా సంపాదించాలని అని అప్పయ శెట్టితో అయితే బోలెడంత సంపాదించవచ్చని చెబుతుంది. తల్లీ కూతుళ్ళ ఇద్దరి మధ్య గొడవ జరిగి, చివరికి మాచల తల్లి విసుగెత్తి వెళ్ళిపోతుంది.

మాచల చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తుంది. అనుకున్నట్టుగానే ప్రతాపరుద్రుడు మారువేషంలో చిత్రప్రదర్శన దగ్గరకు వస్తాడు. మాచల గీసిన కళాఖండాలను అద్భుతంగా వర్ణిస్తాడు. ప్రతాపరుద్రుడి మాటలకు, అతని సౌందర్యానికి తెలియకుండానే ప్రేమలో పడుతుంది. అలా ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతాపరుద్రుడు మారువేషంలో ఉండడం వల్ల ఒక సైనికుడిగా భావించి మాచల స్వేచ్ఛగా తన భావాలను పలుకుతుంది. అదే ప్రతాప రుద్రుడికి నచ్చుతుంది.

మాచల ఇంటికి వచ్చి తాను చూసిన సిపాయి వేషంలో ఉన్న ప్రతాపరుద్రుడి చిత్రం గీసి ఆయననే కలవరిస్తూ ఉంటుంది. తన చెలికత్తె అయిన చందలతో తన ప్రేమ విషయాన్ని చెబుతుంది. చందల రాబోయే పౌర్ణమి రోజున జరగబోయే ముకుర వీక్షణం గురించి గుర్తుకు చేస్తుంది. అది తనకు ఎంత మాత్రమూ ఇష్టం లేదని మాచల తెగేసి చెబుతుంది. వేశ్యావృత్తి అంటే తనకు అసహ్యమని తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తుంది. అది జరిగేపని కాదని చందల చెబుతుంది. ఆత్మత్యాగమయినా చేస్తాను గానీ ముకురవీక్షణం చేయను అంటుంది మాచల. లేదా ఆ సిపాయితో నా జీవితాన్ని గడుపుతాను అంటుంది. తన నిర్ణయాన్ని గౌరవించి వచ్చే పున్నమి వరకూ ఎటువంటి అఘాయిత్యం చేసుకోవద్దని చెబుతుంది చందల.

ఈలోపు ప్రతాపరుద్రుడు మాచల వివరాలు కనుక్కోమని నాగయ గన్నయను ఆదేశిస్తాడు. మాచల తారామణి కూతురని, వచ్చే పున్నమికి ఆమెకి ముకుర వీక్షణం ఉన్నట్టు చెబుతాడు మంత్రి. కానీ మాచలకు ముకుర వీక్షణం ఇష్టం లేదని, దానికి కారణం ఆమె చిత్ర ప్రదర్శనకు వచ్చిన సైనికుడిని ప్రేమిస్తోందని చెబుతాడు. అయితే, మాచలను ఎట్టి పరిస్థితిలోనూ వదులుకోనని అంటాడు ప్రతాపరుద్రుడు. అయితే ఆజ్ఞ ఇస్తే ఆమెను మీ ముందు ఉంచుతాను అంటాడు గన్నయ. దానికి ఆమె ప్రేమించింది ఒక రాజుని కాదు ఒక సైనికుడిని కాబట్టి ఆ సైనికుడే ఆమెను కాపాడాలి అంటాడు రాజు. లింగాల అప్పయశెట్టి చుట్టూ ఉన్న అతని మందీమార్బలం చీమను కూడ లోపలకు రానివ్వరు అని చెబుతాడు మంత్రి. ప్రతాపరుద్రుడు తన ప్రేయసిని తాను ఎలా కాపాడుకోవాలో తెలుసు అని చెప్పి ఎవరి సాయం తనకు వద్దని

గట్టిగా చెబుతాడు.

అన్నట్లుగానే ముకురవీక్షణం రోజు ప్రతాపరుద్రుడు మారువేషంలో వెళ్ళి లింగాల అప్పయశెట్టి మంది మార్బలాన్ని తన ఖడ్గంతో తరిమి తరిమి కొట్టి మాచలను తీసుకుపోతాడు. తన రాజ ప్రాసాదంలో ఉంచుతాడు. మాచలకు రాజప్రాసాదాలు చూసి భయం పుడుతుంది. వారిద్దర్నీ రాజు చూస్తే ఇబ్బంది అవుతుంది అని. చుట్టూ ఉన్న సైనికులను చూసి రాజు పంపించాడు అనుకొని భయపడుతుంది. అప్పుడు ప్రతాపరుద్రుడు ధైర్యం చెప్పి, తానెవరో చెబుతాడు. దానితో ప్రతాపరుద్రుడిపై ఇంకా అనురాగం పెరిగిపోతుంది. వీలు కుదిరినపుడల్లా ప్రతాపరుద్రుడు మాచల దగ్గర వచ్చి వెళ్తూ ఉంటాడు. మిగిలిన సమయంలో బొమ్మలు గీసుకుంటూ గడుపుతూ ఉంటుంది.

కొంతకాలానికి శత్రుమూకలైన తురుష్కులు కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తి వస్తారు. ప్రతాపరుద్రుడిని గెలవడం సాధ్యం కాదని, శత్రువులు కాకతీయ సామంత రాజులను మాయచేసి వాళ్ళనే ప్రతాపరుద్రుడిపై దండెత్తేలా చేస్తారు. అంబదేవుడు దక్షిణాన పాండ్యరాజులతోనూ, ఉత్తరాన దేవగిరి యాదవులు శేవణులతో బలమైన పొత్తు పెట్టుకున్నందున ఈ ముగ్గురి సేనలు కలవకుండా నివారించి, ఒకే సమయంలో ముప్పేట దాడి చేయాలని నిర్ణయిస్తారు. ఒక సైనిక విభాగానికి అధిపతియైన అడిదం మల్లుసేనాని సింహపురిపై దాడిచేసి, అంబదేవునికి తొత్తులా ఉన్న పాండ్యరాజును ఓడించి, ఆ దేశాన్ని కాకతీయ సామ్రాజ్యంలో కలిపి వేస్తాడు. అంబదేవునికి అండగా నిలిచిన దేవగిరి యాదవులు. శేవణులపై గోనగన్నారెడ్డి –గోన విఠల్‌రెడ్డి నాయకత్వంలో సైన్యాలు విరుచుకుపడి, వాళ్ళను ఓడించి, వాళ్ళ రాజ్యాలను కాకతీయ సామ్రాజ్యంలో కలిపివేస్తారు.

ప్రతాపరుద్రుడు స్వయంగా త్రిపురాంతకంపై దండెత్తి, అంబదేవుడ్ని యుద్ధంలో చంపి కాయస్థ రాజ్యాన్ని, కాకతీయ రాజ్యంలో విలీనం చేస్తాడు. ఇలా రాజ్యాన్ని శాంతియుతంగా పరిపాలిస్తున్న ప్రతాపరుద్రుడు ఉత్తరాది నుంచి వచ్చే తురుష్క దండయాత్రల ప్రమాదాన్ని పసిగట్టలేకపోతాడు. ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ రాజ్యకాంక్షతో దక్షిణాది రాజ్యాలను ఆక్రమించుకోవడానికి క్రీ.శ. 1303లో మాలిక్ చారిత్రక నవల కాఫిర్ నాయకత్వంలో కాకతీయుల మీదకు దండయాత్రకు పంపిస్తాడు. అప్రమత్తంగా ఉన్న కాకతీయ సైన్యాలు ఆ దాడిని తిరగ్గొట్టి వాళ్ళను తరిమేస్తారు. అలా నాలుగుసార్లు దండెత్తిరాగా, అడ్డుకొని తరిమేస్తారు. అయిదవసారి మాలిక్ కాఫిర్ దండయాత్ర సందర్భంగా చేసిన హింసాకాండకు వెరచి, ప్రజల కోసం ప్రతాపరుద్రుడు సంధి చేసుకుంటాడు. అల్లావుద్దీన్ మరణం, మాలిక్ కాఫిర్ హత్యతో ఢిల్లీలో ఏర్పడిన పరిస్థితులను చూసి ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం మానేస్తాడు. ఖిల్జీలు తర్వాత తుగ్లకులు ఢిల్లీ పీఠం కైవసం చేసుకుంటారు. కప్పం కట్టడం మానేసిన ప్రతాపరుద్రుడికి బుద్ధి చెప్పటానికి ఉలూఖాన్ భారీ సైన్యంతో దండెత్తి వస్తాడు. రెడ్డి – వెలమ సేనానుల వైషమ్యాల వల్ల సమయానికి సహకారం అందక యుద్ధంలో ప్రతాపరుద్రుడు ఓడిపోతాడు. ఓరుగల్లును కొల్లగొట్టి నాశనం చేసిన తురుష్కులు ప్రతాపరుద్రుడ్ని బందీగా ఢిల్లీకి తీసుకువెళు తుంటే, అవమానం భరించలేక 'దారి మధ్యలో ఆత్మత్యాగం చేసుకోవడంతో ప్రతాపరుద్రుడి చరిత్ర ముగుస్తుంది.

అదే సమయంలో విషయం తెలిసిన మాచల శివాలయంలో తనకు నచ్చిన నృత్యం చేసుకొంటూ ఉంటుంది. ఆమెను చూసి, ఆమె నాట్యానికి, ఆమె అందానికి పిచ్చెక్కిపోయిన తురుష్కులు ఆమెను వంతుల వారీగా అనుభవించాలని చూస్తారు. కానీ తన ప్రభువు తప్ప తన శరీరాన్ని తాకే అధికారం ఎవరికీ లేదంటూ, తన ప్రభువే లేనప్పుడు తాను బ్రతికి ఉండి లాభం ఏంటి అని ప్రాణత్యాగం చేసుకుంటుంది. దానితో నాటకం ముగుస్తుంది.

**వస్తువు:**

ఈ రెండు నాటకాల్లో ఉండే వస్తువు చారిత్రకమైనదే. పైగా కాకతీయ సామ్రాజ్యంతో ముడిపడి ఉన్న చరిత్ర. పైగా ఇద్దరు స్త్రీల గుణాలకు అద్దం పట్టే కథ. ఒకరు వీరనారి రుద్రమ, మరొకరు శృంగార తార మాచల. కానీ ఇద్దరూ నీతికి కట్టుబడిన వ్యక్తులు. అదే ఇద్దరినీ కలిపే ఏక సూత్రం. వారి వారి జీవితగాథ ఇందులోని వస్తువు.

**భాష:** కన్యాశుల్కంలాంటి సాంఘిక నాటకాలలో ప్రజలు మాట్లాడుకొనే భాషనే వాడారు గురజాడ. అది అప్పటికి చాలా

పెద్ద విప్లవం. కానీ ఆనాటి సాంఘిక నాటకాల్లో కూడా చాలా వరకూ గ్రాంథిక భాషలోనే ఉండేవి. తరువాత తరువాత వచ్చిన నాటకాల్లో పౌరాణిక, చారిత్రక పాత్రలకు గ్రాంథికం మిగిలిన పాత్రలకు శిష్ట వ్యవహార భాషను వాడుతూ వచ్చారు. ఇప్పుడు వస్తున్న పౌరాణిక, చారిత్రక నాటకాల్లో గ్రాంథిక భాషనే వాడుతున్నారు రచయితలు. కానీ రెండు చారిత్రక నాటకాలు రాసినరావుగారు అందులో ప్రతి పాత్రకు శిష్టవ్యవహార భాషనే వాడారు. నిజానికి కాకతీయుల కాలానికి చెందిన భాషను వాడాలి. అది కచ్చితంగా పౌరాణిక భాషే కావాలి. ఉదాహరణకు ఇప్పటికీ ఎంతో ఆదరణ ఉన్న భువన విజయాల్లో సైతం గ్రాంథిక భాషనే వాడుతారు. రాయల కాలం 16వ శతాబ్దం. ఆ కాలం నాటి భాషనే భువన విజయాల్లో వాడుతున్నారు. కానీ 12వ శతాబ్దానికి చెందిన అంటే రాయల కాలానికి నాలుగు వందల సంవత్సరాల క్రితం నాటి కాకతీయుల కాలానికి సంబంధించిన కథతో నాటకాలు రాసిన రావుగారు మాత్రం శిష్టవ్యావహారిక భాషనే వాడారు.

చారిత్రక కథను తీసుకొని ఆధునిక దృష్టితో, ఆధునిక పాఠకులకు అందించే ప్రయత్నం చేశారు ప్రాణ్ రావు. ఆయన చేసిన ప్రయత్నంలో విజయం సాధించారని ముక్తకంఠంతో చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. నాగయ్య జి (2009), తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటి, నవ్య ప్రచురణ, తిరుపతి.
2. ప్రాణ్ రావు ఎస్.ఎమ్ (2021), రుద్రమదేవి, మాచలదేవి (రెండు చరిత్రక నాటకాలు), స్వీయ ప్రచురణ, హైదరాబాద్.
3. అంతర్జాలం వికీపీడియా నుండి సమాచారం

# కన్యాశుల్కం - ఇతివృత్త వైవిధ్యం

**డా. మల్లెపోగు మాదన్న**
తెలుగు అధ్యాపకులు
యస్.జి.యస్.ఆర్ట్స్ కళాశాల
తిరుపతి
సెల్ : 99660 63428

**ఉపోద్ఘాతం:**

"నాటకాంతం హి సాహిత్యం" అన్నాడు మహాకవి కాళిదాసు. సాహిత్య ప్రక్రియలలో నాటకం కూడా ఒకటి. కందుకూరి సాంఘిక విప్లవాన్ని, గిడుగు-భాషా చైతన్యాన్ని, తనలో సమన్వయించుకుని సరికొత్త సాహితీ మార్గాన్ని చూపిన నవయుగ వైతాళికుడు - గురజాడ వేంకట అప్పారావు. శ్రీశ్రీ అన్నట్లు "వేసిన దారంట వెళ్ళిపోవడం సులభం. అంతేకాదు పదిలం" కాని గురజాడ దృష్టి భవిష్యత్తులోకి చొచ్చుకొనిపోయి ఎగిసిపోయేటంతటి నిశితమైంది. ప్రగతి మూలకమైంది. అందువల్లే గురజాడ నేటికీ నిలిచి వున్న "కన్యాశుల్క నాటకాన్ని" రచించగలిగారు.

**ఇతివృత్తం:**

కన్యాశుల్కంలో అనేక విశిష్టాంశాలు ఉన్నాయి. అందులోని పాత్రలు, మనస్తత్వాలు, ప్రవర్తనలు- ఇవన్నీ విశిష్టతను కలిగి ఉన్నాయి. పాత్రలకు పేర్లుపెట్టి చిత్రీకరించడంలోను విశిష్టత తొణికిసలాడుతుంది. వేశ్యా సమస్య, కన్యాశుల్కం సమస్యల నేపథ్యాన్ని వివరించడంలోనూ, హాస్యాన్ని మేళవించడంలోనూ, వ్యావహారిక తెలుగులో నాటకాన్ని రాయడంలోనూ ఇలా ఈ నాటకంలో ఎన్నో విశిష్టాంశాలున్నాయి.

పసిప్రాయంలో ఉన్న అభం శుభం తెలియని కన్న కూతుళ్ళను డబ్బుకోసం కాటికి కాళ్ళు చాచుకున్న ముసలి వాళ్ళకిచ్చి పెళ్ళిళ్ళు చేయడం, తత్ఫలితంగా తలెత్తే విధవరాండ్ల సమస్య, వేశ్యా సమస్య వీటన్నిటికీ వెనుక ఉన్న మూఢచారాలు వాటికి 'తగుదునమ్మా' అంటూ భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థ, అబద్ధపు న్యాయ వ్యవస్థ ఇలాంటి అనేక సామాజిక రుగ్మతలకు వాటి పర్యవసానాలకు, తత్పరిణామాలకు నిలువుదట్టం-'కన్యాశుల్కం'.

"జీవితంలో ఉన్నవన్నీ కన్యాశుల్కంలో ఉన్నాయంటాడు" శ్రీశ్రీ. నిజ జీవితంలో కుహనా సంస్కర్తనో, తిమ్మిని బమ్మిని చేసే వకీళ్ళనో అన్ఫార్చునేట్ యంగ్ విడోనో కలిసినప్పుడు కన్యాశుల్కం నాటకం మన కళ్ళముందు కదలాడుతుంది.

సమాజంలోని విభిన్న వ్యక్తుల కృత్రిమ మనస్తత్వాలు, మిడి మిడి జ్ఞానానికీ, మోసాలకీ తప్ప ఎందుకూ పనికిరాని విద్యావిధానం, అబద్ధపు న్యాయ వ్యవస్థ, నక్కజిత్తుల వ్యవహారాలు, చితికి శిథిలమైనపోయిన వితంతువులు ఇవన్నీ సహజరూపాలుగా సజీవ పాత్రల సమ్మేళనంగా కన్యాశుల్కం భాసిల్లుతుంది. వాస్తవిక జీవితం నుంచి సమకాలిక ఇతివృత్తాన్ని ఎన్నుకొని, హాస్యరస పోషణతో పాత్ర చిత్రణగావించి అత్యంత విశిష్టత కలిగిన నాటకాన్ని అందించిన మహాకవి గురజాడ.

గురజాడలోని మంచిని పెంచే ప్రేమతత్వం, భ్రష్టుపట్టిన ఆచారాలను సంస్కరించడం, సామాజిక అవినీతిమయంగా ఉన్న అతి నీచమైన దాస్యం నుంచి స్త్రీ జాతిని కాపాడే యోచన, విధవా వివాహసమర్థన వేశ్యా సమస్యలోని వాస్తవికాంశాలు, సమాజపు కృత్రిమత్వంపై ద్వేషం, వీటన్నింటినీ హాస్యంతో రంగరించి జీవితంలోని గంభీరత్వాన్ని చూపించాడు రచయిత. ప్రజలకు సన్నిహితంగా ఉన్నటువంటి భాషలో, సమకాలీన సమాజంలో ఉన్న దైన్యాన్నీ, హైన్యాన్నీ, మాలిన్యాన్ని, కుట్రల్నీ, కుతంత్రాల్ని, ఆశనూ, నిరాశనూ చిత్రించటంలో ఈ నాటకాన్ని మించింది ఇంకొకటి లేదు.

'బాల్యవివాహం' వల్ల వైధవ్యం పొందిన స్త్రీలలో "అన్ఫార్చునేట్ బ్యూటీఫుల్ యంగ్ విడో" అయిన బుచ్చమ్మ వంటి అమాయకురాళ్ళు వున్నారు. గిరీశం గారిని పెళ్ళాడతానని ధైర్యంగా చెప్పగలిగిన బుచ్చమ్మ స్నేహితురాలు వంటి

సాహసులూ వున్నారు. రామప్పంతుళ్ళను నమ్ముకొని మోసపోయి భ్రష్టుపట్టిన మీనాక్షులూ, నిర్బంధ వైధవ్యం అనుభవిస్తూ గిరీశంలాంటి నయవంచకులను నమ్మి మోసపోయిన పూటకూళ్ళమ్మలూ ఉన్నారు.

పతనం అయిపోతున్న భ్రష్టుపట్టిపోతున్న ఆ సాంప్రదాయిక సమాజంలో ఈ దురాచారాలను అడ్డుకోవడానికి వెంకమ్మ కరటక శాస్త్రి లాంటి వాళ్లూ ఉన్నారు. పరోక్షంగానో ప్రత్యక్షంగానో వీళ్లకు తోడ్పడడానికి గిరీశం, మధురవాణి లాంటి వాళ్ళూ ఉన్నారు. తను చేసిన తప్పిదానికి విధవ కూతురు మీనాక్షి వైధవ్యం అనుభవిస్తూ, ఇంట్లోనే ఉన్నా వివాహయోగం ద్వారా వస్తుందని నమ్మి "డబ్బుకూ ప్రాణానికి లంకెపెట్టుకొని" బతికే లుబ్ధావధానులు వంటి 'త్రాష్టులు' మంచం మీంచి దించేయడానికి సిద్ధంగా ఉన్న వాడికి కట్టి ఓ కూతురిని విధవను చేయడమేకాక మరో కూతురుని కూడా డబ్బుకు కక్కుర్తిపడే లుబ్ధావధాన్లు వంటి నర పీనుగులకు అమ్మే అగ్నిహోత్రావధాన్లు వంటి మూర్ఖపు గాడిద కొడుకులూ ఉన్నారు. ఇలాంటి వాళ్ళ ధన లోభాన్ని గుర్తించి 'లౌక్యాన్ని' ప్రదర్శించి మధ్యవర్తిత్వం నిర్వహించి తన పబ్బం గడుపుకొనే నయవంచకులైన రామప్ప పంతులూ, ఈ దురన్యాయాలను ఎలాగైనా ఖండించి, నిషేధించి సరికొత్త వ్యవస్థను స్థాపించాలని సంకల్పించిన సౌజన్యం కలిగిన సౌజన్యారావు పంతులూ ఉన్నారు.

చదువు చట్టుబంధాల్ని మరచిపోయి 'చుట్టల్ని' కాల్చుకోవడం నేర్చిన వేంకటేశం వంటి శిష్యులూ, గిరీశం దగ్గర నాలుగింగిలీషు ముక్కలు నేర్చుకోవాలని తహతహతో ఉంటూనే కన్యావేషంతో లుబ్ధావధాని చవక పెండ్లి కూతురుగా నటించి పరోక్షంగా దురన్యాయాలను అడ్డగించిన మహేశం లాంటి శిష్యులూ వున్నారు.

పెద్ద స్వార్థాన్ని సాధించడం కోసం చిన్న సహాయాన్ని చేసినట్లు నటించే పాత్రలు-రామప్ప పంతులు, గిరీశం. ఈ రెండు పాత్రలకూ పేర్లు పెట్టడంలో ఒక చాతుర్యం వుంది. ఒక ఎత్తుగడ వుంది. వీరి పేర్లలో వీరి స్వరూప స్వభావాలను సూచించకపోవడమే ఆ చాతుర్యం, ఆ ఎత్తుగడ. నాటకంలోని తక్కిన పాత్రల పేర్లు ఆయా పాత్రల స్వరూప స్వభావాలను సూచిస్తాయి. చిర్రు బుర్రులాడే 'అగ్నిహోత్రావధాన్లు', డబ్బుతో చెలిమి చేసే 'లుబ్ధావధానులు', మధురంగా మాట్లాడే 'మధురవాణి', పన్నాగాలు పన్నిన 'కరకటశాస్త్రి', సజ్జనత్వం సంతరించుకున్న సౌజన్యరావు, అమాయకంగా మాట్లాడే బుచ్చమ్మ, మొదలైన పేర్లు ఆ పాత్రల గుణాలను, ఆకారాలను ప్రతిబింబిస్తాయి. దీనికి కారణం ఈ పాత్రలన్నింటికీ సమస్యపట్ల అనుకూలంగానో, ప్రతికూలంగానో స్పష్టమైన భావం వుంది. కానీ గిరీశం, రామప్పపంతులు-అగ్నికి ఆజ్యంపోసే, సమస్యను తమ స్వార్థం కోసం మరింత జటిలం చేసే నయవంచకులు, లౌక్యులు. అందుకే వారి గుణగణాలను వ్యక్తం చేయని విధంగా వారికి గురజాడ వారు పేర్లు పెట్టారు.

ఈ నాటకంలోని పాత్రల సృష్టి ప్రత్యేకమైంది. బాల్యంలోనే వైధవ్యం పొంది, వయస్సు వచ్చిన తర్వాత పరిస్థితుల ప్రాబల్యం వల్ల దుర్మార్గులతో లేచిపోయినవారు బుచ్చమ్మ, మీనాక్షులు. కూతుళ్ళను కాటికి కాళ్ళు చాచుకున్న ముసలివాళ్ళకు అమ్మి సొమ్ము చేసుకొనే పాపాత్ముడు అగ్నిహోత్రావధాన్లు. బుచ్చమ్మ, మీనాక్షి ఇద్దరూ సుబ్బిపెళ్ళి లుబ్ధావధానులతో కాకుండా కాపాడిన వారే.

మధురవాణి, కరటకశాస్త్రి, సౌజన్యారావు ఈ ముగ్గురూ సుబ్బిని రక్షించినవారే. ఈ పాత్రలు అనుసంధానం కన్యాశుల్కం నాటకంలోని మరో విశిష్టత. విశాలదృష్టి, దయాదాక్షిణ్యాలు, ఇతరుల నుంచి మంచిని కోరుకునే వినయం వీళ్ళ సహజగుణాలు. కరటకశాస్త్రి, సౌజన్యారావులు మధురవాణిని గురువుగా భావించారు. ఆమెను వాళ్ళను గురువులుగా సంభావించింది. నాటకాన్ని ఆకళింపు చేసుకుంటే అవగతమయ్యేదిదే. ఈ పాత్రలలో ఇంతటి పరస్పర అవగాహన ఉన్నా కరటకశాస్త్రి, సౌజన్యారావు ఒక్కసారైనా కలవకపోవడం కన్యాశుల్కం నాటక చమత్కృతుల్లో ఒకటి. అంతేకాదు మంచిచేయాలనే తత్వానికి ఒక అంచున కరటకశాస్త్రి మరొక అంచున సౌజన్యారావు నిలబడి ఉన్నప్పుడు వారి మధ్య అనుసంధానం చేస్తూ జీవనదై ప్రవహించింది మధురవాణి పాత్ర. అందువల్లనే "మధురవాణి గురజాడ ప్రాపంచిక దృక్పథానికి ప్రతినిధి".

ఈ నాటకంలో రెండు గురు శిష్యపాత్రల జంటలున్నాయి. (1) గిరీశం-వేంకటేశం. (2) కరటకశాస్త్రి- మహేశం.

గిరీశం వేంకటేశానికి చుట్టకాల్చడం నేర్పాడు! కరటకశాస్త్రిని చూసి మహేశం చుట్టుకాల్చడం నేర్చుకున్నాడు. ఆంగ్లేయ విద్యావలంబకులైన గురుశిష్యులు గిరీశం, వెంకటేశం చెడ్డపాత్రలు కావడం, సంస్కృత విద్యావలంబకులైన కరటక శాస్త్రి, మహేశం మంచి పాత్రలు కావడం కన్యాశుల్కం నాటకం రచనలో ఉన్న మరో విశిష్టత.

వివిధ ప్రవర్తన నియమావళి గల న్యాయవాది పాత్రలు-నాయుడు, భీమారావు, సౌజన్యారావు పంతులు. అగ్నిహోత్రావధానులు ముగ్గురి దగ్గరకుపోతాడు. నాయుడికి న్యాయశాస్త్రం తెలీదు. అయినా అవినీతిపరులైన అధికారులను పట్టుకుని పనులను సానుకూలంగా చేసుకోగలడు. భీమారావు అచ్చం వకీలు. "ఇచ్చిన ఫీజుకు పనైపోయింది. మళ్ళీ ఫీజిస్తే గాని మాట్లాడేది" అంటాడు. సౌజన్యారావుకు న్యాయం ప్రధానం. అడ్డమైన గడ్డితిని సిగ్గుమాలిన దొంగ సాక్ష్యాలజోలికిపోడు. తన మనసు క్షోభిస్తుంది కాబట్టి. "ఈ వృతి మానుకోవాలన్న సంకల్పం కూడా ఉందని" ప్రకటించిన సౌజన్యమూర్తి. సౌజన్యరావు పంతులు. అదే పాత్ర "మనం చెడ్డ అనుకొన్న దాంట్లో కూడా మంచి ఉండవచ్చు. అదే ప్రాథమిక సత్యాన్ని మధురవాణి జీవితం నుంచి నేర్చుకొన్నానని" ప్రకటిస్తాడు. ఇతని ప్రకటనే కన్యాశుల్కం నాటక భరతవాక్యం. ఇదే నూతనత్వం నిండిన కన్యాశుల్కం నాటక విశిష్టత.

సంఘమనే ఉద్యానవనంలో సుబ్బి, బుచ్చమ్మ అనే లేత చిగుళ్ళకు ప్రారంభావస్థలో పట్టే లుబ్ధావదాని అగ్నిహోత్రావధాని వంటి నిన్నటి చీడపురుగులను గురించి మాత్రమే కాక, తరుణావస్థలో ఇక మీదట పుట్టబోయే గిరీశం వంటి రేపటి పురుగుల గురించి కూడా హెచ్చరించాడు.

కన్యాశుల్కంలో స్పృశించిన మరో సామాజిక సమస్య వేశ్యాపోషణ. దీనికి వ్యతిరేకంగా 'యాంటి నాచ్చి' ఉద్యమం సాగుతున్న ఆ రోజుల్లో ఈ సమస్యకు అవగాహనను నూరుశాతం ప్రతిఫలించిందీ నాటకం. ఆ రోజుల్లో 'వేశ్య' అనే మాటను వినగానే 'పరమదుష్టస్త్రీ' అనే అభిప్రాయం లోకంలో పాతుకుపోయి ఉంది. 'యాంటినాచి' ఉద్యమం సాగే ఆ రోజుల్లోనే వేశ్యలపట్ల గతానుగతికమైన భావాన్ని బద్దలు కొట్టడానికి వేశ్యల వాస్తవ స్వరూపంలోని మంచి చెడులు సమ్మిశ్రమైన సంకీర్ణ వ్యక్తిత్వాన్ని లోకానికి విప్పి చెప్పేందుకు గురజాడ ఈ నాటకంలో ప్రయత్నించి కృతకృత్యులైనారు.

"ఆ ముసలాళ్ళు చస్తే కష్టం సుఖం ఎరుగని పసిపిల్లలు విధవలవుతారు". ఉప్పూ, పులుసూ తినడం చేత ఏమీ ఎరగని పసి పిల్లలు పూర్ణయవ్వనం వచ్చిన తర్వాత మనసు పట్టలేకపోతే వాళ్ళదా తప్పు? అని గిరీశం ప్రశ్నించింది బుచ్చమ్మను కాదు మరో కోణంలోంచి ఉధ్భవిస్తున్న వేశ్యాసమస్యనూ దాన్ని పెంచి పోషిస్తున్న మూర్ఖపు సమాజాన్ని. అందుకే అదే గిరీశం "వెదవ వివాహం కూడదూ, గిదవ వివాహం కూడదూ" అని "ఓర్వలేని మాటలు చెబుతూ డబ్బు కాసించి ముసలి పెళ్ళిళ్ళు చేసిన మూర్ఖుల్దా తప్పు"? అని ప్రశ్నించి అందులోనే సమాధానాన్ని సమస్య పరిష్కారాన్ని సూచిస్తాడు.

గురజాడ కన్యాశుల్కం నాటకంలో సమస్యలపట్ల, శాపభారాలను మోస్తున్న స్త్రీల పట్ల సానుభూతిని కలిగించి ఆ సమస్యకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడమే తన లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతేకాదు ఈ నాటకంలో 'సామాజిక విమర్శను' ప్రధాన లక్ష్యంగా ప్రదర్శించారు. సామాజిక విమర్శకు అతి బలమైన, అత్యంత ప్రతిభావంతమైన ఆయుధం 'అధిక్షేపం'. కన్యాశుల్కం నాటకమంతా సమకాలీన సమాజంలోని అనేక వికృతుల మీద అధిక్షేప పూర్వకమైన సామాజిక విమర్శగా సాగింది.

నాటక కళారూపానికి మరింత పట్టునిచ్చింది 'వ్యవహారికశైలి' వ్యవహారిక భాష విశిష్టతనూ, విదేశీయుల మెప్పుపొందిన దాని మార్ధవాన్ని, భావప్రకటన విస్తృతినీ ఆధునిక రచయితలు ఎందుకు గమనించలేకున్నారో అని తన రెండవ కూర్పు పీఠికలో గురజాడ వ్యవహారిక భాషకు తన నాటకంలో పట్టం కట్టారు. నిజానికి కన్యాశుల్కంలో హాస్యం హాస్యం కోసం కాదు. ప్రతినవ్వు వెనుక ఒక విషాద ఛాయ వుంటుంది. హాస్యం వెనుక గంభీరత దాగి వుంటుంది. కోపించే అగ్నిహోత్రావధాన్లు, ఏడ్చే లుబ్ధావదాన్లు మనకు నవ్వు తెప్పిస్తారు. అలాగే నవ్వే మధురవాణి, వెర్రిగా మాట్లాడే

బుచ్చమ్మ, విషాద విహ్వలత మీనాక్షి మనకు ఏడుపు తెప్పిస్తారు.

**ముగింపు:** కన్యాశుల్కం దురాచారాన్నీ, దానితో ముడిపడివున్న సమస్యలనూ, వాటి లోతు పాతులనూ, కష్ట నిష్ఠూరాలనూ, బాధావేదనలనూ బేరీజువేసి, ఆ సమస్యలతో ముడిపడి ఉన్న మానవ స్వభావాలను సమగ్రంగా చిత్రించాడు. ఇందులోని పాత్రలన్నీ సంకీర్ణమైన, లోతైన, వాస్తవికమైన మనస్తత్వ చిత్రణతో కూడిన పాత్రలు. కాబట్టి మానవుడు ఈ సంకీర్ణ మనస్తత్వంలో ఉన్నంతకాలం ఈ నాటకం, ఆ పాత్రలు జీవించే ఉంటాయి. ఆ పాత్రలను "పాపం వాటిని బతకనివ్వండి" అని మనం జాలి చూపాల్సిన అవసరం లేదు. సజీవత్వాన్ని సమగ్రంగా సంతరించుకున్న ఈ పాత్రలన్నీ చిరంజీవులే.

**ఆధారగ్రంథాలు**

1. అప్పారావు గురజాడ (2000), కన్యాశుల్కం, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.
2. నాగభూషణశర్మ మొదలి (2008), నాటక శిల్పం విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.
3. రమణ పి.వి. (1995), తెలుగు సాంఘిక నాటకం పరిణామ వికాసం, వెంకటరమణ బ్రదర్స్ పబ్లికేషన్స్, వరంగల్.

ISSN 2457 - 0796 UGC CARE List Approved Journals
మూసీ మాస పత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-27: సంచిక - 7(2) హైదరాబాద్ మే - 2024

# వరవిక్రయం-సామాజిక చిత్రీకరణ

**డా. జి. వెంకట లక్ష్మి**
తెలుగు ఉపన్యాసకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
ఇబ్రహీంపట్నం
సెల్ : 9949059179

*"కావ్యేషు నాటకం రమ్యం*
*నాటకాంతం హి సాహిత్యం"*

అని మహాకవి కాళిదాసు ఉక్తి. సాహిత్య ప్రక్రియ లన్నింటినీ వ్రాసిన తర్వాత నాటక సాహిత్య ప్రక్రియ రచనకు పూనుకోవాలని సూచించటంలోనే నాటక గొప్పతనం చెప్పకనే తెలుస్తుంది. నాటకం రమ్యమైనది, ఎందుకంటే ఇది దృశ్య కళ, సమాహారం కళ. ఆంగిక, వాచక, అభినయాలతో ప్రేక్షకులను అలరించి, వారి హృదయ పీఠాలను అధిష్టిస్తుంది. పండిత, పామర జనరంజకంగా అలరారుతుంది నన్నయ తన భారతావతారికలో రసాన్విత కావ్య నాటకముల్ పెక్కు జూచితి-అనటాన్ని బట్టి సమాజంపై నాటక సాహిత్య ప్రభావం ఎంత పడుతుందో అర్థం చేసుకోవచ్చు. సంఘ సంస్కరణ, సాంఘిక దురాచారాలకి నాటకాన్ని ఆయుధంగా వాడి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన వారిలో కాళ్ళకూరి నారాయణరావు ఒకరు. ఈయన ఏప్రిల్ 28,1871 మత్స్యపురి, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లాలో బంగారు రాజు, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించాడు. ఈయనకి మహాకవి అనే బిరుదు ఉంది. చిన్నతనం నుండే సంఘ సంస్కరణ భావాలు కల నారాయణ రావు బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం గారి శిష్యులై బ్రహ్మ సమాజంలో చేరి కులమతాలకు అతీతమైన మానవత్వాన్ని ప్రచారం చేసారు. వీరు కట్నం లేకుండా వర్ణాంతర వివాహం చేసుకొని సంఘసంస్కర్తలకు ఆదర్శప్రాయంగా నిలిచారు. ఈయనకి ఫోటోగ్రఫి, ఆయుర్వేదం,యోగాభ్యాసంలో ప్రావీణ్యం ఉంది. కొంతకాలం ఉపాధ్యాయునిగా, వైద్యునిగా, పత్రికాసంపాదకునిగా పనిచేశారు. రచన, ప్రదర్శన, సంఘసంస్కరణ నిరంతర వ్యాపకాలుగా కలిగిన కాళ్ళకూరి బహు గ్రంథకర్త. ఈయన వరకట్న సమస్యపై వ్రాసిన నాటకం వరవిక్రయం 1923 లో రచించిన ఈ నాటకం లోని వరకట్న సమస్య నేటికీ సజీవంగా నిలిచిన ఒక సాంఘిక దురాచారం. కట్న సమస్య సమాజంలో ఎలా వేళ్లూనుకుపోయిందో వరవిక్రయం నాటకంలో కవి అద్భుతంగా, వ్యంగ్యాత్మకంగా దృశ్య-శ్రవ్య నాటక ప్రక్రియ ద్వారా వివరించారు.

వరకట్న దురాచారాన్ని హాస్యాత్మకంగా ఎత్తి చూపుతూనే నాటక లక్షణాలను క్రమపద్ధతిలో పాటించారు. నాందిలో వరకట్నం సమస్య సమాజంలో శూన్యమవ్వాలని కోరుతూ గౌరీదేవిని కవి స్మరించాడు. ప్రస్తావనలో సూత్రధారుడు, నటి సూచనప్రాయంగా కథా నిర్దేశం చేసి చరఖాగానంతో పాత్రల ప్రవేశం చేయిస్తుంది. ఈ నాటకంలో మొత్తం 10 అంకాలున్నాయి.

పుణ్యమూర్తుల పురుషోత్తమరావు రెవిన్యూ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తూ సహాయ నిరాకరణోద్యమంలో ప్రభుత్వ ఉద్యోగం వదిలివేస్తాడు. ఆయనకి కాళింది, కమల అనే ఇద్దరు అమ్మాయిలు. అతనా భార్య భ్రమరాంబ. తండ్రి వరాన్వేషణతో నాటకం మొదలౌతుంది. తల్లి తన పిల్లలతో ఒకప్పుడు ఆడపిల్లలు పుడితే సంతోషపడేవారు, కానీ ఇప్పుడు ఆడపిల్లని ఎందుకు కన్నామా? అని భాధ పడే కాలం వచ్చింది. అని చెప్పడం ఎప్పుడో 1923లో రాసిన విషయం కొంతమంది జీవితాల్లో నేటికీ కనబడుతూనే ఉంది. మగపిల్లల తల్లిదండ్రులు ఎలా ఆలోచిస్తున్నారో చెప్తూ పురుషోత్తమ రావు కులం, రూపం. జ్ఞానం, పరువు, ప్రతిష్ట బంధువులతో ప్రమేయం లేకుండా కేవలం కన్యలిచ్చే ధనాన్నే ఆశిస్తున్నారు. గవ్వకు కొరగానివాడు కాసుల వెలలో ఉన్నాడని, స్కూల్ ఫైనల్ అయితే 2 వేలు, ఇంటర్ అయితే 3 వేలు,

బి ఏ అయితే 4 వేలు, ఆస్తులు ఉంటే అంతకు రెట్టింపు కట్నం ఇవ్వాలి. ఈ కట్నం రేట్లు రైలుబండిలో తరగతులలాగా ఉన్నాయని చెప్తాడు. ఇంకొంతమంది అబ్బాయిలు తమకు పెళ్ళిలో మోటార్ సైకిల్, రిస్టువాచ్, గోల్డ్ రింగ్, బూట్లు, సూట్లు కావాలనేవారు ఉన్నారు. మరికొందరు పైచదువులకయ్యే ఖర్చులు పెట్టుకోవాలని చెప్తే, కొంతమంది విదేశాల్లో చదివించమని అడిగారు. మరి పిల్లవాడు యోగ్యుడా అంటే అదీ లేదు. పంచాద్రి క్రాఫింగ్, పక్కపాపిడి జూలు, కాఫిహోటల్లో ఖాతాలు, సిగరెట్లు, బీడీలు తాగడం, నోట్లో కిళ్ళీలు, చలువ కళ్లద్దాలు - ఇలా చదువు తప్ప అన్నిట్లోనూ ముందున్నారు అని భ్రమరాంబతో చెప్తాడు. తోటి సంఘసంస్కర్తల్లో సంబంధాలు వెతికితే వాళ్ళుకూడా వేదికనెక్కి ఉపన్యసించేవాళ్ళేకాని, ఆచరణ శున్యులని, ఇదంతా చూస్తుంటే, పెళ్ళికెదిగిన ఆడపిల్లలు ఇంట్లో తిరుగుతుంటే కంట్లో పడ్డ దోమలాగా, నేరంపై లేచే కురుపులాగా, పంటి నొప్పిలాగా, మార్వాడి అప్పులాగా, పళ్ళసందులో చిక్కిన పీచులాగా, చెప్పులో ఉన్న రాయిలాగా, గొంతులో పడ్డ సూదిలాగా ప్రతి నిమిషం బాధిస్తుంది అని చెప్పడంలో డబ్బు లేని తల్లిదండ్రుల ఆవేదన కనిపిస్తుంది. అడిగినంత కట్నమిచ్చిన వారి పరిస్థితిని చుస్తే, పండుగలకు, పబ్బాలకి, తద్దినాలకు- ఇలా ఇప్పుడు వచ్చిన ఎంతో కొంత ఇచ్చుకోవాలి .ఎప్పుడైనా వారి బిడ్డను వారు చూసుకోవడానికి పుట్టింటికి పంపమంటే అదిరిపడి, ఇల్లెలాగడుస్తుంది అని ప్రశ్నిస్తారు.

నాటకంలో పెండ్లి కుమార్తెలు కాళింది, కమల తల్లిదండ్రులు వరాన్వేషణలో పడే బాధలను చూసి పెళ్లి తర్వాత పుట్టింటివారు పెళ్లికైన అప్పులు తీర్చుకుంటూ కష్టాలు పడతారని, తాము వారికి ఏమాత్రం సహాయం చేయలేని స్థితిలో పరాయియింట్లో పనిచేసుకుంటూ ఉండాలని, ఆడపిల్లగా పుట్టి తల్లిదండ్రులని బాధించేకంటే పుట్టిన వెంటనే చనిపోయినా బాగుండేదని అనుకుంటారు.

నాటకంలోని పెళ్లిళ్ల పేరయ్య ఎంత ఎక్కువ కట్నం తీసుకుంటే ఆ అబ్బాయి కి అంత గొప్ప అని చెప్తూ కాళిందికి సింగరాజు లింగరాజు దత్త పుత్రుడు బసవరాజుతో ఖాయం చేయాలనుకుంటాడు.

పెళ్ళికొడుకు తండ్రి సింగరాజు లింగరాజు ఎంత పిసినారి స్వభావం కలవాడో కాళ్ళకూరి హాస్యాత్మకంగా వివరించాడు - ధనం మూలం ఇదం జగత్ అన్నట్లుగా లింగరాజు ఉంటాడు. ప్రాణం పోయినా పైస పోరాదు అనేది ఆయన తత్త్వం. డబ్బు ఆశతో మూడు పెళ్లిళ్లు చేసుకొని కట్నం సొమ్ము 14 వేలు కూడబెట్టాడు. ఉప్పులు, పప్పులు, బియ్యం, నూనె, కట్టెలు, పిడకలు అన్నీ దాచిపెట్టి ఈరోజు కా రోజు లెక్కచొప్పున ఇస్తాడు. ఇంటికెవరైనా చుట్టాలు వస్తే వాళ్ళు తొందరగా వెళ్లాలని పలకరించడు.అప్పులిచ్చి భారీగా వడ్డీలు వసూలుచేస్తాడు. ఒక్కోసారి వంటకి కట్టెలు దండగ అని పక్షుల గూళ్ళను చెట్లపై నుండి తీసి వాడుకుంటాడు. క్షౌరానికి డబ్బులు దండగ అని చేయించుకోడు. చనిపోయినప్పుడు తన డబ్బుల పెట్టె కూడ తనతో వస్తే బాగుండు అని ఆలోచించే స్వభావంతో ఉంటాడు. ఇలాంటి వాడికి తన ఇంటికి వచ్చే కోడలు చాలీచాలక కొంత తిని, ఇంటిపనులన్నీ చేసి, కొట్టినా పడిఉండే అమ్మాయి దొరకాలని కోరుకుంటాడు.

పిసినారి లింగరాజు దత్తపుత్రుడు బసవరాజుతో సంఘసంస్కర్త పురుషోత్తమరావు కూతురు కాళిందితో వివాహాల వీరయ్య, పెళ్లిళ్ల పేరయ్య ఇరువురు కట్నం వేలంలో 5,500 రూపాయలకి సంబంధం కుదురుస్తారు. లింగరాజు వెంటనే 10 రూపాయలు బయాన తీసుకొని, సంబంధం కుదుర్చుకున్నట్లు రసీదు ఇస్తాడు. దాంతో పాటు మగపెళ్ళివారికి పెట్టిపోతలు, మర్యాదలు ఎలా ఉండాలో కోరికల చిట్టా కూడ రాసి సంతకం చేసి ఇస్తాడు. కట్నం తీసుకొని వివాహం చేసుకోవటం ఇష్టం లేని కాళింది తనని అబ్బాయిలాగా భావించి ఇంట్లోనే ఉండనివ్వాలని, డబ్బు కోసం ఇబ్బంది పడవద్దని చెప్పి, విఫలం చెంది, కట్నం తీసుకొని పెళ్లి చేసుకోవటం ఇష్టం లేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది.

సింగరాజు లింగరాజు కట్నం సొమ్ము పోగొట్టుకోవటం ఇష్టం లేక రెండవ అమ్మాయిని బసవరాజుకి ఇవ్వమని పెళ్లిళ్లపేరయ్య ద్వారా కబురు పెడతాడు. కాళింది కట్న సమస్యతో చనిపోయిన విషయం అన్ని పత్రికల్లో ప్రముఖంగా వస్తుంది. దీంతో బసవరాజుని కళాశాలలో తోటి స్నేహితులు గేలి చేస్తుంటారు. ఈ విషయం తండ్రితో చెప్పిన పట్టించుకోక వచ్చే కట్నం మీదే దృష్టి పెడతాడు. కమల అనుమతితో బసవరాజు వివాహం కమలతో నిశ్చయించబడుతుంది .పిసినారి

లింగరాజు తమ శుభలేఖలు అచ్చు వేయించే పని కూడ ఆడపెళ్ళి వారికే అప్పగిస్తాడు. వివాహ సమయంలో పెండ్లి కుమార్తెకు పెట్టే నగలు కొత్తవి కాకుండా తన వద్ద ఉన్న 4000 రూపాయల తాకట్టు నగలను ఇస్తాడు. పెండ్లి తర్వాత ఆమె తమ ఇంటికి రాగానే తీసుకోవచ్చని అనుకుంటాడు. భార్యకు కూడ నగలు అరిగిపోతాయేమోనని పెళ్లి ముందు రోజే ధరించటానికి ఇస్తాడు. ఐదు రోజుల పెళ్ళికి గాను ఆడపెళ్ళివారు పంపే పిండివంటలు, ముత్తైదువ సామాగ్రి, వంట సామాను మొదలైన సరుకంతా ఒక గదిలో దాచి, పెళ్లి తర్వాత అమ్ముకుందామని అనుకుంటాడు. వివాహ సమయంలో ఆడపెళ్ళి వారి నుండి లాంఛనాలు, గౌరవాలు ముక్కు పిండి మరీ వసులు చేస్తారు. తమవంతు వచ్చే పాటికి పిసినారితనంతో తప్పించుకుంటారు. పెళ్లి తర్వాత కమల తన అక్క కాళిందికి జరిగిన అన్యాయానికి లింగరాజుకి బుద్ధి చెప్పాలనే ఉద్దేశ్యంతో కాపురానికి వెళ్లకుండా పుట్టింట్లోనే ఉంటుంది. నగలు తాకట్టు పెట్టినవారు తమ నగలు తమకివ్వాల్సిందిగా లింగరాజుపై ఒత్తిడి పెట్టారు. పెండ్లి నాటి ఆ నగలు కమల దగ్గర ఉన్నాయి. చివరికి లింగరాజు వెఱ్ఱిబుర్రల వెంగళప్ప అనే లాయర్ సహాయంతో పురుషోత్తమరావు పసిపిల్లను, నగలను తీసుకొని పారిపోవడానికి ప్రయత్నం చేస్తున్నాడని కోర్టులో దావా వేస్తాడు. తనని ఇబ్బంది పెట్టినందుకు నగలను, కోర్టుకైన ఖర్చులను, మనోవర్తి లేకుండా వారితో సంబంధం

తెగతెంపులు చేయాలని న్యాయమూర్తికి విన్నవించుకుంటాడు.

లింగరాజు ప్రశ్నలకి సమాధానం కమల ఇస్తూ -నగలన్నీ భద్రంగా ఉన్నాయని నగల మూటని న్యాయమూర్తికి చూపుతుంది .ఇవన్నీ తనకి పెళ్లి సమయంలో లింగరాజు బహుమానంగా ఇచ్చినవి.

కాబట్టి బహుమతిని దాతకు తిరిగి తీసుకునే హక్కు లేదు అని చెప్తుంది. కాపురానికి అత్తవారింటికి వెళ్లకపోవటానికి కారణం చెప్తూ -నా భర్తే నా ఇంటికి వచ్చి నా ఆజ్ఞానుసారం నడుచుకోవాలని చెప్పి, దానికి రెండు కారణాలను చూపుతుంది. ఒకటవది-పెండ్లి కొడుకును మున్నంగి వారితో పోటీ పడి వేలం పాటలో 5, 500 రూపాయలకి సొంతం చేసుకున్నామని, దానికి రుజువుగా లింగరాజు ఇచ్చిన అగ్రిమెంటు, రసీదు కోర్టుకి సమర్పిస్తుంది. మొదట తన అక్క కాళిందికి సంబంధం కుదుర్చుకొని, ఆమె చనిపోవటం వల్ల తాను ఈ వివాహం చేసుకోవలసి వచ్చిందని చెప్తూ దీనికి ఆధారాలు కాళింది చనిపోయినపుడు

పత్రికలు ప్రచురించిన కథనాలను న్యాయమూర్తికి చూపుతుంది. రెండవది ఇరువురి శుభలేఖల్లోనూ అమ్మాయికి అబ్బాయినిచ్చి అనే ఉంటుంది. న్యాయమూర్తి ఆ రెండు శుభలేఖలు పరిశీలిస్తే ఇలా ఉంది నా కుమార్తె చి.సౌ. కమలకు బ్రహ్మశ్రీ సింగరాజు లింగరాజు కుమారుడు బసవరాజు నిచ్చి అని అమ్మాయి తరుపు కార్డులో, నా కుమారుడు చి. బసవరాజును బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారి కొమార్తె చి .సౌ. కమలకు ఇచ్చి అని అబ్బాయి తరుపు కార్డుల్లో ఉంటుంది.

చివరికి విషయం న్యాయమూర్తికి అర్థమై చిరునవ్వుతో మీ కొడుకును కమలకు ఇచ్చినట్లు సాక్ష్యం ఉంది కదా అని లింగరాజుని ప్రశ్నిస్తాడు. ఇదంతా గమనిస్తున్న బసవరాజు ఇకనైనా ముందుకు వచ్చి నిజం చెప్పకపోతే దేవుడికి ఏం సమాధానం చెప్తానని, తన తండ్రి పిసినారితనం వల్లే ఇదంతా జరిగిందని భావించి న్యాయమూర్తితో కమల చెప్పిందంతా నిజం అని ఒప్పుకొని, ఆమెకు దాసుడనై ఉంటానని చెప్తాడు. ఆమె చెప్పినట్లుగా నగల మూటను ఇతర కాగితాల కట్టను నెత్తిన పెట్టుకుని వరకట్నం తీసుకోవడం దురాచారమని కమల, పురుషోత్తమరావుతో పాటు తానూ కూడ ప్రబోధిస్తూ వారితో వెళ్తాడు. దీన్ని చూసినవారంతా వీరిని మెచ్చుకుంటూ, లింగరాజు బుద్ధిని అపహాస్యం చేస్తూ నవ్వుకుంటుంటారు. ఇదంతా గమనించిన లింగరాజు బుద్ధి తెచ్చుకుని వారి దగ్గరికి వెళ్లి, క్షమించమని ప్రార్ధించి, తాను కూడ వరకట్న వ్యతిరేక మహాయజ్ఞంలో పాలుపంచుకుంటాడు. ఈ నాటకంలో కాళ్లకూరి నారాయణరావు దేశభక్తిని కూడా చాటాడు. చరఖాగానంతోనే నాటకం మొదలవుతుంది. కాళింది చరఖాపై ప్రమాణం చేసి కట్నం తీసుకొని పెళ్లి చేసుకోను అంటుంది. రాట్నం దగ్గరకు వెళ్లి ముద్దు పెట్టుకుని కడసారి కొంత పోగు వడికి చనిపోతుంది. సంఘసంస్కర్తలు కొందరు వేదిక నెక్కి

ఉపన్యాసాలు ఇస్తారు. తప్పితే నిజ జీవితంలో వాటిని
పాటించకుండా పయోముఖ విషకుంభాలుగా ఉంటారని కూడా ప్రస్తావించబడింది. ఇక పురుషోత్తమరావు లాంటి వారు మార్పులేని సమాజాన్ని చూసి చూసి తామే మారిపోతున్నారు.

కమల కాళింది ఇరువురు ఇంగ్లీషు, తెలుగు, హిందీ, సంస్కృతం నేర్చుకున్నట్లు, సంగీతంలో కూడా ప్రావీణ్యం ఉన్నట్లు చెప్పబడింది. చదువు విజ్ఞానం పెంచుతుందని, విజ్ఞానం ద్వారా సమస్యలని ఎదుర్కొనే ధైర్యం, పరిష్కార మార్గాలు వాళ్లే వెతుక్కుంటారనే సూచన దీనిలో కనిపిస్తుంది. ఈ నాటకంలో కట్నం గురించి ప్రస్తావిస్తూ బ్రాహ్మణుల ఇంట ముద్దుగా పుట్టి, కోమటి ఇంట్లో ముద్దులు కురిపిస్తూ పెరిగి కమ్మవారింట్లో కాపురం చేస్తుందని రచయిత హాస్యాత్మకంగా చెప్పారు.

వరకట్నం అనే దురాచారానికి ప్రోత్సాహమే కారణమని కాళింది పాత్ర ద్వారా నాటక కర్త చెప్పిస్తాడు.

నాటకంలో పెళ్లిళ్ల పేరయ్యల గుణగణాలను పరిశీలిస్తే ఆడపిల్లకి న్యాయం చేయాలనే ఉద్దేశం కంటే తమ సొంత లాభమే ముందు చూసుకుంటారు. వీరు మంచి మాటకారులై ఉంటారు. కట్నం వేలంలో 5500కు పెంచడం కూడా వీరి చాతుర్యమే. పురుషోత్తమరావు పాలం పెళ్లిళ్ల పేరయ్య తన సొంత తెలివితో అల్లుడి పేరు పెట్టి తానే తక్కువ ధరకు తీసుకున్నాడు. తమకి రావలసిన డబ్బును ఏ విధంగానైనా పెళ్లి సమయంలోనే వసూలు చేసుకునే తత్వం వీరికి ఉంటుంది.

నాటకం చివరలో పెండ్లికొడుకు బసవరాజులో చైతన్యం వచ్చి కేసు మరీ ముందుకు పోకుండా
నవ్వుల పాలు కాకుండా తెలివితో వ్యవహరించాడని చెప్పడం ఒక కీలక మలుపు. పిల్లలలో చైతన్యం వస్తే తల్లిదండ్రులు కూడా మారి సామాజిక రుగ్మతలను మార్చవచ్చు అనే అంశం దీనివల్ల కనిపిస్తుంది. ఇలా సమాజంలో ఉండే భిన్న మనస్తత్వాలను, సామాజికాంశాలను వివరించడంలో ఈ నాటకం పరిపూర్ణ విజయం సాధించింది.

**ఆధార గ్రంథాలు**


1. నారాయణరావు కాళ్ళకూరి (1988), వరవిక్రయం, రవీంద్ర పబ్లిషింగ్ హౌస్, గుంటూరు.
2. డా॥ నాగయ్య జి. (1996), తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటి, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
3. ప్రొ॥ సిమ్మన్న వెలమల (2005), తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం.
4. డా॥ ద్వానా శాస్త్రి (2008), తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్.

# వరవిక్రయము - స్త్రీ చైతన్య స్ఫూర్తి

**డా. మంగమూర మునిలక్ష్మి**
తెలుగు అధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల
తిరుపతి
సెల్ : 9701525882

సాహిత్యం సమాజదర్పణం. అందులోని ప్రతి అంశం సాహిత్యవస్తువే. అందుకే సాహిత్యం వివిధ ప్రక్రియలలో రూపుదిద్దుకొని దర్శించడం కద్దు. కవిత్వం, నవల, కథ, కథానిక వంటి ప్రక్రియలలో నాటకం ప్రయోగ ప్రధానమైనది. కావ్యేషు నాటకం రమ్యం అన్నారు పెద్దలు. దృశ్యయోగ్యం కనుక వాటి ప్రభావం కూడా ఎక్కువే. సామాజిక జీవన ఇతివృత్తాలతో ప్రదర్శనా యోగ్యత, సామాజిక చైతన్యం కలిగి వెలువడ్డవి నాటకాలు. ఇవి అనేక కోణాల్లో అనేక రంగాలను స్పృశించాయి.

పౌరాణిక నాటకాల ప్రాబల్యం అధికంగా ఉన్న రోజుల్లో సాంఘిక సమస్యలకు పెద్దపీట వేసి సాహిత్య సృజన చేసిన వారిలో కాళ్ళకూరి నారాయణరావు ఒకరు. అటు సాంప్రదాయాన్ని ఇటు ఆధునికతను జోడించి రచించిన నాటకం వరవిక్రయము. కాళ్ళకూరి వారి ప్రతిభా పాటవాలకు నైపుణ్యాలకు చక్కటి నిదర్శనం. వరకట్న దురాచారాన్ని వ్యతిరేకిస్తూ, సమాజంలో మార్పును ఆకాంక్షిస్తూ రచించిన రచన ఇది.

వరకట్న సమస్య ఆనాటిది మాత్రమే కాదు, వంద సంవత్సరాలు గడిచినా ఈనాటికీ ఉండడం శోచనీయం. ఆడపిల్ల పెళ్ళి సమయంలో మగపిల్లవానికిచ్చే నగదు, బంగారు వస్తువులు, లాంటివి వరకట్నం కిందికి వస్తాయి. "వివాహ సందర్భంగా వధువు తరపువారు వరుడికి లేదా అతని తరపు వారికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇచ్చే ఆస్తులు ధన కనక వస్తు వాహనాదులు" అని వరకట్న నిషేధశాసనం (1961) నిర్వచించింది. (తెలుగు నవలల్లో వరకట్న సమస్యా చిత్రణ, రాజేశ్వరి, పు. 40

వరకట్నం అంటే కేవలం కొంత డబ్బు ఇస్తే సరిపోతుందనే పరిస్థితి లేదు. ఇది భౌతిక, అభౌతిక రూపాలలో దర్శనమిస్తూ ఉంది. ఆడపిల్ల తల్లిదండ్రులు అబ్బాయికిచ్చే కట్నం, నగదు, బంగారు, వస్తు, వాహనం, లాంఛనాలు, భూములు, స్థిరాస్తులు, సారెలు, కానుకలతో పాటు ఒప్పంద రూపంలో కూడా ఉండడం గమనార్హం. ఈ దృశ్యాలన్నీ 1922లో రచించిన కాళ్ళకూరి వారి 'వరవిక్రయము' నాటకంలోనూ దర్శనమిస్తున్నాయి. అవి నేటికీ కొనసాగుతున్నాయి. ఈ నాటకంలో ప్రధానమైన అంశం వరకట్న సమస్య.

ఈ పరిశోధనా పత్రం ముఖ్యోద్దేశ్యం స్త్రీ పాత్రల చైతన్య స్ఫూర్తి కనుక అదే ప్రధాన నేపథ్యంగా భావిస్తే ఇందులో నాలుగు పాత్రలు దర్శనమిస్తాయి. కాళింది, కమల, భ్రమరాంబ, సుభద్ర. పురుషోత్తమరావు గారి భార్య భ్రమరాంబ. వీరి కుమార్తెలు కాళింది, కమల. వీరి వివాహ ప్రయత్నమే కథగా నడిచింది. పురుషోత్తమ రావు సంఘసంస్కరణ భావాలు కలిగినవాడే అయినా వరకట్న విషయంలో అవేవీ పనికిరాలేదు. పెళ్ళిళ్ళ పేరయ్య సహాయంతో సింగరాజు లింగరాజు పెంపుడు కొడుకు బసవరాజుతో తన కుమార్తె కాళింది వివాహానికి నిశ్చయించాడు. అయితే కాళిందికి ఆస్తులు అమ్మి తండ్రి వరకట్నం ఇవ్వడం నచ్చలేదు. చదువులెన్ని చదివినా వరకట్నం తప్పడంలేదని ఆక్రోశించింది. తన చెల్లెలితో ప్రాణమైనా విడుస్తానుగాని కట్నమిచ్చి వివాహం చేసుకోనని రాట్నము సాక్షిగా ప్రమాణం చేసింది. తండ్రి సంస్కార భావాలు, ఆత్మాభిమానం, ఆధునిక భావాలు పుణికి పుచ్చుకొన్నది కనుక చివరకు ఆత్మార్పణకు సిద్ధపడింది.

తండ్రి తమకు ఆధారమైన పొలాన్ని అమ్మి వరకట్నమివ్వడం నచ్చలేదు కాళిందికి. చెల్లెలు కమల బసవరాజు ఫోటో చూపినా చూడలేదు. అందగాడు, చూడమని చెప్తే – అంత అందగాడనిపిస్తే నీవే పెళ్ళిచేసుకో అంటుంది. తల్లితో మీకు కులము ఉంది. మాకు గుణము ఉంది. కట్నం ఇచ్చి పెళ్ళిచేసుకోవడం కంటే చిన్నతనము ఏముంటుంది. అడిగేవారికి పాపభయాలు లేవు. ఇచ్చేవారికి సిగ్గులేదు అని ఆత్మాభిమానంతో చెబుతుంది. అలాంటి గాడిదతో కాపురం చేయడం కంటే మగపిల్లవాడిలా తల్లిదండ్రుల దగ్గర ఉండడమే మేలంటుంది. ఇచ్చేవారు ఉంటేనే పుచ్చుకొనేవారు ఉంటారని, ప్రోత్సాహమే అన్నింటికీ హేతువని అంటుంది. తండ్రితో తనకు అలాంటి పెళ్ళి వద్దని కట్నమిచ్చి కంఠానికి పుస్తె కట్టించుకోవడం కంటె తనకు తాను కంఠమునకు తాడుతో ఉరి వేసుకోవడం గౌరవమని చెబుతుంది. ఈ అవమానపు వివాహ ప్రయత్నం విరమించమంటుంది. అంతరాత్మకు ఇష్టంలేని పనిచేయడం కన్నా మరణించడమే ఉత్తమమని భావించింది. ఆత్మహత్య పాపమని మనసు హెచ్చరించినా ఆత్మాభిమానం ఆ పనిని చేయించింది. మానసిక ధైర్యం ఆమెను ఆత్మహత్యకు పురిగొల్పింది.

రెండవ పాత్ర కమల. అభిమానాన్ని వదలుకోలేక అక్క కాళింది ఆత్మహత్య చేసుకోవడం కమలలో తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఆ కారణంగా ఆమెలో వరకట్న దురాచారాన్ని రూపుమాపాలనే ఆకాంక్ష బలంగా రూపుదిద్దుకుంది. కమల కూడా అక్కలాగే చదువుకున్నది. పరిస్థితులను అంచనావేయగలిగినది. తెలివైనది, లోకజ్ఞత తెలిసినది. 'వేశ్యలను వెలయాలు అంటే కట్నం తీసుకునే మగవాళ్ళని వెలమగలు అనాలి' అని అనగలిగినంతటి ధీశాలి కమల. వరకట్నము వసూలు కావాలంటే బసవరాజును కమల వివాహం చేసుకోవాలని భావించినప్పుడు తండ్రి అభిప్రాయంతో ఏకీభవించి వివాహానికి సిద్ధమైంది. కట్నం డబ్బు తిరిగిరావాలి, అక్క మరణం సఫలీకృతం కావాలంటే వివాహం తప్పదని భావించింది. అయితే వివాహానికి సంబంధించిన విషయాల్లో తన ఇష్టానికి ప్రాధాన్యమివ్వాలని తండ్రిని కోరింది. బసవరాజును పెళ్ళాడింది. లింగరాజు కోడలు కమలకు వివాహ సమయంలో నాలుగువేల రూపాయల నగలు పెట్టాడు. మూడు సంవత్సరాలు గడచిపోయాయి. అయినా కోడలు కాపురానికి రాకపోవడంతో కోర్టునాశ్రయించాడు. కోర్టులో లింగరాజుకు వ్యతిరేకంగా కమల తానే స్వయంగా వాదిస్తానంటుంది. లింగరాజు కోర్టుకు విన్నవించిన రెండు విషయాలను న్యాయాధికారితో తానే చర్చిస్తుంది. మొదటిది పెళ్ళిలో తనకు పెట్టిన బంగారం. లింగరాజు తన వివాహమైనప్పుడు అవి తనకు బహూకరించిన వస్తువులు. బహూకరించిన వస్తువులు తిరిగి తీసుకోవడానికి హక్కులేదు కనుక వాటిని తిరిగి ఇవ్వవలసిన పనిలేదు. రెండవది తన భర్తను వేలంపాటలో ఐదువేల అయిదు వందలకు కొన్నారు కనుక తన భర్త తన యింటికి వచ్చి తాను చెప్పినట్టు వినవలసిందేగాని, తనను ఆయన ఇంటికి రమ్మని చెప్పే అధికారం లేదు. అందుకు సాక్ష్యాలు రశీదులు, పెళ్ళిపత్రిక. న్యాయం కమలవైపు రావడంతో బసవరాజు కూడా కమల దగ్గరకే వచ్చాడు. కమల బసవరాజుతో నగలు, కాగితాల కట్టు తీసుకొని తనవెంట రమ్మంటుంది. తన భర్తతో "రండి! ఇద్దరమూ కలిసి ఈ వరవిక్రయ దురాచారమును రూపుమాపుటకు ప్రయత్నిద్దాము" అంటుంది.

మూడవ పాత్ర భ్రమరాంబ. పుణ్యమూర్తుల పురుషోత్తమరావుగారి భార్య. భర్త అడుగుజాడల్లో నడిచినా స్వతంత్ర భావాలున్నాయి. లోకం పోకడలను అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా ప్రవర్తించగలదు. ఇద్దరు కూతుళ్ళను కని పెంచి, కట్నాలు ఇచ్చుకోలేక తల్లిదండ్రులుపడే అవస్థ తానూ పడ్డది. చదువు, సంస్కారం, కొరగాకుండా పోయినందుకు బాధపడుతుంది. వివాహ విషయంలో బసవరాజు కాళిందికి తగిన వరుడని తెలివిగా చెబుతుంది. పెళ్ళి సంబంధాలగురించి మాట్లాడుతున్నప్పుడు 'సంపత్తులేని కులీనుడు స్మశానంలో తులసి మొక్క' వంటివాడని అంటుంది. సమాజంలోని పరిస్థితులను అర్థం చేసుకొన్నది గనుక కట్నం ఇచ్చి చేసుకొనే పెళ్ళి తనకు ఇష్టం లేదని పెద్ద కుమార్తె కాళింది అన్నప్పుడు దేశకాల పరిస్థితులు తెలియక అంటున్నావు. పిండిబొమ్మ వంటి పిల్లని ఇస్తామంటే కట్నంకోసం చేయి చాస్తున్నారు. కట్నం ఇవ్వకుండా మంగళసూత్రం కట్టే వరుడు ఈ జగత్తులో కనిపించడు అని ఆవేదన పడుతుంది. కమల వివాహ సమయంలో లాంఛనాల ప్రస్తావన వచ్చినప్పుడు 'మగపెళ్ళి వారు తమ లాంఛనాలను దబాయించి మరీ నెరవేర్చుకొంటున్నారు గానీ

ఆడపిల్ల పెళ్ళివారికి ఇవ్వవలసిన లాంఛనాలు మాత్రం ఇవ్వడం లేదు.' అని మగపెళ్ళివారు లాంఛనాల స్వీకరణ తమ హక్కుగా భావించి వసూలుచేయడాన్ని వ్యతిరేకిస్తుంది. న్యాయస్థానంలో కమల వాదించి గెలిచినప్పుడు మగవారే గాదు ఆడవారిలోనూ కట్నం పట్ల వున్న వ్యామోహాన్ని నిరసిస్తూ "కట్నాలు తీసుకోవడమే గౌరవము అనే వెర్రితనము ఆడవాళ్ళను వదులుగాక" అంటుంది. ఒక కుమార్తె కట్నదాహానికి బలైపోయినా, చిన్న కుమార్తె కట్నానికి వ్యతిరేకంగా పోరాడి జయించడానికి సహకరించింది.

నాల్గవది సుభద్ర. సింగరాజు లింగరాజు మూడవ భార్య. చదువుకున్న స్త్రీ, పరిస్థితుల కారణంగా లింగరాజుకు మూడవ భార్య అయింది. భర్త చేస్తున్నది తప్పని తెలిసినా వ్యతిరేకించలేదు. కానీ అవకాశం వచ్చినప్పుడు భర్తను ఎదిరించక మానలేదు. దంతాలు ఊడిపోయిన ముసలివానికి కూడా పిల్లనిచ్చే తల్లిదండ్రులు వున్న ఈ కాలంలో ఆడదానిగా పుట్టడంకన్నా అడవిలో కొండచిలువగా పుట్టడం మేలు అంటుంది. ముసలి, పిసినారి అయిన తన భర్తను తలచుకొని అటువంటి భర్త శత్రువులకు కూడా వద్దని కోరుకుంటుంది. తను ఆశగా నగలు పెట్టుకొన్నా, చీరలు కొన్నా, తాంబూలం వేసుకొన్నా ఒప్పుకోడు. జడవేసుకొన్నా, మంచి చీర కట్టినా, వంటవాడిని పిలిచినా ముసలి మొగుడికి అనుమానం, భయం. అలాంటి భర్తను తలచుకొని దుఃఖించడమే తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత. ఎప్పుడూ ఎందుకు కొఱకొఱలాడుతుంటావు. సంతోషంగా ఎప్పుడుంటావు అని భర్త అన్నప్పుడు 'చచ్చిన మరునాడు' అంటుంది. నువ్వా నేనా అంటే, 'మీకు చావేమిటి! ఎన్ని కట్నాలు తీసుకోవాలి, ఎందరి గొంతులు కోయాలి' అంటుంది. ఎందుకు నా మీద అంతకోపమని లింగరాజు అంటే 'విద్య వయసు పరువు విడిచిపెట్టి సంపద ఒక్కటే చూసి పిసినిగొట్టు పీనుగకు నన్ను కట్టి ఇచ్చిన నా తల్లి మీద తప్ప నాకు ఎవ్వరిమీద కోపం లేదు' అంటుంది. ముసలి భర్తతో వయస్సులో ఉండే భార్య పడే కష్టాలు, నిస్సహాయత, బాధ సుభద్ర స్వరంలో కాస్తంత కోపంగానో, హాస్యంగానో, చమత్కారంగానో అప్పుడప్పుడూ కనిపిస్తూనే ఉంటుంది.

ఈ నాటకంలో భ్రమరాంబ సాంప్రదాయ బద్ధంగా ఉంటూ భర్త అడుగుజాడల్లో నడుస్తూ అవసరమైనప్పుడు తగిన సలహాలు సూచనలు చేస్తూ ఉన్న సమర్థురాలిగా కనిపిస్తే, సుభద్ర భర్త ముసలివాడయినా తన కోరికలు హద్దుదాటనీయక సాంప్రదాయ కట్టుబాట్లతో సహనంతో జీవిస్తూ భర్త తప్పులను అవకాశం దొరికినప్పుడల్లా ఎత్తిచూపుతూ మార్గదర్శకురాలిగా ఉంది. ఈ రెండు పాత్రలు ప్రధాన పాత్రలతో పోల్చినప్పుడు చిన్నవే అయినా నాటకానికి అవసరమైనవి. ఇక ప్రధాన స్త్రీ పాత్రలు కాళింది, కమలల విషయానికి వస్తే ఇద్దరూ సంఘసంస్కరణ భావాలు అలవరచుకొన్నవారే. వరకట్న దురాచారానికి వ్యతిరేకులే. అయితే కాళింది తనకు వివాహం కుదిరినప్పుడు ఆస్తులు అమ్మి వరకట్నం ఇచ్చి పెళ్ళిచేసుకోవడం కంటే మరణించడమే మేలని భావించింది. వివాహం వద్దని తల్లిదండ్రుల కాళ్ళు పట్టుకొంది, ఏడ్చింది. తన మనసును అర్థంచేసుకోలేక పోయినందుకు చింతించి, చివరకు మరణమే శరణ్యమని అవమానపు పెళ్ళి చేసుకోలేక ఆత్మహత్య చేసుకొంది. కమలలో కూడా అక్క అభిప్రాయాలే ఉన్నాయి. కానీ కార్యసాధకురాలు, లోకజ్ఞానం కలది. తల్లిదండ్రులను తన ఆలోచనలకు అనుగుణంగా ఒప్పించగల, మార్చగల నేర్పరురాలు. బుద్ధి కుశలత గలది. కాళింది ఆత్మార్పణం తర్వాత కమల బసవరాజునే పెండ్లాడింది. న్యాయాధికారికి తానే స్వయంగా తన ఆవేదనను విన్నవించుకొంది. "అక్కయా! నిక్కము తెల్పుచుంటి నిటు నీకసి తీర్పమదిం దలంచితిన్" అని అక్కకు జరిగిన అన్యాయానికి ప్రతీకారము తీర్చుకుంది. భర్త బసవరాజును తనవైపుకు మార్చుకొని సంఘసంస్కరణలో భాగస్థుడిని గావించడమే గాక, పరమలోభియైన తన మామగారు లింగరాజును కూడ మార్చి తానును సంఘసంస్కరణ ఉద్యమంలో భాగస్వామి అవుతానని చెప్పడం కమల సాధించిన విజయం. స్త్రీ సమస్యల్ని ఈ నాటకంలో ప్రతిఫలింపజేస్తూ పరిష్కారాలు చూపడంలో నాటకం సఫలీకృతమైంది.

**ఆధార గ్రంథం :**

1. నారాయణరావు కాళ్ళకూరి (1988), వరవిక్రయము, రవీంద్ర పబ్లిషింగ్ హౌస్, గుంటూరు, హైదరాబాద్.

# తెలంగాణ జన జీవన పోరాట చిత్రణలో మా భూమి నాటకం

**కంచర్ల మహేష్**
పరిశోధక విద్యార్థి
కాకతీయ విశ్వవిద్యాలయం
సెల్: 6300489220

**నాటక పరిచయం**

ఇతిహాసాలు పురాణాల తొలిఅడుగుగా ప్రారంభమైన తెలుగు సాహిత్యం ఎన్నో సాహిత్యాంశాలతో సమాజంపై చెరగని ముద్ర వేసింది. సాహిత్య విలువలను అందిస్తూ సమాజ హితానికి తోడ్పడుతూ వస్తుంది. 1000 యేండ్ల ఘనమైన చరిత్ర గల తెలుగు ఈ పాశ్చాత్య సాహిత్య ప్రభావాలను తనలో ఇముడ్చుకొని ఎన్నో సాహిత్య ప్రక్రియలకు పురుడుపోసింది. కవిత్వం,నవల,కథ ,నాటకం ,విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియలన్నీ పాశ్చాత్య ప్రభావం వల్ల వచ్చినవే.

అటు ప్రాచీన సాహిత్యం ఇటు ఆధునిక సాహిత్యాన్ని ఈ ప్రక్రియలు ఎంతో ఉన్నతికి తోడ్పడుతూ వస్తున్నాయి. అలాంటి ప్రక్రియల్లో ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రక్రియే నాటకం. 19 వశతాబ్దపు ఆధునిక సాహిత్య నూతన ఒరవడిని సృష్టించినది. నాటకం ఒక సమాహార కళ. నాటకం పుట్టు పూర్వోత్తరాల గురించి సంస్కృతంలో "కావ్యేషు నాటక రమ్యం–నాటకాంతం హి సాహిత్యం" అనే మాటలు నాటక ప్రక్రియ వైశిష్ట్యం, ఆదరణ మనకు బోధకమౌతుంది. నాటకం నట అనే సంస్కృత ధాతువు నుండి ఆవిర్భవించింది. నట అర్థం అభినయం. ఈ ధాతువు నుండి నటి, నటనం, నటుడు అనే అర్థాలు పుట్టాయి.

నాటకం వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడ అందిస్తుంది. సామాజిక పోరాటాల సమస్యలపై ప్రజలను చైతన్యపరుస్తుంది. తెలంగాణ పోరాటంపై కూడా నాటక సాహిత్య ప్రభావం ఎంతో ఉంది. మధ్యయుగం నాటి నిజాం పరిపాలనా విధానంపై వ్యతిరేక ఉద్యమాలు వచ్చిన సమాజంలో నాటక ప్రక్రియ పాత్ర అనన్య సామాన్యమైంది. తెలుగులో మొదటి నాటకంగా కోరాడ రామచంద్ర శాస్రి రాసిన 'మంజరి మధుకరీయం' 1960 లో రాశారు. తర్వాత సంస్కృత, ఆంగ్ల నాటకాల అనువాదాలు

వచ్చాయి. నాటకాలను నాలుగు రకాలుగా విభజించారు. అందులో ఉత్తమమైనవి సాంఘిక నాటకాలు. ఇవి ఆ సమాజంలో ఉన్న ప్రతి అంశాన్ని వివిధ కోణాల్లో అద్దం పట్టినట్లు విశ్లేషిస్తాయి.. ఇవి ప్రజలను ఎంతగానో చైతన్యంవైపు నడిపించాయి. వరకట్నం, మధ్యపానం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నేపథ్యం, వెట్టి చాకిరీ. అస్పృశ్యత, దొరల దౌర్జన్యాలు , అణగారిన ప్రజల జీవన చిత్రణ, రైతుల పోరాటాలు వంటి ఎన్నో వస్తువులను స్వీకరించి నాటకాలను రచించారు.

**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నేపథ్యం**

భారత దేశ చరిత్రలోనే ఒక అద్వితీయ ఘట్టంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని చెప్పవచ్చు. దశాబ్దాల మరియు శతాబ్దాల పాటు కొనసాగిన శ్రమ దోపిడీ,అణచివేత మరియు అరాచకాలకు వ్యతిరేకంగా కొనసాగిన సాయుధ పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడినది. "భూమి కోసం–భుక్తి కోసం–విముక్తి కోసం" "దున్నేవాడిదే భూమి" అన్న నినాదం మారుమ్రోగిన ఉద్యమం ప్రజల్లో ఎంతో చైతన్యాన్ని పురికొల్పింది. దిక్కులు పెక్కటిల్లేలా నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సాగించిన ఉద్యమం. ఈ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గ్రామాలలో సంఘాలు,నిజాం అరాచకాలకు ప్రజలకు స్పృహ కల్పించే ఆంధ్ర మహాసభలు,

గ్రంథాలయోద్యమాలు, కవులు మొదలైన వారు చైతన్యవంతమైన వాతావరణాన్ని సృష్టించి సాగించారు. ఇందులో ప్రధాన భూమికగా నిజాం నిరకుశత్వం, భూమి సమస్య, రజాకార్ల అరాచకాలు,వెట్టి చాకిరీ, లేవిగల్ల పన్నులు మొదలైనవి. హైద్రాబాద్ రాజ్యంలోని ప్రజలు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు దూరమై బానిస బ్రతుకును అనుభవిస్తుండేవారు. పత్రిక స్వేచ్ఛ హరించబడింది. సభలు సమావేశాలపై ఆంక్షలు ఉండేవి. ఈ నిరంకుశత్వాన్ని అంతం చేయడమే సాయుధ పోరాట లక్ష్యం. భుసామ్య దోపిడీ వ్యవస్థలో దొరలు, దేశముఖ్, జాగిర్దార్లు ప్రజలపై ఆధిపత్యాన్ని చలాయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడ్డారు. ఈ సాయుధ రైతాంగ పోరాటంలో రైతుల సమస్యలను అర్థం చేసుకొని మహా మేధావులు, కమ్యునిస్టులు కలిసి సంఘాలుగా ఆంధ్ర మహాసభలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజల్లో చైతన్యం వచ్చి నిజాంకి వ్యతిరేకంగా గ్రామగ్రామాన ఉద్యమం చేపట్టారు. ఎంతో మంది ప్రాణాలను అర్పిస్తూ స్వేచ్ఛ సమానత్వం, బానిస విముక్తికై పోరాడారు. అందులో చెప్పుకోదగిన సంఘటనలు కామారెడ్డి గూడెం సంఘటన, పాలకుర్తి సంఘటన, కడివెండి సంఘటన, మొండ్రాయి సంఘటనలు చరిత్ర పుటల్లో సాయుధ పోరాటానికి నిలువెత్తు నిదర్శనాలు.

**రచయితల పరిచయం:**

ఆధునిక సాంఘిక నాటక రంగంలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించిన మా భూమి నాటకాన్ని వాసిరెడ్డి - సుంకర అనే జంట రచయితలు రచించారు. వాసిరెడ్డి భాస్కరరావు తెలంగాణలోని వీరులపాడు గ్రామం. సుంకర సత్యనారాయణ కృష్ణ జిల్లా ఈడుపుగల్లు గ్రామంలో జన్మించారు. వీరిద్దరిది రైతు కుటుంబ నేపథ్యం. రైతు పడే కష్టాలు కడగండ్లు తమ చుట్టూ జరుగుతున్న పరిస్థితులను చూసి చలించే గుణం కలవారు. ఇద్దరు సమాజ పీడిత అంశాలపై చైతన్యవంతమైన నాటకాలు రాయడానికి పూనుకున్నారు. అందులో వీరు రాసినవి ముందడుగు,అపనిందలు మరియు మా భూమి నాటకం వంటి సాంఘిక నాటకాలు. అభ్యుదయ భావాలతో చిత్రించిన మా భూమి నాటకం 12 సార్లు ప్రదర్శితమైన తర్వాత మద్రాస్ ప్రభుత్వం నిషేదానికి గురి చేసింది.

**మా భూమి నాటకంలో పాత్రల ప్రాముఖ్యత**

నాటకం అనగానే గుర్తుకొచ్చేది పాత్రలు మరియు అందులోని ఇతివృత్తాలే. పాత్రలు ఎంతో అభినయంతో ప్రజల గుండెలను రంజింపజేసి, చైతన్యాన్ని కల్పిస్తుంటాయి. సమాజంలో వుండే పీడిత సమస్యలపై అవగాహన కల్పిస్తూ ప్రజా జీవన విధానాలను మెరుగుపరుస్తాయి. మా భూమి నాటకంలో ఒక్కో పాత్ర ఆనాటి కాల పరిస్థితులకు అనుగుణంగా వాస్తవ జీవితానికి దెగ్గరగా చిత్రించినవే. సుంకర సత్యనారాయణ అప్పటి భూసామ్య వ్యవస్థలో జరిగే అరాచకాలను ,నిజాం పాలనలో రజాకార్ల ఆగడాలు కళ్ళకు కట్టినట్లుగా మాభూమి నాటకంలో చూపించాడు. నిరక్షరాస్యులకు సైతం అర్థం అయ్యే రీతిలో నాటకాన్ని చిత్రించి ప్రదర్శించేవారు. నాటకంలో పాత్రలచేత మధ్య మధ్యలో పాడించిన పాటలు ఆ పాత్రల స్వభావానికి పరిపుష్టిని ఇచ్చాయి. ఆ పాత్రలు

1. వీరారెడ్డి - అభ్యుదయవాది, కథానాయకుడు,ప్రతిఘటించే స్వభావం కలవాడు
2. యల్లమంద - ఆలోచించే అలవాటులేని ఆవేశపరుడు,గొర్రెల కాపరి
3. జగన్నాథరెడ్డి దేశ్ముఖ్ - గర్వాంధుడు, 20,000 ఎకరాల అక్రమ ఆస్తులను కూడగట్టిన క్రూరుడు.
4. పట్వారీ వెంకట్రావు - తను చేసేది తప్పని తెలిసి చేసే మూర్ఖుడు
5. రౌడీ మస్తాన్ - దేశముఖ్‌కు ఎడమ భుజం
6. సీతమ్మ - వీరారెడ్డి భార్య
7. కమల - వీరారెడ్డి చెల్లెలు
8. అమీన్ - ఇన్‌స్పెక్టర్
9. దాదాసాహెబ్ -షేక్ బందగి గురించి వివరించే వ్యక్తి
10. సుభాన్ -మస్తాన్ తమ్ముడు అభ్యుదయ భావాలు కలవాడు

11. మంగలి రాముడు -దొర సేవకుడు

12. రామిరెడ్డి -రైతు

**మా భూమి నాటకం రాయడానికి కారణాలు**

నైజాం కాలం నాటి అరాచకాలను ,దౌర్జన్యాలను కళ్ళ ముందు జరుగుతున్న తతంగాన్ని రక్తి కట్టించాడానికి ,ప్రజలను చైతన్యపరచాడానికి నడుంకట్టారు. దొరలు,భూస్వాములు, రజాకారుల ఆగడాలకు ఎదురొడ్డి నిలిచిన సంఘం వాళ్ళు, ఆంధ్ర మహాసభలు, కమ్యునిస్టులు ఇలా ఎంతో మంది ప్రేరణగా రాయబడినది. భూస్వాముల స్వలాభం కోసం చేసిన అరాచకాల వల్ల గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పులను చిత్రించారు.

**మా భూమి నాటకం ఇతివృత్తం:**

మా భూమి నాటకం మొత్తం ఆరు రంగాలుగా సాగుతుంది. మొదటి రంగం 'బందగీ సమాధి' వద్ద నుంచి నాటకం ప్రారంభం ఆవుతుంది. వీరారెడ్డి, దాదాసాహెబ్, సుభాన్, రామిరెడ్డి, కమల మరియు సీతమ్మ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రజలు "విప్లవ జ్యోతిని వెలిగించితివి తెలంగాణను నీవే -భాయీ బందగీ" అనే పాటను పాడుతూ 12 సంవత్సరాలు దేశ్‌ముఖ్ మీద పోరాటం చేసిన బందగీ ధైర్యాన్ని మరియు త్యాగాన్ని గుర్తుచేస్తూ తన పోరాట స్ఫూర్తిని స్మరిస్తారు. దొర ఆగడాలను అరికట్టేందుకు అందరూ సంఘంలో చేరుదాం అనే ప్రమాణం చేస్తారు.

రెండవ రంగం 'దివాణం' లో జగన్నాథరెడ్డి ,మస్తాన్, రాముడు, వెంకట్రావ్ ,అమీన్ ఉంటారు. ప్రజలను బందగీ ఉర్సు జరగనియ్యకుండా చేసిన ప్రయత్నాలన్నీ మస్తాన్ చెప్పడం. అమీన్ రాక-దొర సారా తాగిపించడం మరియు జగన్నాథరెడ్డి చేసిన అరాచకాలను కప్పిపుచ్చమని వెయ్యి రూపాయలు అమీన్‌కి ఇవ్వడం. యల్లమంద భూమిని సంతకం పెట్టించుకొని లాక్కోవడం. లెవి పన్ను గురించి సర్కార్ కి ప్రజలకు మధ్య కుట్ర పన్నడం. కట్టని వారిని బెదిరింపు చర్యలకు పాల్పడటం వంటి ఇతివృత్తంలో సాగుతుంది.

మూడవ రంగం 'వీరారెడ్డి ఇల్లు' వీరారెడ్డి, కమల, సీతమ్మ ఉంటారు జోలపాట తో మొదలవుతుంది. కమల వివాహ విషయం గూర్చి మాట్లాడుతూ భార్య సీతమ్మను సంఘంలో చేర్చడం. రామిరెడ్డి వచ్చి తన ఎద్దులను దొరగారి మందలో కలుపుకున్నాడు అనే విషయం చెప్పడం. ఎల్లమంద దొరగారి కొట్టిన దెబ్బలను చూపడం. మంగలి రాముడు వచ్చి తన బాధలు చెప్పుకొని సంఘంలో చేరడం సుభాన్, దాదా రాముడుతో జాగ్రత్తగా ఉండాలనే నిర్ణయం. దొరగారి విషయాలు రాముడి ద్వారా తెలుసుకొని వ్యతిరేఖ చర్యలు చేయడం జరుగుతుంది.

'గడి' దొర మరియు వెంకట్రావ్ లేని రోజులల్లో దొర పనులకి ఒక్కరు కూడా వెళ్ళకుండా ఉంటారు. అమీన్‌ని పిలిచి వారిని కొట్టించాలని అమీన్‌ని పిలిపిస్తాడు. దొర గారికి షావుకారు వస్తువులను ఇవ్వకుండా రాముడిని వెనెక్కి పంపడం. దాదాని అమీన్‌లో చేరమనడం. దాదా నిరాకరించడం. వీరారెడ్డిని అరెస్టు చేయడంతో నాలుగవ రంగం ముగుస్తుంది.

ఐదవ రంగంలో కమల దేశంలో జరుగుతున్న సమస్యల చర్చ ఎల్లమందకు చదువు నేర్పించడం దాదా, సుభాన్, రామిరెడ్డి సంఘం గురించి చర్చ, రాముడు రాక వీరారెడ్డి ని అరెస్టు సంగతి ఊళ్ళో అందరికి తెలియడం, దేశముఖ్ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం. కమలను చెరబట్టడానికి దొర మనుషుల ప్రయత్నం. సీతమ్మ, దాదాలు ఈ పోరాటంలో మరణించడం.

అరవ రంగంలో సీతమ్మ,దాదా సమాధులవద్ద అందరు సమావేశామయ్యి వారి స్ఫూర్తి ద్వారా ప్రజల్లో "దున్నేవాడిదే భూమి" అనే నినాదంతో ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుంది. వెంకట్రావ్ దగ్గరవున్న 600 ఎకరాల భూమిని రైతులది రైతులకి ఇవ్వడంతో నాటకం సమాప్తం అవుతుంది .

**నేటి సమాజంలో మా భూమి నాటక విశిష్టత:**

మన పూర్వ తరం అనుభవాలు వారి చైతన్యం వారు చేసిన కృషి ఫలితమే నేటి సమాజం. ఈ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తియే నేటి ప్రత్యేక తెలంగాణ సాధించుకోవడానికి నాందిగా చెప్పవచ్చు. నేడు దొరలు లేకున్నా అలాంటి పనులు చేసే పద్ధతులు మార్పు చెందాయి. అక్రమ రిజిస్ట్రేషన్లు వంటి వాటి ద్వారా అమాయకపు రైతులు వారి భూమిని కోల్పోతున్నారు. 1946 నాటి పరిస్థితులను చక్కగా అందించింది మా భూమి. ఒకవైపు జాతీయోద్యమం, మరోవైపు ఆంధ్రరాష్ట్రోద్యమం, ఇంకోవైపు తెలంగాణ పోరాటాల నేపథ్యంలో మా భూమి నాటకం చిత్రించబడింది.

**ముగింపు:**

నాటకాల ద్వారా సమాజాన్ని చైతన్యం వైపు నడిపించవచ్చు అనే మాటకు నిదర్శనం మా భూమి నాటకం. ఆ కాలంలో జరిగిన సాయుధ పోరాటాన్ని , దొరల దౌర్జన్యాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. సాంఘిక నాటకాలు చెప్పవలసిన ఉద్దేశ్యాన్ని సూటిగా ప్రజలకు అందించవచ్చు. ఇంత వైతాళికత ఉన్న నాటకాన్ని ఆ నాటి సమాజంలో ప్రదర్శనను నిషేధించారు అంటే అశ్చర్యమేమీ లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. చక్రధర స్వామి టి. (2007), తెలంగాణ నాటక వికాసం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు.
2. రమణ పి.వి. (1979), తెలుగు సాంఘిక నాటకాలు, నవయుగ బుక్‌హౌస్, హైదరాబాద్.
3. గంగప్ప ఎస్. (2005), తెలుగు నాటకం - సామాజిక చైతన్యం, శశి ప్రచురణలు, గుంటూరు.
4. సత్యనారాయణ సుంకర, భాస్కర రావు వాసిరెడ్డి (1947), మా భూమి నాటకం.

# గయోపాఖ్యాన నాటక ప్రాశస్త్యము

**డా. బి.సునీత**
అసోసియేట్ ప్రొఫెసర్
కాకతీయ ప్రభుత్వ కళాశాల
హన్మకొండ
సెల్ : 9963077641

తెలుగు సాహిత్యంలో ప్రతి సాహిత్య ప్రక్రియ ఒక ప్రయోజనాన్ని కల్గి ఉండి, ఆ ప్రయోజనం నెరవేరేలా చేస్తుంది. కొన్ని ప్రక్రియలు చదువుకొని ప్రేరణను, ఆనందాన్ని పొందేవి అయితే మరికొన్ని ప్రక్రియలు చూసి ప్రేరణను, అనుభూతిని పొందేవి. నాటకప్రక్రియ దృశ్యరూపమైనది. ప్రేక్షకుల సాహిత్య స్థాయితో సంబంధం లేకుండా ఆనందానుభూతిని పొందగలిగిన ఏకైక సాహితీ ప్రక్రియ నాటకం. ప్రదర్శన యోగ్యమైన నాటకం సర్వజనులను ఆకర్షిస్తుంది. నాటకం జీవితాన్ని, జీవిత సత్యాల గురించి, పాత్రలు తమ మాటలు, చేతల ద్వారా ప్రేక్షకుల మనస్సును హత్తుకునేటట్లు చెప్పగల మాధ్యమం, లోకంలో అవగతమయ్యే సుఖదుఃఖాలను అభినయాత్మకంగా వ్యక్తీకరిస్తుంది నాటకం.

వస్తువును బట్టి పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాలు అని నాటకాలను వర్గీకరించవచ్చు. నాటక రచన ఆరంభించిన తొలి రోజుల్లో పురాణ, ఇతిహాసాలే ప్రధాన కథా వస్తువులు. భారతం,రామాయణం, భాగవతం నుండి కథను తీసుకొని నాటకాలుగా మలిచేవారు ఈ క్రమంలోనే మహాభారతంలోని కథను గ్రహించి "గయోపాఖ్యానం" అనే పేరుతో నాటకంగా రచించి తెరకెక్కించారు చిలకమర్తి లక్ష్మీనరసింహం. వీరు 26-9-1867 పశ్చిమ గోదావరి జిల్లా ఖండవల్లి గ్రామంలో జన్మించారు. వీరు ప్రసిద్ధ నాటక కర్తగా,నవలా రచయితగా, హాస్య రచయితగా, సంఘ సంస్కర్తగా, గొప్ప ఉపన్యాసకులుగా, దేశభక్తులుగా తెలుగు వారందరికి చిరస్మరణీయులు. గయోపాఖ్యానం, పారిజాతాపహరణం, కీచకవధ, ద్రౌపతీపరిణయం, శ్రీరామజననం, ప్రహ్లాదచరిత్ర, గణపతి, సౌందర్యతిలక, కర్పూరమంజరి మొదలైన రచనలు వీరికి అత్యంత కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టాయి. చిలకమర్తి వారి రచనలన్నిటిలో తలమానికం గయోపాఖ్యానం. దీనికి "ప్రచండయాదవం" అనే పేరు కూడా ఉంది. ఈ నాటకం 1889 డిసెంబరులో రాయబడినా పుస్తక రూపంలో 1909 సం॥లో ముద్రించబడింది. పుస్తక ప్రచురణ కాలం నుండి 1942 సం॥ వరకే లక్ష ప్రతులకు పైగా అమ్ముడుపోయి ఒక రికార్డు నెలకొల్పింది. గయోపాఖ్యాన నాటక రచనచేత ఆ కాలములోనే లక్షరూపాయలకు పైగా సంపాదనను పొందారు చిలకమర్తి వారు.

హిందూ నాటక సమాజ ప్రదర్శనల కోసం చిలకమర్తి వారు రాసిన నాటకాలలో అయిదు అంకాలతో రాసిన గయోపాఖ్యానం అత్యంత జనాదరణ పొందింది. ఆ రోజుల్లో ఈ నాటకాన్ని ప్రదర్శించని తెలుగు నాటక సమాజం లేదనేది వాస్తవం. ఈ నాటకంలోని కృష్ణార్జునుల పాత్రలకు పోటీలు పెట్టి బంగారు పతకాలు బహుమతులుగా ఇచ్చేవారు. ఇందులోని సంభాషణలు, పద్యాలు సహజత్వానికి దగ్గరగా ఉండి తెలుగువారి మనోభావాలను ప్రతిబింబిస్తూ ఉండటం వల్లనే గయోపాఖ్యానం జనంతో అంతగా అల్లుకుపోయిందని చెప్పవచ్చును. గయోపాఖ్యాన నాటక ప్రాచుర్యానికి పద్యాలే ప్రధాన పాత్ర వహించాయి. చిలకమర్తి వారి పద్యరచన అతి సరళ సుందర పదాలతో సంభాషణకు తగినసామెతలు, లోకోక్తులతో వాస్తవానికి దగ్గరగా ఉండటం ప్రేక్షకుల చేత అమిత ఆదరాన్ని చూరగొన్నది ఈ నాటకం. గయోపాఖ్యాన నాటక కథా విషయానికి వస్తే శ్రీకృష్ణుడు సూర్యోదయ సమయానికి యమునా నదిలో సూర్యునికి అర్ఘ్యం ఇస్తూ ఉ

ండగా ఆకాశమార్గంలో మణిపురాధీశుడైన గంధర్వరాజు గయుడు ప్రయాణిస్తూ నోట్లోవేసుకున్న తాంబూలాన్ని నమిలి కింద ఎవరు ఉన్నారో కూడా చూడకుండా ఉమ్మివేస్తాడు. అది కృష్ణుని చేతిలో పడుతుంది. కోపంతో కృష్ణుడు ఆ పని చేసిన దోషిని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. తర్వాత అశరీరవాణి ద్వారా గయుడు విషయం తెలిసికొని మరణానికి సిద్ధపడగా భార్య చిత్రరేఖ, మంత్రి పుష్పదంతుడి సలహామేరకు బ్రహ్మ మరియు శివుడి దగ్గరకు వెళ్ళి కృష్ణుడికి వ్యతిరేకంగా గయున్ని రక్షించడం మా వల్ల కాదనిపించుకుంటాడు. నారదుని సూచన మేరకు అర్జునుడి వద్దకు వెళ్ళి అసలు విషయం చెప్పకుండ శరణుకోరతాడు. అర్జునుడు శరణు ఇచ్చాక శ్రీకృష్ణుడికి గయుడు చేసిన అపరాధం తెలుసుకొని ఆలోచనలో పడతాడు. ఆ తర్వాత అభయం ఇచ్చాక శరణాగత రక్షణకు కట్టుబడాలని పాండవులు నిర్ణయించడం, ఇది తెలిసి కృష్ణుడు అక్రూరుడిని, సుభద్రను రాయబారానికి పంపడం, అది విఫలం కావడంతో ఇరుపక్షాల వారు యుద్ధానికి సిద్ధం కావడం జరుగుతుంది. ఇద్దరూ తమ తమ పంతం వీడకుండ యుద్ధం చేస్తున్న సమయంలో శివుడు ప్రత్యక్షమై ఇద్దరినీ వారిస్తాడు. చివరికి కథ సుఖాంతం అవుతుంది.

ఈ నాటకంలో చిలకమర్తి వారు ప్రతీపాత్రకు చక్కని ప్రాధాన్యతను కల్పించారు. నాటకంలో రచయిత ఏమి చెప్పినా, ఎలా చెప్పినా పాత్రల సంభాషణల ద్వారానే చెప్పాలి. సంభాషణా రచనకి నాటకంలో అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పాత్రల నేపథ్యాన్ని వివరించాలన్నా, కథలోని దేశకాల పాత్రలను సూచించాలన్నా సంభాషణే సాధనం. గయోపాఖ్యానంలో, పాత్రల సంభాషణ సందర్భంలోని పద్యాలు ప్రతి ఆంధ్రుడి నోట పలికిన ఆణిముత్యాలు.

ఆ రోజుల్లో గయోపాఖ్యానంలోని పద్యాలు రాని ఒక్క తెలుగువాడు లేడన్నది ఏ మాత్రం అతిశయోక్తి కాదు. గయోపాఖ్యానం మహాభారతంలోని కథ అయినా మహిమాన్విత దైవాంశ పరిస్థితులను పాత్రలను వారి మధ్య ఉన్న అనుబంధాలకు ప్రస్తుత సమాజంలోని మానవుల మధ్య ఉన్నటువంటి అనుబంధాలకు చక్కని ప్రతిరూపంగా మలిచారు చిలకమర్తి వారు.

నాటకంలోని ప్రథమాంకంలో శ్రీకృష్ణుని చెలికాడైన కౌశికుడు, పరిచారిక అయిన హంసపదిక సరసమైన హాస్య సంభాషణ ప్రేక్షకుల దృష్టిని నాటకం వైపు ఆకర్షిస్తుంది. శ్రీకృష్ణుడి అర్ఘ్యప్రధానానికి ఆటంకం కలిగించి అవమానించిన గయుడిని సంహరిస్తానని ప్రతిజ్ఞపూనిన సమయంలోని ఈ పద్యం శ్రీకృష్ణుడిని ఎంత ఆగ్రహానికి గురిచేసిందో తెలుపుతుంది.

పద్యం :

జలనిధులింకుగాక ! కులశైలము లేదును గ్రుంకుగాక ! యా
జ్వలనుడు వేడిమిన్విడిచి చల్లదనంబును దాల్చుగాక ! యీ
జలజ హితుండు పశ్చిమదిశం జనియించెడు గాక యింక ! నా
ఖలు గయు నుత్తమాంగమును ఖండన జేసెద జక్రధారలన్

మరియు ఒకవేళ ఏ కారణం చేత అయినా గయుడిని సంహరింపక పోతే దేవకీ వసుదేవుల కొడుకును కాను, బలరాముడికి తమ్ముడిని కాను, పావనమైనట్టి యాదవ వంశంలో జన్మించలేదనుకుంటాను అని అంటాడు శ్రీకృష్ణుడు.

ద్వితీయాంకంలో గయుడి భార్య చిత్రరేఖలో తన భర్త ప్రాణాలు ఏ విధంగా అయినా దక్కించుకోవాలనే ఆర్తి కనిపిస్తుంది.

"నామనోహరు గాచి నన్ను రక్షింపరే
వేల్పులార ! పుడమివేల్పులార
నా ప్రాణవిభుబ్రోచి నన్ను పాలింపరే
సిద్ధులార ! రణప్రసిద్ధులార !

గయుడు శ్రీకృష్ణుని పరమభక్తుడు, భక్తుడికి ఆపదవస్తే ఆదుకోవాల్సిన దైవమే ఆగ్రహిస్తే ఇక కాపాడే వారు ఎవరుంటారు అంటాడు ఈ పద్యంలో.

"ఖలులనేనియు గావకంకణము దాల్చు
నళిన నాభుండు భక్తుని నన్నుజంప
బ్రతిన గైకొన రక్షించు వాడెవండు
కంచెయే చేను మేసిన కలదెదిక్కు"

తృతీయాంకంలో అన్నదమ్ములైన పాండవుల మధ్య ఉన్న సఖ్యతను చూపించారు రచయిత. అర్జునుడు గయుడికి శరణు ఇచ్చిన తర్వాత విషయం తెలిసి బాధపడుతుంటే గయుడి రక్షణ అవశ్యకర్తవ్యం అని అర్జునుడి వాగ్దానాన్ని బలపరిచారు తర్వాత అక్రూరుడు, సుభద్ర రాయబారులుగా వచ్చినపుడు తగురీతిగా అర్జునున్ని క్షమించి, గయున్ని రక్షించమని శ్రీకృష్ణుడికి రాయబారం పంపుతారు పాండవులు. అక్రూరుడి మాటలతో గయున్ని శ్రీకృష్ణుడికి వదిలిపెట్టకుండ అర్జునుడు యుద్ధానికి సిద్ధమైతే అతన్ని వారించమని సుభద్రను కృష్ణుడు పంపినందున సుభద్ర అర్జునుడిని అనేక విధాలుగా బతిమిలాడుతుంది. ఈ సందర్భంలో అర్జునుడు

మగువ మీదను బతికెంత మక్కువైన
మగని మీదను సతికెంత మమతయున్న
నువిదలకు గాపురంబెంత యొప్పియున్న
పుట్టినింటికి కడుగూర్చు బొలతియెపుడు

అంటాడు. అధిక ఐశ్వర్యముతో తులతూగుతున్న సోదరుల ముందు భర్తను చులకన చేసి మాట్లాడుట స్త్రీ జాతి లక్షణమని కోపంతో అంటాడు అర్జునుడు. భర్త ఎంత పరాక్రమవంతుడైనా, భార్యపై ఎంత అనురాగం చూపించినా, కష్టసుఖాలలో ఎంత అండగా ఉన్నా స్త్రీలు పుట్టినిల్లు అంటేనే తమ పంచప్రాణాలు అర్పిస్తారు అని అతికఠినంగా సుభద్రను నిందిస్తాడు.

చతుర్థాశ్వాసంలో శ్రీకృష్ణబలరాముల సమక్షంలోకి వెళ్తారు అక్రూరుడు సుభద్ర. అక్రూరుడు పాండవులు చెప్పిన సందేశాన్ని వినిపిస్తాడు. తర్వాత సుభద్ర కూడ పాండవులు గయుడిని క్షమించి విడిచిపెట్టుమనిన సందేశాన్ని తెలుపుతుంది. ఆ మాటలు విన్న శ్రీకృష్ణుడు కోపంలో పాండవులకు తాను చేసిన ఉపకారాలు మర్చిపోయి ప్రవర్తించిన తీరుకు శిక్ష అనుభవించవలసిందే అంటాడు. అప్పుడు సుభద్ర అర్జునుడు తెలియక శరణు ఇచ్చాడు. అందులో తప్పేముంది అంటుంది. ఈ సందర్భంలో శ్రీకృష్ణుడు.

"సారె చీరలు నగలును జాలగొనుచు
బుట్టినిండ్లు గుల్లలు చేసి పోయిసతులు
తుదకు మగని పక్షముజేరి యెదురగుదురు
మగనిపై గూర్మి అధికంబు మగువ కెపుడు"

స్త్రీలు పెళ్ళి తర్వాత చీరలు, సారెలు, ధనము, వస్తువులు పుట్టింటి నుండి తీసుకువెళ్ళి, చివరకు భర్త పక్షముననే మాట్లాడతారు. పుట్టిల్లు గుల్ల చేస్తారు కాని కృతజ్ఞత చూపించరు అంటాడు కోపంగా శ్రీకృష్ణుడు. పంచమాంకంలో శ్రీకృష్ణుడు అర్జునుడు యుద్ధానికి సిద్ధపడతారు.

"నీచ ముచ్చమనక రాచపాడి దొఱంగి
బిడియ మించుక లేక బిచ్చమెత్త
జన విరుద్ధబుంగ సైదోడు లేవురు
వెలంది నొక్కర్తునే పెండ్లియాడ"

అంటూ శ్రీకృష్ణుడు పాండవులను హేళనాపూర్వకంగా అవమానిస్తాడు. దానికి అర్జునుడు అవును నిజమే కృష్ణా మీరు చేయగల పనులు మేమెక్కడ చేస్తాము అంటూ

"అల్లుడా రమ్మని యాదరమ్మున బిల్వ
బంపుమామను బట్టి చంపగలమె !
జలకేళి సవరించు జవరాంద్ర కోకల
నెత్తుక పోయి చెట్లెక్క గలమె !
ఇల్లిల్లు దిరిగి ద్రేపల్లెలో ముచ్చిలి
మిసిమి ముద్దలు దెచ్చి మ్రింగగలమె"
గొల్లబొట్టెల గూడి కోల చేకొని యాల
కదుపుల నేర్పుతో గాయగలమె
తల్లిదండ్రులు పరుల కీదలచుకన్య
బలిమిమై దెచ్చి భార్యగా బడయగలమె
దుష్టులను వంక వీరుల ద్రుంపగలమె
అనపరాధుల దండింప నరుగ గలమె

అంటూ కృష్ణున్ని అవమాన పరుస్తాడు అర్జునుడు. ఈ పద్యంలో కృష్ణుడు చేసిన మంచిపనులు కూడ వైరభావం వల్ల అర్జునుడికి ఉచితంగా తోచవు. గయోపాఖ్యానంలోని మొత్తం పద్యాలలో "అల్లుడారమ్మని" అనే ఈ పద్యమే అత్యంత ప్రజాదరణ పొందింది. చిలకమర్తి అంటే గయోపాఖ్యానం, గయోపాఖ్యానం అంటే అల్లుడా రమ్మని పద్యం అన్నంతగా పేరు పొందింది.

యుద్ధరంగంలో కృష్ణార్జునులు భీకర పోరు సల్పుతుంటే శంకరుడు ప్రక్షత్యమై ఇద్దరినీ వారించి యుద్ధం ఆపుతాడు. ఈ యుద్ధ పరిణామానికి ముగ్గురూ కారణమంటాడు శంకరుడు. భూమి మీద ఎవరున్నారు చూడకుండ కృష్ణుడి దోసిట్లో నిష్ఠీవనం వేయడం గయుడి తప్పు, ఆ తప్పు ఎవరు చేశారో గమనించకుండ చంపుతాను అని ప్రతిజ్ఞ చేయడం కృష్ణుడి తప్పు, గయుడు ఎవరికి ఏమి అపకారం చేశాడో తెలుసుకోకుండ శరణు ఇవ్వటం అర్జునుడి తప్పు. అందువల్ల మీ ముగ్గురి మధ్య సయోధ్య కుదర్చటం అందరికీ మంచిది అంటాడు శివుడు. అప్పుడు కృష్ణుడు భవిష్యత్తులో కౌరవులకు పాండవులకు జరగబోయె యుద్ధంలో పాండవులు వారి శక్తి సామర్థ్యాలను ఎలా నిరూపించుకుంటారో పరీక్షించడానికి ఇదంతా నేను కల్పించిన లీలనే అంటాడు మరియు ఈ పరీక్షలో పాండవులు విజయం సాధించారు అంటాడు. ఈ విధంగా గయోపాఖ్యానం కథ సుఖాంతం అవుతుంది.

**ముగింపు :**

"కావ్యేషు నాటకం రమ్యం" అన్న వాక్యాన్ని గయోపాఖ్యానం నాటకం నిజం చేసింది. నాటకం సమాహార కళ, సార్వకాలికం కాబట్టి ఎప్పుడో జరిగిపోయినదయినా అప్పటి సమాజ స్థితిగతులు మారినా ఆ నాటకం అన్నివేళలా నిలిచి ఉంటుంది. నాటకం సమాజపు నైతిక, సామాజిక విలువలను ఆమోదించి ఆ విలువల ఔన్నత్యాన్ని చాటుతుంది. ఇలాంటి విలువలకు నిలయమైన గయోపాఖ్యాన నాటకం 1890 సం॥లో ప్రథమ ప్రదర్శన జరిగిన నాటి నుండి అన్ని తరాల సాహితీ ప్రియులను మరియు సామాన్య ప్రజానీకాన్ని అలరిస్తూ, ఆకర్శిస్తూ రసానందాన్ని కలిగిస్తున్న పౌరాణిక నాటకం. గయోపాఖ్యానంలోని పద్యాలు రచించబడి 125 సంవత్సరాలు గడిచినా ఇంకా నిత్యనూతనంగా విరాజిల్లడానికి కారణం ఈ నాటకంఒక ఉదాత్తమైన వీరరసావిష్కారం వలన, అద్భుతమైన కల్పన వలన, చక్కటి వినసొంపైన పద్యాల వలన తెలుగు నాటక రంగంలో చెరిగిపోని స్థానం సంపాదించుకుంది.

సామాన్య మానవుల రాగద్వేషాలను, పంతాలు పట్టింపులను ప్రతిబింబించడమే గయోపాఖ్యాన విజయ రహస్యం. క్రోథం, అహంకారం పెరిగినపుడు ఎంతటివారైనా తమస్థాయిని మరచి ప్రవర్తిస్తారని కృష్ణార్జునుల పాత్రల ద్వారా వ్యక్తపరిచారు రచయిత. ఇతివృత్తం కాల్పనికమైనా, పౌరాణికమైనా జీవితానికి దగ్గరగా ఉంటే ఆ నాటకం ప్రజాబాహుళ్యాన్ని

ఆకర్షిస్తుందనడానికి గయోపాఖ్యానం సజీవ ఉదాహరణమని చెప్పవచ్చు. శ్రీ చిలకమర్తి వారికి 42 సంవత్సరాల వయస్సులో అంధత్వం ప్రాప్తించినా తెలుగు సాహిత్యానికి నిర్విరామ సేవనందిస్తూ 79 సంవత్సరాల వయస్సులో 17-6-1946 రోజున స్వర్గస్తులయ్యారు.

**ఆధార గ్రంథాలు :**

1. లక్ష్మీనరసింహం చిలకమర్తి (2010), గయోపాఖ్యానం, సాహిత్య అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్.
2. డా॥ ద్వా.నా.శాస్త్రి (1998), తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.
3. ఆచార్య సూర్యా ధనంజయ్ సం. (2021), సాహితీ దుందుభి, తెలుగు అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్.

# పాండవోద్యోగ నాటకం - వస్తువైవిధ్యం

**డా. గుమ్మడి రవీంద్ర**
తెలుగు అధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల
తిరుపతి
సెల్ నెం. 94403 23369

నూరేళ్ళ కాలంలో సుమారు ఎనిమిదివేల నాటక పుష్పాలు వికసించి నాటకమనే ఉద్యాన వనంలో పరిమళాలు వెదజల్లి స్వరూప స్వభావాలలో వైవిధ్యాన్ని వెలువరించిన ఆ పువ్వులన్నీ సుగంధాలు కాకపోయినా సువాసనలు వెదజల్లే పూల పక్కనే కొన్ని వాసనలేని పూలు, ఆకర్షణలేని పూలు, గుడ్డిపూలు, గడ్డి పూలుగా వుండవచ్చు. కారు మబ్బులున్నప్పుడే విద్యుల్లతకు విలువ. అలాగే నాటక సాహిత్యాన్ని విశ్లేషించినవారు వెల్లడించిన అంశాలను బట్టి నాటక సాహిత్య స్వరూపాన్ని తెలుసుకోవచ్చు.

తెలుగునాటక సాహిత్యాన్ని ప్రారంభదశ, (1860-1890) పరిణామదశ, (1920-1945) వికాసదశ, (1958-1970) ఔత్సాహిత నాటకదశ నుంచి ఆధునిక దశగా విభజించారు. అనువాద, అనుసరణ, పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలు, ట్రాజెడీలు, కామెడీలు సమస్యాత్మక స్టేజీ, పోటీ, ప్రయోగాత్మక, రేడియో నాటకాలు స్త్రీపాత్రలు గల నాటకాలు, స్త్రీపాత్రలేని నాటకాలు పాశ్చాత్య నాటక ప్రభావం గల నాటకాలు వున్నాయి. శిష్టా రామకృష్ణశాస్త్రి, కోలాచలం శ్రీనివాసరావు శ్రీనివాసచక్రవర్తి, పురాణం సూరిశాస్త్రి ధర్మవరం కృష్ణమాచార్యులు మొ॥వారు నాటకసాహిత్యానికి చేసిన సేవలు మరువరానివి.

కవనార్థంబుదయించితిన్, సుకవితా కార్యంబెనా వృత్తి; యీ భవ మద్దాన ధరింతు; అని చెప్పుకున్న కారణజన్ములు, కింకవీంద్ర ఘటా పంచాననులు - కవితా కళా ప్రపూర్ణులు శ్రీ చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారు. ఆశుకవితా ప్రదర్శనల చేతను, అష్టావధాన, శతావధానముల చేతను, బహువిధ కావ్య రచన చేతను, రససమంచిత నాటక నిర్మాణము చేతను సమస్తాంధ్ర ప్రజాహృదయములను ఉర్రూతలూగించిన విద్వత్కవులు తిరుపతి వేంకట కవుల పద్యకావ్యములన్నియు ఒక ఎత్తు వారి నాటకములు మరొక ఎత్తు. వీరి నాటకములు పద్య కవితకు పూల పందిరులై వెలసినవి. దీనికి వారి సహజ ధారా శోభితమైన సరళ సుందర పద్యరత్నములే కారణం. “అదిగో ద్వారక” “చెల్లియొ చెల్లకో” - “జెండాపై కపిరాజు” మొదలైన పద్యాలు ఎందరినో నటులను చేసినవి. మరెందరినో గాయకులుగా సృష్టించినవి. ఈ పద్యాలు పల్లెటూళ్ళలో గొడ్లు కాచుకునే కుఱ్ఱవాళ్ళు సైతము రాగయుక్తంగా పరవశులై పాడేవారు! ఇదే తిరుపతి వేంకట కవుల పద్యరచన. అంత హృద్యమైనది.

తిరుపతి వేంకటకవులు దాదాపు ఇరవై రూపకాలు రచించినా స్వతంత్ర నాటకాలలో జగత్ప్రసిద్ధి గాంచిన నాటకము పాండవోద్యోగం. తెలుగువారి నాలుకలపై నాట్య మొనరించిన నాటకమిది.

పాండవోద్యోగము భారత కథాత్మకమైన నాటకము. కురుక్షేత్ర సంగ్రామమునకు ముందు దుర్యోధనుడు - అర్జునుడు ఇరువురును శ్రీకృష్ణుని తమ తమ పక్షాలకు సాయము చేయమని వేడుటకై శ్రీకృష్ణుని దగ్గరకు రావడంతో ప్రారంభమై యుద్ధారంభమైన తర్వాత శత్రుపక్షములో వున్న గురువులను, బంధువులను, మిత్రాదులను చూచి అర్జునుడు విషాదము చెందగా శ్రీకృష్ణుడు తత్త్వోపదేశ పూర్వకంగా కర్తవ్యాన్ని బోధించుట, ధర్మరాజు భీష్మ - ద్రోణాదులను దర్శించి వారి ఆశీర్వాదాన్ని పొందుట ధర్మజుని ప్రకటన విని కౌరవ సోదరులలో యుయుత్సుడు పాండవపక్షానికి వచ్చుట,

భీష్ముని మరణం వరకు కుంతీ తనయులకు తోడుగా వుండి తల్లి ఋణాన్ని తీర్చుకోమని కర్ణునకు చివరిసారిగా శ్రీకృష్ణుడు ఉపదేశ మొనరించుటతో నాటకము ముగుస్తుంది.

తిరుపతి వేంకటకవులు ఆరు అంకముల నాటకంగా దీనిని తీర్చిదిద్దిరి. వీరు పాండవోద్యోగ విజయాలలో పాండవులను ఆధునిక స్వాతంత్ర్య సమరవీరుల వలె తీర్చిదిద్దిరి. పౌరాణికములందలి శైలి ఉదాత్తము. భాష గ్రాంథికము గద్యపద్యాత్మకాలైన ఈ పౌరాణికాలలో తిరుపతి వేంకటకవులు పద్యాలకే ప్రాధాన్యతనిచ్చారు. వీరి భారత నాటకములు తెలుగు జాతిని చైతన్యచకితులను చేశాయి.

మహా భారత కథకు నాయకుడు ధర్మరాజు. ధర్మము మూర్తీభవించిన మహోదాత్తమూర్తి ధర్మజుడు. సత్యవచనుడు క్షమా గుణ సంపన్నుడు ధర్మజుని భ్రాతృవాత్సల్యము సర్వజనులకు ఆదర్శమైంది. వీరు ప్రదర్శించిన రాజనీతి మహోన్నతమైంది. సకలలోక సౌఖ్య సంధాయకమైనది. బంధుజన ప్రీతి ధర్మ పక్షపాతము - శరణాగత రక్షణము - శ్రీకృష్ణభక్తి - ధర్మజుని మహోదాత్త వ్యక్తిని చేసినవి.

ఎన్ని సుగుణములున్నను సర్వ అనర్థప్రదమైన జూదానికి బానిసయై తనకు, తమ్ములకు, ధర్మపత్నికి తీరని కష్ట నష్టములు కొని తెచ్చుకున్నాడు. చంద్రునిలోని కళంకమువలె ఈ రాజ చంద్రునిలో ద్యూత వ్యసనము ఒక తీరని మచ్చ అయినది. అరణ్య అజ్ఞాత, వాస సమయాలలో అనేక కష్టములనుభవించినను, అవమానముల పాలైనను చిత్త స్థైర్యమును కోల్పోక కౌరవులతో సంధి చేసుకొనుటకే సర్వవిధాల ప్రయత్నించాడు. యుద్ధము జరిగినచో వచ్చు అనర్థాలను ముందే ఊహించినాడు. జయాపజయములు పరాధీనములైనను, దైవ స్వరూపుడైన శ్రీకృష్ణుడు తన పక్షమునే ఉన్నాడని తెలిసినను ప్రజలందరు సుఖముగా వుంటే చాలునని భావించాడు - "నే చాలక కాదు చూవె - తినజాలను నెత్తురుకూడు మాధవా" - అని విన్నవించుకున్నాడు.

ఇది ధర్మజుని యుద్ధ విముఖత్వాన్ని సూచించును.

రాయబారానికి ముందు శ్రీకృష్ణునితో ధర్మజుడు పలికిన పలుకులు వారి శాంతి ప్రియత్వాన్ని నిరూపించును. "భీష్మ పితామహుడు, ఆచార్య ద్రోణుడు, కృపాచార్యాది ప్రముఖులు వినుచుండగా నిండు సభలో నూరుగురు కుమారులతో కూడియున్న మా పెద తండ్రికి నీవు గూడ ఒక్కసారి సంధివచనములు వినిపించుమని కోరాడు. వారు సంధిమాటలు విన్నను వినకుండినను అందరకు మన ప్రయత్నము తేటతెల్లమగును. వారినే నిందింతురు. మాకు సత్కీర్తి దక్కును. నిన్ను ప్రజలందరు ప్రశంసింతురు. ఎల్లరును మన క్షేమమునే కోరుదురు. కావున సంధి యొనర్చి మా భారత వంశాన్ని కాపాడుము లేదా గర్వాంధులైన ధృతరాష్ట్ర సుతులతో కూడా వంశ నాశనమొనర్చుము. అని కార్యభారాన్ని శ్రీకృష్ణునిపై పెట్టెను. అర్ధరాజ్యమునకు బదులు ఐదూళ్ళిచ్చిన చాలునని అంగీకరించెను. కౌరవులు సంధికి ఇష్టపడినచో అన్నదమ్ములము మేము నూట ఐదుగురము అలా ఇష్టపడక పోయినచో వారు నూరుగురు - మేము ఐదుగురమె!" అని తన అభిప్రాయాన్ని స్పష్ట మొనర్చెను.

ధర్మరాజు దూరదృష్టి కలవాడు. పాపాత్ములైన దుర్యోధనాదుల దగ్గరకు కృష్ణుని ఒంటరిగా పంపుట అపాయకరమని భావించెను. త్రిలోకాధిపత్యమైనను నీ సేమముతో మాకు సమానము కాదని తెలిపెను. సంస్కారహీనులైన కౌరవులు నిన్ను రూపుమాపుటకు ప్రయత్నింపవచ్చును. కావున సాత్యకిని వెంటబెట్టుకుని వెళ్ళుట మంచిది. అక్కడ కృతవర్మ వున్నాడు వారు కౌరవులకు అమాత్యుడైనను యాదవుడు కాబట్టి నీకు అనుకూలుడైయుండును. అని సూచించాడు. ధర్మజుడు తలచినట్లే జరిగినది కదా! శత్రువులు కూడా బలసంపన్నులు - జయమెవరిదో చెప్పుట దుర్లభము. కావున సుఖము వైకల్పికము. అందువలన సంధి సేయుటయే మనకు అర్హంబు" అని ధర్మరాజు సిద్ధాంతము, తమ్ముల బల పరాక్రమములను ఎరుగనివాడు కాదు "అడుగుదాటరు పాండవులన్న మాటకున్" - అను విషయము కూడా తెలియని వాడు కాదు. ఐనను సంధి కొరకే తహతహలాడుటకు ధర్మజుని బంధు ప్రీతి శాంతి కాముకత్వములే కారణములు అందువలననే శ్రీకృష్ణుని రాయబారమునకు పంపుచు ధర్మరాజు " మా వంశమును ఆశీర్వదింపు"డని పంచ భూతములను

ప్రార్థించాడు.

సంధికి అంగీకరింపుమని దుర్యోధనునికి హితవు పలికిన పెద్దలు కూడా ధర్మజుని ధర్మశీలమునే ప్రస్తావించారు. ధృతరాష్ట్రుడు "నాయనా! దుర్యోధనా! సర్వలోకనుతుడైన ధర్మరాజునకు కోపము వచ్చినచో సమస్తలోకములు భస్మమగును. అతడు ధర్మానికి కుదురు. ఆడి బొంకడు. ఉదారచరితుడు. వారితో యుద్ధము వద్దు" – అని కుమారునితో చెప్పాడు. శ్రీకృష్ణుడంతటివాడు "రాజ రాజా! అలుగటయే తెలియని అజాత శత్రుడే అలిగిననాడు సముద్రములన్నియు ఏకమై పోవును. కర్ణులు పది వేవురైనను చావక తప్పదు. నా పలుకులను విశ్వసింపుము" అని అజాతశత్రుని విషయమే ప్రస్తావించినాడు. తన కుమారులందరకు ధర్మజుని వాక్యమే శిరోధార్యమని తెలిసిన కుంతీదేవి కూడా "కార్యాలోచనము పట్ల పాంచాలిని గౌరవింపవలసిందని ధర్మరాజులో నొక్కి వక్కాణింపు మని శ్రీకృష్ణునితో చెప్పి పంపినది. కర్ణుడు తాను అగ్రజుడని తెలిసినచో ధర్మమూర్తి యైన యుధిష్ఠిరుడు రాజ్యము అంగీకరింప దనుట నిశ్చయము" అని శ్రీకృష్ణునితో పలికెను. అంతేకాదు

"నిత్య సత్య వ్రతుండన నెగడు ధర్మ
తనయుడే నేల నేలగ దగినవాడు"

అని ధర్మరాజే రాజు కాదగిన వాడని కర్ణుడే స్పష్టముగా చెప్పెను.

ధర్మజుడు శాంతి ప్రియుడన్నచో, పరాక్రమ హీనుడని భావింపనక్కరలేదు. కౌరవ సభావిశేషములు విన్న తర్వాత యుద్ధమునకు సిద్ధమైనాడు. కృష్ణా వసుదేవ నందనా! నా చింత నశించినది. యుద్ధ సంకల్పము కలిగినది. కౌరవుల పట్ల మోహము అడగి పోయినది" – అని సమర సంసిద్ధతను తెలిపినాడు. దూతయై వచ్చిన ఉలూకుడు వచించిన మాటలన్నియు విని తమ్ముల కోపావేశమును మాన్పి తాంబూలాదులు ఒసగి సగౌరవంగా పంపెను. ధర్మరాజు ఉచితజ్ఞత ఇట్టిది.

భీష్మ ద్రోణుల అనురాగమే తనకు పెట్టని కోటలని ఎరిగిన ప్రాజ్ఞుడు ధర్మరాజు. కౌరవ పాండవ సమరమునకు ముందు ధర్మరాజు వ్యవహరించిన తీరు వారి రాజనీతి చాతుర్యమునకు నిదర్శనము. నిరాయుధుడై, కవచము కూడా లేకుండా రెండు చేతులు మోడ్చి కౌరవసేన వైపు వెళ్ళుచున్న ధర్మజుని చూచి కౌరవవీరులే కాదు భీమాదులు కూడా ఆశ్చర్యపోయారు. అడ్డముగా వచ్చిన సోదరులను తప్పుకుని భీష్మద్రోణుల సన్నిధికి వెళ్ళి సాష్టాంగ నమస్కారము చేసి, సమరములో జయము చేకూరునట్లు ఆశీర్వదింపుడని అర్థించినాడు. భీష్ముడు మనుమని చూచి ఉప్పొంగి పోయి ప్రేమతో కౌగిలించుకుని – నీ నడవడిని నేనే కాదు దేవతలు కూడా మెచ్చుకుందురు నచ్చిన మేటి మనుమడవు నాయనా!" నీవు వచ్చి మేలు చేసితివి లేకున్నచో శపించెడివాడనే! అని "జయమగు గాక" యని దీవించి పంపినాడు. అట్లే ద్రోణుడు "ఏను వినరాని మాటను వింటినేని, అస్త్ర సన్యాసంబు గావింతును" – అని పాండవ విజయానికి మార్గాన్ని సూచించి పంపినాడు. అంతేకాదు ద్రోణాచార్యుడు – ఇతడు కడు ఉపాయశీలి, రాజనీతి ధురంధరత్వమున కృష్ణుని తర్వాత ఇతనినే చెప్పవలయును" – అని ధర్మజుని రాజనీతిని ప్రశంసించినాడు.

కౌరవసోదరులలో ఒకడైన యుయుత్సుడు తమ పక్షమును వీడి, పాండవ పక్షమునకు వచ్చుట నిస్సందేహముగా ధర్మరాజు ధార్మిక విజయమే ధర్మజుని పిలుపు విని "అన్నా! ఇదిగో నీ పక్షమునకు వచ్చుచున్నాను. నీ వంటి మహానుభావుని కొరకై యుద్ధములో ప్రాణములు అర్పించినచో ఎల్లరును మెచ్చుకుందురు. ఇంతకంటే పురుషార్థమేమి కావలెను! అని యుయుత్సుడు తన జన్మ సార్థకమైనదిగా భావించెను. ఇది అధర్మముపై ధర్మ విజయము! ఇది ధర్మజుని విజయము. ఇలా తిరుపతి వేంకటకవులు పాండవోద్యోగము నాటకములో వస్తువైవిధ్యానికి పెద్దపీట వేశారనడంలో ఏమాత్రము అతిశయోక్తి లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. తిరుపతి వేంకటకవులు (1994), పాండవోద్యోగం, భువనవిజయం పబ్లికేషన్స్, విజయవాడ.
2. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణలు, హైదరాబాద్.
3. డా॥ ద్వా.నా. శాస్త్రి (1998), తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.

# ఎన్.జి.ఓ నాటకం - మధ్యతరగతి జీవిత చిత్రణ

**డా. ఎం.టి.జ్యోత్స్న**
తెలుగు అధ్యాపకులు
ఎస్.వి.జి.ఎం.ప్రభుత్వ డిగ్రీ కళాశాల
కళ్యాణదుర్గం
సెల్ : 9182535598

ఆచార్య ఆత్రేయ పేరు వినగానే మనసును మురిపించే ,మరిపించే సినిమా పాటలు గుర్తుకొస్తాయి. తెలుగు సినిమాలో సాహిత్య ప్రమాణాలను నిరూపించే విధంగా వారి పాటలు ఉండటమే కాకుండా మనసును ఆనంద జలధిలో ఓలలాడించే విధంగా కూడా వుంటాయి ఆయన పాటలు విన్న ఎన్ని హృదయాలు బరువెక్కి ఉంటాయో,ఎన్ని హృదయాలు తమ బరువును దించుకొని ఉంటాయో లెక్కలేదు.మన - సుకవిగా, మనసు కవిగా, మనసున్న కవిగా ఆత్రేయ గారి పేరు అజరామరం.

ఆత్రేయ కలం తెలుగు వారికి లభించిన అమృత కలశం. ఆ కలం నుండి ఎన్నో సినిమా పాటలు,ఎన్నో కథలు,నాటికలు,నాటకాలు,సంభాషణలు జాలువారాయి.ఆయన కలం నుండి వెలువడిన పదం పాటయ్యేది.పాట మాటయ్యేది.

ఆత్రేయ సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టేందుకు మునుపే చక్కని నాటకాలను ఎన్నింటినో రచించి మంచి నాటక రచయితగా పేరు తెచ్చుకున్నారు. 1943లో ప్రారంభమైన ఆయన నాటక ప్రస్థానంలో గౌతమ బుద్ధ, అశోక సామ్రాట్, పరివర్తన, వాస్తవం ఎన్ .జి.ఓ ., విశ్వ శాంతి,కప్పలు, భయం వంటి నాటకాలు వున్నాయి. ఆ నాటకాల్లో ట్రెండ్ సెట్టర్ లాంటి నాటకం ఎన్ .జి.ఓ.

1948 లో వచ్చిన ఈ నాటకం 'అద్దెకొంప' పేరుతో 10-12-1948న చెన్నపురి మ్యూజియం హాలులో యల్.ఐ.యం. కాలేజి విద్యార్థుల చేత (పదర్శింపబడింది. తరువాత యన్. జి. ఒ. పేరిట వెంకటగిరి అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వారిచే ఏలూరులో జరిగిన 15 వ ఆంధ్ర నాటక కళా పరిషత్ సమావేశాలలో పోటీ నాటకంగా ప్రదర్శించబడి ఉత్తమ ప్రదర్శనకు,ఉత్తమ రచనకు ప్రథమ బహుమతులను పొందింది.ఆత్రేయ గారు ఆ రోజు గోపి పాత్రలో ఒదిగి పోయి ప్రేక్షకుల మెప్పును చూరగొన్నారు. కేవలం రెండు రంగాలుగానే ఈ నాటకం రచించబడింది.నాటకం ముందు మాటలో ఆత్రేయ ఈ నాటకంలో ఎటువంటి సందర్భంలోనూ పాటలు చేర్చి నాటకాన్ని ప్రదర్శించ వద్దని కోరడం గమనార్హం.

నాటకం ప్రారంభంలోనే ఇంటిగా మార్చబడి అద్దెకివ్వబడిన ఒక మోటర్ షెడ్ వర్ణన మధ్యతరగతి జీవనాన్ని తెలుపకనే తెలుపుతుంది. ఉన్న ఒక్క పెద్దగదిలోనే కుటుంబమంతా కాపురముంటుంది. రంగనాథం, అతని తండ్రి, తమ్ముడు గోపి, భార్య సీత, వారి పిల్లలు ఆ ఇంట్లో నివసిస్తూ వుంటారు. రంగనాథం ఒక గుమాస్తాగా పని చేస్తూ ఉంటాడు. తనకొచ్చిన అరా కొరా జీతంతోనే ఇంటిని నడుపుతూ జీవనాన్ని సాగిస్తుంటాడు. పక్షవాతంతో మంచం పట్టిన తండ్రి, పోషణ లేక చిన్న వయసులోనే కాళ్ళు, చేతులు చచ్చుబడిన భార్య, తగ్గని దగ్గుతో బాధపడే పెద్ద అబ్బాయి, వాయువు పట్టి పీడిస్తున్న చిన్న అబ్బాయి ఇలా ఇంట్లో వున్న ప్రతి వాళ్ళు అనారోగ్యంతో బాధ పడుతుంటారు. పై చదువులు చదువుతున్న తమ్ముడు గోపి, తల దాచుకోవడానికి మేన మామ గారింటికి వెళ్ళిన చెల్లెలు అదనపు భారాలు.

నాటకం ప్రారంభంలోనే ఒక మంచి ఇంటికి అద్దెకు మారాలన్న ఆ ఇంటి ఇల్లాలి కోరిక, ఒక మధ్య తరగతి

ఇల్లాలి కనీస అవసరాన్ని తెలియజేస్తుంది. ఇల్లు మారితేనైనా ఇంటి పరిస్థితులు చక్కబడతాయేమోనన్న ఆశ కనిపిస్తుంది. పట్నంలో మధ్య తరగతి వారి నివాసం ఎంత కష్టతరమో తెలియజేస్తుంది. పేద వారిలాగా గుడిసెల్లో జీవించలేక ,డబ్బున్న వారిలా బంగళాలలో ఉండడానికి తగిన డబ్బు లేక చాలీచాలని అద్దె గదుల్లో తలదాచుకుంటూ,తమ లేమితనం ఇతరుల కంట పడకూడదని,తమ జబ్బుల్ని,బాధల్ని తమ లోనే దాచుకొని పైకి సంతోషంగా వున్నట్లు జీవించేవారే మధ్యతరగతి వారు.

రంగనాథం తండ్రి మార్గంలోనే పయనించి తండ్రిలాగా నాన్ గెజిటెడ్ ఆఫీసర్ (ఎన్.జి.ఓ)గా ఉద్యోగాన్ని సంపాదిస్తాడు. తండ్రిలాగే నీతీ,నిజాయితీలకు ప్రాణం యిస్తాడు. నెలకు తనకు వచ్చే 80 రూపాయలలో 30 రూపాయలు ఇంటి అద్దెకే పోతున్నా, మిగిలిన దానితోనే తన వాళ్ళను సంతోషంగా వుంచాలన్న ఆలోచనతో రేయింబవళ్ళు కష్టపడుతూ ఉంటాడు. పిల్లల ఆరోగ్యం బాగా లేకపోతే ఎలా వుందని వాకబు చేసేంత తీరిక కూడా లేకుండా వుంటాడు రంగనాథం. తండ్రి పదే పదే చెల్లెలికి పెళ్లి ఎప్పుడు చేస్తావన్న ప్రశ్నకు జవాబు చెప్పలేక తండ్రి స్నేహితుడు రామశాస్త్రిని సంబంధం తీసుకొని రమ్మని చెబుతాడు. అయితే రామశాస్త్రి తీసుకు వచ్చిన సంబంధం వారు పెళ్ళికొడుకు చదువు పేరుతో పదివేల రూపాయలు అడిగినప్పుడు ఏమిచేయలేని నిస్సహాయ స్థితిలో నిలిచిపోతాడు. ఉన్నదంతా పెద్ద కూతురికి కట్నం ఇచ్చి పెళ్లి చేసినా, తండ్రిని పల్లెత్తు మాట అనని వ్యక్తిత్వం రంగనాథంది.ఇంటి యజమాని గుప్తా నౌకరు శర్మ ఇంటి అద్దె బకాయీలు చెల్లించలేదని గొడవ పడినప్పుడు, తమ్ముడితో పాలవాడు ఇక పాలు పోయనని బెదిరించినప్పుడు, పిల్లలు అనారోగ్యంతో క్షీణించి బాధ పడుతున్నప్పుడు,తండ్రి అనారోగ్యంతో రోజురోజుకూ కృశించి పోతున్నప్పుడు తప్పని పరిస్థితులలో, లంచం తీసుకోకూడదన్న లక్ష్యంతో పని చేస్తున్న రంగనాథం మొదటి సారి దయాల్ సేథ్ దగ్గర కొన్ని జతల దుస్తులను, ఇతరుల దగ్గర కొంత డబ్బును లంచం తీసుకుంటాడు.

లంచం తీసుకున్న తరువాత అంతర్మధనంతో చావా, బ్రతుకా అని తేల్చుకోలేక భార్యతో, తమ్ముడితో చెప్పి బాధపడతాడు. అతని భార్య, తమ్ముడు కూడా ఆ పాపిష్టి సొమ్ము మనకు వద్దు తిరిగి ఇచ్చి వేయమని చెబుతారు. అసలే బాధతో వున్న రంగనాథం స్నేహితుడైన డాక్టర్ ద్వారా తమ్ముడు పళ్ళపొడి పొట్లాలు అమ్ముతున్నాడని తెలిసి హతాశు డైపోతాడు. తమ్ముడు చదువు మానివేసి బస్టాండ్ దగ్గర పండ్లపొడి అమ్ముకోవడం తన చేతగాని తనంగా భావిస్తాడు. సగటు మధ్యతరగతి వ్యక్తి వ్యక్తిత్వాన్ని మనం రంగనాథం పాత్రలో తిలకించవచ్చు. చివరకు తమ్ముడిని పోలీసులు మినిస్టర్ మీటింగులో ప్రశ్నలు వేసినందుకు జైలుకు తీసుకు వెళ్తున్నందుకు ,తనను లంచం తీసుకున్న కారణంగా పోలీసులు అరెస్ట్ చేస్తున్నందుకు ఇన్నాళ్ళ తమ కుటుంబ డొల్లతనం బయట పడినందుకు అతను పడ్డ బాధ వర్ణనాతీతం. 'అందరిని అరెస్ట్ చేయండి' అని అరుస్తూ తన పిల్లలను కాపాడమని తన డాక్టర్ స్నేహితుడితో చెబుతూ రంగనాథం జైలుకు వెళ్ళడంతో నాటకం ముగుస్తుంది.

ఎన్.జి.ఓ పేరుతో నాటకాన్ని రచించినా ఆత్రేయ గారి లక్ష్యం మాత్రం నెల జీతంతో ఇంటిని గడుపుకునే ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి జీవితాన్ని చిత్రించడమే అనిపిస్తుంది.

ఇంటి పరిస్థితులను, వృద్ధాప్యంలో వున్న తండ్రిని, ఒక్కడే కుటుంబ భారాన్ని అంతటినీ మోస్తూ వున్న అన్ననూ, కల్లా కపటం తెలియక భర్తే సర్వస్వంగా భావిస్తూ కుటుంబ బాధ్యతలలో తనను తాను కోల్పోయే మధ్యతరగతి గృహిణి అయిన వదినను, స్వార్ధంతో మంచి చెడులు మరచిన సమాజపు వికృత కోణాన్ని, పేదరికం క్షీణింపజేసిన పసితనాన్ని, స్వరాజ్యం సిద్ధించినా స్వతంత్ర ఫలాల్ని దక్కనివ్వకుండా చేస్తున్న రాజకీయ నాయకులను పరిశీలించి చూసి విప్లవ భావాలను వంటబట్టించుకున్న పాత్ర రంగనాథం తమ్ముడు గోపిది. ఆ పాత్రను ఆత్రేయ గారు తీర్చిదిద్దిన వైనం అసామాన్యం. ఇల్లు గడవక గోపి చదువు మానివేసి బస్టాండ్‌లో పళ్ళపొడి అమ్ముతాడు. అది తెలిసి అన్న రంగనాథం ఫాల్స్ ప్రిస్టేజ్‌కు పోయి తమ్ముణ్ణి చావగొడతాడు. అప్పుడు గోపి అంటాడు "కూలివాళ్ళు మనకంటే ఎంతో నయం. ఇంట్లో అందరు పని చేస్తారు. మనం అలా కాదు. ఒక్కడు సంపాదించాలి. తక్కినవాళ్ళందరూ తినాలి. ఆడది ఇల్లు

వదలకూడదు. డబ్బుగల వాళ్ళచేత మనుష్యులమనిపించుకోవాలి.” అని ఆత్రేయ ఆంతర్యాన్ని మధ్య తరగతి వాళ్ళ గురించి ఆయనకున్న అభిప్రాయాన్ని ఈ మాటల వల్ల మనం అర్థం చేసుకోవచ్చు. గోపి పాత్రకు ఆత్రేయ వ్యక్తిత్వానికి సామ్యత వున్నదేమో అందుకే ఆ పాత్రను ఆయన ఇష్టపడి నాటక ప్రదర్శనలో గోపి పాత్రను పోషించేవారు.

ఈ విషయం ఈ క్రింది మాటల వల్ల తేట తెల్లమవుతుంది. నా ధ్యేయం అని ఆయన ఒకచోట ఇలా రాసుకున్నారు. “నేను సత్సంప్రదాయ వంశంలోనే పుట్టి పెరిగాను. కాని కొంతకాలానికి నాలో ఏ మూలనో దాగివున్న విప్లవకారుడు తలెత్తాడు. ధనికుల, రాజకీయ నాయకుల అత్యాచారాలను, అన్యాయాలను దైవానికి, కర్మకు అంటగట్టడానికి నా మనసు అంగీకరించలేదు. ఈ కుళ్ళును కడగలేక పోయినా, బయటపెట్టాలి” అనుకొని నేను నాటకాలు రాశాను. కాని నేనింకా కృతకృత్యున్ని కాలేదు. నా ఆఖరి నాటకం రాయాలి. నేనే స్వయంగా ప్రజలలో-దేశం నాలుగు మూలలా ప్రదర్శించాలి. ప్రజల మధ్యనో, రంగస్థలం మీదనో నా ఆఖరి ఊపిరి వదలాలి లేదా ప్రభుత్వ కారాగారంలోనో మగ్గి మరణించాలి. అప్పుడే నా జన్మ ధన్యం “పై వాక్యాలు ఆత్రేయ గారి అంతరంగాన్ని, నాటక రచయితగా ఆయన బాధ్యతను సూచిస్తున్నాయి. కాబట్టే ఆయన రచించిన ఈ ఎన్.జి.ఓ నాటకం తరువాత ఎన్నో నాటకాలకు, సినిమాలకు స్ఫూర్తిని ఇచ్చింది. సాంఘిక, ఆర్థిక అంతరాలు మధ్యతరగతి మనుగడను ఎంత విషాదభరితం చేస్తాయో అద్భుతంగా చిత్రీకరించిన ‘ఎన్.జి.ఓ’ నాటకం తెలుగు నాటకరంగంలో ఒక మైలురాయిగా పి.వి.రమణ ప్రశంసించారు.

“ప్రజా సమస్యలను స్వాభావికంగా ప్రతిబింబించే వీరి రచనా విధానం సామాన్య ప్రేక్షకుల మొదలు మేధావి వర్గం వరకు అమితంగా ఆకర్షించింది. వాస్తవిక జీవిత చిత్రణ గల ఈ కొత్త తరహా నాటకాన్ని చూసి ఎందరో రచయితలు తమ ఆలోచనా రీతిని, రచనా విధానాన్ని మార్చుకున్నారు. రచయితలకు, ప్రయోక్తలకు, నటులకు మార్గదర్శకులయ్యారు. ఒకసారి ఆరుద్ర ‘ఏమీ స్టఫ్ లేని సీన్ని కూడ డ్రమటైజ్ చేయగల శక్తి వుంది ఆత్రేయకి’ అని అన్నారు. ఈ నాటకాన్ని ‘గుమస్తా’ పేరుతో 1953లో చలన చిత్రంగా నిర్మించారు. తరువాత వచ్చిన ఎన్నో మధ్యతరగతి కథలతో తీసిన సినిమాలకు,నాటకాలకు ఈ నాటకం ఆదర్శంగా నిలిచింది అంటే అతిశయోక్తి కాదు.

**ఆధార గ్రంథాలు :**

1. ప్రొ॥ సిమ్మన్న వెలమల (2011), తెలుగు సాహిత్య చరిత్ర, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం.
2. ఆచార్య ఆత్రేయ (1952), ఎన్.జి.ఓ. నాటకం, బాలప్రభా ప్రెస్, గుణదల.
3. అంతర్జాల వికీపీడియా సమాచారం

# ఒకే నిద్ర ఎన్నో కలలు - నాటక పరిశీలన

**దండి అంజయ్య**
తెలుగు అతిథి అధ్యాపకులు
నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)
నల్లగొండ
సెల్: 9000083081.

**రచయిత పరిచయం:**

బుచ్చిబాబుగా పేరుపడిన ఈయన అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు (1916 - 1967). ఈయన ప్రసిద్ధ నవలాకారుడు, నాటక కర్త, కథకుడు. ఈయన తెలుగు రచనలలో 'బుచ్చిబాబు' అన్న కలం పేరుతోనూ, ఆంగ్ల రచనలలో 'సంతోష్ కుమార్' అన్న కలం పేరుతోనూ రచనలు చేశారు. ఈయన పదవ తరగతి పాలకొల్లులో, ఇంటర్, డిగ్రీలు గుంటూరు క్రైస్తవ కళాశాలలో ఎం.ఏ. తెలుగు నాగపూర్ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. అనంతపురం, విశాఖపట్నంలో ఆంగ్ల ఉపన్యాసకుడిగా పనిచేశారు. 1945 నుంచి 1967 వరకు అనగా తను మరణించేంతవరకు ఆల్ ఇండియా రేడియోలో పని చేశారు. ఈయన ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఏ. పట్టా పొందాడు. బుచ్చిబాబు ఆలోచన స్రవంతి పై 'సోమర్సెట్ మామ్' మరియు 'ఓ హెన్రి' తదితర ఆంగ్ల రచయితల ప్రభావం మెండుగా కనిపిస్తుంది. తెలుగు రచయితలు, కవులందరూ జాతీయవాదులు, మార్క్సిస్టులు లేదా ఏదో ఒక సంఘసంస్కరణ ఉద్యమానికి చెందిన వారైన కాలంలో అతికొద్ది మంది ఆధునిక అభ్యుదయ రచయితల్లో బుచ్చిబాబు ఒకరు.

ఈ నాటకానికి 1962లో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ వారి బహుమతి లభించింది.

**ఉపోద్ఘాతం:**

ఈ నాటకం ప్రధానంగా స్వాతంత్రం తొలినాళ్లలో ప్రజల మధ్య ఉన్న ప్రాంతీయ భావాలను, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత ప్రజల మనస్తత్వం, ప్రవర్తన, జాతిభేదాలు, ఆడపిల్లలపై ఉన్న చిన్నచూపును ప్రతిబింబిస్తుంది. రచయిత వ్యవస్థలో మార్పును తీసుకురావడం, నాటకం ద్వారా సమాజంలో ఈ వ్యత్యాసాన్ని తొలగించాలని రచయిత అభిమతం. ఈ నాటకంలో 15 పాత్రల వరకు ఉన్నప్పటికీ తను సమాజానికి ఇవ్వదలచిన సందేశాన్ని రెండు మూడు పాత్రల ద్వారానే ఇచ్చారు. ప్రాంతాలు వేరైనా, భాషలు వేరైనా, కులమతాలు వేరైనా మనమంతా మానవులం, భారతీయులం. ఐకమత్యమే మహాబలం అని చాటి చెప్పాడు.

**పాత్రల స్వభావం:**

**రామదాసు:**

రామదాసు కుటుంబ పెద్ద. 50 సంవత్సరాల వయస్సు కలవారు. ఒక కంపెనీలో మొదటి యాజమాని. కోప స్వభావి. ఈయన భార్య పేరు లక్ష్మి దేవి, కుమారుడు శ్రీనివాసు, కుమార్తె రాధ. తన కంపెనీలో రెండవ భాగస్వామి లక్ష్మణ స్వామిపై అరవ జాతీయుడని, వారికి తెలివితేటలు ఎక్కువ అని నమ్మేవాడు. అలాగే తన కుమార్తెతో ఆడుకోవడానికి వచ్చిన తన కుమార్తె చిన్ననాటి స్నేహితుడు సుధీర్ బెంగాలీ అని వీళ్ళకి అహంకారం ఎక్కువనే ఆలోచన ఉన్నవాడు. ఈ విధంగా బెంగాలీలపై, గుజరాతీలపై, తమిళులపై, కన్నడ వారిపై సదుద్దేశం ఉండేది కాదు. ఇతని పాత్ర ద్వారానే ఆనాటి సమాజంలో వ్యక్తుల మధ్య, ప్రాంత, జాతి, కుల, మత భేదాలను రచయిత తెలిపాడు.

**లక్ష్మణ స్వామి:**

కంపెనీ రెండవ యజమాని. రామదాసు వ్యాపార భాగస్వామి. తనకి భార్య లేకున్నా కుమార్తెను అపురూపంగా పెంచి, చదివించాడు. తన కుమార్తె తన వ్యాపార భాగస్వామి అయిన రామదాసు కుమారుడు శ్రీనివాసును ప్రేమించి, మూడో నెల గర్భవతి అని తెలిసినప్పటికీ, అబార్షన్ లాంటిది చేయించి ఒక ప్రాణాన్ని బలి తీసుకునే ఉద్దేశం లేదని చెప్పాడు. మనుషుల మధ్య బేధాలను మనమే సృష్టించుకున్నామని, ఇవి శాశ్వతం కాదు. అందరం మనుషులమే అని చెప్పాడు.

శ్రీనివాస్ మంచి తెలివైన యువకుడు అతనికి నా కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదని శ్రీనివాస్‌తో పెళ్లి కోసం తనకు రామదాసుకు ఉన్నటువంటి వ్యాపార వివాదాలను, అహాన్ని పక్కకు పెట్టి తగ్గి రామదాసు దగ్గరికి వచ్చి తన కుమార్తెను మీ ఇంటి కోడలుగా చేసుకోమని బ్రతిమలాడిన మనస్తత్వం చూసినప్పుడు, ఈ పాత్ర ద్వారా కుటుంబ బంధాలకన్నా, మనుషుల మధ్య ప్రేమ కన్నా లోకంలో డబ్బుతో సహా ఏది శాశ్వతం కాదు అని రచయిత చాలా చక్కగా చెప్పాడు.

అలాగే వ్యాపార ప్రారంభంలో, యవ్వనంలో ఉన్నప్పుడు రాజమ్మతో చనువుగా ఉన్నాను. తను గర్భవతి కావడం ఆమెకు కుమార్తె పుట్టడం జరిగాయి. ఇక్కడే ఉంటే కొత్త సమస్యలు వస్తాయని, నా కూతురు మనసులో నేను చెడ్డవాడిగా మిగిలిపోతానని భయంతో రాజమ్మని బెంగళూరుకు పంపి అక్కడ కూతురు పట్టమ్మను చదివించి, ఆలనా పాలన చూశాడు. తన స్నేహితుని కంపెనీలో మంచి ఉద్యోగం ఇప్పించి, కొంత ఆస్తిని పట్టమ్మకి ఇచ్చి తన బాధ్యతను చాటుకున్నాడు.

**శ్రీనివాసు:**

రామదాసు కుమారుడు. తండ్రికి కంపెనీ వ్యాపారాల్లో సహకరించేవాడు. కంపెనీ రెండో భాగస్వామి అయిన లక్ష్మణస్వామి కుమార్తె మీనాక్షిని ప్రేమించి పెళ్లికి ముందే గర్భవతిని చేశాడు. ఇదే విషయంపై డాక్టర్ సుధీర్ కుమార్ ప్రశ్నించినప్పుడు తనని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. యవ్వనంలో తెలుసో తెలియకో తప్పు చేశాను. తనని పెళ్లి చేసుకొని ఆ తప్పును సరిదిద్దుకుంటానని చెప్పాడు. తండ్రి వద్దన్నప్పుడు మీ పంతాలు పట్టింపుల కోసం మా ప్రేమను వదులుకోము అని నిర్భయంగా చెప్పడం ద్వారా రచయిత సమాజంలో మొదటి విజయాన్ని సాధించాడు.

**రాధ:**

రామదాసు కూతురు 17సంవత్సరాల వయస్సు కలది. రాధ ఏడు సంవత్సరాల వయసులో ఆడుకోవడానికి వెళ్లి నీటిలో జారిపడినప్పుడు కాలుకి గాయం తగిలింది. కానీ ఆ గాయం రాధను శాశ్వత వికలాంగురాలిగా మార్చిందని కుటుంబ సభ్యులు భావించి, ఆ గాయానికి కారణం సుధీర్ అనే బెంగాలీ యువకుడు అని అతన్ని ఇంటికి రానివ్వరు. లేదు, నా కాలుకి పెద్దగా ఏమీ నొప్పిలేదు. నేను నడవగలను అని తను పదేపదే చెప్పినప్పటికీ ఎవరు నమ్మక తనని ఇంట్లోనే ఉంచి చదువు, సంగీతం చెప్పించేవారు. కాదని నడవనీయకుండా అవిటిదానిలాగా మార్చారు. చివరకు అదే బెంగాలీ యువకుడైనటువంటి సుధీర్ కుమార్ డాక్టర్ చదువు పూర్తి చేసి వచ్చి రాధ రిపోర్టులను నిర్ధారించి తను ఆరోగ్యంగానే ఉంది. నడవగలదని చెప్పాడు. అప్పుడు రాధ కుటుంబ సభ్యుల కళ్ళు తెరుచుకున్నాయి.

**రామయోగి:**

శ్రీనివాస్ స్నేహితుడు. తన పరిశోధన కోసం రామదాసు కంపెనీలో కార్మికులతో, యజమాన్యంతో కలిసి కొంత కాలం రీసెర్చ్ చేయడానికి వచ్చాడు. రామదాసు ఇంట్లోనే ఉంటూ వారి కుటుంబంలో మనుషుల, మనసుల మధ్య ఉన్నటువంటి దూరాన్ని వాళ్ళకి తెలియజేస్తుండేవాడు. కార్మికులతో కలిసి ముచ్చటిస్తూ వారిలో చైతన్యం కల్పిస్తుండేవాడు. కార్మికులకు పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే వచ్చే సమస్యలను చెబుతూ కార్మికుల యొక్క బాధ్యతను గుర్తు చేస్తుండేవాడు. రామదాసు లక్ష్మణ స్వామి వ్యాపార లావాదేవీల్లో వివాదం తలెత్తినప్పుడు పరిష్కరించే ప్రయత్నం చేశాడు. కార్మికులకు వసతి, విద్యా, వైద్యం అందుబాటులో ఉండాలని యాజమాన్యానికి చెప్పి ఒప్పించినాడు. బెంగాలీ

యువకుడు డాక్టర్ చదువు పూర్తి చేసిన సుధీర్ కుమార్‌ని అతని పరిశోధనని అభినందిస్తూ, వైద్య వృత్తి యొక్క గొప్పతనాన్ని, అతన్ని ప్రశంసించి రాధ, సుధీర్ల వివాహానికి మార్గం సుగమం చేశాడు.

ఈ పాత్ర సమాజాన్ని సరిదిద్దే పాత్రగా రచయిత తీర్చిదిద్దాడు. అలాగే ఒక మోస్తరు హాస్య పాత్రగా కూడా చెప్పవచ్చు. రచయిత సమాజంలో ఆశించిన మార్పును, నాటకంలో ఈ పాత్రతోనే తీసుకువస్తాడు. రామయోగి సమసమాజ స్థాపన కోసం నిరంతరం తాపత్రయపడే మనస్తత్వం కలవాడు. సమాజ నవనిర్మాణం యువత చేతుల్లో ఉందని నమ్మే యువకుడు రామయోగి. యువతకు వయోజన విద్య అందిస్తే, సమాజ అభివృద్ధి త్వరగా జరుగుతుందని కాంక్షించిన వ్యక్తి.

ఈ నాటకంలో రాధ సుధీర్ల కల్మషం లేని స్నేహం, ప్రేమ, వాళ్ళ మనస్తత్వం, ప్రాంతాలకతీతంగా భాషా, కుల, మతాలు లేకుండా వారి స్నేహాన్ని అద్భుతంగా చూపించారు. శ్రీనివాసుతో లక్ష్మణ స్వామి కూతురు ప్రేమ వివాహాన్ని మొదటగా సమర్ధించింది రాధనే. ఆడపిల్ల చదువు ఇంటికే కాదు, సమాజానికి, సమానత్వానికి, సమాజ నిర్మాణానికి మార్గం అని రాధ పాత్ర సూచిస్తుంది. రచయిత చెప్పిన ప్రకారం పైపాత్రలు సమాజ నిర్మాణంలో పట్టుగొమ్మల్లా ఉన్నాయి అనడంలో సందేహం లేదు.

**రచన విశిష్టత :**

నాటకం సుదీర్ఘంగా కొనసాగుతున్న తరుణంలో రామదాసుకి కల రావడం కలలో పశ్చాత్తాప పడడంతో నాటకం ముగించిన తీరు అద్భుతం. రామదాసు లక్ష్మణస్వామి మధ్య గొడవ జరిగినప్పుడు కంపెనీలోని వివిధ స్థాయిలలో పనిచేసే పలు ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు తమ ఉద్యోగాలు పోయాయని తమ ఉద్యోగాలు తమకు వచ్చేంతవరకు తాము నిరాహార దీక్ష, నిరసన చేపడుతామని రామదాసు ఇంట్లో రామదాసు ఎదురుగా కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు రామదాసు వాళ్లని మీరు ఎంత నిరసన వ్యక్తం చేసినా ఇక్కడ మీకు ఉపయోగం లేదని చెప్పి తను కుర్చీలో కూర్చొని నిద్రపోతున్నప్పుడు అతనికి ఇంతలో ఒక కల వచ్చింది.

ఆ కలలో "తను, లక్ష్మణస్వామి, లక్ష్మీదేవి, రామయోగి, కాంబ్లె, మహంతి వీళ్లంతా బయటికి వెళ్లడానికి ఒక గేటు దగ్గర నిలబడ్డప్పుడు ఆ గేటు ఎంతకు తెరచుకోదు. ఎవరక్కడ గేటు దగ్గర తలుపు తీయండి నేను వెళ్ళాలి అని రామదాసు అన్నప్పుడు, ప్రభువు చిత్తం అని నారాయణ అన్నాడు. కానీ గేటు ఎంతకు తెరచుకోదు. లక్ష్మణ స్వామి తాను అర్జెంట్‌గా వెళ్లాలి అని తన డ్రైవర్తో గేటు తీపిస్తే తెరుచుకోదు. తన డ్రైవర్ని పంపించి, ఇంజనీర్ని పిలిపించడానికి లక్ష్మణ స్వామిని పంపించాడు. ఇంతలో సంఘసంస్కర్త మహంతి వచ్చి నేను సమాజంలో మార్పు తీసుకురావాలి. త్వరగా వెళ్లాలి. అని నారాయణని తెరవమంటాడు. తెరుచుకోదు. ఇంతలో రాధా సుధీర్లు జంటగా నడుచుకుంటూ వస్తారు. గేటు తెరవమని నారాయణని అడిగితే అది మీలాంటి వాళ్ళు వెళ్లే దారి కాదు రాజులు వెళ్లే రాజమార్గం అని చెబుతాడు.

నారాయణ ఈ విధంగా అంటాడు. "ఈ మార్గం గుండా వెళ్లిన వాళ్ల పేర్లు చెప్తాను వినండి అని, వేటగాని అంబుకు బలైన శ్రీకృష్ణుడు, సోక్రటీస్, క్రైస్తు, ఐరిష్ ప్రజానాయకుడు మైఖేల్ కాలిన్స్, పొట్టి శ్రీరాములు మరికొంతమంది ఉన్నారు" అని అన్నాడు. మరి అది ఎవరికి తెరుచుకుంటుంది అని అడిగినప్పుడు అది మహాత్ములకు తెరచుకుంటుంది అని నారాయణ చెప్తాడు. ఇక మాటలతో కాదు అని దూరంగా నల్లకోటు వేసుకొని చెట్టుకింద ఉన్న ప్లీడర్ విశ్వానికి కూతవేస్తే అతను వచ్చి ఎందుకు తెర్చుకోవట్లేదు అని నారాయణని అడిగినప్పుడు నారాయణ ఈ విధంగా బదులిస్తాడు.

మీరందరూ మీ పనుల మీద వెళ్లేవారు. ఒకరి భాష ఒకరికి అర్థం కాదు. శత్రుత్వంతో, ఈర్ష్యతో జాత్యహంకారంతో, ప్రాంతీయ ప్రగల్భంతో, ఎవరికి వారే విడివిడిగా నడుస్తారు. ఎవరికీ సత్యంతో పనిలేదు. అని అంటాడు. సర్కారు వారికి తెలంగాణ వారంటే గిట్టదు. ఇద్దరికీ తమిళులు అంటే గిట్టదు, వారికి కన్నడం వారంటే పడదు. మహారాష్ట్రకు గుజరాతీ వారంటే ఇష్టం ఉండదు. వారికి పంజాబీలు పరాయి వారు. ఒరియా వారికి బెంగాలీలు అంటే గిట్టదు.. మీ ద్వేషానికి ఈ గేటు ఒక్కటే హద్దు. ఇక ఇది మీరు దాటలేరు అని అంటాడు. ఇంతలో మెలకువ వచ్చిన రామదాసు తనకు కలలో

వచ్చింది జరగకూడదని నిర్ణయించుకుని శ్రీనివాస్‌తో మీనాక్షి పెళ్లికి ఒప్పుకుంటాడు.

ఈ నాటకంలో ప్రధానంగా వాడిన సామెతలు:

ఏ లోటూ లేకపోవడం ఒక లోటు

నా మనసు బిచ్చగాని పాత్ర లాంటిది

పిల్లి ఎదురొచ్చింది వెళ్ళొద్దని ఇంటావిడ అన్నా పోనీలే కుంటి పిల్లి అని వచ్చాను

స్త్రీ వయసు ఎంత అని ఖచ్చితంగా చెప్పినవాడు ఈ సృష్టిలో లేడు

డబ్బు గడించే వానికి ఆకలి దప్పిలుండవు

కవికి పొత్తం కూలికి విత్తం అన్నట్లు దరిద్ర నారాయణుడు ధనిక స్వాముల ఇంట్లో

పురుషుడు చటుక్కున నోటికి వచ్చింది అనకూడదు

**ముగింపు:**

మనిషికి నిజంగా కావలసింది స్వచ్ఛమైన కల్మషం లేని మనస్సు తప్ప ఆస్తులు ఆడంబరాలు గౌరవాన్ని తెచ్చి ఇవ్వడం జరగదు. అని భావించి తన ఆస్తిని రామదాసు చెప్పినట్టుగా వయోజన విద్య కోసం పాఠశాలకు కేటాయిస్తాడు. ఆ పాఠశాలకు రామయోగిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తారు. రామదాసు శ్రీనివాసుకి లక్ష్మణస్వామి కుమార్తె మీనాక్షితో వివాహం జరిపించి తన పెద్దరికాన్ని చాటుకోవడంతో ఈ నాటకానికి తెర పడుతుంది. రామదాసుకి కలలో వచ్చిన సంఘర్షణ తన జీవితాన్ని మార్పు తీసుకు వచ్చింది కాబట్టి ఈ నాటకానికి 'ఒకే నిద్ర ఎన్నో కలలు' అనే నామం సార్థక్యాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. బుచ్చిబాబు (1965), బుచ్చిబాబు నాటకాలు, నాటికలు, విశ్వవాణి పబ్లిషర్స్, గాయత్రి ప్రెస్, విజయవాడ.
2. అంతర్జాల వికీపీడియా సమాచారం.

# సమాజ నేత్రాలు - పరిశీలన

**డా. ఎన్. దీపిక**
అసోషియేట్ ప్రొఫెసర్
నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)
నల్లగొండ
సెల్: 9032822036

19వ శతాబ్దం ఉత్తరార్థం నుండి తెలంగాణలో తెలుగు నాటక వైభవం ప్రారంభమైందనవచ్చు. సంగీతం, సాహిత్యం, అభినయం,రసం ఈ నాలుగు కళల సమాహారమే నాటకం. నాటక కళ ఎంతో పవిత్రమైంది. అది ఒక తపస్సు. ఎందరో కళాభిమానులు దానిని ఆరాధించి, జీవించి తన్మయత్వం పొందారు. అందుకే కళ కళ కోసం కాదు, సామాజిక ప్రయోజనం కోసం కూడానని తెలుస్తుంది ఎంతో విశిష్టమైన, విస్తృతమైన తెలుగు నాటక రంగస్థలం విజ్ఞాన వినోదాలను పంచడమే కాకుండా సామాజిక పరివర్తనకు కూడా దోహదపడింది. ప్రేక్షకులను అమితంగా అలరించింది. ఎంతోమంది నటుల్ని, ఎన్నో నాటకాలని, ఎందరో రచయితల్ని, మరెందరో ప్రయోక్తల్ని తెలుగు నాటక కళా ప్రపంచానికి అందించింది. అందుకే'చాక్షుషం క్రతుః' అన్న కాళిదాసు మాటలు నాటక ప్రదర్శన విషయంలో అక్షర సత్యాలు.

సమాజంలోని ప్రజలు జీవనభృతి కోసం చేపట్టే పనులనే వృత్తులు అంటారు. ఈ వృత్తులను ప్రజలు తమ అభీష్టం మేరకు నైపుణ్యాలను పెంచుకొని, వంశపారంపర్యంగా వస్తున్న జీవనశైలిని ఆధారం చేసుకుని తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న వాళ్లు లెక్కకు మిక్కిలిగా ఉంటారు. ఈ విధంగా అనాదిగా ఉన్న చేతివృత్తులు, కులవృత్తులలో ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునిక పనిముట్లు, ఫ్యాక్టరీలు వచ్చి చేతివృత్తుల వాళ్లను దెబ్బతీస్తున్నాయి. కష్టం చేసుకునే శక్తి ఉన్న పని లేక బలహీన వర్గాలు నలిగిపోతున్నాయి. ఆధునిక పరిస్థితులకు తగ్గట్టుగా చేతివృత్తులను తీర్చిదిద్ది, కులవృత్తులను అభివృద్ధి చేసే విధంగా వృత్తి సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుండి ఈ సంఘాలకు ఆర్థిక సహాయం అందిస్తే, వాళ్లకు జీవనోపాధి లభించడమే కాక, వృత్తి నైపుణ్యాలు పెంచుకొని తద్వారా జాతీయ ఆదాయం పెరుగుతుందని రచయిత ఉద్దేశం.

నాటక రచన రచయితకి కత్తి మీద సామువంటిది. కథ అయినా కావ్యమైన వాటికి విస్తృతి ఎక్కువ. నాటకం ఆ విధంగా కాదు, దీనికి పరిమితులు ఎక్కువ. రచయిత సందర్భానుసారంగా వచ్చే ప్రతి పాత్రకి ప్రాణ ప్రతిష్ట చేస్తేనే ఆ నాటకం రక్తి కడుతుంది లేదంటే రచయిత పడిన శ్రమ అంతా వృథా అవుతుంది. ఏ రచయితైన నాటకం రాయాలంటే నాటక సూత్రాలు అవలంబిస్తూ, నాటకానికి మూల స్తంభాలాంటి పాత్రలతో అనేక సంభాషణల కూర్పుతో, వ్యక్తిత్వాలను రూపొందిస్తూ, రూపురేఖలు దిద్దుతూ ,సంక్షిప్తంగా, ప్రదర్శనా సౌందర్యానికి సంఘటనలు అందంగా కురిస్తేనే ఆ రచయిత సఫలీకృతుడు అవుతాడు. ఆ లక్షణాలన్నీ పునికి పుచ్చుకున్న గొప్ప రచయిత డాక్టర్ ముదుంబై పురుషోత్తమాచార్యులు గారు. వీరు మంగతాయమ్మ, వెంకట నరసింహచార్యుల దంపతులకు
1948లో తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ లో జన్మించారు. 1960లో 'మన కర్తవ్యం' నాటికలో బాలనటుడిగా నాటక రంగ ప్రవేశం చేశారు. 1962లో ద్రోహం, మేటి రైతు నాటికలలో బాలనట గాయకుడిగా ఉన్నారు. 1979 నుండి 1985 వరకు శ్రీ త్యాగరాజ ఉత్సవ సమితి కార్యదర్శిగా పలు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. 1982 నుండి ఇప్పటివరకు అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి అధ్యక్షులుగా సుమారుగా 500కు పైగా సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. 1983 నుండి శ్రీ ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ద్వారా ఇప్పటివరకు

సుమారు 2000 సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. 1985 సంవత్సరంలో 'తపస్విని' వీడియో చిత్రానికి, 2000 సంవత్సరంలో 'అందరికీ విద్య' అనే ఆడియోకి సంగీత దర్శకత్వం వహించారు. 2006 నుండి అన్నమయ్య పదశృతి, అన్నమయ్య నృసింహ కీర్తనలు, ఆలంపురం జోగులాంబ కీర్తనలు, విఠలేశ్వర శతక పద్య గానం, శ్రీనివాస చరితం, శ్రీ వాసుదాసు కీర్తనలు, మరింగంటి వారి తిరునామ సంకీర్తనం, వారిజాల శ్రీ వేణుగోపాల స్వామి సుప్రభాతం-కీర్తనలు, హరినామ గాన రంజని మొదలైన ఆడియో సిడీలకు సంగీత దర్శకత్వం వహించారు. 1995లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది నాటకోత్సవ పద్య నాటక పోటీలలో, 1999లో అన్నమాచార్య భావన వాహిని లో, 2002, 2005, 2009 సంవత్సరంలో నంది నాటక పోటీ పద్య నాటకాలులో, 2004లో మాటీవీ పాడాలని ఉంది వంటి కార్యక్రమాలలో న్యాయనిర్ణేతగా పాల్గొన్నారు. తపో భంగం స్వాతంత్ర్య దీప్తి శ్రీ సిద్ధి వినాయక అన్నమయ్య చరిత్ర దేవి మహాత్మ్యం,విశిష్ట సంస్కృతి ఖిల్లా -నల్లగొండ జిల్లా, భగవద్రామానుజ వైభవం,ఆళ్వార్ వైభవం వంటి నృత్య నాటికలను రచించారు. 1992 నుండి ఆకాశవాణిలో లలిత సంగీత గానం చేస్తున్నారు.రాధిక మాధవం, శ్రీ సుదర్శన ప్రభావం, హరి సంకీర్తనాచార్య, విముక్త సీత, వరూధిని, మహా భక్త శబరి, ప్రభావతి, నీలవేణి, నాదయోగి, ప్రబంధ రాయబారం మొదలైన పద్య నాటకాలను రచించారు.వీరు రచించిన సరాగాలు (పాటలు), విరిమువ్వలు (వచన కవితలు), రసానంది (నాటికలు), పదవ తరగతి తెలుగు పాఠ్యాంశ కథలు, మన ఘంటసాల సంగీత వైభవం (ప్రైవేట్ లలిత గీతాలు), మన ఘంటసాల పద్య గాన సౌరభం( ప్రైవేట్ పద్యాలు), ఘంటసాల భగవద్గీత గాన సౌందర్యం, గీతల్లో గీత (పద్యాలు), తెలంగాణ పాఠ్యాంశ కథలు, విశేషాంశాలు, అలంపురం జోగులాంబ సంకీర్తనలు, వారిజాల వేణుగోపాల స్వామి సుప్రభాతం-కీర్తనలు, అవిసె పూలు (వచన కవితలు), ప్రపంచ విలాపం (మినీ కవితలు), రహస్య భూతం (పద్య కావ్యం) ముత్యాలకొలను ( సంస్కృత నీతి శాస్త్రానికి అనువాదం) ముద్రణ గావించబడినవి.

అవార్డులు:1998లో మచిలీపట్నం కళా పీఠం వారి చేత 'ఘంటసాల కమాండేషన్ అవార్డు', 2001లో హైదరాబాద్ కళానిధి సంస్థ వారి 'ఉత్తమ సంగీత విద్వాన్' పురస్కారం, 2008లో ద్వా.నా.శాస్త్రి 'ఉత్తమ పరిశోధన అవార్డు' 2011లో వరూధిని కి 'ఉత్తమ రచయిత అవార్డు', నంది నాటక పోటీలలో 2011లో గుంటూరు విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీ వారి 'సంగీత సేవక పురస్కారం', 2016లో తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీ పురస్కారం, 2017లో శరత్ చంద్ర ఘంటసాల సంగీత కళాశాల వారి 'సముద్రాల అవార్డు', 2019లో గంధర్వ అకాడమీ, హైదరాబాద్ వారి సంగీత అవార్డులు అందుకున్నారు.వీరు' శ్రీ చందాల కేశవదాసు సాహిత్యము -పరిశీలన' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ పట్టా పొందారు.

1983 నుండి ఇప్పటివరకు కూడా శ్రీ ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వారితో కలిసి అనేకానేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరు విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు. ప్రస్తుతం వీరు శ్రీ అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితికి అధ్యక్షులుగా, శ్రీ ఘంటసాల కల్చరల్ అసోసియేషన్‌కి చైర్మన్‌గా, శ్రీ నాద బ్రహ్మ సంగీత కళాశాలకు ప్రధాన ఆచార్యులుగా పదవీ బాధ్యతలు చేపడుతున్నారు.1989 నుండి శ్రీ నాద బ్రహ్మ సంగీత కళాశాల ద్వారా సుమారు 500 మందికి సంగీత విద్యాబోధన గావిస్తున్నారు. ఇటీవల వీరికి జాతీయ చలనచిత్ర ఉత్తమ విమర్శక పురస్కారం - 2021 లభించింది.

2014లో సరిగ్గా 10 సంవత్సరాల క్రితం నాటి దేశ, కాల,రాజకీయ, సామాజిక స్థితిగతులకు దర్పణం ఈ నాటకం. సమాజంలోని కుల వృత్తులు వాటినే నమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్న వాళ్ళుముఖ్యంగా నేత కార్మికుల జీవితాల్లో తొంగి చూస్తున్న దైన్యం మనం 'సమాజ నేత్రాలు' నాటకంలో చూడవచ్చు. ఈ నాటకం మానవ ప్రగతిశీల పరిణామ చరిత్రలో మార్పు చాలా కీలకమైనదని, సహజమైనదని, వాంఛితమైనదని, అని వార్యమైనదని కూడా తెలుపుతుంది. ఎగుడు దిగుడులుగా ఉన్న సమాజంలో ఈ మార్పు అనేది తప్పనిసరి అని గుర్తించి, మార్పును ఆహ్వానిస్తే ఆ మానవ సమాజం సాఫీగా ఒక దశ నుండి వేరొక దశకు పరివర్తన చెందుతుంది.ఈ అనివార్యమైన మార్పును కోరుకునే వ్యక్తుల మధ్య కొనసాగుతున్న ఘర్షణ, ఆ ప్రయత్నంలో వారికి ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటు తేలిన

వ్యక్తులు చైతన్యమై, సంఘటితమై, సమాజంలో నిర్లక్ష్యం చేయబడ్డ తమ ఉనికి కోసం,మెరుగైన స్థానం కోసం చేసే పోరాటం మనం ఈ నాటకంలో చూడవచ్చు.

సమాజనేత్రాలు' నాటకంలో 12 అంకాలు ఉన్నాయి. మహారాజుసభ– రాజు కొలువుదీరి ఉండడం, యువరాజు జన్మదినోత్సవానికి ఊరి వారందరికి వస్త్ర దానం చేయడానికి పంచలు, కండువాలు, చీరలు, రవికలు సిద్ధం చేసినారా,లేదాఅని నేత కార్మికుని మహారాజు ప్రశ్నించడంతో నాటకం ప్రారంభమవుతుంది. నేత కార్మికునితో సహా 10 కుటుంబాలు 30 రోజులు కష్టపడితే, కష్టపడినందుకు 20 వరహాలు అడుగుతాడు నేత కార్మికుడు. ఈ రెండు వేల వరహాలే కాకుండా, ప్రతినెల రెండు వేల వరహాల వడ్డీ అందుకొనుటకు గల అసలు మొత్తాన్ని లెక్కవేసి నేత కార్మిక వర్గ నాయకుని పేరు మీద నిధిగా ఏర్పరచమని కోశాధికారిని ఆజ్ఞాపిస్తాడు రాజు. రాజు గారి ఔదార్యానికి ఆనందంతో అనేకానేక కృతజ్ఞతలు తెలిపి వెళతాడు నేత కార్మికుడు.

జమీందారు గారి అమ్మాయి వివాహ సందర్భంలో వస్త్ర దానం చేయడానికి నేత కార్మికుని పిలిస్తే, 10 కుటుంబాలు 30 రోజులు కష్టపడినందుకు 5000 రూపాయల అడుగుతాడు నేత కార్మికుడు.అందుకు జమీందారు, పట్వారిని పిలిచి పదివేల రూపాయలు సరిగ్గా రెండింతలు ఎక్కువ ఇవ్వమని ఆదేశిస్తాడు జమీందారు. అంతేకాకుండా తన ఇలాకాలో ఏ ధనవంతుడైన ఏ కులవృత్తుల వారి నుండి ఏ పని తీసుకున్నప్పుడైనా ఈ విధమైన ఏర్పాటు జరగాలని ఫర్మానా రాయించి అందరికీ పంపిస్తాడు. దానితో జమీందారుగారి దాతృత్వానికి ఆ నేత కార్మికుడు ఉబ్బితబ్బిబ్బై జమీందారుని ఆశీర్వదిస్తాడు.

ఆధునిక కాలంలో లక్షాధికారి పుట్టిన రోజుకు వస్త్ర దానం చేయడానికి నేత కార్మికులకు ఆర్డరు ఇవ్వగా, ఆ కార్మికుడు దాని ఖరీదుని ఇరవైవేలు చెప్పగా, సెక్రెటరీ పదిహేనువేలకు తగ్గించడానికి ప్రయత్నిస్తే, కాయకష్టం చేసుకునే పనివాళ్ళు,వారి ఉత్పత్తుల మీద రేటు వేసే హక్కు వారికే ఉందని, అది ఎక్కువా, తక్కువా అని సందేహించి వాళ్ళను అవమానించడం న్యాయం కాదని, సెక్రటరీ బేరమాడినందుకు పరిహారంగా మరో రెండు వేలు ఇస్తాడు. వృత్తి కార్మికులందరూ హాయిగా, ఆనందంగా ఉంటేనే మా ఈ ఆస్తిపాస్తులకు ధన్యత కలిగేదని అంటాడు లక్షాధికారి. ఆ మాటకు నేత కార్మికుడు 2000 తిరిగి ఇవ్వబోతే తన పుట్టినరోజు బహుమతిగా తీసుకోమని బలవంతం చేస్తాడు లక్షాధికారి.

పై మూడు సంఘటనలు ఆనాటి సమాజంలో వృత్తి కార్మికుల కష్టానికి ఇచ్చే విలువ,ఏ కుల వృత్తుల వారైనా వారి వారి వృత్తులకు ప్రాముఖ్యత ఇచ్చి ఆయా వస్తు సామాగ్రిలను సమకూర్చలేకపోతే, మానవ మనుగడే అసాధ్యమనే విషయం తెలుస్తుంది. క్రమక్రమంగా ఆధునిక సమాజంలో లక్షాధికారులైనా వారిబుద్ధులు ఏ విధంగా మారిపోయాయో, మునయ్య తన కూతురు ఏరువాకకు, కొడుకు యాదయ్యకు చెప్తుంటాడు. ఇప్పుడు కాలం మారిందని, రకరకాల రంగు బట్టలు వస్తుంటే, ముతక బట్టలు ఎవరు కడతారని అన్న యాదయ్యతో నేసే బట్టల్లోనే రకరకాల నేవళీకలొస్తున్నాయని, అందాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చేవి నేతబట్టలేనని ఏరువాక వాదిస్తుంది. కులవృత్తులు అమ్మతో సమానమని, అన్ని వృత్తుల కార్మికులను, వృత్తి సంఘాలను ఒకటిగా చేసి మన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ చేసుకోవాలన్న ఆలోచనతో ఏరువాక ఉంటుంది.

రామప్ప పట్టుచీరలకు పెద్ద బజారులో షోరూం ప్రారంభించడానికి ముహూర్తం చూడడానికి కుమార శర్మని పిలిచి, బేరసారాలు ఆడుతాడు. బేరం కుదరక తన విద్యను అమ్ముకుంటున్నానేమో అనే ఆవేదనతో తిరిగి వెళతాడు కుమార శర్మ. షో రూమ్ లో పూజాపునస్కారాలకు, వినాయకుని రాతి విగ్రహం చేయించడానికి వీరాచారిని పిలిపిస్తాడు. తన అవసరానికి ఊరిలోని కార్మికులందరినీ తక్కువ ధరకు వాడుకోవడం లాంటి లక్షణాలు రామప్పలో మెండుగా ఉంటాయి.

ఎల్లప్ప ఎమ్మెల్యే అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఏరువాక ప్రసంగిస్తూ, గ్రామీణ వృత్తుల పరిస్థితి రోజురోజుకు సమస్యలలో కూరుకుపోతున్నదని,ఆధునిక యాంత్రీకరణ రావాలని, అన్ని మండలాల్లో

వృత్తి శిక్షణ కేంద్రాలు ఏర్పడాలని, వృత్తి సమాఖ్యలను బలోపేతం చేయాలని, డ్వాక్రా మాదిరిగానే స్వయం సహాయక బృందాలను నెలకొల్పాలని, బ్యాంకు రుణాలను సాధించాలని, వీటన్నిటిని సాధించాలంటే అందరం కలిసికట్టుగా పనిచేసి, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలను, యువ సంఘాలను నెలకొల్పాలని కోరుకుంటుంది. సమాజంలో నెలకొన్న అంతర్గత విభేదాలను రూపుమాపే దిశలో అనుక్షణం సఖ్యత కోసం, సమాజాభివృద్ధి కోసం, సంఘ సంస్కరణ కోసం పాటుపడే వ్యక్తులుగా ఎమ్మెల్యేఎల్లప్ప,ఏరువాక మనకి నాటకంలో కనబడతారు.

నెలవంక పుట్టినరోజు, కొత్త షాపు ప్రారంభోత్సవం సందర్భంగా వంద మందికి వస్త్ర దానం చేయడానికి మునయ్యను పిలిచి, అతిగా బేరమాడుతున్న అన్న రామప్ప మాటలకు మధ్యలో ఎల్లప్ప కల్పించుకొని, శ్రామికుల కర్షకుల చెమటకు విలువ కట్టడానికి ప్రపంచంలో ఎక్కడా తూనిక రాళ్లు లేవని, వృత్తి పని వాళ్ళు లాభం కోసం పని చేయరని, బ్రతుకుతెరువును సుగమం చేసుకోవడానికి శ్రమిస్తారని, రోజులు వెళ్ళదీయడానికి అవసరమైనంతవరకే కూలి అడుగుతారని, పీక్కు తినడానికి కాదని, నేత కార్మికుల హృదయం పత్తి వంటిదని, దాని నుండి దారం తీయాలే కాని ప్రాణం తీయకూడదని, 65000 ఇస్తానని భీష్మించుకున్న రామప్పతో మిగిలిన 25000 తాను ఇస్తానని మాట ఇస్తాడుఎల్లప్ప.

రామప్పఫంక్షన్ అయిపోయిన తర్వాత ఇవ్వవలసిన వాళ్ళకి నయా పైసా ఇవ్వకపోవడంతో యాదయ్య, కుమారశర్మ, వీరాచారి రామప్ప ఇంటికి వెళ్లి గొడవ చేసి రామప్పని నిలదీస్తారు. ఇక తప్పదనుకొని వీరాచారి, కుమార శర్మల బాకీ తీరుస్తాడు కాని యాదయ్యకు ఇద్దామనుకునేసరికి చేతిలో డబ్బులు అయిపోతాయి. రేపు ఎటిఎంలో నుంచి డబ్బులు తీసిస్తాగాని, ఈ బాటిల్ కొంచెం తాగమని యాదయ్యకు మందు పోసిస్తాడు రామప్ప. ప్రతిరోజు డబ్బుల కోసం వచ్చినటువంటి యాదయ్యకు మందుపోస్తూ, డబ్బులు ఇవ్వకుండా కాలం గడుపుతూ ఉంటాడు రామప్ప. యాదయ్యను మందుకు బానిసను చేస్తాడు రామప్ప.

అన్ని మండలాల్లో మహిళా సంఘాలు ఏర్పాటు అయినాయి. ఇంకా వృత్తి పనుల పరిస్థితుల ప్రభావం, వ్యవసాయం పైన బాగా ఉండటం వల్ల ఆదరణ పథకం, అభ్యుదయ యోజన, మరెన్నో స్వయం ఉపాధి పథకాలు తెచ్చుకోవాలనే ఆలోచన ప్రజల్లో వచ్చిందని, ఇవి లేకనే గ్రామ ప్రజలు సూరత్, షోలాపూర్ వంటి చోట్లకు వలసలు వెళుతున్నారని, ఎమ్మెల్యేఎల్లప్ప వచ్చిన తర్వాతనే కరెంటు, పక్కా రోడ్లు, వాటర్ ట్యాంకులు, బజారుకో నల్లా, హెల్త్ సెంటర్, పోస్ట్ ఆఫీస్ వచ్చాయని ప్రసంగించింది ఏరువాక. ఎమ్మెల్యే చేసిన మంచి పనుల వల్ల గ్రామం ఏ విధంగా అభివృద్ధి చెందిందో ప్రజలందరికీ తెలియజేస్తుంది ఏరువాక.

డబ్బుల విషయంలో యాదయ్యకు రామప్పకు గొడవవుతుంది. యాదయ్యకు రోజు తాగుడు పోయించి తన కారుకు డ్రైవర్ గా పెట్టుకుంటాడు రామప్ప. రామప్ప చేసే ఆగడాలు డ్రైవర్ గా ఉన్న యాదయ్యకు కొద్ది కొద్దిగా తెలుస్తూ ఉంటాయి. ఏరువాక, మునయ్య,ఊర్లో వాళ్ళందరూ రామప్ప చేసే ఆగడాలు యాదయ్యకు చెప్పడం, యాదయ్యకు రావలసిన కొన్నినెలల జీతం ఇవ్వకపోగా, యాదయ్యనే తనకు బాకీ ఉన్నట్టుగా తాగుడు పోసి రాయించుకుంటాడు రామప్ప. అంతే కాకుండా యాదయ్య చెల్లెలైన ఏరువాకను తనకు అప్పజెప్పమంటాడు. దాంతో యాదయ్య రెచ్చిపోయి నానామాటలంటాడు యాదయ్య. రామప్పకు ఎదురు తిరుగుతాడు. ఎమ్మెల్యే ఎల్లప్పను కలిసి రామప్పను దండించడానికి, గ్రామాభివృద్ధికి తన వంతు సహాయంగా ఏం చేయమన్నా చేస్తానని మాట ఇస్తాడు యాదయ్య.

ఊర్లో ఉన్న వృత్తుల వారందరికీ వడ్డీ లేకుండా రుణాలు మంజూరు అవుతాయి. వీరు తయారు చేసే ఉత్పత్తులకు ప్రతినెల ఆర్డర్లు వస్తాయి. ఆ ఉత్పత్తులకు వీరే ధర నిర్ణయించవచ్చు .మధ్యలో దళారుల ప్రమేయం ఉండదు. రైతులకు రుణమాఫీ అయి కొత్త ఋణాలు మంజూరవుతాయి. ఋణాలు మంజూరవుతాయన్న శుభవార్తతో యాదయ్య లో పరివర్తన వచ్చి తాగుడు మానేస్తానని అమ్మ మీద ఒట్టు పెడతాడు యాదయ్య. కొమరయ్యకు, కొడుకు బసవయ్యకు ఏరువాకను చేసుకోవాలని ఉంటుంది కాని, బసవయ్య గాజువాక పిల్లను పెళ్లి చేసుకుంటాడు.

రామప్ప చేసిన దుర్మార్గాలు బయటపడాలంటే రామప్ప భార్య రాసిన డైరీ ముఖ్యమని తెలుసుకొని, నెలవంక, ఎల్లప్ప కలిసి ఇల్లంతా వెతికితే డైరీ దొరుకుతుంది. డైరీ చదివిన తర్వాత రామప్ప దుర్మార్గాలని తెలుసుకున్న ఎల్లప్ప ఆశ్చర్యపోతాడు.

పోచమ్మ చర్ల నివాసి అయిన రామప్ప భార్య తండ్రికి ఒక్కతే కూతురు. ఆస్తంతా ఆమె పేరు మీదే ఉంది చెల్లెలి కొడుకు అయిన నాచన్న, చిన్న తనంలోనే కన్నవాళ్ళను పోగొట్టుకొని, అక్క పంచన చేరతాడు. తమ్ముడికి ఏమన్నా ఆస్తి రాసిస్తుందేమోననే అనుమానంతో రామప్ప భార్యకు, నాచన్న( బావమరిది)కు విషం పెడితే, భార్య చనిపోతుంది. నాచన్నకు మతిపోతుంది. దాంతో ఆస్తి అంతా రామప్ప వశం అవుతుంది. మొదటి నుంచి భర్త చేసే వ్యవహారాలు చూస్తున్న ఆమెకు అనుమానం వచ్చి భర్తకు తెలియకుండా అన్ని విషయాలు డైరీలో రాసింది. చివరకు విషం మింగిన క్షణాలలో సైతం ఆ విషయాన్ని కూడా రాసి సంతకం చేసి కన్నుమూస్తుంది ఆ మహా ఇల్లాలు. విషాహారం తిన్న నాచన్న బస్సులో వెళుతూ స్పృహ తప్పడంతో అక్కడ ఉన్నవాళ్లు వెంటనే దగ్గర్లోని క్రిస్టియన్ హాస్పిటల్‌లో చేరుస్తారు. రెండు రోజుల్లో కొంచెం కోలుకుంటాడు. ఏమి మాట్లాడకపోవడంతో ఆ హాస్పిటల్ ఫాదర్ అతనికి శామ్యూల్ అని పేరు పెట్టి ఆశ్రమంలో చేర్పిస్తాడు. ఓ రాత్రి చెప్పా పెట్టకుండా ఆశ్రమంలో నుండి వెళ్లిపోయి ఊర్లు తిరగడం మొదలు పెడతాడు శామ్యూల్. పిల్లలు రాళ్లు వేసి తరుముతూ గోల చేసినప్పటినుండి పాటలు పాడుతూ, గ్రామంలో జరిగే ప్రతి సంఘటన చూస్తూ, దానికనుగుణంగా తత్వాలు చెబుతూ ఉంటాడు. శామ్యూల్ తత్వశాస్త్రంలో ఎంఏ చేసిన అద్భుతమైన ఆధ్యాత్మికవేత్త. శామ్యూల్ చెప్పే తత్వాలు ఉదాహరణకు:

పోతన్నవేడికే సిలకా? ఎగిరిపోతున్న వేడికే సిలకా?
ఎంత దూరం పోయి ఎగిరెగిరి పడినా
సివరాకరకు సెట్టు సేరకా తప్పదు సిలకా!
కొమ్మ పై వాలకా తప్పదు సిలకా!

రాదు రాదు నీ వెంట డబ్బుల మూట
ఎందుకురా నీ కింత కాసుల తీట?
పేరాసల వేట?

ఉరకకు ఉరకకు సిలకా! నువ్వు ఉరికితే ఊడును పిలకా
మెరిసే పండును నమ్మకు దాని మెరుపుల కిందనే పురుగులుండును
ఎంతగ ఉరికిన ఎండమావిలో సుంతైనా నీళ్లు ఉండవు సిలకా!

కులము కులము అంటావు కుళ్ళిపోతుంటావు
కోయిలది ఏ కులమే సిలకా! గండు తుమ్మెదలదే కులము సిలకా!
మతము మతమంటావు మాసిపోతుంటావు
సెట్టుది ఏమతమె సిలికా!
చేను గట్టుది ఏ కులమె సిలకా!

ఎవరు చేసిన కర్మ వారనుభవించక

ఎప్పుడూ తప్పదే సిలకా!
పది జన్మలెత్తినా, ఏ జన్మలోనైన
పాపమూరకె పోదు సిలకా!
ఇల్లలకంగనే పండగైతదా సిలకా?
పిల్లల గంటేనే తల్లి అయితదా సిలకా?
ఇల్లు వాకిలి సల్లగుంటెనే పండగా, బతుకు పండగా
తల్లీపిల్లలు ప్రేమగుంటెనే నిండుగా, కడుపు నిండుగా

అంటూ ప్రతి తత్వం చివర బారా బజే కతం అనే మకుటంతో ముగిస్తుంటాడు.సామ్యూల్ చెప్పిన తత్వాలు అన్నీ కూడా సమాజంలో, తను చూసిన ప్రతి సంఘటనకు అనుగుణంగా మానవ ధర్మాన్ని బోధించేవే.

చిన్నప్పటినుండి తల్లి ప్రేమకు, దుర్మార్గుడైన తండ్రి ప్రేమకు దూరమైన నెలవంకను మునయ్య కొడుకు యాదయ్యకి ఇచ్చి వివాహం జరిపించాలని, ఎల్లప్ప వివాహమంతనాలు జరుపుతున్న సమయంలో కొందరు రౌడీలు ఏరువాకను కాళ్లు చేతులు కట్టేసి కారులో తీసుకొని పోయి కిడ్నాప్ చేస్తారు. విషయం తెలుసుకున్న ఎల్లప్ప నెలవంకను కూడా చెట్టుకు కట్టేసి, రామప్పకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేస్తాడు.

అనేకానేక నాటకీయ పరిణామాలతో రామప్ప ధన వ్యామోహంతో చేసిన చండాలమైన పనులన్నింటిని తానే చేశానని తప్పులను క్షమించి తన బిడ్డను వదిలిపెట్టమని వేడుకుంటాడు.నెలవంకతో ఏడుస్తూ, అమ్మను పొట్టన పెట్టుకున్న, మామయ్యని పిచ్చివాడిని చేసిన, అంతకంటే ఎక్కువ దుర్మార్గంగా కులవృత్తులను ఘోరంగా అవమానించాను. కూతురు వంటి ఏరువాకను చెరపట్టాలని ప్రయత్నించాను. ఇంక నాకు నిష్కృతి లేదు. నన్ను కాల్చేయండి. క్షమించకండి అంటూ ప్రాధేయపడతాడు. యాదయ్య తో రాయించుకున్న అప్పుపత్రాన్ని చింపేస్తాడు. సమాజం ఇంత కులమతాతీతంగా మారిపోయిందని తెలుసుకోలేని అజ్ఞానినని, ఎంత పొరపాటు చేశానని బాధపడతాడు. ఏరువాకతో తన కళ్ళు తెరుచుకున్నాయని నువ్వు దేవతలా కనిపిస్తున్నావని ఈ ఊరు నాకు అమ్మ లాంటిదని, మీరంతా నాకు తోబుట్టువులని, నేను జైలు నుంచి తిరిగివచ్చాక నా ఆస్తిపాస్తులన్నీ మీ వృత్తి సంఘాలకు రాసిస్తానని మాట ఇస్తాడు రామప్ప. రామప్పలో వచ్చిన ఈ మార్పును చూసి గ్రామ ప్రజలంతా హర్షిస్తారు.

ఆస్తిపాస్తుల కోసం అయిన వారిని దూరం చేసుకుని, రక్తసంబంధాలతోపాటు సామాజిక అనుబంధాలకు కూడా ప్రాధాన్యమిచ్చి, కుల మతాతీతంగా సమాజం నిర్మింపబడాలని, గ్రామాలు బాగుపడాలంటే వ్యవసాయం లాంటి పెద్ద వృత్తులే కాదు చేనేత లాంటి చిన్న చేతివృత్తులు కూడా అభివృద్ధి చెందాలని, ఏ దేశ ఆర్థిక సౌధానికైనా, గ్రామీణ వృత్తులే మూల స్తంభాలని "సర్వేంద్రియానం నయనం ప్రధానం". అన్నట్టు అసలు సమాజం అనే శరీరానికి ఒక కన్ను పారిశ్రామిక అభివృద్ధి అయితే రెండో కన్ను ఆధ్యాత్మిక అభివృద్ధని, కాబట్టి దేశాభివృద్ధికి ఈ రెండు కన్నులు ప్రధానమైనవని, మన వృత్తులను కళ్ళ వలె చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని, రెండు కళ్ళలో మన వృత్తి విద్యలను కుడికన్నుగా, సామ్యూల్ తాత చెప్పిన తత్వాలని ఎడమ కన్నుగా, మన వృత్తులను, ధర్మాన్ని సదా రక్షించేవి కనురెప్పలుగా అంటే ప్రభుత్వం కనురెప్పల లాగా ఈ వృత్తులను కాపాడాలని ఈ నాటక సందేశం.

రంగస్థలం మీద నటీనటుల ద్వారా ప్రదర్శింపజేయబడుతూ, సామాజికలను రసానుభూతికి లోను చేసి, తద్వారా అనేకానేక సందేశాలనిస్తూ, సమాజానికి ఒక మార్గనిర్దేశనం చేస్తూ, సమాజ శ్రేయస్సు కాంక్షించే నాటకంగా ఈ "సమాజనేత్రాలు" నాటకాన్ని చూడవచ్చు.ఈ విధంగా సాంఘిక ,ఆర్థిక అంతరాలు లేని సమ సమాజం కోసం సంఘ పునః నిర్మాణం కోసం ప్రయత్నించిన రచయిత ఈ నాటకానికి "సమాజ నేత్రాలు"అనే పేరు పెట్టడం సార్ధకమైనదిగా భావించవచ్చు.

నాటక రంగ వికాసం కోసం పాటుపడి, వారి జీవితాలను, ఆస్తులను త్యాగం చేసిన కళాకారులు కళాపోషకులు

ఎందరో ఉన్నారు. చాలామంది సినిమా కారణంగా నాటకం చనిపోయే స్థితిలో ఉందనుకుంటున్నారు కాని సినిమా, నాటకానికి మరో రూపం. నాటకం నుండి సినిమా పుట్టింది. నాటక రంగస్థలం నుండే ఓనమాలు దిద్దుకుని,సమాచార విప్లవంతో, ఆధునిక టెక్నాలజీతో,అత్యాధునికంగా మెరుగులు దిద్దుకుని, అన్ని వర్గాల ప్రజలను చైతన్యవంతం చేస్తూ ముందుకు సాగుతుంది. కళా సృజనకు, కళాభివృద్ధికి దాతల ఆదరణ, ప్రేక్షకుల ప్రోత్సాహం ఎంతైనా అవసరం. మౌలిక వసతులు సమకూర్చినట్లైతే ఈ నాటక కళ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుందనడంలో ఏ విధమైన సందేహం లేదు.

**ఆధార గ్రంథాలు**

1. నరసింహారావు తాటికొండాల (2021), తెలంగాణ నాటక రంగ చరిత్ర, ఖమ్మం.
2. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణలు, హైదరాబాద్.
3. పురుషోత్తమాచార్యులు ముదుంబై (2014), సమాజ నేత్రాలు.

# వరూధిని పద్య నాటకం - పరిశీలన

**డా. టంగుటూరి సైదులు**
తెలుగు అతిథి అధ్యాపకులు
నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ)
నల్లగొండ
సెల్ : 9912676267

ప్రపంచ సాహిత్యంలో నాటకానికి విశిష్ట స్థానం ఉంది. నాటకం సమాజానికి దర్పణం కనుక అలాంటి నాటకాల్లో తెలుగువారికి మాత్రమే సంపదగా భాసిస్తున్న పద్య నాటకాల అభ్యుదయానికి ఎందరో కృషి చేశారు. నాటకం అనే ప్రక్రియ దృశ్యరూపమైనది. ప్రేక్షకులు సాహిత్యంతో సంబంధం లేకుండా ఆనందం పొందగలిగిన ఏకైక ప్రక్రియ. పాత్రలు ప్రదర్శించే తీరును బట్టి ప్రేక్షకులు అనుభూతిని పొందుతారు. నాటకం ప్రదర్శనయోగ్యమైనది. నట అనే ధాతువు నుండి నటనం నటీ,నటులు అనే పదాలు ఏర్పడ్డాయి. నాటకం దృశ్య కావ్యం. ఇది జీవితానికి ప్రతిబింబమే కాదు జీవిత సారమని ప్రముఖ రచయిత లాజోస్ అంటారు. సుఖదుఃఖ సమన్వితమైన లోక స్వభావం ఆంగికాభి నయోపేతమైనది నాట్యమని నాట్య శాస్త్రంలో భరతుడు పేర్కొన్నాడు. నాటకంలో లోక వృత్తానుకరణం, అభినయ ప్రధానం అనే రెండు విషయాలు ఉంటాయని భరతుడు పేర్కొన్నాడు. కావ్యేషు నాటకం రమ్యం, నాటకాంతం హి సాహిత్యం అనేది కూడా ప్రసిద్ధమైనదే. లోకంలో అవగతమయ్యే సుఖదుఃఖాలను అభినయాత్మకంగా వ్యక్తీకరించేదే నాటకం.

కళారత్న బిరుదాంకితులు బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥ ముదుంబై పురుషోత్తమాచార్య 1948 సం॥ జన్మించారు. శ్రీమతి మంగతాయమ్మ, శ్రీమాన్ వెంకట నరసింహచార్యులు వీరి తల్లిదండ్రులు. వీరు తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులుగా, అన్నమాచార్య సంకీర్తన సమితి అధ్యక్షులుగా 500 కార్యక్రమాలు నిర్వహించారు. త్యాగరాజ ఉత్సవ సమితి కార్యదర్శిగా సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఘంటసాల కల్చులర్ అసోసియేషన్ ద్వారా 2000 సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. వీరు పద్యం, వచనం, నాటకం, పాట, కీర్తనలు వంటి అనేక ప్రక్రియలలో సిద్ధహస్తులు. వీరు చందాల కేశవ దాసు సాహిత్యం పరిశీలన అనే అంశంపై పిహెచ్.డి. చేశారు. అవిసెపూలు, విరిమువ్వలు, ప్రపంచ విలాసం, రహస్య భూతం వంటి రచనలు చేశారు. రాధిక మాధవము, శ్రీ సుదర్శన ప్రభావము, హరి సంకీర్తనాచార్య, విముక్త సీత, వరూధిని, మహాభక్త శబరి, ప్రభావతి, నీలవేణి, నాదయోగి, ప్రబంధ రామాయణం, తపస్విని రచించారు. వీరి సాహిత్య సేవలకుగాను తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం, వరూధిని నాటకానికి ఉత్తమ రచయితగా నంది అవార్డు రావడం జరిగింది. 2021 సం॥కి జాతీయ చలనచిత్ర ఉత్తమ సినీ విమర్శకుడిగా అవార్డు పొందారు.

పురాణాలనుండి ఏదైనా చిన్న అంశాన్ని తీసుకొని వర్ణనలతో పెంచి పెద్ద చేసి వ్రాయడం ప్రబంధం. ప్రబంధ రచనకు ఆద్యుడు అల్లసాని పెద్దన. మనుచరిత్ర అనే ప్రబంధాన్ని రచించి ప్రబంధ రచనకు మార్గదర్శి అయినాడు. మనుచరిత్ర మార్కండేయ పురాణం నుండి గ్రహించబడింది. కాలానుగుణంగా కవులు సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రచనలు చేస్తుంటారు. ఆ కాలంలో సమాజంలో బ్రాహ్మణులకు గౌరవం తగ్గింది. దానిని సరి చేయడానికి మనుచరిత్రలో చంచల మనస్తత్వం కలిగిన గంధర్వ స్త్రీని, ఉత్తముడైన బ్రాహ్మణున్ని పాత్రలుగా తీసుకొని స్త్రీ అదుపుతప్పినా పురుషుడు మనోనిగ్రహంతో ఉండాలని చక్కని పాత్రలకు ప్రాణం పోసి అష్టాదశ వర్ణనలతో రచించి ఎంతో ప్రఖ్యాతిగాంచారు.

ముదుంబై పురుషోత్తమాచార్య దీనిని పండితులకే గాక పామరులకు అందుబాటులోకి తేవాలనే సదుద్దేశంతో వరూధిని పద్య నాటకంగా అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు.

దీన్ని ప్రణయ సౌరభం అనే పద్య నాటక సంపుటి నుండి గ్రహించడం జరిగింది. ప్రబంధాన్ని పద్య నాటక రూపంలో రచించడం ఒక సాహసమే. గతంలో కొంతమంది కవిపుంగవులు కూడా కావ్యాలను, ప్రబంధాలను నాటకాలుగా రచించారు. ఈ నాటకంలోని పాత్రలు ప్రవరుడు నిష్టాపరుడైన బ్రాహ్మణుడు నాయకుడు, వరూధిని నాయకి, సిద్ధుడు, కలశంబరుడు మాయా ప్రవరుడు, స్వారోచి, ఇంద్రుడు, బ్రహ్మ మిత్రుడు, రచయిత పాత్రలు కొంత మార్పు చేసి కలశంబరునిగా పేరు మార్చి సిద్ధుడిని బ్రహ్మ మిత్రుడిని కథాగమనం కోసం కొంచెం ఎక్కువగా ఉపయోగించుకున్నాడు. ఇది 9 అంకాల నాటకం.

తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన భూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభనముగా నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదు వాక్కునను సంప్రితిన జగన్మోహిని
పుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా

వరూధిని నాటకం వరూధిని ప్రవరుల ప్రణయ సౌరభంగా రచించడం జరిగింది. అరుణాస్పదా పురానికి సిద్ధుడు వెళ్లడం అతని ప్రభావం వల్ల ప్రవరుడు హిమాలయాలకు వెళ్లడం వరూధిని కలవడం చంచల మాస్తత్వం గల స్త్రీ అదుపుతప్పిన పురుషుడు మనోనిగ్రహంతో ఉండాలనే ఇతివృత్తంతో నడుస్తుంది. స్వారోచి జననం మొ|| ఘట్టాలు ఉంటాయి.

మరాలవాహిని మనీషా దాయిని
విరంచి మోహిని విపంచి ధారినీ...

అనే పాటతో మొదటి దృశ్యం ప్రారంభమవుతుంది. వరూధిని హిమాలయాల్లో వీణా వాయిస్తూ చక్కని స్వరంతో మంచి పాటను ఆలపిస్తుంది. కలశంబరుడు వరూధిని పాటను మెచ్చుకుంటాడు. వరూధిని అంటే కలశంబరునికి ఎంతో ప్రేమ కానీ అతని ప్రేమను అంగీకరించక చిరాకు పడుతుంది. కలశంబరులతో వివాహం చేయడానికి వరూధిని తండ్రి సిద్ధపడతాడు. దీనితో విసిగిపోయిన వరూధిని పదునాలుగు భువనాలను సంచరించడానికి బయలుదేరి హిమాలయ ప్రాంతాలను చేరుకుంటుంది. హిమాలయ దృశ్యం అతి మనోహరంగా కనిపించడంతో ఆ సుందర దృశ్యాలకు ఎంతో సంతోష పడిపోతుంది.

అరుణాస్పదపురంలో ప్రవరుడు అతని భార్య సోమిదమ్మ నిత్య పూజలు చేస్తూ సాధుసంతులకు ఆతిథ్యం ఇచ్చి తరిస్తున్నారు. ఒకరోజు తన వద్దకు వస్తున్న సిద్ధునికి ఆహ్వానం పలికి అర్ఘ్యపాధ్యాదులిచ్చి పూజించి ఇష్ట మృష్టాన్నములు ఇచ్చి సేవలు చేశారు. స్వామి తమరు ఏయే పుణ్యక్షేత్రాలు దర్శించారు అని కుతూహలంతో అడిగారు. నలు దిశల అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించానని చెప్పగా, ఇంత చిన్న వయసులో ఎలా సాధ్యమైందని ఆశ్చర్యపోయారు. ఒక దివ్య ఔషధ పసరు ప్రభావం వలన దర్శించానని, ప్రస్తుతం హిమాలయాల నుండి వచ్చానని అక్కడ విశేషాలు చెప్పారు. అప్పుడు ప్రవరుడు నన్ను మీ శిష్యునిగా భావించి ఆ దివ్య ఔషధాన్ని నాకు ప్రసాదించి నాకు హిమాలయ దర్శన భాగ్యం కలిగించవలసిందని ప్రార్థించాడు. సిద్ధుడు ఒక ఔషధ భరిణను ఇచ్చి అరికాళ్ళకు పూసుకొని భక్తితో స్మరించగా మీ అభీష్టము నెరవేరగలదని, ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు అని వెళ్ళిపోయాడు. పసరు రాసుకొని హిమాలయాలను చేరుతాడు ప్రవరుడు. అక్కడకు చేరిన ప్రవరుడు హిమవన్నగ సౌందర్యానికి పరవశిస్తూ...

ఇచ్చోటనే కదా! మెచ్చుగా తపమాచ
రించె గంగకయీ దిలీపసుతుడు
ఇదే తావుగాదా! పరమేశ్వరు నాజ్ఞతో

నవనిపై సురగంగ అవతరించే
ఇదియే గదా! గౌరీ ఈశుని పతిగా భా
వించుచు తపమాచరించు నెలవు
ఇక్కడేగాద! కుసమేక్షు శరదనుర్ధ
రుడు రుద్రనేత్ర దగ్దుడుగనాయ్యే
యక్ష కిన్నెర కిం పురుషాది సురులు
గాన గాంధర్వ విద్య ప్రకండ వరులు
సంచరించెడి దివ్య బాస్వన్నిలయము.
మహిత పుణ్యాలయమ్ము, హిమాలయమ్ము

ఈ హిమాలయ మహిమలను ప్రశంసించుటకు బ్రహ్మకునైనను సాధ్యం కాదు. ఒక సామాన్య బ్రాహ్మణుడను నా తరమగునా అని, ఇప్పటికి ఇది చాలు మిగిలినవి మరలా రేపు వచ్చి చూస్తారని, ఇక నా గృహానికి వెళ్ళిపోదునని

ఓం పరమేశ్వరాయ మమ
స్వగృహం దర్శనార్థం తిరోగమనేన గమిష్యామి

అని ప్రార్థించాడు. కానీ ఎక్కడికి వెళ్ళలేదు. మంచు ప్రభావం వల్ల పాద లేపనం కరిగిపోయింది. హా! దైవమా మాకు ఇప్పుడేది దారి అని ఎక్కడ నుండి వచ్చానో ఎరుగనైతినని బాధపడెను. ఇక్కడ ఎవరైనా ఉన్నారా అని ఆందోళనగా వెతుకుతుండగా అక్కడ ఒక ముని ఆశ్రమం కనిపించింది. అక్కడకు వెళ్ళగా వీణ వాయిస్తున్న కన్యను చూశాడు. ఆమె కూడా అతనిని చూచింది. అతని రూపానికి మోహితురాలైంది.

ఎక్కడివాడో యక్షతనయెందు జయంత వసంత కంతులన్
................ నను వీడు పరిగ్రహించినన్.

నలుడు, వసంతుడు, జయంతుడుల శరీర సౌందర్యాన్ని మించినవాడు. వీడు నన్ను ఒంటరిగా తీసుకెళ్తే బాగుండునని ఆలోచిస్తుంది. ఇంతలో ప్రవరుడు వెళ్లి ఓ బెదిరేటి లేడి కన్నుల దాన నీవు ఎవతెవు? నేను బ్రాహ్మణుడను, ప్రవరుడను దారి తప్పిపోయాను. నాకు మార్గం చూపించి పుణ్యం కట్టుకొమ్ము నీకు శుభమగును అని పలికాడు. తొలిచూపులోనే అతనిపై మనసు పడటం వలన ఆమెకు కోపం, నవ్వు వచ్చి...

ఇంతలు కన్నులుండ.......
నెల్లిదమైతిమే మాటలేటికిన్

చెంపకు చారడేసి కన్నులు ఉండగా దారి ఎందుకు అడుగుతున్నావు. ఇంతలోనే దారి మరిచావా? ఏకాంతంగా ఉన్న స్త్రీతో మాట్లాడకూడదు అనే కనీసం ధర్మం తెలియదా ఓ బ్రాహ్మణోత్తమా! నా పేరు వరూధిని, రంభ, తిలోత్తమా, హేమా, నా ప్రాణ సఖురాండ్రు. భూసుర నీవు మా ఇంటి బంధువైతివి మా ఇంటికి రావాల్సిందని ఆహ్వానించింది. తర్వాత తనను వివాహం చేసుకోమని తన మనసులోని మాటను తెలిపింది. నాకు వివాహమైనది. తల్లిదండ్రులు నాకోసం ఎదురు చూస్తుంటారు. నేడు ఇల్లు చేరకున్న సమస్త ధర్మాలు చెడిపోవునని, తన ముందు ఆ విధంగా మాట్లాడకూడదని ప్రవరుడు చెప్పెను. ఎంత పుణ్యం చేసుకొంటె మానవులకు గంధర్వాంగనల పొందు లభించును? వ్రతముల కోసం ఇంకా పాకులాడెదవు ఎందుకు బ్రాహ్మణోత్తమా! అని అన్నది. తనను ఇంకా బాధ పెట్టవద్దని కౌగిలించుకున్నది. వెంటనే ప్రవరుడు 'ఛీ పో' అని త్రోసి వేశాడు. ఆమె ఎంతో బాధకు గురై దుఃఖించింది. అతన్ని ఎన్నో మాటలు అన్నది. ప్రవరుడు ఆ మాటలను వినిపించుకోక ఆమెపై పడినప్పటి జువ్వాదిని కడుగుకొని తన స్వస్థలం చేరుకొనెను. ప్రవరుని కాటిన్యానికి ఆమె బాధపడుచుండగా ఆమె చెలికత్తెలు, ఆమెను ఊరడించి ఆమె సఖులు ఆమెను పూదోటకు తీసుకెళ్లారు. పూర్వం ఆమెను మోహించి తిరస్కృతుడైన కలశాంబరుడు ప్రవరుని వరూధిని మోహించుటయు,

అతడు తిరస్కరించి పోవుటయు చూచెను. అంతట అతడు నేను అదృష్టవంతుడను అని తలచుకొని వరూధిని పూదోటకు వచ్చు సమయానికి అక్కడ ప్రవరుని రూపం ధరించి ఆ తోటలో దేవతార్చనకు పూలు కోస్తున్నాడు. అతన్ని వరూధిని చూసింది అతని వద్దకు వెళ్లి దీనంగా ప్రార్థించింది. తన కోరిక నెరవేరినందుకు గంధర్వుడు పరమానంద భరితుడై కరుణాహృదయుని వలె నటిస్తూ నిన్నటి నుండి నీవు బాధపడుతున్నావు. నీ బాధను నేను చూడలేను అని 'వ్రతము కంటే పరోపకార గుణము గొప్ప' అని నీ కొరకు వ్రత భ్రష్టుడను అవుతున్నానని, నీతో చిరకాలం సుఖింపవలెనని అన్నాడు. కొంతకాలం తర్వాత వరూధిని గర్భవతి అయినది. ఒకరోజు తన ఇంటి వద్ద ఇబ్బందులను గూర్చి చెప్పి అతడు నాకు సెలవు ఇప్పించాలని కోరి వెళ్ళెను. కొన్ని రోజుల తర్వాత ఆమెకు కుమారుడు జన్మించాడు. అతనికి స్వారోచి అని నామకరణం చేశారు.

**పాత్ర సంభాషణలు:**

పురుషోత్తమాచార్యగారు వరూధిని మరియు ప్రవరులతో హిమాలయ వర్ణన చేయించాడు. వరూధిని సుందర దృశ్యాలను చూసి ఆహా! ఏమి ఈ భూలోక సౌందర్యము భూలోకమునకు మనిమయ మకుటాయమానమైన ఈ హిమగిరి ఎంత రమణీయంగానున్నది చతుర్దశ భువనములందెచ్చట కానరాణి నవవసంత శరణాలస్య చంద్రికలు అంతట చల్లచల్లగా పరుచుకుని ఉండుటచే నా మనస్థాపమంతయు చల్లారి పోయినది కదా! అందుకే కాబోలు యక్ష, కిన్నెర, కింపురుశాది జాతులవారు ఈ హిమవన్నగముననే నివాసం ఏర్పరచుకున్నారు. ఇంతకన్నను గొప్ప మనోహర స్థావరం ఇంకెందు లభింపగలదు అంటూ ఆహ్లాదంగా సంచరిస్తూ ప్రకృతి వర్ణన చేస్తుంది. పెద్దన మనుచరిత్రలో ప్రవరుడు హిమాలయాల్లో సంచరిస్తూ 'అటజనిగాంచే......' అనే పద్యంతో ప్రకృతి వర్ణన చేశారు. వరూధిని నాటకంలో హిమాలయాలను చేరిన సమయంలో...

ఇచ్చోటనే గదా! మెచ్చుగా తపమాచ
రించె గంగకయి దిలీపసుతుడు
ఇదే తావుగదా! పరమేశ్వరు నాజ్ఞతో
నవని పై సుర గంగా అవతరించే

అనే పద్యంతో ప్రకృతి వర్ణన చేశారు. వరూధిని నాటకంలోని పాత్రలు అత్యంత రమణీయంగా కథాగమనం సాగుతుంది. ఆద్యంతం ప్రేక్షకునికి ఉత్కంఠ కలిగే విధంగా మంచి డైలాగులతో ప్రేక్షకులకు ఆసక్తి రేపుతూ రంజింపచేస్తాయి. ప్రతి పాత్ర సజీవకళ ఉట్టిపడేలా పాత్రలను పోషించారు. అనవసర విషయాలను తగ్గించి అవసరమైన విషయాలను జోడించి అద్భుతంగా చిత్రించారు పురుషోత్తమాచార్యగారు.

**ప్రబంధం నుండి నాటకంలో చేసిన మార్పులు:**

వర్ణనలు చాలావరకు తగ్గించడం జరిగింది. సిద్ధుని సిద్ధున్ని యోగీశ్వరునిగా, బ్రహ్మ మిత్రున్ని మునీశ్వరునిగా, మరియు మాయా ప్రవరున్ని కలశంబరుడుగా, ఇందీవరాక్షున్ని సోదరునిగా పాత్రల్లో స్వల్ప మార్పు చేసి కొత్తగా ఇంద్రుని పాత్రను జోడించడం జరిగింది. నిరంతరం స్త్రీ పాత్రలకు భంగం కలుగకుండా కాపాడారు. గంధర్వ కాంత అయిన వరూధిని భూలోకానికి వచ్చి నివసించినందువల్ల భారతీయ స్త్రీల వైశిష్ట్యాన్ని కొంత సూచించారు. తొమ్మిది అంకాలుగా ఈ నాటకాన్ని వ్రాసి నాటక లక్షణాలను ఎక్కడ విస్మరించకుండా తెలుగు నాట అత్యంత ఆదరణ పొందిన నాటకంగా వరూధిని నాటకం ప్రశస్థికెక్కినది. ఈ కృషి ఫలితం పురుషోత్తమాచార్యగారికి దక్కుతుంది.

**ముగింపు:**

మనుచరిత్ర ప్రబంధాన్ని పురుషోత్తమాచార్యగారు పాఠాలు చెప్పే రోజులలో నాటకంగా తీసుకురావాలని అనుకున్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత రవీంద్రభారతిలో జరిగే నాటక ప్రదర్శనలో రంగస్థలం నటులు జానకిరామ్‌గారు రెండు గంటలకు సరిపోయే నాటకాన్ని రాయాలని కోరడం వలన వరూధిని నాటకం రూపుదిద్దుకుంది. పండితులకే

పరిమితమైన ప్రబంధాన్ని నాటక రూపంలో పామరులకు చేర్చిన ఘనత పురుషోత్తమాచార్య గారిది. సావేరి సంస్థ వారు వరూధిని నాటకాన్ని మొదట ప్రదర్శించారు. సావేరి భవానిగారు వరూధిని పాత్రకి వన్నెతెచ్చారు. అందుకే ఈ నాటకానికి నంది పురస్కారం లభించింది. వరూధిని నాటకాన్ని విశ్వవ్యాప్తం చేసిన పురుషోత్తమాచార్యులు ధన్యులు.

**ఆధార గ్రంథాలు**

1. డా॥ పురుషోత్తమాచార్య ఎం., వరూధిని నాటకం (అముద్రితం).
2. పెద్దన అల్లసాని (2001), మనుచరిత్ర, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్ ప్రచురణ, చెన్నై.

# సత్య హరిశ్చంద్ర నాటక మేటి - చీమకుర్తి నాగేశ్వరరావు

**నోసిన వెంకటేశ్వర్లు**
పరిశోధక విద్యార్థి
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయము
సెల్ : 7893346176

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు ఉన్నాయన్న సంగతి తెలిసిందే. అందులో నాటక ప్రక్రియ కూడా ఒకటి. తెలుగు సాహిత్యంలో నాటకం ఒక రసగుళిక. అది ఒక అందమైన అమోఘమైన, సమ్మోహనమైన మధురమైన ప్రక్రియ. నాటకాలు పద్యనాటకాలుగా, సాంఘిక నాటకాలుగా పిలువబడుతున్నాయి.

**ఆంధ్రనాటక పితామహుడు:**

ఆంధ్రదేశంలో బళ్ళారిలో మొట్టమొదటి నాటక సమాజాన్ని నెలకొల్పి నాటక రచనచేసి ప్రదర్శించిన ఘనత ధర్మవరం రామకృష్ణమాచార్యులు గారికే దక్కింది. అందుకే ఈయన " ఆంధ్ర నాటక పితామహుడు " గా కీర్తింపబడుతున్నాడు.

ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారితో పోటీగా నాటక సమాజం ఏర్పాటు చేసి నాటక రచన చేసి ప్రదర్శించినవారు శ్రీ కోలాచలం శ్రీనివాసరావు. వీరు పౌరాణిక నాటకాలతో పాటు చారిత్రక నాటకాలు కూడా అనేకం రచించారు. వీరు మొత్తం 28 నాటకాలు రచించి " ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు " అనే బిరుదుతో ప్రఖ్యాతి గాంచారు.

**శవ్య, దృశ్యకావ్యాలు**

కావ్యాలను రెండు భాగాలుగా మన అలంకారికులు విభజించారు. 1. శ్రవ్యకావ్యం 2. దృశ్యకావ్యం

**1. శ్రవ్యకావ్యం:** ఒకరు చెప్పగా విని ఆనంద పడటం శ్రవ్యకావ్యం.

**2. దృశ్యకావ్యం:** కన్నులతో చూడడం వలన రసానందం కలిగించే కావ్యమే దృశ్యకావ్యం.

ఒక సన్నివేశాన్ని దృశ్యమానం చేయడానికి, ప్రదర్శించడానికి ఉద్దేశించిన రచన దృశ్యకావ్యం.

" కావ్యేషు నాటకం రమ్యమ్
నాటకేషు శకుంతలా
తత్రాపి చతుర్థోంక:
తత్రశ్లోక చతుష్టయం "

పై శ్లోకాన్ని బట్టి దృశ్యకావ్యాలలో నాటకం రమ్యమైనదని చెప్పవచ్చును. " నాటకాంతం హి సాహిత్యమ్", "సందర్భేషు దశరూపకం శ్రేయ: " శ్రవ్యమూ, దృశ్యమూ అయిన నాట్యము లేక భావము, కీర్తనము అనగా శుభ, అశుభ ఫలములు ఇచ్చే ధర్మాధర్మాల యొక్క స్వభావాలను ప్రదర్శించడం లేదా వృత్తానుకరణం అగునట్లుగా నాట్యం నిర్మితమైనదని భరతముని అభిప్రాయము. ప్రపంచదేశాలలో సర్వకళలకు నిలయమైనది మన భారతదేశం. దశవిధ రూపకాలతో అగ్రగామిగా వెలుగొందుతూ, హావభావ విన్యాస సంభాషణా చాతుర్యంతో ప్రేక్షక మనోరంజనం గావించి రసానందం కలిగించే ప్రక్రియ నాటకం. దేశానికి పల్లెటూళ్ళే పట్టుగొమ్మలు అన్నట్లుగా ప్రతి అంశానికి ప్రతి కళకు గ్రామాలే మూలం. అది ఏ కళ అయినా గ్రామాలే మాతృ స్థానాలు అయి ఉంటాయి. నాటకాలకు కూడా పల్లెటూళ్ళే పునాదులు వేసి, ఆదరించాయి, ఆదరిస్తున్నాయి.

తెలుగునాట పద్యనాటకం గజ్జెకట్టి దాదాపు 110 సంవత్సరాలపైగానే సాగింది. ఈ పద్యనాటకం నాటి నుండి

నేటి వరకు రంగస్థలంపై జగజ్జేగీయమానంగా ప్రకాశిస్తూనే ఉంది. నేటి టి.వి.లు, సినిమాల యుగంలో కూడా తెలుగునాట వాడవాడలో, పట్టణాలలో ఈ పద్యనాటకం రసరమ్యంగా వెలుగొందుతూనే ఉంది. ముమ్ముందుకు సాగుతూనే ఉంది. ఈ యజ్ఞంలో అందరి నటులతో పాటుగా మహానటులుగా పేరుపొందిన వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారితో తొట్టెంపూడి నాగేశ్వరరావు ఒకరు.

**చీమకుర్తి నాగేశ్వరరావు:**

తొట్టెంపూడి నాగేశ్వరరావు అంటే ఏదో కొత్తపేరులాగా అనిపిస్తుంది నాటక ప్రియులకు. అదే చీమకుర్తి నాగేశ్వరరావు అంటే నాటక ప్రియులందరికి వెంటనే గుర్తుకు వస్తుంది. 'జగమెరిగిన బ్రాహ్మణునకు జంధ్యమేల' అన్నట్లుగా ఈ పేరువినని ఆంధ్రుడు ఉండడు. పండిత పామరులను తన నటన, గాన మాధుర్యంతో మెప్పించి, ఒప్పించిన మహాగాయకుడు చీమకుర్తి నాగేశ్వరరావు. వీరు "హరిశ్చంద్రుని"గా ఆంధ్రదేశంలో సుప్రసిద్ధులు. బండారు రామారావు తర్వాత హరిశ్చంద్ర పాత్రకు కీర్తిప్రతిష్టలు తెచ్చిన నటుడు నాగేశ్వరరావు. హరిశ్చంద్ర పాత్రకు నూతన ఒరవడి దిద్ది తనదంటూ ఒక బాణీని సృష్టించి పద్య పఠనంలో నవరసాలు పండించిన గొప్ప గాయకుడు నాగేశ్వరరావు. బండారు రామారావును అభినవ హరిశ్చంద్రుడుగా అభివర్ణిస్తే, చీమకుర్తి నాగేశ్వరరావును అభినవ బండారు రామారావుగా అభిమానులు ప్రశంసించారు. హరిశ్చంద్ర నాటకంలో భాగంగా జాషువా గారు రాసిన 'స్మశాన వాటిక' పద్యాలను చేర్చి 'కాటిసీను ' పద్యాలు పాడుతుంటే ప్రేక్షకులు ఆ పద్యంలో లీనమైపోయేవారు.

చీమకుర్తి నాగేశ్వరరావు అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. తన నాటక పయనంలో పెద్దగా చదువు లేకపోయినా గురు ముఖంగా ' హరిశ్చంద్ర పాత్ర ' నేర్చుకొని ఆంధ్రదేశమంతటా కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చిన నటగాయకుడు చీమకుర్తి. పద్యం పాడే విషయంలోను, రాగం విషయంలో ఇతరులను అనుకరించకుండా తనకంటూ ప్రత్యేక బాణీని ఏర్పరుచుకున్న వ్యక్తి చీమకుర్తిగారు. ఆ బాణీకి, రాగానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులు అయ్యి వన్స్ మోర్ అనేవారు. ఇలా ఎన్నోసార్లు వన్స్‌మోర్ అనే పదం ఆయన నటనాజీవితంలో ఎన్నోసార్లు విన్నాడు. ఒకే పద్యం ఒకే స్టేజీమీద ఎన్నోసార్లు పాడిన సందర్భాలు కోకొల్లలు.

**చీమకుర్తి నాగేశ్వరరావు - జీవన రేఖలు:**

| | | |
|---|---|---|
| జననం | : | 1951వ సంవత్సరం |
| జన్మస్థలం | : | చీమకుర్తి దగ్గర ఉన్న కొండూరు వారి అగ్రహారం |
| తల్లిదండ్రులు | : | అంకమ్మ, కోటయ్య |
| భార్య | : | వెంకమ్మ |
| విద్యాభ్యాసం | : | ప్రాథమిక విద్య మాత్రమే అభ్యసించారు. |
| నాటకరంగ ప్రవేశం | : | ప్రప్రథమంగా రామాంజనేయ యుద్ధంలో యయాతి పాత్రలో నాటకరంగ ప్రవేశం జరిగింది. |
| గురువు | : | అద్దంకి మాణిక్యాల రావు, అద్దంకి |
| హార్మోనిస్టు | : | తొట్టెంపూడి సుబ్బారావు |

చీమకుర్తి పేరు వినగానే మనకు విలువైన గ్రానైట్ నిక్షేపాలు ఉన్న ప్రాంతంగా గుర్తుకు వస్తుంది. అంతకంటే విలువైన స్వర సంపద కలిగిన నాగేశ్వరరావు కళాభిమానులకు జ్ఞప్తికి వస్తాడు. కుటుంబ పోషణార్థం చిన్న వయస్సులోనే కూలిపనులకు వెళ్ళాడు. పని చేస్తున్నప్పుడే కూనిరాగాలు తీసేవాడు. హార్మోనిస్టు సుబ్బారావు గారు నాగేశ్వరరావును తనతోపాటు అనేక నాటకాలకు తీసుకువెళ్ళి పద్య పఠనంలోనూ, గానంలోనూ మెళుకువలను నేర్పించాడు. వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్. ఖాళీ సమయాలలో పచ్చాకు కూలీకి పనికి వెళ్ళేవాడు. సంగీత సామ్రాట్టులు లాగా సంప్రదాయ సంగీతాన్ని

ఏనాడు సాధన చేయలేదు. ప్రాథమిక విద్య మాత్రమే చదువుకున్న వీరు ఏకసంథాగ్రాహి. ఒక్కసారి ఏదైనా ఒక పాటను గానీ, రాగాన్ని గానీ వింటే దానిని నేర్చుకునేవాడు. ఒంటరిగా ఉన్నప్పుడు గానీ, పనిలో ఉన్నప్పుడు గానీ రాగాలతో ప్రకృతిలో పరవశించేవాడు.

రహదారిలో ఎత్తుపల్లాలను అధిగమిస్తూ సునాయాసంగా ట్రాక్టర్ నడిపినట్లుగా రాగాలలోని ఆరోహణ, అవరోహణలను అర్థం చేసుకుని తన రాగరథాన్ని నేర్పుగా స్వారీ చేసి సంగీత ప్రపంచంలో అద్వితీయంగా ప్రభాసించిన ప్రభాకరుడు నాగేశ్వరరావు. సంస్కృత పదాలతో, సమాసాలతో ఉండే పద్యాలను అలవోకగా ఆలపించేవాడు. ఇతరులను అనుకరించకుండా తన గాత్రంతో సరిక్రొత్త రాగ ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు. చీమకుర్తి నాగేశ్వరరావు పద్య రాగాలాపన అర్థం చేసుకోవాలంటే జాషువా రాసిన 'కాటి సీను' ను ప్రత్యక్షంగా చూసి తీరాలి.

ఇచ్చోటనే సత్కవీంద్రుని ...... అనే పద్యం కానీ, ముదురు తమస్సులో మునిగిపోయిన క్రొత్త సమాధి అనే పద్యాలే కాక హరిశ్చంద్రుని నాటకంలోని ఎన్నో పద్యాలు చీమకుర్తి నాగేశ్వరరావు గారి కంఠం నుండి ఒక గంగా ప్రవాహం లాగా జాలువారినపుడు ప్రేక్షకులు తమకు తెలియకుండానే చప్పట్లతో, ఈలలతోనూ తన ఆనందాన్ని తెలియజేస్తూ వన్స్‌మోర్ అంటారు.

ఆంధ్రదేశంలో వివిధ సందర్భాలలో జరిగే ఉత్సవాలలో కానీ, ప్రకాశం జిల్లాలో ఎక్కడే ఉత్సవాలు జరిగినా చీమకుర్తి నాగేశ్వరరావు గారి హరిశ్చంద్ర నాటక ప్రదర్శన తప్పనిసరిగా ఉండేది. చీమకుర్తిలో జరిగే తిరునాళ్ళలో అయితే నాగేశ్వరరావు గారు ఒక ప్రభ మీద పద్యాలు పాడడం మొదలుపెడితే మిగిలిన ప్రభల దగ్గర ఉన్న ప్రజలంతా నాగేశ్వరరావు గారు పాడే ప్రభ దగ్గరకు చేరుకునేవారు. ఆయన పంచే రాగామృతం కోసం రసపిపాసులు ఆవురావురుమంటూ ఎదురు చూసేవాళ్ళు. తన నటజీవితంలో దాదాపు 6వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. హరిశ్చంద్రుడు పాత్రే కాకుండా నక్షత్రకుడు, భవాని మొదలైన పాత్రలు కూడా ధరించారు. ఏ పాత్ర ధరించినా అంకిత భావంతో ఆ పాత్రలో లీనమైపోయేవారు.

**సన్మానాలు:**

చీమకుర్తి నాగేశ్వరరావు దాదాపుగా 500 పైగా సన్మానాలు పొందారు, ఎన్నో బిరుదులు కూడా పొందారు. బంగారు నందులు, వెండి కప్పులు, ఎన్నో స్వర్ణ కంకణాలు చీమకుర్తి కళా ప్రతిభకు గౌరవ వందనం చేశాయి.

మానవీయ మనుగడకు, మానవీయ విలువలకు చెరగని, తరగని మచ్చుతునక సత్య హరిశ్చంద్రుని అజరామరమైన గాథ. భారతీయ చింతనలో ధర్మబద్ధతకు, సత్య సంధతకు గల మౌలిక ప్రాతిపదికకు అద్దంపట్టే ఈ నిరుపమ అంశాన్ని మహానాటక కర్త బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకీకరించిన తీరు అసాధారణం, అనితర సాధ్యం. అటువంటి నాటకంలో హరిశ్చంద్రుని పాత్రను అమోఘంగా పోషించి చీమకుర్తి నాగేశ్వరరావు చరితార్థుడయ్యాడు. తెలుగు పద్యనాటక రంగంలో తనకంటూ ఒక పేజీని రాసుకున్న చీమకుర్తి నాగేశ్వరరావు గారు 2006వ సంవత్సరములో కళామతల్లి ఒడిలో శాశ్వత నిద్రలోకి జారుకున్నారు.

**ముగింపు:**

కొత్త నీరొచ్చి పాత నీరును పారదోలినట్లు రంగస్థల ప్రదర్శనలను సినిమాలు డామినేట్ చేయగా ప్రస్తుతం వాటికి టి.వి. పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుత కాలంలో థియేటర్లలో సినిమాలు చూసేవారు తగ్గిపోయారు. సమాజంలో అన్నీ అవసరమే కనుక దేని మనుగడ దానికి తప్పని సరిగా ఉండి తీరాలి.

ఆంధ్రదేశంలో పౌరాణిక నాటకానికి ఆదరణ తగ్గిపోతుంది అంటున్న నేటి స్థితిలో, పౌరాణిక నాటకానికి కొంత ఆదరణ తగ్గిన పరిస్థితులతో పౌరాణిక నాటకం ఎప్పటికీ అజరామరం, ఎల్లప్పుడూ దేదీప్యమానంగా ప్రకాశిస్తూనే ఉండేందుకు, పద్య నాటకానికి, నాటకరంగానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

**ఆధార గ్రంథాలు:**

1. డా॥ వి.ఆర్. రాసాని (2015), ప్రసిద్ధ తెలుగు నాటక పద్యాలు, అమరావతి పబ్లికేషన్స్, గుంటూరు.
2. డా॥ కోటేశ్వరరావు కోయి (2011), అస్తమించిన స్వరచంద్రుడు చీమకుర్తి, (బహుజన కెరటాలు- పదేళ్ళ బహుజన కెరటాల ప్రస్థానం 2001 - 2011 ప్రత్యేక సంచిక)

# తులనాత్మకంగా నాటకాలను విమర్శించిన తొలి విమర్శకుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

**అంకే శ్రీనివాసులు**
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ కళాశాల (స్వ)
అనంతపురము
సెల్: 9652471652

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ విమర్శకులుగా అనువాదకులుగా, పరిశోధకులుగా, గ్రంథ పరిష్కర్తలుగా, సంగీత విద్వాంసులుగా వినుతికెక్కినవారు. ప్రాచీన ఆధునిక సాహిత్యాలను అవలోకనం చేసుకున్న విమర్శకులు.

## 1. నాటకోపన్యాసములు

"కావ్యేషునాటకం రమ్యమ్"

1934 అక్టోబరు 20, 21 తేదీలలో ధర్మవరం రామకృష్ణమాచార్య, కోలాచలం శ్రీనివాసరావు గార్ల నాటకాలమీద రాళ్ళపల్లి వారు చేసిన స్మారకోపన్యాసాలే ఈ నాటకోపన్యాసాలు. మొదటి ఉపన్యాసంలో లలితకళలు, నాటక లక్షణాల విశ్లేషణ, నాటకాంగాలచర్చ, ఆధునిక నాటకవాదాలను సమీక్ష చేశారు. రెండవ ఉపన్యాసంలో ధర్మవరం, కోలాచలం వారి నాటకాలలోని విశేషాలు, తులనాత్మకంగా విశ్లేషణ చేశారు.

ఈ రెండు ఉపన్యాసాలు భారతి పత్రికలో 1935 జవనరి నుండి ఏప్రిల్ వరకు నాలుగు సంచికల్లో ప్రచురితమయ్యాయి. తర్వాత "నాటకోపన్యాసములు" పేరుతో పుస్తకంగా వచ్చాయి.

నన్నయ కాలం నాటికే తెలుగులో నాటక ప్రస్తావనలున్నాయి. తెలుగులో సంస్కృత నాటకాలను కూడా కావ్యంగా దిగుమతి చేసుకోవడమే తప్ప యధాతథంగా స్వీకరణ చేయలేదు. సంస్కృత నాటకాలను చూసి ఆనందించడమే కాని తెలుగులో స్వతంత్ర నాటకరచన జరగలేదు. మధ్యయుగంలో జన్మించిన యక్షగానం నాటకవయ్యారాలతో నడిచింది. బొమ్మలాటలు జానపద సమాజంలో అనాదికాలం నుండి ఉన్నాయి. అంతే! 1860 ప్రాంతంలో తెలుగులో కోరాడ రామకృష్ణయ్య 'మంజరీ మధుకరీయము' రాసేదాకా తెలుగుసాహిత్యంలో నాటకం లేకపోవడం చాలా విస్మయం కలిగించే విషయం. ఈ విషయాన్ని ప్రశ్నించడంతోనే 1928 అక్టోబరు చివరివారంలో మన ఉపన్యాసాల్ని ప్రారంభించారు. నాటక స్వభావాన్ని, లక్షణాల్ని ఇక్కడ చాలా లోతుగా రాళ్ళపల్లి చర్చించారు.

"నాటకము సమాహారకళ. లలితకళలలో ఏకళ సహకరించక పోయినను నాటకము రసాభాసమగును. మరియు ఏకళ స్వయంసంపూర్ణము కాదు" అని నాటకానికి లలితకళల అవసరాన్ని చెప్పారు. "భిన్న పదార్థముల నొకచోట చేర్చి చేయు కూర్పుకళ" అని నిర్వచించారు. "చిత్రలేఖనము, శిల్పకళలలో చలనరూపమును చిత్రీకరించలేము.
కవిత్వమున సంకేతరూపమైన భాషచేత అంతరంగ బహిరంగ చిత్రణ చేయవచ్చు. ఈభాష ద్వారా కూడా వ్యక్తీకరింపలేని సూక్ష్మ, సూక్ష్మేతర భేదములను సంగీతము ద్వారా వ్యక్తీకరింపవచ్చును. అభినయమున హావభావ ప్రదర్శన రమ్యముగా చేయవచ్చును. కాని అచేతన ప్రపంచమును చూపుట అసాధ్యము.... కళకు అనుకరణము సాధనము, సాధ్యము చిత్తైకాగ్రత, దానిఫలము శాంతి ... ఈ శాంతిని సాధించు వస్తువులయము, శాంతి అనగా సోమరితనము గాదు ఏకాగ్రత, అవిదిత వేద్యాంతరముగా ఏదేని యొక వస్తువునందు చిత్తము నిల్పగలుగుట బహుభేదములచే భిన్నమగు ఈ ప్రపంచము నందు అభేదానుభవమును సంపాదించుట ఇట్టి యవస్థ ఆనందమయము. ఆనందమనగా సుఖముగాదు. సుఖము

ఇంద్రియములకు సంబంధించినది. ఆనందము ఆధ్యాత్మికము అనగా ఆత్మకెక్కువ సంబంధించినది." అని లలితకళలను విశ్లేషించి వాటి ప్రయోజనాలను వివరించారు.

"తీవ్రములైన ప్రాణి భావభేదములను గానము చూపగలిగినట్లు ఏ యితర కళయు చూపలేదు" అని నాటకంలో సంగీత ప్రాధాన్యతను చెప్పారు. నాటకంలో అభినయానికి కవిత్వం, కవిత్వానికి సంగీతం సహాయపడటం వల్లనే భావ సంపూర్ణత ఉంటుందని రాళ్ళపల్లి భావన.

కళ స్వతంత్రం. అది ఇతర కళలపై ఆధారపడాల్సిన అవసరం లేదనే స్వతంత్ర వాదన పట్ల రాళ్ళపల్లికి గౌరవం లేదు. స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించాలి అనే విషయాల్ని కళ, నీతి అనే రెండు అంశాలాధారంగా చర్చించారు. స్త్రీలు రంగస్థలం మీదకు రావటం వల్లనే నాటకం అభివృద్ధి సాధిస్తుందను కోవడం భ్రమ. కళ వ్యక్తికి గాని, జాతికి గాని చెందినది కాదు. "స్త్రీ పాత్రల్ని పురుషులు, పురుషపాత్రల్ని స్త్రీలు ధరించి మెప్పించవచ్చును" అందువల్ల ప్రాధాన్యత ప్రాముఖ్యత వ్యక్తికి కాక పాత్రకే వుంటాయి. నీతి దృష్ట్యా స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించడం వల్ల కళకు నష్టమే! "స్త్రీ పురుషుల పరస్పరాకర్షక శక్తి మైత్రి పెరిగిన కొలది కృశించును" అనే వాదాన్ని రాళ్ళపల్లి ఏమాత్రం అంగీకరించలేదు. నాగరికత వల్ల ప్రతి జాతి అనేక రకాల కట్టుబాట్లు, నియమాలు నిర్మించుకుంటుంది. అవి జరిగేవరకూ స్త్రీలు రంగప్రవేశం చేయకపోవడమే ఉత్తమమని భావించారు.

"అవస్థానుకృతిర్నాట్యమ్" అన్న మాట కేవలం నాట్యానికి, నాటకానికి మాత్రమే పరిమితం కాదు. అన్ని లలితకళలకు వర్తించే అంశం. కళ అనుకరణమే అని అంగీకరించినా, అనుకరణకు కూడా పరిమితులున్నాయి. అనుకరణలో అనుకర్త కొంతదూరం మాత్రమే వెళ్ళగలడు. ఎందుకంటే భక్త ప్రహ్లాదనాటకం చివర నరసింహపాత్రధారి హిరణ్యకశ్యప పాత్రధారిని వధించినట్లు మాత్రమే నటించగలడు. నిజంగా వధించలేడు కదా! అందుకే అనుకరణకు హద్దులున్నాయి. రాళ్ళపల్లి చెప్పినట్లు "ఇది ఫలానిదని గుర్తించుటకు కావలసిన ముఖ్య ధర్మమును – మనభావనా వీధిలో ప్రతిబింపజేయుటయే తప్ప దాని యంగోపాంగముల జ్ఞానమును మనమెదడు కంటించుట కాదు" ఆచార్య శలాక రఘునాథ శర్మగారన్నట్లు "తెల్లని మల్లెపూవును నల్ల రాతిలో చెక్కి శిల్పి చూపుతాడు" "కళకు అనుకరణము సాధనము. సాధ్యము చిత్తైకాగ్రత" అన్న రాళ్ళపల్లి మాటల వెనుక శాస్త్రీయత ఉంది. ఇది అభినవ గుప్తుని సహృదయ సిద్ధాంతానికి అన్వయించేదికూడా! "కళ యందు రెండు" గుణములు చూపించవచ్చును. సుఖము చమత్కారము. శిల్పము యొక్క అభిమతము సుఖముగాని, చమత్కారము కాదు" అంటారు కట్టమంచి. రాళ్ళపల్లి దీనికన్నా మరింతలోతుకు వెళ్ళి సహృదయానందాన్ని విశ్లేషించారు. ప్రాచీన భారతీయ లాక్షణికులు మరణం, రోగం, శవదహనం, యుద్ధం వంటివి రంగస్థలం మీద ప్రదర్శించకూడదని నిర్ణయించడాన్ని జ్ఞాపకం చేసుకుంటే రాళ్ళపల్లి అభిప్రాయాలు ఎంత వాస్తవమైనవో అర్థమవుతుంది. ఈ మాటలను అరిస్టాటిల్ మాటలతో సమన్వయించ వచ్చు. He must represent things such as they were or are such as they are said to be and belived to be or such as they should be (Poetics)"

ఈ అంశాన్ని సమర్థించడానికే 'లయ' వాదాన్ని చర్చించారు. నాట్యంలో ఛందస్సు, సంగీత సమ్మేళనం అవసరమా కాదా? అనే విషయాన్ని నిరూపణ కోసం 'లయ' ను వివరించారు. కళానుకరణలో బహిరంశాలైన రూపక్రియలు ఒకభాగం, ఆంతరంగికం మరొకభాగం! బాహ్యానుకరణ కష్టం కాకపోవచ్చు! కాని అంతరింగకమైన తత్త్వానుకరణలో 'లయ' ఎంతో అవసరమవుతుంది. ఈ 'లయ' ను అనుసంధించడానికి ఛందస్సు, సంగీతాలు ముఖ్యసాధనాలుగా ఏర్పడుతాయనే రాళ్ళపల్లి విశ్లేషణ చాలా సమంజసంగా ఉంది. ఇది సహృదయ సిద్ధాంతానికి చాలా అనుగుణమయినది. అరిస్టాటిల్ Catharsis theory కి భారతీయుల రససిద్ధాంతానికి చాలా సమన్వయముందని కూడా రాళ్ళపల్లి అభిప్రాయాలాధారంగా మనం నిరూపించవచ్చు.

"Tragedy not only rouses these emotions (fity and fear) but also by the way it rouses them effects a castharíss of emotions" అని అంటారు అరిస్టాటిల్. ఈ "అనుభూతి" భావనను క్రోంబి ఇలా విశ్లేషించాడు.

"Aristotle regarded the function of tragedy as something medical : the pity and fear of tragedy were the doses with which the tragic poet homeopathically purges his audience into emitional health. Tragedy certainly does produce an enjoyable and wholesome effect by rousing in us emotions in real life would be unpleasantly and perhaps dangerously disturbing. Thus the emotions roused by the spectable of the evil in life are by tragedy deprived of evil effect and even made beneficial. So something like purification (though not exactly in the religious sence) also may be alleged" కాబట్టి ఈ విశ్లేషణ మన రససిద్ధాంతానికి అన్వయించేదే.

బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీను ఘట్టంలో చితిలో శవం కాలుతూ ఉంది. కాటికాపరయిన హరిశ్చంద్రుడు

"మాయామేయ జగంబెనిత్యమని సంభావించి మోహంబునన్
నాయిల్లాలని నాదు పుత్రుడని ప్రాణంబుండు నందాక యెం
తో యల్లాడిన యీ శరీర మిపుడిందున్ గట్టెలన్ గాలుచో
నా యిల్లాలునురాదు నా సుతుడుతోడై రారు తప్పింపగన్"

ఈ పద్యం చూస్తున్న ప్రేక్షకుడు పాత్రోన్మీలనం పొందుతాడు. జీవితం అశాశ్వతమనే భావాన్ని ఆక్షణం అనుభవిస్తాడు. అరిస్టాటిల్ Catharsistheory గా చెప్పిన భావక్షాళనం "భావితాంతఃకరణ ప్రవృత్తి" ని కలిగిస్తుంది. అందుకే నాట్యంలో, నాటకంలో, నేటి సినిమాలో సంగీత సాహిత్యాలకు ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. పై భావాల్నే రాళ్ళపల్లి మాటలో ఇలా చదువుకుంటాం "భావములను తీవ్రపరచు శక్తి శ్రుతి రాగ తాళ లయల నాశ్రియంచిన సంగీతమునకున్నది. అక్షర మాత్రాలయమును జూపుశక్తి పద్యరచన కున్నది" దీనికి సవరణగా కాక అనుబంధంగా ఒక మాట చెప్పుకోవాలి. పద్యం లేకపోయినా వాడుకభాషలో గురజాడ 'కన్యాశుల్కం' రసానుభూతికి ఏమాత్రం తక్కువ కాదు. ఈనాటక ప్రదర్శనలో కూడా సంగీతం తప్పనిసరి! ఇంకొక సందర్భంలో ఈకాలపు మహారచనగా రాళ్ళపల్లి కన్యాశుల్క నాటకాన్ని అభివర్ణించడంలోని అర్థమిదే!

ఈ ఉపన్యాసంలో మూడవ అంశం స్త్రీపాత్రలు స్త్రీలే ధరించాలన్నది. ఈ విషయాన్ని రెండు కోణాల్లో విశ్లేషించారు. మొదటిది కళాదృష్టి, రెండవది నైతికదృష్టి, స్త్రీవేషాన్ని ధరించి స్త్రీలను కూడా ఆకర్షించిన స్థానం నరసింహారావు, మైసూరు శామన్న వంటివారు చేసిన నాటకసేవ చాలాగొప్పది. నాటకం, స్త్రీ ఎలా ఉంటుందో చూపడానికి కాదు. హనుమంతుని పాత్రకు కోతినే తీసుకురావాలి మరి! కాబట్టి స్త్రీ పాత్రను పురుషుడెందుకు పోషించకూడదంటారు. ఈ అంశాన్ని ఆధునికులు అంగీకరించరు. స్థానం నరసింహారావు వంటి మహానటులు అన్నివేళలా దొరకరు. అయినా కూడా విద్యావంతురాలవుతున్న ఆధునిక మహిళకు అనుకరణ తగదనడం సరికారు. కాబట్టి రాళ్ళపల్లి వారి వాదాన్ని అంగీకరించడం కష్టం.

రెండవ ఉపన్యాసం చివరలో ధర్మవరం, కోలాచలం గార్లు కూడా స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించాలనే అభిప్రాయాన్ని కలిగివున్నారని రాళ్ళపల్లి ఆలోచన. ప్రసిద్ధ తమిళనవలా రచయిత జయకాంతన్ స్త్రీ పాత్రల్ని స్త్రీలే పోషించడం మంచిదన్నారు. ఆయన రాసిన "కల్యాణి" నవల దీనికి ఉదాహరణ.

లక్షణ నిర్ణయంలో, కళానిర్వచనం, విశ్లేషణలో, కావ్యప్రయోజన చర్చలో రాళ్ళపల్లి భావాలు అన్నికాలాల్లో ఆమోదయోగ్యమైనవే! "శర్మగారు లక్షణ విషయమున అధికారికంగా మాటలాడగల్గిన సమర్థులు. సంస్కృతాంధ్ర ఆంగ్లసాహిత్య పరిశీలనాదక్షులైన వీరి విమర్శలు ప్రత్యేక విశిష్టత కలిగినవై సహృదయాకర్షకములుగ నుండును. ఇట్లు సంయమనముతో చేయబడినవై సాహిత్యస్థాయినందుకొనెడి విమర్శలను వెలయింపగలవారు తెలుగుదేశంలో చాలా తక్కువగానున్నారని చెప్పవచ్చును" అని శలాక రఘునాథశర్మ అన్నారు.

రెండవ ఉపన్యాసం ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుగారి నాటకాలను తులనాత్మకంగా

పరిశోధించారు. వీరి రచనలమీద రాళ్ళపల్లి చేసిన చర్చను తెలుసుకోనేముందు వీరి గురించి చాలా చిన్న పరిచయం చేస్తాను. ధర్మవరం రామకృష్ణమాచార్యులు బళ్ళారిలో న్యాయవాది. "ఆంధ్రనాటక పితామహుడు" గా బిరుదు. 1886లో బళ్ళారిలో నాటక ప్రదర్శనకోసం "సరసవినోదినీసభ" ను ఏర్పరచారు. తెలుగు, సంస్కృతం, కన్నడం, ఆంగ్లభాషల్లో పండితులు. ముప్పయి నాటకాలు రాశారు. వాటిలో విషాదసారంగధరము, పాదకాపట్టాభిషేకము, చిత్రనళినీయము, చంద్రహాస, మోహినీ రుక్మాంగద, సావిత్రీచిత్రాశ్వము, అజామిళ ముఖ్యమైనవి. కోలాచం శ్రీనివాసరావు గారు కూడా బళ్ళారిలోనే న్యాయవాది. బళ్ళారిలో "సుమనోరమసభ" అనే నాటక సమాజాన్ని స్థాపించారు. 1905లో 'వాణీవిలాసము' అనే నాటక ప్రదర్శనశాలను కూడా ఏర్పాటుచేశారు. "చారిత్రక నాటక పితామహుడు" గా ఖ్యాతిపొందారు. సునందినీ పరిణయము, విజయనగర రాజ్యపతనము, సుల్తానాచాంద్‌బీబీ, ప్రతాపాక్బరీయము, చంద్రగిర్యభ్యుదయము, మదాలస, రుక్మాంగద చరిత్రము వంటి 25 నాటకాలకు పైగా రచించారు. ఇద్దరూ సమకాలీకులు. ధర్మవరం వారి అల్లుడైన బళ్ళారి రాఘవ కోలాచలం గారి నాటక సమాజంలో చేరి మహానటుడిగా ప్రపంచ ప్రసిద్ధిని పొందారు.

ధర్మవరము కోలాచలం గార్లు నాటకమార్గంలో ఎంతదూరం వెళ్ళారు? ఆ మార్గంలో ఏమి సాధించారు? ఏమి వదిలివేశారు? ఆమార్గం ఎంతవరకూ అనుసరించవచ్చు? అనే నాలుగు ప్రశ్నలతో రెండవ ఉపన్యాసాన్ని ప్రారంభించారు.

"ధర్మవరము కోలాచలము గార్లు పాశ్చాత్య సారస్వత పరిచయము మూలమున తమ మాతృభాషను తన్మూలమున దేశీయులను వృద్ధికి దేవలయునని యుద్రేకముతో ప్రవర్తించినారు. కాని వీరేశలింగము పంతులు మొదలగు కొందఱివలె అన్ని త్రోవలలోను నడవబోయి అవకతవకపని చేయలేదు" అన్నారు.

"అంశములను రంగములుగా విభజించుట, నాందీప్రస్తావనలు వదులుట, మరణము మొదలగు వానిని ప్రత్యక్షముగా చూపుట ఇత్యాదులలో పాశ్చాత్యపద్ధతిననుసరించి మన కవులు నాటక రచనకు చాలా మేలిమిని తెచ్చారనుటలో సందేహము లేదు" అని ఇరువురిని ప్రశంసించారు.

రంగస్థలంపై ప్రదర్శించడానికి వీలులేనివని ప్రాచీన అలంకారికులు చెప్పినవన్నిటిని రాళ్ళపల్లి సమర్థించారు. శృంగార చేష్టలను ప్రదర్శించడం అనౌచిత్యానికి దారితీస్తుందన్నారు.

పాశ్చాత్యసాహిత్య ప్రభావంతో ఇరువురూ విషాదాంత నాటకాలు రాశారు. ధర్మవరం వారి సారంగధర నాటకమొక్కటే విషాదాంతనాటకమన్నారు. "పదిశోకాంత నాటకములు చేసినంతపనిని తెలుగువారికిది యొకటే చేసినది, చేయుచున్నది. దీనికి తగినట్లు కార్చుటకు గావలసినన్ని కన్నీళ్లు తెలుగువారి కున్నవా? యని సందేహపడవలసి యున్నది" అని సారంగధర నాటకంలో కరుణరసం శ్రుతి మించినదన్నారు. "రసమేదియైనను మనము సహజముగా నేర్పరచుకున్న నీతి, ధర్మము, అనురూప్యము, సౌమనస్యము మొదలగు హద్దులను మీఱిపోయినచో దాని ఫలమగు ఆనందమును మన మనుభవింపజాలము" ఇరువురికి పాటలపై మమకారమెక్కువ, ధర్మవరం వారికి మరీ ఎక్కువ. కోలాచలం గారికి పద్యాలంటే ఇష్టం. "పామర జనుల తృప్తికై పాటలు వ్రాయవలసివచ్చినది" అని ఇరువూరు చెప్పడాన్ని రాళ్ళపల్లి అంగీకరించలేదు. ఇరువురి సాహిత్యమూ ప్రబంధశయ్యకు చెందినదన్నారు.

నీతి ప్రబోధం విషాదాంత నాటకాలలో ఉన్నతంగా సుఖాంతాలలో సాధ్యం కాదని రాళ్ళపల్లి భావన. "విషాదము నెక్కువగా నాటకములందనుభవించుటచే జనులు నీతిమందులగుదురనుట నా సిద్ధాంతమునకు గాని, యనుభవమునకుగాని యింకను రాని మతము" అని చెప్పారు. అయితే ఇరువురు నాటకకర్తలు నీతిపేరుతో రసాన్ని, రసం పేరుతో నీతిని నాశనంచేసినవారుకాదన్నారు.

మిశ్రపాత్రలు లోకసహజమన్నారు. ఇటువంటి పాత్రలవల్ల ఔచిత్యం కలుగుతుందనే స్వభావ వాదుల అభిప్రాయాన్ని రాళ్ళపల్లి ఏమాత్రం ఆమోదించలేదు. పాత్రోన్మీలనం, మనసుమీద ముద్రపడటం వల్ల, కవి నటుల ప్రతిభావర్చస్సు వంటి వాటివల్ల ఔచిత్యం ఉంటుంది తప్ప మిశ్రపాత్రల వల్ల కాదని అన్నారు.

ఈ రెండవ ఉపన్యాసాన్ని విమర్శిస్తే అనేక ఆసక్తికరమైన తెలుస్తున్నాయి.

ప్రాచ్యపాశ్చాత్యుల నాటకనిర్మాణంలో పెద్దగా తేడాలులేవని రాళ్ళపల్లి అభిప్రాయం. తెలుగునాటకాల ఆవిర్భావంలో పాశ్చాత్యప్రభావం అందరికీ తెలిసిందే. అయితే ప్రాచ్యపాశ్యాత్య నాటక సిద్ధాంతాలను క్లుప్తంగానయినా చర్చించిన విమర్శకులలో రాళ్ళపల్లి మొదటి వారు. ప్రాచ్యులు పాశ్చాత్యులిరువురూ రసపోషకులే! పరిభాషలోనే
చిన్న తేడాలున్నాయి. భారతీయులు గద్య పద్యాత్మకంగా నాటకాన్ని నిర్మిస్తారు. పాశ్చాత్యులలో గద్యానికే ప్రాధాన్యత ఎక్కువ. భారతీయులలో అంకవిభజన ఉంటే పాశ్చాత్యుల నాటకాలు రంగవిభాజ్యకాలు. రంగస్థలంపై మరణం, యుద్ధం వంటి వాటిని ప్రత్యక్షంగా ప్రదర్శించరు. కానీ పాశ్చాత్యులు ప్రదర్శిస్తారు. పాత్రసూచన ఇక్కడ ఉంది. అక్కడలేదు. సుఖాంతాలకే ఇక్కడ ప్రాధాన్యం, ప్రాచుర్యం! అక్కడ విషాదాంతాలకే సింహాసనం. మనకు పాత్రలు సంపూర్ణ సుగుణాలు, లేదా సంపూర్ణ దుర్గుణాలుగా ఉంటాయి. వారు సుగుణదుర్గుణమిళితమైన పాత్రలు ఉంటానికి ఇష్టపడతారు.. ధర్మవరం, కోలాచలం కవులిద్దరూ ఈ పద్ధతులను స్వీకరించి మధ్యేమార్గాన్ని అవలంబించారని రాళ్ళపల్లి విశ్లేషించారు. ధర్మవరం కోలాచలం గారి తరంలో పద్యనాటకాలు తగ్గి గద్యనాటకాలు విస్తృతమయ్యాయి. అయితే ఇద్దరూ పద్యగద్యాలతోనే నాటకాలు రాశారు. పాటలు పామరులకోసం రాసుకున్నామని చెప్పుకున్నారు. పద్యాలు కోలాచలం వారి నాటకాల్లో చాలా ఎక్కువని ధర్మవరం వారి నాటకాల్లో తక్కువని రాళ్ళపల్లి విశ్లేషించారు.

నాందీప్రస్తావనలు రాయడం మన సంప్రదాయం. ఇరువురూ కొన్నింటిలో కొద్దిగా, కొన్నింటిలో పూర్తిగా వదలేశారు. అయితే అవి ఉండటమే ఉత్తమమని రాళ్ళపల్లి ఉద్దేశం. ప్రస్తుతం అంతగా అవసరం లేదని ప్రస్తుత నటులు, నాటకకర్తలు ప్రదర్శించడం లేదు.

రంగస్థలం మీద ప్రదర్శించే వీలులేనివిగా శృంగారం వంటి వాటిని ప్రాచీనులు చెప్పారు. ధర్మవరం వారు రంగస్థలంలో ఆలింగనం, చుంబనం వంటివాటిని అనుమతించడాన్ని రాళ్ళపల్లి ఆక్షేపించారు. నాటకానికి ఆధునిక రూపమైన సినిమాల్లో వీటి ప్రదర్శన ఎక్కువయి జనజీవితం మీద తీవ్రప్రభావం చూపుతున్నాయన్న రాళ్ళపల్లి మాటలే సమర్థనీయాలు.

విషాదాంతాల మీద ఇరువురికి మక్కువ ఎక్కువని తేల్చారు. 'ఊరుభంగం' ఒక్కటే సంస్కృతంలోని విషాదాంతం. కాబట్టి పాశ్చాత్య ప్రభావమే దీనికి కారణమని ఆయన అభిప్రాయం! ధర్మవరం వారివి నాలుగు విషాందాంతాలు! విషాదసారంగధర, అజామిళ, చంద్రహాస. విషాద సారంగధరలో అవసరం కన్నా ఎక్కువగా విషాదం ఆవరించింది. సారంగధరుని మరణాన్ని ఆపే అవకాశం ఉన్నా ధర్మవరం వారు ఆ పనిచేయలేదన్నారు. చిత్రాంగిని చంపాల్సిన అవసరం లేదు. కోలాచలం వారి విషాదనాటకాలు మూడు. రామరాజు, సుల్తానాచాంద్‌బీబీ, శిలాదిత్య. అయితే కోలాచలంగారికి విషాదంతాల పట్ల పెద్దగా అభిమానం లేదని, 'రామరాజు' నాటకాన్ని సుఖాంతంగానే రాశారని, "సుమనోరమసభ" నటులు నాటకం చివర్లో అషాబీ, పఠాన్ మరణాన్ని కల్పించి విషాదాంతంగా మార్చారని రాళ్ళపల్లి చేసిన శాస్త్రీయ విశ్లేషణ వాస్తవమైనది. ప్రధానపాత్ర మరణం వల్ల విషాదాంతంగా నాటకం మారిపోదు. ప్రేక్షకుడు తీవ్రభావోద్వేగంతో గుండెబరువుతో నాటక ప్రదర్శనశాల నుండి వెళ్ళినప్పుడే విషాదం రంగస్థలం మీద రక్తికడుతుందని చెప్పడాన్ని ఎవ్వరయినా అంగీకరిస్తారు.

రచయితలే నాటకాలను ఆడించడం వల్ల ఉన్న ఉపయోగాలను వివరించారు. నటుల, పరిషత్‌ల అభిప్రాయాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. అందువల్ల నాటకానికి అవసరమైన బిగువు, ఐక్యత, అనురూప్యత, కథాప్రవాహం వంటి సద్గుణాలు సిద్ధిస్తాయి. ధర్మవరం స్వయంగా పాత్రధారణ చేయడం వల్ల కోలాచలం నాటకాల
కంటే వారి రచనల్లో ఈ లక్షణాలు గొప్పగా ద్యోతకమవుతున్నాయన్న రాళ్ళపల్లి విశ్లేషణ సమంజసమే. ఈ విశ్లేషణను ఇతర నాటక విమర్శకులు అంగీకరించలేదు. "సభ్యులను దృష్టిలో పెట్టుకొన్న ఆచార్యుల వారు దీనికెక్కువ అవకాశమును కల్పించుటచే అతకని భాగములు, మరికొన్నిచోట్లు సభ్యతను మీరిన ప్రసంగములు కూడా కలవు" ధర్మవరం నాటకాల్లో హాస్యరసం ఎక్కువని రాళ్ళపల్లి చెప్పినప్పటికీ ఈలోపాన్ని గుర్తించలేదు. సినిమాల ఉధృతిలో నాటకదీపం కొడిగట్టుతోంది.

అయినప్పటికీ 1998లో పాటిబండ్ల ఆనందరావుగారు 'పడమటిగాలి' నాటకంలో రాళ్ళపల్లి చెప్పిన గుణాలన్నీ మూర్తీభవించాయి. ఆనందరావు నటుడు, దర్శకుడు కావడం వల్ల ఆనాటకం తెలుగు నాటక చరిత్రలోనే అత్యధిక ప్రదర్శనలు పొందుతోంది.

నీతిబోధకు ధర్మవరం వారు కొంత ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారని "కళా సంసారమున నీతి తెరమఱుగు భార్యగా నుండి పనిచేయవలయునే కాని ముందుపడి మొగము చూపి త్రోసికొని రారాదు. అట్లయినచో కళ సొగసు చెడును" అని విశ్లేషించారు. ఈ అభిప్రాయం వల్ల ప్రాచీన ఆలంకారిక స్వభావాన్ని రాళ్ళపల్లి కలిగున్నారని అర్థమవుతోంది. "కావ్యం కాంతా సమ్మితమని" ప్రాచీన అలంకారికులు చెప్పిందేకదా! అయితే భార్య తలుపుచాటునే ఉండవలెనా?

ఇలా ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు గార్ల నాటకాలను తులనాత్మకంగా చర్చించారు. "ఇది పై పరామరిక మాత్రమే లోతుకు దిగి చూడవలసినది చేయవలసినది కొండంత కలదు. నా కన్నా శక్తియు, అవకాశమును అనుకూలమును గలవారాపనికి అధికారులు" అని వినయంగా రెండవ ఉపన్యాసాన్ని ముగించారు, 1934లో ఈమాట చెప్పితే మూడున్నర దశాబ్దాల తరువాత అంటే 1972లో కోలాచలం శ్రీనివాసరావు గారి నాటకాలమీద ఎస్. గంగప్ప పరిశోధన చేశారు. 1974లో ధర్మవరం గారి నాటకాలమీద సాధన వీరాస్వామి నాయుడు పరిశోధన చేసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. ఎస్. గంగప్ప, సాధన వీరాస్వామినాయుడు ఇరువురికి సిద్ధాంత గ్రంథరచనలో తగిన సూచనలు సలహాలను ఇచ్చి ప్రోత్సాహం అందించినది రాళ్ళపల్లి వారే!

**2. నాటక కళ – నేటి మన నాటకములు**

ఇది కూడా ఉపన్యాసమే! 1938 డిసెంబరు 15వ తేదీన నెల్లూరులో అష్టమాంధ్ర నాటక కళాపరిషత్తు సమావేశం జరిగింది. దీనికి రాళ్ళపల్లి అధ్యక్షోపన్యాసం చేశారు. 1939 జనవరి భారతి సంచికలో ఆ ఉపన్యాసం ప్రచురణయ్యింది.

ఇప్పటి నాటకాలు రెండు రకాలు. తీవ్రమయినవి, తేలకయినవి. రెండింటిపట్లా తనకు ఇష్టం సన్నగిల్లిందని ఉపన్యాసాన్ని ప్రారంభించారు. తీవ్రమైన నాటకాలలో కామ, క్రోధాలు ఎక్కువ. ఇటువంటివి చూసిన చదివిన సహృదయాలు కూడా సంతోషిస్తున్నామనే భ్రాంతిని పొందుతున్నారు. ఇదే ఉత్తమ కళ అనే భ్రమలో పడుతున్నారు.

స్త్రీవేషాన్ని పురుషుడు వేసి "విలాసబిబ్బోక విభ్రమములతో" తృప్తిపడక స్త్రీపాత్రను స్త్రీలే పోషించాలనే భావన పెరిగింది. దీనితో కూడా తృప్తి పడలేదు. పాత్రలకు శృంగారాన్ని దట్టించడం ఎక్కువైంది. అదిచూసి కామోద్రేకాన్ని పొందేవారు ఎక్కువయ్యారు. కాని ప్రభుత్వం, కొందరి పెద్దల వల్ల ఇది కొంత అదుపులో ఉంది. కాని పాశ్చాత్య సంస్కృతిలో ఇటువంటి ఉద్రేకానికి ప్రాధాన్యత ఎక్కువ. దీని తీవ్రత వల్ల హిట్లరు, ముస్సోలిని వంటి వారు ఉద్భవించారు. "కాని యీ యుద్రేక కోలాహలములలో రసప్రధానమైన రచనకు ప్రయత్నించు కవులు గాని అంతకన్న దానినభినయింప సాహసించు నటులు గాని చూచు నుత్సాహము గల సభ్యులు గాని సామాన్యముగా కానరాకపోవుచున్నారనుట మనమిప్పుడు చింతింప వలసిన విషయము" ఇరువై సంవత్సరాల కింద కర్నాటకలో రత్నావళి, శాకుంతలం, మృచ్ఛకటికం వంటివాటిని అభినయించేవారున్నారు. నేడు వారు లేరు. చివరికి పాఠశాల, కళాశాలలో షేక్స్పియర్ నాటకాలు ప్రదర్శించే విద్యార్థులూ లేరు. తెలుగు నాటకరంగ పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీలేదు. ప్రాచీన భారతీయ నాటకాలలో చాదస్తాలున్నాయని విమర్శకులు అంటున్నారు. నిజమే! కాని అంతలోనే వాటి స్వరూపమంతా ముగిసిందా? చాదస్తాలను వదలి వాటిలోతును చూడటమే ఉత్తమ సంస్కారానికి గుర్తు. ఆధునిక నాటక కర్తలకూ కాలైక్యం వస్త్వైక్యం వంటి చాదస్తాలున్నాయి. సినిమాల వ్యాప్తివల్ల నాటకాలకు ఆదరణ తగ్గిందని కొందరి అభిప్రాయం. దానివల్ల సమాజానికి ప్రత్యేకంగా జరిగిన కష్టమేమో నాకు అర్థంకాదు. నాటక కంపెనీలు చేసే పనినే సినిమా కంపెనీలు చేస్తున్నాయి. సంకుచితమైన రంగస్థలం ఇప్పుడు విశాలమైంది. ఇప్పుడు నటులు, కవులు ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. ఆ పెట్టుబడికి తగినట్లు ఎక్కువ లాభాన్ని సంపాదించుట తప్ప నాటకాలకు సినిమాలు చేసిన తప్పేమిటి? నాటకాల దృష్టి సినిమా దృష్టికన్నా భిన్నమయ్యేంత వరకూ రెండింటికి ఈ స్పర్థత తప్పదు. ఈ పోటీలో ఎక్కువ అనుకూలాలు సినిమాలకే.

ఈ ఉద్రేకాలను చౌకవినోదాలను వదలి రసంమీద దృష్టి నిలపాలి. రసపోషణకు ఇవి కొంతవరకే ఉపయోగపడతాయి తప్ప ఎక్కువగా పనికిరావు. "పూవులతో పూజలు, పాటలతో ప్రార్థనలు జరుగుచున్నంత వరకూ భక్తిరసము భోగ్యముగా నుండును గాని, భక్తులు శివమెత్తి బిత్తలియాటలాడ మొదలుపెట్టి స్త్రీ పురుష భేదము లేని యద్వైతమునకు దిగిరేని రసికులాచోట నుండక చల్లగా జారవలసినదే" సినిమాలో అన్నీ ఒకసారి చిత్రించడంతో పనిపూర్తవుతుంది. నాటకంలో ఇది సాధ్యంకాదు. సినిమాలో "అభినేత యెంత సమర్థుడైనను మనము చూచునది వాని నీడయే కావున మన మనుభవించునదియు రసచ్ఛాయయే కాని రసము కాదు. ఇంతేగాక నిన్నటి యభినయము చాలదని కాని తోచినచో నేడు దానిని మార్చుకొని చేర్చుకొని సవరించు నలుకూలము నాటకము వారికి గలదు. కావున బేజారుకవకాశము తక్కువ. సినిమాలలోనిది ఒకటే శాశ్వతముద్ర" అందువల్ల ఎలా చూసినా సినిమా నాటకాలకు పోటీ పెట్టుకొనుట పొరపాటు.

సామాన్యులకు గొప్ప పరాయణం, త్యాగబుద్ధి కలుగునా? వారికి ధనంమీద ఆశ ఎక్కువగదా? అనే ప్రశ్న వస్తే సామాన్యులు, ఎవరు? విశేషజనులు ఎవరు? చదువుకొన్నవారు విశేషజనులు, మిగిలినవారు సామాన్యులని కదా దీని అర్థం. అంటే చదువుకున్న వారంతా ద్రవ్యాశలేనివారు? చదువురానివారంతా పిసినారులా? అది అనుభవ విరుద్ధం. "అట్లుగాక ఉదాత్త విషయముల విలువ నెరిగిన వారు విశిష్టులు. తక్కినవారు సామాన్యులు అని చెప్పినచో అట్టి సామాన్య జనులకు ఉదాత్త విషయములను తెలియజెప్పినను తెలియదని ఊహింపవలెనా? అట్లూహించుటకు ఎవరికేమి యధికారము? అట్లుగాక సామాన్యులను సామాన్యులుగానే యుండజూచుట విశిష్టజనుల విశేషమునకు లక్షణమా? అవకాశమిచ్చి చూడవలయునుగాని మనము సామాన్యులనుకొను వారిలో ఎందరి యందు ఎన్ని విశేషధర్మముల బీజము లణగియున్నవో ఊరకయే మనకెట్లు తెలియను? విశిష్ట జనులనుకొను వారికి మాత్రమీ తెలివి పుట్టుకతో వచ్చినదా? నేర్చినది నేర్పబడినది కాదా? ఐనప్పుడు మన విశేషమందు మనకు నిజముగానే నమ్మకముండిన యెడల సామాన్యజనులకు దాన్ని రుచి చూపి మన దారికి తెచ్చుకోలేమా? తెచ్చుకోవలదా? నిజము చూడబోయిన ఈ సామాన్య విశేష విభాగము సుఖప్రియులగు సోమరులు చేసికొన్నది. వారి స్వార్థపరత్వమునకిది యూతకోల"

కాబట్టి ప్రజల్ని రసికులుగా చేయడం కవుల నటుల ధర్మం. ఈ పని మరీమరీ ప్రతి ఒక్కరూ చేయాలి. విశ్వవిద్యాలయాలు, విద్యాశాఖ వారు ప్రాచీన నాటకాలనే బోధిస్తున్నారు. అయినప్పటికీ వారి దృష్టి నాటక లక్షణాలు చరిత్ర, కవి, కథ, పోలికలు, విభేదాలు వంటి బహిరంగ విషయాల పట్ల ఆసక్తి ఉంది గాని అనేక స్వానుభవమార్గాలకు వెళ్ళలేదు.

ఇది రాళ్ళపల్లి ఉపన్యాసమే కాని స్వయంగా రాసి పత్రికలకు పంపినది కాదు. ఆయన ఉపన్యాసాన్ని ఇతరులు రాసుకొని ఈ రూపంలోకి తెచ్చివుండాలి. ఎందుకంటే 1932 నాటికే రాళ్ళపల్లి వ్యవహారిక భాషను ఆమోదించి, అప్పటి నుండి వ్యవహారిక భాషలోనే రాస్తున్నారు. కాని ఈ వ్యాసం గ్రాంధికభాషలో వుంది.

ఈ ఉపన్యాసంలో గుర్తించాల్సిన ముఖ్యమైన విషయాలున్నాయి. విశ్వవిద్యాలయాలలో ఎం.ఫిల్ కోసం పరిశోధించిన ఎస్. చంద్రశేఖర్, రమంజనీ కుమారీ గార్లు ఈ వ్యాసాన్ని పేర్కొనలేదు. బహుశా ఈ వ్యాసం రాళ్ళపల్లి గారి వద్ద లేదనుకుంటాను. ఘట్టమరాజు గారి వద్ద కూడా లేదు. వేటపాలెం గ్రంథాలయం నుండి నేను సేకరించాను.

స్త్రీ పాత్రల్ని స్త్రీలే పోషించాలి అనే విషయాన్ని ఈ ఉపన్యాసంలో కూడా చర్చించారు. నాటకోపన్యాసాల సందర్భం కళా, నైతిక దృక్పథాలతో చర్చించిన ఈ అంశానికి మరింత వివరణను ఇక్కడ ఇచ్చారు. పాత్రలకు శృంగారాన్ని దట్టించి ప్రేక్షకుల్ని కామోద్రేకుల్ని చేయడం ఎక్కువయ్యిందనడం నేటి సినిమాలకు చక్కగా వర్తిస్తుంది. స్త్రీని మనిషిగా చూపడం కన్నా శృంగార వస్తువుగా చూపడం ఎక్కువైంది. దీనివల్ల సామాన్య స్త్రీకి భద్రత కరువవుతోంది. ధన ప్రభావం ఎక్కువ కావడమే దీనికి కారణమని రాళ్ళపల్లి చెప్పిన వివరణ చక్కగా వుంది. నాటకోపన్యాసాల్లోని విషయానికి ఈ వ్యాసం మరింత చేయూతనిస్తోంది..... "...శివమెత్తి బిత్తలియాటలాడ మొదలుపెట్టి స్త్రీ పురుష భేదములేని యద్వైతయునకు

దిగే.....” ప్రమాదాన్ని 1934 నాటికే అంచనా వేసివున్నారు. ఈ వ్యాసాన్ని చక్కగా అర్థం చేసుకుంటే స్త్రీ పాత్రను స్త్రీ పోషించడాన్ని ఆయన వ్యతిరేకించలేదని, అంగాంగ ప్రదర్శనకే ఆయన వ్యతిరేకి అని స్పష్టమవుతోంది. నిజానికి 1934 నాటికి భారతీయ సినిమా ఇంకా ప్రాదుర్భావదశలోనే వుంది. అయినప్పటికీ రాళ్ళపల్లి అంచనా ఎంతో దూరదృష్టి కలిగినది.

నాటక సినిమాల మధ్యనున్న తేడాను చాలా చక్కగా విశ్లేషించారు. సినిమాను చిత్రీకరిస్తే ఇక మార్చలేం. కాని నాటకం అలా కాదు. “నిన్నటి యభినయము చాలదని కాని బాగులేదని కాని తోచినచో నేడు దానిని మార్చుకొని చేర్చుకొని సవరించుకొనే అవకాశం” నాటకానికి ఉంది. దీనికి చక్కని ఉదాహరణ. శివాజీగణేశన్ మద్రాసులో ప్రతి సాయంత్రం ఒకే నాటకంలో ఒకే పాత్రను ఐదు సంవత్సరాల పాటు పోషించాడు. అప్పటికి ఆయన ప్రసిద్ధ సినిమా నటుడు కూడా! ఐదు సంవత్సరాల పాటు శివాజీగణేశన్ ప్రదర్శనను దర్శించిన ఒక ప్రేక్షకుణ్ణి ఒక పత్రికా విలేఖరి “ఎందుకు మీరు ఐదు సంవత్సరాలుగా ప్రతిరోజు ఇదే నాటకాన్ని చూస్తున్నారు? అని ప్రశ్నించాడు. “శివాజీగణేశన్ ఆ పాత్రను నిన్న పోషించినట్లు నేడు పోషించడం లేదు. ప్రతిరోజూ ఆయన నటన చాలా వైవిధ్యంగా వుంది.” అని ప్రేక్షకుడు సమాధానమిచ్చాడు! సామాన్యులకున్న గొప్పతనాన్ని, వారిలోని రసికతను చాలా గొప్పగా విశ్లేషించారు. రాళ్ళపల్లి సామాన్యుని పక్షమే! అందుకే ఆయన గ్రాంథికం నుండి వ్యవహారభాషకు మొగ్గారు.

యూనివర్సిటీలు ‘ఒట్టి శుష్క విషయములతో కూరి నించుచుండిరి”, సుఖదుఃఖాల మూలస్థానమైన ‘భావాంబర వీధి’ అనే హృదయం ఒకటి వుందని యూనివర్సిటీలు గుర్తించలేదనడం నేటికీ వాస్తవమే. అనవసరమైన లాక్షణిక చర్చకున్నంత ప్రాధాన్యత లోతైన వాస్తవాలకు విశ్వవిద్యాలయాలలో చోటు లేదనడం అక్షరాల వాస్తవం.

**ఆధార గ్రంథాలు**

1. ఆచార్య శ్రీరామచంద్రుడు పుల్లెల (2002), అలంకారశాస్త్ర చరిత్ర, నందనం, హైదరాబాద్.
2. రామకృష్ణమాచార్య నండూరి (1996), కావ్యాలోకం, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
3. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణలు, హైదరాబాద్.
4. గోర్కీ సాహిత్య వ్యాసాలు (2015), ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్.
5. డా॥ శ్రీనివాస్ అంకే (2022), బహుముఖం, కవన ప్రచురణలు, అనంతపురం.
6. ప్రజాసాహితి (1985), ప్రజా కళారూపాల ప్రత్యేక సంచిక.

# తెలుగు నాటకరంగం విమర్శ – పరిశోధన

**డా. మహ్మద్ హసేన**
సహాయ ఆచార్యులు
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ)
రామగిరి, నల్లగొండ
సెల్ నెం. 9908059234

ఆంధ్ర దేశంలో 1880లో నాటక ప్రదర్శనలు ప్రారంభమైనట్లు ఆధారాలు తెలియజేస్తున్నాయి. నాటి మాస పత్రికలలో ఆయా నాటకాల గురించి, ప్రదర్శనల గురించి వివరణలు, వార్తలు వెలువడుతుండేవి. అంతేకాక వ్యక్తిగత ద్వేషాల వల్ల, ఇతర కారణాల వల్ల, నాటకాలలో తప్పులను, దోషాలను ఎత్తి చూపిస్తూ కొందరు పత్రికలలో వ్యాసాలు కూడా రాసే వారు. 1898లో కొక్కొండ వెంకటరత్నం పంతులు గారి "ప్రసన్నరాఘవం" అను నాటకాన్ని వివరిస్తూ మూలానికంటే మూడింతలు ఎక్కువగా విమర్శ రాశారు వేదం వేంకటరాయశాస్త్రి. 1900లో వెల్లాల సదాశివశాస్త్రి భట్టుమూర్తి కావ్యాలంకార సంగ్రహ కృతిలోని రస–నాయికా–నాయక ప్రకరణలని సహేతుకంగా విమర్శిస్తూ ఓ గ్రంథం రాశారు. ప్రాచీన లక్షణ గ్రంథం మీద తెలుగులో వచ్చిన మొట్టమొదటి విమర్శనాత్మక సమీక్ష ఇదేనని కొంతమంది అభిప్రాయం. 1906లో రెంటాల వెంకట సుబ్బారావు గారు, షేక్స్పియర్, ఒథెల్లో నాటకం మీద చక్కని ఆంగ్ల విమర్శ "Othello Unveiled" అనే పేరు మీద ప్రచురించారు. అలాగే 1909లో "హేమ్లెట్" నాటకం మీద కూడా విమర్శనాత్మక గ్రంథాన్ని రచించి ప్రచురించారు.

1908లో కోలాచలం శ్రీనివాసరావు ఆంగ్లంలో రచించిన "The Dramatic History of the world" గ్రంథం ఒక అద్భుతంగా చెప్పుకోదగ్గది. ప్రపంచ నాటక చరిత్రకు అనుబంధంగా నాటక రచయితలకు, నటులకు, సమాజాలకు, విమర్శకులకు, ప్రేక్షకులకు, సంబంధించిన సిద్ధాంత సూత్రాలు కూడా వివరించారు అందులో. ఈ గ్రంథం ఒక పరిశోధనాత్మక విమర్శ గ్రంథంగా చెప్పుకోవచ్చు. ఆ తరువాత కొందరు పండితులు కొన్ని నాటకాల మీద, ప్రదర్శనల మీద విమర్శలు ప్రకటించారు. కాని 1913లో ప్రారంభమై 1918–20 ప్రాంతాలకు బాగా వ్యాపించిన నాటక పోటీల పుణ్యమా అని ఆంధ్ర దేశంలో నాటక విమర్శ ఒక సాధారణ ప్రక్రియగా మారింది. విమర్శకులు, ప్రజలు నాటకంలో నటనా నక్షణాలను గురించి ఊహించడం ప్రారంభించారు. నాటకంలో సంగీతం ఉంటే నటనకు అవకాశం ఉండదని, "హార్మోనియం", "తబలా" లాంటివి నాటకానికి శత్రువుల్లాంటివని కొందరు, వివిధ నాటకాలకు ప్రజల ఆదరణ ఉందా? నాటక రచనలో వ్యవహారిక భాష స్థానమేంటి? ఇలా అనేక విషయాల మీద విమర్శనాత్మక వ్యాసాలు అప్పట్లో మరికొందరు రాశారు.

1913నే ప్రచురించబడ్డ పానుగంటి వారి "సాక్షి" మొదటి సంపుటంలో నాటక రచన, ప్రదర్శనల గురించి రాసిన నాలుగు వ్యాసాలు చాలా ముఖ్యమైనవి. ఆ వ్యసాల్లో పానుగంటివారు "సారంగధర నాటక రచనని, ప్రదర్శనని విమర్శిస్తూ నాటక శైలి ఎలా ఉండాలి? పాత్ర ఔచిత్యమంటే ఏమిటి? యుక్తి-ప్రతియుక్తి వైఖరి ఎలా ఉండాలి? నాటకాలలో పద్యాలు ఉండాలా? ఉండకూడదా? ఉంటే ఎలాంటి పద్యాలు ఉండాలి?, విషాదాంత – సుఖాంత నాటక లక్షణాలలో గల తేడాలు ఏమిటి? అనే అంశాల మీద కూలంకషంగా చర్చించారు. అయితే తెలుగులో సాహిత్య విమర్శకులకు కొత్త బాటలు వేసిన వారు కట్టమంచి రామలింగారెడ్డి, తణికెళ్ల వీరభద్రుడు, మల్లాది సూర్యనారాయణశాస్త్రి అని చరిత్రకారుల లభిప్రాయం.

పైన పేర్కొన్న ఈ పండితులందరూ తమ విమర్శనను ఏ ప్రాతిపదికన చేశారు? అనేది చర్చనీయాంశాలు. సంస్కృత నాటకకర్త శ్రీహర్షుడు తన "నాగానందం" నాటకం పీఠికలో ఈ శ్లోకం రాశారు.

"శ్రీహర్షో నిపుణ:కవి, పరిషదప్యేషా గునగ్రాహిణీ
లోకేహారిచ పత్సరాజచారితమ్, నాట్యే దక్షవయామ్"

అంటే లోకంలో అందరికీ తెలిసిన కథ, నిపుణుడైన కవి, దక్షత కలిగిన నటులు, నాటకంలోని గుణగణాలను గ్రహించగల పారిషాదులు (ప్రేక్షకులు) ఉంటేనేకానీ నాటకం అన్న పదానికి పూర్తి అర్థం రాదు అని ఆయన భావన. నాటక రచనకి పాఠకులు ఎంత అవసరమో, ప్రదర్శనకి ప్రేక్షకులు అంతే అవసరం. "Theatre is not complete without audience" అన్న పాశ్చాత్య ఆర్యోక్తి ఉండనే ఉంది. మంచిగాని, చెడుగాని ప్రదర్శింపబడేది వాళ్ల కోసమే కాబట్టి వాళ్లు బాగుందని మెచ్చుకుంటే నటుడు ఉబ్బిపోతాడు. నటుడికి ప్రేక్షకుల అవసరం ఎంతైనా ఉంది. వారిని మెప్పించకపోతే ఇతగాడికి భుక్తి ఉండదు. ఔత్సాహికుడికి ప్రేక్షకుల చప్పట్లే భుక్తి.

తెలుగు నాటకరంగంలో అద్భుతమైన విమర్శకులుగా పేరు పొందినవారు పురాణం సూరిశాస్త్రి. వారి చిరకాల నాట్య వ్యాసంగం ఫలంగా "నాట్యంబుజం" ప్రచురించారు. (1) నాటకానుభవములు (2) ఆంధ్ర నాటకములు (3) నాటక సమాజములు (4) ప్రసిద్ధ నటులు (5) ప్రదర్శన విమర్శనము (6) ఆంధ్ర నాటక విమర్శనము (7) నాటక సమస్యలు (8) నాటక విమర్శనము అనే అధ్యాయాలు ఇందులో ఉన్నాయి. ముఖ్యంగా నాటి ప్రసిద్ధ సమాజాల ప్రదర్శనా పద్ధతులు ఇందులో విమర్శింపబడ్డాయి. అందులో సూరిశాస్త్రి సద్విమర్శకుడి లక్షణాలను ఇలా ప్రతిపాదించారు.

"తన బుర్రలో జరిగే నాటకమంతా చూడనేర్చినప్పుడే నాట్య రంగాల ఆటలు సార్థకంగా చూడగలుగుతారు. రసాస్వాదన చేస్తారు. జీవితానుభావాలు అందరికీ ఉంటాయి. బుద్ధిని మూడు పాయలుగా చీల్చి, వ్యావహారికంలో భోక్తృత్వ కర్తృత్వముల కొకదాన్ని నియమించి, రెండవ దానితో జగన్నాటక విలాస శోభలను, నిత్యానందతూష్టీం భావములననుభవించుచూ, మూడవ దాన్ని సాక్షి భావమున ఏకాగ్ర ధారణతో వర్తింపచేయగలిగినవాడే రస రహస్యమెరిగిన విమర్శకుడు. విమర్శక వ్యాపారమంతా లోక జ్ఞానము మీద నిలిచియున్నది. లోకానుభావానికి జ్ఞాన రూపమొనర్చుటకు, సాక్షీ భావము, యోగ సాధన అలవడవలెను". అంటే ఆట చూసేటప్పుడు నా చిత్తము మూడు ప్రత్యేక వ్యాపారములతో మూడు కోశములుగా విభక్తమై ఉంటుంది. ఒకటి కథ మొత్తమును రామనీయకమును, అందున జనించు రసమును అనుభవించుచూ నిగూఢ తదేక చింతతో నిస్తబ్దమయి ఉండును. నట వర్తనమందలి రసభావ తరంగములన్నీ ఈ కోశమున కదిలించుచు అనురూప వికాసమును నీ ముఖ నేత్రములందు పుట్టించుచుండును. రెండవ కోశము, నీ సంకల్పం లేకుండానే జరుగుతున్న నటనను చూస్తూ, మాటలు వింటూ, అందులో వెలుగొందు దానిని ధారణ చేయుచుండును. దాని వ్యాపారము స్వతంత్రము నాకు తెలిసి జరిగేది కాదు. నా సంకల్పం వల్ల నడిచేది కాదు. ఎందుకంటే నేను రసానుభావ పారవశ్యముతో మైమరిచియున్నాను. అట్టి మైమరపు లేకుంటే రస సమాధి లేదన్న మాట. ఇదంతా నాటకాలతో సరి. నేను విమర్శన రచించెడి వేళ, ధారణ గ్రస్తములైన దృశ్యశ్రవ్య విషయాలు సాక్షాత్కరించినప్పుడు వాని మూలమున క్రమ్మర రసావేశమేర్పడును. ఈ రెండు కోశాలు కళా విమర్శనకు సంబంధించినవి. ఇవి కాక మూడవ కోశము. అటూ ఇటూ చూచుచూ ప్రక్క వారితో మాట్లాడుచూ, లౌకిక వ్యాపారములు జరుపుచుండును. ఇదే నా అనుభవం. నాటకం చూసేటప్పుడు మాత్రం నా బుద్ధిలో రెండు భాగములు, ఒకటి తెలిసియు, ఒకటి తెలియకను కథా వ్యవహారముతో ఐక్యమయి ఉండును. ఏకాగ్రత వల్ల వ్యక్తి చాంచల్యము నశించి తన్మయత్వమేర్పడును. చూస్తున్నాను వింటున్నాను అనే కర్తృత్వమస్తమించును. ఆనందము అనుభవించుటయే మన పని".

శాస్త్రిగారి ఈ వాక్యాలలో ఉత్తమ విమర్శకుడు చేయవలసిన పనేమిటో తెలుస్తున్నది. వారు చెప్పిన విధంగానే

వారి నాటక విమర్శలన్నీ రచించి ప్రకటించారు. అందుకే తెలుగు నాటక విమర్శకులలో ఆయన ప్రథముడే కాదు. ప్రధానుడు కూడా అని చెప్పక తప్పదు. ఆయన విమర్శలన్నీ కళాత్మకమయిన భావ ప్రకటనలే. ఎందుకంటే సాహిత్యం ఒక కల అయినప్పుడే సాహితీ విమర్శ కూడా ఒక కళా ప్రక్రియే అవుతుంది. “All art is expression” అనే నానుడిని మారుస్తూ “All expression is art” అన్నాడు ఫ్రెంచి విమర్శకుడు బెండెట్టో క్రాస్. ఈ దృష్టితో చూస్తే ఓ సాధారణ వ్యక్తి మాట్లాడే మామూలు వాక్యంలో కూడా ఓ కళ కనిపిస్తుంది. ఎందుకంటే సహజంగానే మనిషిలో ఉండే కళాత్మకత వల్ల ఇది గోచరిస్తుంది. అలాంటప్పుడు విమర్శక దృష్టితో మాట్లాడినప్పుడు, రాసినప్పుడు అందులో కళాత్మకత తప్పకుండా ఉంటుంది. ఈ ఆలోచనను బలపరుస్తూ జాస్పర్ సన్ అనే ఆంగ్ల విమర్శకుడు “The Philosophy of grammar” అనే పుస్తకంలో ఇలా రాశారు.

“In all speech there are three distinct things - expression, suppression and impression. It is important to note that impression is often produced by suppression also and suggestion is impression through suppression”.

ఇక్కడ “సజెషన్” అనేది సంస్కృతి సాహిత్యకారుల ప్రకారం వ్యంజనమంటే అన్ని రకాల కళల్లో నిగూఢంగా ఉన్న గొప్ప శక్తి. దీని ప్రేరణతోనే సాహితీ ప్రక్రియలు పుడతాయి. సంస్కృత సాహితీ విమర్శకు ఈ వ్యంజన అనేది కేంద్ర బిందువు. సాహిత్య కళా ప్రక్రియలలో అది అర్థమయితేనే విమర్శకుడు తన విమర్శను సృష్టించగలడు. సంస్కృత లాక్షణికుల ప్రకారం సాహిత్య విమర్శలు మూడు ముఖ్యమైన ఆలోచనలు లేదా పద్ధతులలో జరుగుతాయి. అవి ధ్వని, రస, ఉన్నయ అనేవి. ధ్వని అంటే వ్యంజన, అంటే సజేషన్, అంటే సూచన ఇచ్చినట్లు చెప్పడం, రస అనేది ఉత్తమోత్తమమైన విమర్శనా పద్ధతి. ఇది కేవలం భారతీయ సాహిత్యంలోనే కాదు విదేశీ సాహిత్యకారులు కూడా అవలంబించే పద్ధతి. ఇక ఉన్నయ అంటే ఊహించడం. రస పద్ధతికి
ప్రాముఖ్యాన్నిస్తూ, ధ్వనిని కూడా ఒప్పుకునేవారు కొందరు, ఉన్నయ అంటే ఊహించడం, రస సిద్ధాంతాన్ని ఒప్పుకునేవారు కొందరు ఉన్నారు. ఈ పద్ధతుల ఆధారంగానే సంస్కృత నాటక సాహిత్యం మీద విశ్లేషణలు, విమర్శలు ప్రకటించబడ్డాయి.

ప్రముఖ సంస్కృత పండితులు ఎస్.కుప్పుస్వామి గారు తమ “Highways and Biways of literary criticism in Sanskrit” అనే పుస్తకంలో ఇలా రాశారు.

“In fact vyanjana may be regarded as the central principle of literary criticism in Sanskrit, the pivotal doctrine round which the whole scheme of art critism in Sanskrit revolves. Now what is the secret of this principle? Because renderd the term suggestion, which is impression through suppression”.

శాస్త్రి వివరణను మనం అర్థం చేసుకుంటే విమర్శకుడు ఏవో నాలుగు మాటలు రాస్తే సరిపోదు. అతను సూచనలు ఇవ్వగలగాలి. అది నాటక సాహిత్య విమర్శ కావచ్చు. ప్రదర్శన విమర్శ కావచ్చు. నాటక విమర్శ కావచ్చు. నాటక విమర్శ అంటే కేవలం నాటక కథ రాయడం కాదు. విశ్లేషణ అనగానే దాని బాగోగుల మీద గుణ నిర్ణయం, ఆ గుణ నిర్ణయానికి తగిన సామర్థ్యం, అనుభవం విమర్శకుడికి ఉండాలి. అర్థ స్ఫూర్తితో ఉన్న సంభాషణలను విని ఆస్వాదించే శ్రవణ ఇంద్రియం కావాలి. అలాగే అనేక విషయాలను చూసి అర్థం చేసుకుని సమన్వయము చేసుకునే దృశ్య భావుకత కావాలి. అందుకు తగిన నాటక రచన, సాంకేతిక ప్రదర్శనా విషయాల అవగాహన కావాలి. నాటకాన్ని చదివి లేదా చూసినప్పుడు సంభాషణలు విని నాటక అంతరార్థాన్ని అవగతం చేసుకోవడం నాటక విశ్లేషకుడికి చాల అవసరం.

చదివిన దానిని, చూసిన ప్రతి అంశాన్ని సునిశిత దృష్టితో చూడడం, చూపించడం నాటక విమర్శకుడి ధ్యేయం. పురాణం సూరిశాస్త్రి చెప్పినట్లు చూసిన నాటకాన్ని ఇంకా అర్థవంతంగా ఆమోదించి ఆనందించడానికి, చూడని నాటకాన్ని

చూడాలనిపించడం, చూసేటప్పుడు విశ్లేషణలలోని పలు అంశాలు మననం చేసుకుంటూ ఆనందిచడం నాటక విమర్శకుడికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణాలు. తన విశ్లేషణతోనూ, దాని ఆధారంగా చేసే విమర్శతోనూ ప్రేక్షకులలో నాటకాసక్తిని పెంచగలిగినవాడే నిజమైన విమర్శకుడు. ఆచార్య మొదలి నాగభూషణశర్మ గారి మాటల్లో చెప్పాలంటే "విమర్శకుడు నాటకాన్ని ప్రదర్శన దృష్టితో చదవాలి, సాహిత్య దృష్టితో చూడాలి".

ఇంకా అనేక మంది అంశాల మీద, నాటకరంగం మీద పరిశోధనలు జరిపి తెలుగులోను సిద్ధాంత వ్యాసాల్ని సమర్పించి పట్టాలు పొందారు, పొందుతున్నారు కూడా. ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి, జరగాలి కూడా. అయితే కొందరు పరిశోధకులకి ఉండవలసిన కనీస లక్షణాలు లేకుండాపోతున్నాయి. దానివల్ల పరిశోధనా రంగంలో స్థాపించవలసిన ఉన్నత ప్రమాణాలు స్థాపించలేకపోతున్నాం. కేవలం డిగ్రీల కోసం పక్షపాత ధోరణిలో రాసే సిద్ధాంత వ్యాసాలు ఎక్కువవుతున్నాయి. ఎంపిక చేసుకునే పరిశోధనాంశాలు కూడా కొన్ని చాలా పేలవంగా, సత్యదూరంగా ఉంటున్నాయి. ఇటువంటి పరిశోధనలను గుర్తించి వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే పరిశోధన అనేది హాస్యాస్పదం అయ్యే ప్రమాదముంది. తెలుగు నాటకరంగపు పురోభివృద్ధిలో విమర్శ,
పరిశోధన కూడా ఉన్నత ప్రమాణాలను సాధించుకోవలసిన అవసరం ఉంది.

**ముగింపు:-** "కావ్యేషు నాటకం రమ్యం" అన్నట్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో నాటక రంగం మరియు నాటకాలు 1980 వరకు అత్యంత ప్రభావవంతమైన సాధనంగా పనిచేసి అనంతరం అందుబాటులోకి వచ్చిన వివిధ మాధ్యమాల వల్ల ఈ ప్రక్రియ పూర్తిగా కనుమరుగైన స్థితిలోకి వెళ్ళింది. ఉమ్మడి రాష్ట్రంలో నంది నాటక బహుమతులు ఇచ్చి ప్రోత్సహించినప్పటికీ ప్రేక్షకుల నుండి ఆదరణ లభించకపోవడం వల్ల దాదాపుగా క్షీణించే స్థితికి ఈ ప్రక్రియ (నాటకం) దాపురించింది.

**ఆధార గ్రంథాలు**

1. ప్రొ॥ సిమ్మన్న వెలమల (2011), తెలుగు సాహిత్య చరిత్ర, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం.
2. డా॥ శ్రీరామ అప్పారావు పోణంగి (1967), తెలుగు నాటక వికాసం, నాట్యమాల ప్రచురణలు, హైదరాబాద్.
3. డా॥ ద్వా.నా శాస్త్రి (1998), తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్.
4. అంతర్జాల వికీపీడియా సమాచారం.